పండిత గోపదేవ్ గారి కృతులు

సత్యార్థ ప్రకాశము రూ. 40/- (568 పేజీలు)

వేదాది శాస్త్ర ప్రమాణ విభూషితము. అవిద్యాంధకార నాశకము. జ్ఞాన ప్రకాశము. అసత్యములు. భ్రాంతి జనకములునగు మతమతాంతర మూలోన్మూలకము. సదసద్వివేచకము. ధర్మముపేరిట వ్యాపకములై యున్న యధర్మముల వినాశకము. సృష్టికర్తయగు పరమేశ్వరుని సత్యస్వరూప బోధకము. పరమేశ్వరుని స్థానము నాక్రమించిన చిల్లర దేవతలయస్తిత్వ నివారకము. అవతారాది గురుడంబములకు ప్రభంజకము. ఆర్షానార్ష గ్రంథ విభజన పూర్వక సత్యజ్ఞాన దీపకము. భూతప్రేత శాకినీడాకినీ మున్నగువాని భయములను దొలగించు మహా మంత్రము. మానవులలోగల యుచ్చనీచ భేదభావములను దొలగించి 'అజ్యేష్ఠాసః అకనిష్ఠాసః' అను ఋఙ్మన్త్రముతో నెల్లరును సమానులే యని బోధించు సదుపదేశకము. వర్ణాశ్రమ వ్యవస్థలోగల వైశిష్ట్యమును బ్రదర్శించునది. స్వర్గనరకములు, మోక్షము మున్నగువానిలోగల భ్రాంతులను దొలగించి సత్యమును బ్రకాశింపజేయునది. జీవబ్రహ్మాం సత్యస్వరూప ప్రతిపాదకము. స్వాతంత్ర్యమూలమంత్ర ప్రదర్శకము. స్వదేశమునందు, స్వదేశభాషయందు, స్వసంస్కృతి యందుబ్రేమను శ్రద్ధాసక్తుల నుద్భవింప జేయునది. పాలకపాలితుల లక్షణ కర్తవ్యములను దెలిపి సురాజ్యమును స్థాపింపజేయునది. సృష్టిస్థితి లయముల విషయములందుగల యసత్యములగు మాన్యతలను దూరమొనర్చి వాని యథార్థతను గ్రహింపజేయునది. భారతీయ పరతంత్రతకు కారణములగు విద్వేషము, పరస్పర భేదభావము మున్నగు వానిని నశింపజేయునది. ఆర్యజాతిని భిన్నభిన్నము చేయుటకు దోడ్పడిన యస్పృశ్యతా దోషనివారకము. భక్ష్యాభక్ష్యములను గురించిన శాస్త్రీయ వ్యవస్థను బోధించి మద్యమాంసాది దుష్టపదార్థములసేవనము నుండి తప్పించి మానవులనుద్ధరించునది. గోవు మున్నగు పశుసంపదను పోషించుటవలన గలుగు లాభముల వివరించునది.

పండిత గోపదేవ

ఈశావాస్య - ఉపన్యాసములు

(యజుర్వేదము - అ ౪౦)

[LECTURES ON ISHAVASYA]

సంకలనము :

చేలవాది సోమయ్య

ప్రకాశకులు :

ఆర్య సమాజము, కూచిపూడి - 522 313

(తెనాలి తాలూకా, గుంటూరు జిల్లా)

'అంబా' దర్శన గ్రంథమాల - 35
పంచమ ముద్రణము - 1000

ఆగష్టు - 1999

మూల్యము : రూ. 20=00

ప్రతులకు :

1) ఆర్యసమాజము, కూచిపూడి - 522 313, తెనాలి తాలూకా.
2) స్వస్తిక్ మెటల్ ప్రొడక్ట్స్, 3-3-738, కంచరి బజార్, సికింద్రాబాద్ - 3.
3) వైదిక సాహిత్య భండార్, ఆర్యసమాజము, సుల్తాన్ బజార్,
హైదరాబాద్ - 500 001.

Designed & Printed at :

PRINTSHOP
#6, "Masetty Building" 3-3-736 to 740,
Kanchar Bazar, SECUNDERABAD - 3.
PH : 040 - 781 2904



పండిత గోపదేవ్ శాస్త్రి గారు

పరిచయము

పూజ్యపాదులు మద్గురువర్యులైన పండిత శ్రీ గోపదేవ్ గారి పరిచయ భాగ్యమబ్బి యిప్పటికి దాదాపు నాలుగు సంవత్సరములైనది. 1968 ఫిబ్రవరిలో శ్రీ కమలీబాబా ఆధ్వర్యమున విజయవాడలో విశ్వమతమహాసభలు జరిగినవి. అందు పలువురు వక్తలు తమ మతములగూర్చి ప్రసంగించిరి. ఆసభలలోనే శ్రీ గోపదేవ్‌గారు కూడ వైదిక సిద్ధాన్తమును ప్రతిపాదించిరి. వేద సిద్ధాంతము అన్యమతములకన్న మిన్నయని సహేతుకముగ నిరూపించిరి. ఆసభలలో క్రైస్తవ, మహమ్మదీయ, పౌరాణికాది మతముల గూర్చి ప్రసంగించిన వక్తలనేకులుండిరి. కాని వారి ప్రసంగములన్నియు శ్రీ గురుదేవుల ప్రసంగములతో బోల్చినచో దినకరుని (సూర్యుని) యెదుట దివిటీ చందమున వెలవెల బోయినవి. నేనెంతయో ముగ్ధుడనైతిని. ఆ సభలలో శ్రీ గురుదేవులు ముఖ్యముగా వ్యక్తి ఆరాధనకూడదనియు ; వ్యక్తులెంతటి గొప్పవారైనను భగవంతునితో తుల్యులుకారనియు, సృష్టిస్థితి లయములకు కర్తయైన పరమేశ్వరు నొక్కనినే భజింపవలెననియు, పౌరాణికులు ప్రతిపాదించెడి యవతారవాదము సరియైనది కాదనియు సహేతుకముగ వివరించుచు వేదప్రమాణము నొసగుచు గంభీరోపన్యాసము గావించిరి. సభయావత్తు మంత్రముగ్ధమైనది. కాని కొందరు పిడివాదపరాయణులు ప్రశ్నల వర్షమును కురియించుచు శ్రీ గురుదేవుల ప్రసంగమునకు ప్రతిబంధకము కల్పింపయత్నించిరి. శ్రీ గురుదేవులు ధీరులై వారి ప్రశ్నలన్నింటిని సహేతుకముగ ఖండించిరి.

వారి యుపన్యాసము విన్నతరువాత నేనంతకు బూర్వము గాఢముగా విశ్వసించిన శంకరాద్వైత సిద్ధాంతమునందు లోపములు కలవని తెలిసికొంటిని. వారి యుపన్యాసములు అమూల్యములనియు, వానిని గ్రంథస్థముచేయుట మంచిదనియు, అది లోకమున కుపకరించుననియు దృఢముగ విశ్వసించితిని.

ఒకమారు శ్రీ గురుదేవులు గుంటూరుతాలూకా ముట్లూరులో ఉపన్యసించుచుండ నటకేగితిని శ్రీ గురుదేవులకు నేను వ్రాసిన వారి ప్రశ్నోత్తర రూపక ప్రసంగమును చదివివినిపించితిని. అవి విన్నతదుపరి చిఱునగవుతో 'ఫర్వాలేదయ్యా ! ఇతడు మనకు పనికివస్తాడు' అని శ్రీ గురుదేవులు శ్రీ జోస్యు వేంకటనరసింహారావుగారితోననిరి. ఆ మాటలు నాకెంతయో ప్రోత్సాహము కలిగించినవి.

శ్రీ గురుదేవులతో బరిచయము కలిగిన యనంతరము గుంటూరులో వారి యుపన్యాసములు ఏర్పాటు చేయుతలంపు కలిగి శ్రీ బోడపాటి బ్రహ్మయ్య శ్రీ బొద్దపాటి సాంబిరెడ్డిగార్లతో సంప్రదింప తదితర మిత్రులుతో గలసి వారు పూనుకొని సహకరించిరి. గుంటూరు దివ్యజ్ఞాన సమాజ మందిర ప్రాంగణము (Theosophical lodge) లో శ్రీ గురుదేవుల యుపన్యాసములు 24-12-1968న ఈశావాస్యోపనిషత్తుపై ప్రారంభమైనవి. నేను వానిని గ్రంథస్థము చేయ సమకట్టితిని. శ్రీ గురుదేవుల సవరణలతో నెట్టకేలకు గ్రంథము పూర్తియైనది.

ఉభయభాషా ప్రవీణులు శ్రీ జోస్యు వేంకట నరసింహారావుగారు ఈ గ్రంథమును పరిశీలించి స్ఖాలదోషములను సవరించి గ్రంథమునకొక రూపము చేకూర్చి సుందరముగ ముద్రించుటకు నెంతయో శ్రమించిరి. వారికెంతయో కృతజ్ఞుడను.

ఇట్లు

బుధజన విధేయుడు

చలవాది సోమయ్య

గుంటూరు

ది. 8-12-1971

సంపాదకీయము

మహర్షి దయానందసరస్వతి అడుగు జాడల్లో వైదికధర్మ ప్రచారము చేయుచున్న నైష్ఠిక బ్రహ్మచారులగు శ్రీ పండిత గోపదేవ్ గారిని గూర్చి యెఱుగని వారుండరు. వారి యుపన్యాసములుకూడ చాలమంది వినియే యుందురు. వారు దార్శనికులు. అంతేగాదు, టీచరుగా గూడ పనిచేసినవారు, అందుచేత వారెంత విషయము నైనను హేతుబద్ధముగా దృష్టాంతములతో ప్రమాణములతో సామాన్యజనమునకు నర్థమగు భాషలో వివరించునట్టి ఘటికులు. ఆధ్యాత్మిక విషయమైనను వారి యుపన్యాసములు జనులు నిశ్శబ్దముగా కదలక మెదలక గంటలతరబడి కూర్చుండి విందురు. అది వారి యుపన్యాసముల విశిష్టత.

పండిత గోపదేవ్‌గారు క్రీ.శ. ౧౯౭౮ సంవత్సరమున గుంటూరు దివ్యజ్ఞాన సమాజమందిరములో ఈశావాస్య ప్రవచనము గావించిరి. దానిఫలితమే ఈ గ్రంథరూపము. ఈశావాస్యోపనిషత్తు యజుర్వేదంలోని నలువదవయధ్యాయము ఈ పుస్తకమునకు రూపకల్పన చేసినవారు శ్రీ చేలవాది సోమయ్య గారు విన్న విషయముల గ్రహించి పొరపడకుండ విన్నవి విన్నట్లు గ్రంథస్థము చేయు ఆయన జ్ఞాపకశక్తి మెచ్చుకోదగినది.

బ్రహ్మవిద్యాబోధక వేదమంత్రములకు అర్థములు వివరించు గ్రంథము కావున విషయము సామాన్యజనమునకు అర్థమగుటకు కష్టమైనను హేతుబద్ధముగా దార్శనిక పద్ధతిలో సామాన్య జనమునకు గూడ అర్థమగు వాడుకభాషలో నున్న గ్రంథమగుటచే ఈ గ్రంథము చాల ప్రసిద్ధిచెందినది.

ఆగష్టు ౧౯౯౯

\- వెంకయ్యార్య

విషయానుక్రమనిక

యజుర్వేదము - 40 వ అధ్యాయము

(ఈశావాస్యోపనిషత్)

గుంటూరు, 24-12-1968

మంగళవారం, సా॥ గం. 6-00

ఈ దినము పెద్దలు చాలమంది సభకు విచ్చేసిరి. దివ్యజ్ఞాన సమాజ మందిరపు గది శ్రోతలతో క్రమముగా నిండి కూర్చుండుటకును కొందరికి చోటు చాలలేదు. ఆహ్వానసంఘం తరపున శ్రీ జాస్తి వేంకటనరసింహారావు గారు పరిచయవాక్యములు పలికి, శ్రీ కల్లూరి చంద్రమౌళిగారిని (మాజీ దేవాదాయశాఖా మంత్రి) సభా ప్రారంభకులుగా ఆహ్వానించిరి. నన్ను ప్రార్థనచేయ పిలిచిరి. "ఎవ్వనిచే జనించు జగము . . . . ." అను ప్రార్థన పద్యమును చదివి శ్రోతలలో వెళ్ళి కూర్చుండి జరుగబోవు కార్యక్రమ విశేషములను గ్రంథస్థము (Record) చేసికొనుచుంటిని. తదుపరి శ్రీ చంద్రమౌళిగారు తమ ప్రారంభోపన్యాసములో ఆస్తికతను గూర్చియు శ్రీ దయానందాది మహర్షుల విశిష్టతను గూర్చియు కొలదిసేపు ముచ్చటించి తదుపరి శ్రీ గోపదేవ్ గారిని గురించి యీ విధంగా అన్నారు.

"ఇకపోతే శ్రీ గోపదేవ్‌గారిని గూర్చి నాలుగు మాటలు చెప్పి విరమిస్తాను. నా ఉద్దేశ్యములో వీరు గొప్ప పండితులు, ఋషులు, యోగి పుంగవులును, వీరు కొన్ని ప్రత్యేక పరిస్థితులలో యిల్లు విడిచిరి. మొన్న మొన్నటివరకును భిక్షాటనచేయుచు (అంటే ఎవరైనను తమను ఆహ్వానించగా వెళ్ళి భోజనము

చేయుచు) విద్యాప్రచారము చేయుచుండినవారు కాశీ మొదలగు విద్యా కేంద్రములలో వేదములను, దర్శనములను, ఉపనిషత్తులను, గీత, బ్రహ్మసూత్రాది గ్రంథములను క్షుణ్ణముగా చదువుకొనిన వారు. ఎవరైనను ఈ శాస్త్ర గ్రంథములలో అనుమానముగాని, ప్రజ్ఞాపాటవముగాని యున్నచో వీరి నడిగి తెలిసికొనవచ్చును. లేక వీరితో చర్చింపవచ్చును. వీరు కూడ సత్యము నంగీకరించుటయందును అసత్యమును విడనాడుటయందును ఆసక్తి చూపువారే. వీరు ఆ జన్మము సంపూర్ణముగా త్రికరణశుద్ధిగా బ్రహ్మచర్యమును పాలించుచున్న నైష్ఠికబ్రహ్మచారులు. వీరు ఎక్కువగా ఉత్తరదేశమునందు కాలము గడపిరి. యోగాభ్యాసమున దిట్టలు. వీరికి కొందరు మహారాజులు సైతం శుశ్రూషలు చేసి వీరియొద్ద యోగాభ్యాస రహస్యములను గ్రహించినవారు కలరు. వీరు ధనమును కూడబెట్టవలయు ననెడి ఆపేక్షకలవారు కారు. నేను వీరిని గూర్చి అతిశయోక్తులు చెపుతున్నానని మీరనుకుంటున్నారేమో కాని, నేను నిజమునే చెపుతున్నాను. కావలెనంటే మీరు వీరిని పరీక్షింపవచ్చును. అట్లు పరీక్ష చేయుట అవసరమనికూడ నేను నమ్ముచున్నాను. వీరు మహర్షి దయానందుని శిష్యులు. వారి సిద్ధాంతములను వేదధర్మములను ప్రచారముచేయువారు. వీరిని ఈ సభాముఖమున ఉపన్యసింపవలసినదిగా కోరుచున్నాను. నాకీ సదవకాశము నిచ్చిన ఆహ్వాన సంఘము వారికి ధన్యవాదములు

తదుపరి శ్రీ గోపదేవ్‌గారు వేదిక నలంకరించిరి. దైవప్రార్థన చేసిరి. నిర్మలము, ప్రశాంతమునైన మోముపై చిరునగవు చిందులు త్రొక్క తమ ఉపన్యాసము నిట్లు కొనసాగించిరి.

మహాజనులార !

మిత్రులు కొందరు నన్నిచటికి ఆహ్వానించి ఉపన్యసింపగోరిరి. ఈ రోజునుండి వరుసగా పది పంద్రెండు దినములు సాయంత్రం 6 గం॥ నుండి 7-30 గం॥ వరకు యీ ఉపన్యాస కార్యక్రమము జరుగుతుంది. శ్రీ చంద్రమౌళిగారు నన్ను గురించి పెద్దపెద్ద మాటలు చెప్పిరి. (చిరునగవుతో) అవన్నీ మరచిపొండి. నా నేర్చినవిధముగ ఉపనిషత్తుపై ఉపన్యసించుటకు

ప్రయత్నింతును.

"వేదోzఖిలో ధర్మమూలం" అంటే సమస్త ధర్మములకు మూలము వేదమని అర్థము. మానవునికి కావలసిన విజ్ఞానము సర్వము వేదములలో బీజరూపముగా నున్నదని వైదికుల మతం. వేదములనే సంహితలు అనికూడ అంటారు. ఈ వేదమంత్రములను మహర్షులు తమ తమ సమాధ్యవస్థలలో దర్శించి మంత్రద్రష్టలైనారు. అనగా మంత్రములును, వాని అర్థములును, వారికి సమాధ్యవస్థలలో అనుభూతములైనవి. ఇట్లు వేదమంత్రములను, వాని అర్థములను దర్శించి అనుభూతము చేసికొన్న వారిలో పురుషులేకాక స్త్రీలుకూడ కొందరు కలరని వేదములను చదువుకొన్నవారికి అర్థమవుతుంది.

ఒక వస్తువుయొక్క అస్తిత్వమును అంగీకరించాలన్నా, నిరాకరించాలన్నా మనకు ప్రమాణ మొకటి అవసరం. ప్రమాణములు నాలుగు విధములుగా ఉన్నై. చార్వాకులు ప్రత్యక్ష ప్రమాణమును మాత్రమే అంగీకరించెడివారు. బౌద్ధులు ప్రత్యక్షము, అనుమానము అను రెండు ప్రమాణములను అంగీకరించెడివారు, మరికొందరు ఆ రెండును గాక ఉపమాన ప్రమాణమును కూడ అంగీకరింతురు. మన ప్రాచీన మహర్షులు, దర్శనకారులు నైన గౌతమమహర్షి కణాదమహర్షి నాలుగు విధములైన ప్రమాణములను అంగీకరించిరి. శ్రీ గౌతమ, కణాద మహర్షులు సుమారు 3 లేక 4 వేల సంవత్సరముల క్రితము వసించి యుండిరని ఐతిహాసికుల (Historians) ఊహ. ఈ కాలనిర్ణయం సరియైనది అవునో కాదో మనకు తెలియదు.

ప్రమాణములు ప్రత్యక్షము. అనుమానము, ఉపమానము, శబ్దము అని నాలుగు విధములు. "లక్షణ ప్రమాణాభ్యాం వస్తు సిద్ధిః" - లక్షణములను బట్టి, ప్రమాణములనుబట్టి యిది ఫలానా వస్తువు అని నిర్ణయించడం జరుగుతుంది. ఒకవస్తువుయొక్క అభావమును నిర్ణయించుటకు సైతం ప్రమాణములు ఆవశ్యకములే. ప్రమ - అంటే జ్ఞానము. ప్రమాణమంటే జ్ఞాన సాధనం. కన్నులు, చెవులు, ముక్కు చర్మము నాలుక అను ఇంద్రియముల ద్వారా జ్ఞానము కలుగును. కావున ఇంద్రియములు ప్రమాణములగును, వీనివలన కలుగు జ్ఞానము ప్రత్యక్షజ్ఞానమగును. అక్షి అంటే కన్ను, అక్షము

అంటే ఇంద్రియము. ప్రతి + అక్షము=ప్రత్యక్షము. ప్రతి ఇంద్రియము. ఇంద్రియముద్వారా తెలియబడు జ్ఞానము ప్రత్యక్షజ్ఞానం అవుతుంది. నేత్రము ద్వారా దృశ్యములు చూచి తెలిసికొనడం, చెవులద్వారా శబ్దములను విని గ్రహించడం, చర్మము ద్వారా స్పర్శజ్ఞానం కలగడం, ముక్కుద్వారా వాసనచూచి తెలిసికొనడం యివన్నీకూడ ప్రత్యక్షజ్ఞానం, క్రిందికి వస్తాయి.

ఇక అనుమాన ప్రమాణము. ప్రత్యక్ష పూర్వకంగా అనుమానము కలుగుతుంది. అను అంటే తరువాత. మానము అంటే తెలియబడునది అని అర్థం. అనుమానము అంటే ముందు ఒక వస్తువును ప్రత్యక్షముగా చూచి, తరువాత దాని మూలమున వేరొక వస్తువు నూహించడం. ఉదాహరణకు : పొగను చూచి అచట నిప్పుఉన్నది అని తెలిసికొంటాం. నిప్పు ఉన్నచోట కొన్ని సమయాలలో పొగ లేకపోవచ్చును. కాని పొగ ఉన్నచోట నిప్పు తప్పనిసరిగా ఉంటుంది. కనుక పొగ ప్రత్యక్ష ప్రమాణమువలన తెలియబడింది. పొగనుబట్టి నిప్పు ఉన్నదని ఊహించడం జరుగుతుంది. ఇట్లు ఊహించడమే అనుమాన ప్రమాణం. దానివలన కలిగినజ్ఞానం అనుమిత జ్ఞానం అంటారు.

మూడవది ఉపమాన ప్రమాణం. వస్తువును ఉపమించి తెలిసి కొనడం. అంటే ఒకదానిని చూచి దాని సాదృశ్యమును మరియొకదానియందు చూచి యది ఫలనా అని తెలిసికోవడం. ఉదాహరణకు : "గోసదృశోగవయః" గోవువంటిది గవయము, అడవిగోవునకు "గవయము" అని పేరు, గోవు లక్షణములే గవయమునకు ఉంటాయి. అని తెలిసికొంటే అడవిలో దానిని చూచినపుడు అది గవయమని గుర్తుపట్టగలం. ఇచట సాదృశ్యజ్ఞానం వల్లనే వస్తువు తెలియబడుతుంది. కనుక సాదృశ్యజ్ఞానము ఉపమానము అని భావము.

ఈ మూడు ప్రమాణములద్వారానే మనం వస్తువులయొక్క భావ, అభావములను తెలుసుకుంటాం. కాని, యీ ప్రమాణములతోనే ప్రపంచంలోని వస్తురాశి నంతటిని తెలిసికొనలేం. అందుచేత నాల్గవది యైన శబ్ద ప్రమాణమును కూడ మనం అంగీకరించాలి.

"ఆప్తవాక్యం శబ్దప్రమాణం" ఆప్తుని వాక్యము శబ్దప్రమాణము.

అప్తుడంటే ఎవరు ? "ఆప్తస్తు యథార్థవక్తా" - యథార్థము చెప్పేవాడు ఆప్తుడు. అతడు అబద్ధమాడడు. చూచినది చూచినట్లు, విన్నదివిన్నట్లు, తెలిసినది తెలిసినట్లు చెప్పగలిగి ఉంటాడు. అతడు ఆప్తుడు. ఇందుకు విరుద్ధముగ పలుకువాడు ఆప్తుడు కాడు. "సాక్షాత్కృతధర్మాఃఆప్తః" అంటే అతడు వస్తు ధర్మములను బాగుగా తెలిసినవాడై ఉంటాడు. నేనొకమోటు విషయం చెపుతాను. అలాగైతేగాని ఈ శబ్దప్రమాణం బాగుగా అర్థం కాదు. ఒక తండ్రికి పుత్రుడున్నాడనుకోండి. తండ్రికి మాత్రం తన కొడుకెవరో తెలియును కాని, పుత్రునికి తన తల్లిదండ్రులెవరో తెలియదు. ఇచట ప్రత్యక్ష ప్రమాణం, అనుమాన ప్రమాణం, ఉపమాన ప్రమాణం యివేమి పనిచెయ్యవు. పిల్లవాడు తాను పుట్టినపుడు తన తల్లిదండ్రులెవరో అతనికి తెలియదు. అతడు ప్రత్యక్షముగా చూడలేదు. అపుడతని కాజ్ఞానమును లేదు. కనుక ప్రత్యక్ష ప్రమాణ మిచట పనిచెయ్యదు. మిగిలిన అనుమాన, ఉపమాన ప్రమాణములద్వారా కూడ తన తల్లిదండ్రులెవరో పిల్లవాడు తెలిసికొనలేడు. మరి తన తల్లిదండ్రులెవరో ఎలా తెలుస్తుంది. పిల్లవానికి తల్లి చెబుతుంది. ఈయన మీ నాన్న అని ఈయన మీనాన్న అని చెప్పడమే కాకుండ తాను తల్లినని కూడ పిల్లవానికి చెపుతుంది. తల్లిమాటలు ద్వారా పిల్లవాడు తన తల్లిదండ్రులెవరో తెలుసుకుంటాడు. కావున నిచట తల్లిమాటలే శబ్దప్రమాణం. సరే ! యీ సృష్టిలో ఉండే జీవులందరకు తల్లివంటి వాడెవరు ? పరమేశ్వరుడు. కనుక అతడు జీవులకు పరమ ఆప్తుడు. ఈశ్వరుని ద్వారా జీవులకు ప్రసాదింపబడిన జ్ఞానమే వేదము. వేదవాక్యములు ఆప్తవాక్యములు కనుక వేదము శబ్దప్రమాణముగా గ్రహింపబడుతుంది.

వేదములు స్వత ః ప్రమాణములని మన ఋషులు అంగీకరించుతారు. స్వతః ప్రమాణమంటే వేదములలో తెలుపబడిన జ్ఞానమునకువేరే ప్రమాణ మేమి అవసరం లేదు. దానికదియే ప్రమాణం. ఉదాహరణకు, దీపమున్న దనుకోండి. దానిని చూపించుటకు వేరే దీపం అవసరం లేదు. అదీపం తన్నుతాను చూపించుకొంటుంది. ప్రక్కనే ఉన్న వస్తువులనుకూడ చూపుతుంది. అట్లాగే సూర్యుడు, సూర్యుని చూపించుటకు వేరొక సూర్యుడు అవసరంలేదు.

అలాగే వేదములు స్వతః ప్రమాణములు. వేదములు కాక మిగిలిన గ్రంథములన్నీకూడ పరతః ప్రమాణము లనబడును. అంటే బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు మొదలయిన వన్నీ వేదానుకూలతయా ప్రమాణములు. మహర్షులు, శంకరుడు, రామానుజుడు, మధ్వుడు మొదలగు ఆచార్యులు కూడ వేదములను స్వతఃప్రమాణములుగా అంగీకరించుతారు.

ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణ వేదము అని వేదములు నాలుగు. పూర్వమివి అచ్చులోలేవు. ఇపుడు ముద్రితములై మనకు దొరుకుచున్నవి కూడ. మానవుడు సంఘజీవి. అతడు చేయవలసిన (కర్తవ్య) కర్మలు వేదమునందు చెప్పబడి ఉన్నాయి. వీనినే వేదవిహిత కర్మలు అంటారు. ఈ కర్తవ్య కర్మలు మానవులాచరించినట్లయితే సంఘము సుభిక్షంగా ఉంటుంది. పూర్వము వేదములను స్త్రీ, పురుష విభేదం లేక అందరుమానవులు చదివేవారు. వేదమంత్రములను కొందరు స్త్రీలు కూడ ప్రచారము చేసినట్లు ముద్రిత వేద గ్రంథములు చూచినపుడు మనం గ్రహించగలం. కాని యీ మధ్య కాలంలో ఎవరో కొందరు "స్త్రీ శూద్రౌ నాధీయాతాం" - స్త్రీలును, శూద్రులును వేదములను పఠింపరాదు. అని అంక్షలు పెట్టి పురుషులలో శూద్రులకేకాక అన్ని వర్ణములలోని స్త్రీలకు కూడ యీ వేదవిజ్ఞానం లేకుండ చేశారు. ద్విజులు వేదములు పఠించుటకు అర్హులని, తదితరులు అనర్హులని ప్రచారం చేశారు. ఇది వేదసమ్మతంకాదు. వేదములందే ("యథేమాం వాచం కల్యాణీ మావదాని జనేభ్యః । బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ స్వాయ చారణాయచ" - యజు. 26-2) స్త్రీ శూద్రాది సమస్త మానవకోటి వేదమును చదువవచ్చు నని యున్నది. వేదము చదువనిదే మానవుడు చేయవలసిన (కర్తవ్య) కర్మలు ఎలా తెలుస్తాయి?

శంకరాచార్యునకు పూర్వం జైన బౌద్ధమతములు విశేషవ్యాప్తిలో ఉండేవి. వీనిని అవైదిక మతములనెడివారు. అంటే యివి వేదవిరుద్ధములైన మతములని, తరువాత శంకరుడు అద్వైత మతమును విశేషవ్యాప్తి లోనికి దెచ్చాడు. శంకరునికి పూర్వమే గౌడ పాదాచార్యులతో అద్వైత మతం ప్రారంభ మయినది.

గౌడపాదుల తరువాత గోవిందాచార్యులు, తరువాత వారి శిష్యుడైన శంకరాచార్యుడు అద్వైత మతసంప్రదాయమును విశేష వ్యాప్తిలోనికి దెచ్చారు. భగవద్గీత, ఉపనిషత్తులు బ్రహ్మసూత్రములు అను వానికి ప్రస్థానత్రయమని పేరుపెట్టి శంకరుడు, వానికి అద్వైత సిద్ధాంత పరముగా తన భాష్యమును వ్రాసినాడు. అద్వైతులు నాలుగు వాక్యములకు - (అహం బ్రహ్మాస్మి" తత్త్వమసి" "అయమాత్మా బ్రహ్మ." "ప్రజ్ఞానం బ్రహ్మ") మహా వాక్యములని పేరుపెట్టి తమ సిద్ధాంతమును ప్రచారము చేసికొనుటకు విశేషముగా ఉపయోగించుకొన్నారు. కొందరీ వాక్యములు వేదములలోని వని తలుస్తారు. ఇవి వేద వాక్యములు కావు. నాలుగు వేదములలో ఎచ్చట వెదకినను యీ వాక్యములు మీకు కనిపించవు. ఇవి వేదవాక్యములని జనులను భ్రమింపజేశారు. భ్రమ. భ్రాంతి. విపర్యయము యీ పదాలన్నీ సమానార్థ బోధకములు. 'అతస్మిన్ తద్ బుద్ధి : - అతస్మిన్ = అది కాని దానియందు, తత్=అది అను బుద్ధికలగడం భ్రమ, అనగా త్రాడును పామనుకోవడం, ముత్యపు చిప్పను వెండి అనుకోవడం యిత్యాదులు భ్రమలు. మహావాక్యములు వేద వాక్యములు కావు. ఇవి ఉపనిషత్ వాక్యములు, వీనిని మీరు ఛాందోగ్యాది ఉపనిషత్తులలో చూడగలరు. అద్వైత మత ప్రచారకుడైన శంకరుడు, విశిష్టాద్వైతమతప్రవర్తకుడైన రామానుజుడు, ద్వైతమతస్థాపకుడైన మధ్వుడు వీరందరు పై వాక్యములను తమతమ మతానుసారంగా వివేచించి యున్నారు.

భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములుయీ మూడింటికి శంకర, రామానుజ, మధ్వాచార్యులు ముయ్వురు తమతమ మతానుకూలంగా భాష్యము వ్రాశారు. కాని వీరు ముయ్వురును ఒకే గ్రంథమునకు భిన్న భిన్న భాష్యములు వ్రాశారు. శంకరుడు వ్రాసిన భాష్యము ద్వైత, విశిష్టాద్వైతులకు నచ్చదు. రామానుజుడు వ్రాసిన భాష్యము అద్వైతులకు, ద్వైతులకు నచ్చదు. మధ్వుడు వ్రాసిన భాష్యము అద్వైత విశిష్టాద్వైతులంగీకరింపరు. ఈవిధంగా త్రిమతాచార్యులు పరస్పర విరుద్ధంగా ప్రస్థానత్రయమునకు భాష్యములు వ్రాసికొని అసలు మూలగ్రంథము లేమి చెప్పుచున్నవో అర్థము కాకుండచేసిరి . గ్రంథకర్త తన పుస్తకమున ఒకే విషయమును చెప్పవలెను. ఒకే గ్రంథమునందు పరస్పర విరుద్ధవిషయములను చెప్పరాదు. ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రములను,

గీతను రచించిన గ్రంథకర్తలు తమ గ్రంథములందు పరస్పర విరుద్ధ విషయములను ప్రతిపాదింపరు. కాని యీ మూలగ్రంథములకు ఆచార్యులు పరస్పర విరుద్ధముగా భాష్యములు వ్రాసికొనిరి. అందుచేత మనకు మూలగ్రంథమునందలి అసలు ప్రతిపాద్య విషయ మేమిటని సంశయము కలుగుతుంది. "నహి సంశయ మనారుహ్యానరో భద్రాణి పశ్యతి"-సంశయింపని మనుజుడు భద్రమును చూడలేడు. అంటే నిజమేమిటో తెలిసికొనలేడు. కనుక త్రిమతాచార్యులు ప్రతిపాదించిన అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సిద్ధాంతములలో ఏదిసత్యమో తెలిసికొనుటకు మనం వేదసిద్ధాంతంతో వీనిని పరిశీలింపవలసి యున్నది. వేదములకు శ్రుతియని పేరు. "శ్రుతిస్మృతి విరోధే తు శ్రుతిరేవ గరీయసీ" - అంటే, శ్రుతులనబడే వేదమునకు స్మృతులతో విరోధము కలిగినపుడు శ్రుతి చెప్పదానినే అంగీకరింపవలెనని పరాశరాది మహర్షు లంగీకరించారు. కనుక త్రిమతాచార్యులు ప్రస్థానత్రయమునకు వ్రాసిన భాష్యములను వేదదృష్టితో పరీక్షించినపుడు ముగ్గురు రచించిన భాష్యములును యథార్థ విషయమును ప్రతిపాదించుట లేదని తోచుచున్నది.

భగవద్గీత : ఇది భారతములో భాగము. భారతం ఇతిహాసం, ఇతిహాసము అంటే చరిత్ర. గీత మహాభారత భీష్మ పర్వాంతర్గతమైయున్నది. ఇది వ్యాసరచితము. కొందరు గీతను ఉపనిషత్తుగనే ప్రచారం చేస్తున్నారు. "గీతాసూపనిషత్సు" - అనికూడ గ్రంథములో వ్రాయుచున్నారు. ఉపనిషత్తుల లోని శ్లోకముల ననుసరించి సమానార్థకములుగా కొన్ని శ్లోకములు గీతలో రచింపబడి యుండవచ్చును. అంతమాత్రమున భగవద్గీత ఉపనిషత్తు ఎట్లు కాగలదు ? ఇది యిట్లుండగా ఉపనిషత్తులకేమో -- వేదశిరస్సులని, వేదశిఖలని, వేద+అంతములని పేరుపెట్టి ప్రచారం చేయుచున్నారు. ఉపనిషత్తులను వేదాంతము లనేటట్లయితే 4 వేదములకు నాల్గు ఉపనిషత్తులు మాత్రమే ఉండవలెను. కాని ప్రస్తుతము ఉపనిషత్తుల పేరుతో సుమారు నాలుగు లేక అయిదువందల పుస్తకములు ప్రచారములో ఉన్నవి. వీనిలో సాంప్రదాయికులు (అద్వైతాది మత సాంప్రదాయికులు) 10 ఉపనిషత్తులను మాత్రమే ప్రమాణముగా అంగీకరించారు. అవి ఈశ, కేన, కఠ. ప్రశ్న, ముండక, మాండూక్య, ఐతరేయ,

తైత్తిరీయ, ఛాందోగ్య బృహదారణ్యకములను ఉపనిషత్తులు - ఇవిగాక శ్రీ శంకరుడు శ్వేతాశ్వత రోపనిషత్తు, మైత్ర్యుపనిషత్తు అను రెండుపనిషత్తులకు భాష్యము వ్రాసినట్లు చెప్పుచున్నారు. అందులో శ్వేతాశ్వతరోపనిషత్తునకు వ్రాసిన భాష్యము శంకరుడు వ్రాయలేదు. వేరే యేవరో వ్రాసిరని కొంద రభిప్రాయపడుచున్నారు.

ఇవిగాక నారాయణోపనిషత్తు, అల్లోపనిషత్తు, భస్మోపనిషత్తు, ఋద్రాక్ష రోపనిషత్తు, గర్భోపనిషత్తు, ఇత్యాది కల్పితోపనిషత్తులనేకములు కలవు. తుదకు అల్లాపేరుతో అల్లోపనిషత్ కూడ ఎవరో వ్రాశారు. మరి ఉపనిషత్తులలో వేద+అంతములు లేక వేదశిరస్సులు అనబడు ఉపనిషత్తులు లేవా అని అంటే ఒకేఒక ఉపనిషత్తు ఉన్నది. అది "ఈశావాస్యోపనిషత్తు" లేక "ఈశోపనిషత్తు" అని కూడ పిలువబడుతున్నది. ఇది మంత్రభాగము.

ఇక వేదమంత్రములకు వ్రాసిన వ్యాఖ్యానాదులు -అనగా, ఆరణ్యకములు, బ్రాహ్మణములు వేదములు కావు.

"తస్మాద్ యజ్ఞాత్ సర్వహుత ఋచః సామాని జజ్ఞిరే
ఛందాంసి జజ్ఞిరే తస్మాద్ యజుస్తస్మా దజాయత"

ఋగ్వేదం. 10-90-9

తా. సర్వప్రాణులకు పరమపూజ్యుడగు పరమేశ్వరునివలన ఋక్కులు, యజుస్సు, సామము, అథర్వము నను వేదము లుత్పన్నము లయినవి.

వేదములను సంహితలు అనికూడ అంటారు. యజుర్వేదములో 40 అధ్యాయములున్నవి. 40వ అధ్యాయము 'ఈశావాస్యోపనిషత్' కనుక వేదాంత గ్రంథమని చెప్పవలసివస్తే ఒక ఈశావాస్యోపనిషత్తునే చెప్పవలసియుండును. కఠమహర్షి చేత రచింపబడుటచేత కఠోపనిషత్ అని పేరు. అట్లే యింకను కొన్ని ఉపనిషత్తులు, - వానిని వ్రాసిన మహర్షుల పేర్లచేత వ్యవహరింపబడు తున్నాయి. ఈ ఉపనిషద్గ్రంథములను వేదాంతమని, వేదసారమని యేవేవో పేర్లుపెట్టి సంప్రదాయకులు వ్యవహరించుచున్నారు. అసలు వేదమే సారమైయుండగా, ఉపనిషత్తులకు సారము నాపాదించుచున్నారు కొందరు.

వైదిక భాష నాలుగు భాగములుగ వ్యవహరింపబడుచున్నది. మంత్రము,

బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తులునని. వేదమంత్రములు అందరికి అర్థముకావని గ్రహించిన మహర్షులు కొందరు మంత్రములపై వ్యాఖ్యానములను వ్రాసియుండిరి. వాని బ్రాహ్మణములందురు - ఐతరేయ బ్రాహ్మణము, శతపథ బ్రాహ్మణము, తాండ్య బ్రాహ్మణము, గోపథ బ్రాహ్మణము, తరువాత ఆరణ్యకములు, ఇవి సృష్టిక్రమమును - ఇతిహాసవిషయములను చెప్పుచుండును. నాల్గవది ఉపనిషద్భాగము. ఉపనిషత్ అంటే బ్రాహ్మణవిద్య. ఇందు తాత్త్వికచింతన చేయబడింది. ఉపనిపూర్వక సద్ ధాతువువలన "ఉపనిషత్" శబ్ద మేర్పడుతుంది. అనగా, బ్రహ్మనిష్ఠద్వారా మనకు కలిగే క్లేశములు పోగొట్టుటకు తోడ్పడే విద్య గనుక దీనిని ఉపనిషద్విద్య అని లేక బ్రహ్మవిద్య అని వ్యవహరించెదరు. "విద్" అంటే జ్ఞానము. "యా" అంటె యిచ్చునది. (విద్+యా=విద్యా జ్ఞానము నిచ్చునది) బ్రహ్మవిద్య అంటే బ్రహ్మజ్ఞానము నిచ్చునది అని అర్థం.

సృష్టి స్థితిలయములకు, పరాపర విద్యలకు సంబంధించిన సమస్త విజ్ఞానము యీ వేదములందు గర్భితమై యున్నదని ఋషుల మతము. ఈ విద్యలు వేదములలో బీజరూపముగా ఉన్నవి. ఇచట వేదములను గురించి ఎందుకు చెప్పవలసి వచ్చినదంటే ఉపనిషత్తులు వేదవిజ్ఞానము నాధారము చేసికొనియే ప్రవర్తిల్లుచున్నవి. మనము భాషించునది కూడ ఉపనిషత్ ప్రవచనమే కద !

సరే ! ఇక రెండుమాటలు చెప్పి ఈభాషణము ముగింతును. వేదము " ఈప్రపంచానికి జీవులు, ఈశ్వరుడు, ప్రకృతి అను మూడు మూలపదార్థములు కలవని బోధించుతుంది. అవి నిత్యతత్త్వములు. అనగా ఒకప్పుడుండి వేరొకప్పుడు లేకుండునవి కావు. ఎల్లప్పుడు ఉండునవి. నిత్యతత్త్వము లనినపుడు అవి స్వయంసిద్ధములని కూడ చెప్పవలసివస్తున్నది. ఒకరిచేఈమూడు తత్త్వములు సృష్టింపబడినవి కావు. కనుక వీనిని అనాదులనియు అంగీకరింపవలసియుండును. ఒకటి సర్వవ్యాపకమయిన ఈశ్వరతత్త్వము, రెండవది జీవతత్త్వము, అది సూక్ష్మము, మూడవది ఈ సృష్టి

జరుగుటకు ఆవశ్యకమైన ప్రకృతి తత్త్వము. ఇది జడము. ఈ మూడుతత్త్వములే ప్రపంచమునకు కారణములు. (ప్రవాహనిత్యం ప్రపంచం). మరియు జీవులు పరమేశ్వరునిచే సృష్టింపబడినవి కావు. పరమేశ్వరునివలె జీవులుకూడ నిత్యసత్య పదార్థములు. అట్లే ప్రకృతియు, ఆది అంతములేని వస్తువులను నిత్యములని అంగీకరింపవలసియున్నది. ఇది స్థూలముగా వేదమునందు ప్రతిపాదింపబడిన జీవేశ్వర ప్రకృతి తత్వముల ప్రస్తావన. ఇప్పటికే కాలాతీతమైంది. రేపటినుండి ఈశావాస్యోపనిషత్తు చెప్పుకుందాము. ప్రథమ మంత్రమును ఒకసారి చదివి సభను ముగించుదాము.

"ఈశావాస్య మిదగ్ం సర్వం యత్ కించ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్యస్విద్ధనమ్"

గుంటూరు, 25-12-1968
బుధవారం, సా. గం॥ 6-00

మహాజనులార !

నిన్నటిదినం ఉపనిషత్తులన నేమో, వానికి వేదాంతగ్రంథములను పేరెట్లు వచ్చినదో వివరించితిని. ఒక్క ఈశావాస్యోపనిషత్తు మాత్రమే వేదము చివరిభాగ మనియు, ఇది యజుర్వేదము 40వ అధ్యాయముగా ఉన్నదనియు, మిగిలిన ఉపనిషత్తులన్నియు వేదభాగములుగాని, వేదశిరస్సులుగాని కావనియు, అవి ఋషిప్రోక్తము లనియు చెప్పియుంటిని. వేదములు ఈశ్వరీయములనియు అందు ఈశావాస్యము వేదభాగ మగుటచే స్వతః ప్రమాణమై ఒప్పుచున్నదనియు, మిగిలిన ఉపనిషత్తులన్నియు పరతః ప్రమాణము లనియు చెప్పియుంటిని.

వేదము నిత్యము. అది ఈశ్వరుని జ్ఞానము, ఈశ్వరుడు నిత్యుడు కనుక ఈశ్వరుని జ్ఞానమైన వేదముకూడ నిత్యమే. పరమేశ్వరుడు సృష్టి కాలమున వేదమంత్రములను శుద్ధాంత ః కరణులైన ఋషుల అంతఃకరణంలో భాసింపజేయును. ఆ వేదములలో చరిత్ర లేదు. ఈ విశాల విశ్వమున జరుగు సృష్టిసంబంధమైన విషయమే వేదములందు చెప్పబడుతుంది. కాని ఉపనిషత్తులలో కథల రూపమునను, చర్చలరూపమునను, తాత్విక విషయములు

ముచ్చటింపబడినవి. ప్రస్తుతము మనము చెప్పుకొనబోవు ఉపనిషత్తు ఈశావాస్యోపనిషత్తు. ఇది వేదభాగం. దీనికి మంత్రోపనిషత్తనియు పేరు కలదు.

" ఈశావాస్య మిదగ్ం సర్వం యత్ కించ జగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథా ః మాగృథః కస్యస్విద్ధనమ్।" - 1

భావార్థము : "మనలను భగవంతు డెల్లపుడు నెల్లవిధముల చూచుచుండును. ప్రపంచము అతనిచే వ్యాప్తమై యున్నది. అంతట అతడున్నాడు. అతడు వ్యాపకుడు - అంతర్యామి" అని నిశ్చయించి ఈశ్వరునకు భయపడు మానవులు ఎన్నడును అన్యాయాచరణముతో నెవ్వరి ధనము నపహరింపనెంచరు. అట్టివారు ధార్మికులై యిహపరములందు అభ్యుదయ నిఃశ్రేయసములను బొంది యెల్లపుడు నానందింతురు.

ఈ సృష్టి స్థితిలయములను చేయగల పరమేశ్వరు డొకడున్నాడని అంగీకరించడం ఆస్తిక్యమనబడుతుంది. కాని " దేవాలయమునకు వెళ్ళు ప్రతివాడును ఆస్తికుడే" అను దృష్టి జనులలో వ్యాపించి ఉంది. వాస్తవానికి "అస్తి ఇతి మతి ః యస్య స ఆస్తికః' (పరలోకం) ఉన్నది అని అంగీకరించేవాడు ఆస్తికుడనబడతాడు. అస్తి అంటే ఉన్నది అని అర్థం. ప్రపంచమును పుట్టించి పోషించి లయం చేసే మూలతత్త్వం ఒకటున్నదని లేదా పరలోకమున్నదని అంగీకరించడం అస్తిత్వ మనబడుతుంది. దీని నంగీకరింపనివారు నాస్తికులనబడతారు.

ఆస్తికులైనవారు వేదములు ఈశ్వరీయములని, స్వతఃప్రమాణములని అంగీకరిస్తారు. ఆస్తికులు శరీరంలో సృష్టిస్థితిలయములకు కారణమైన పదార్థమేగాక, శుభాశుభ కర్మలుచేసే జీవుడుగూడ ఉన్నాడని అంటారు. ఈ జీవుడు శరీరాంతరములు పొందుతుంటాడని కూడ అంగీకరిస్తారు. సృష్టికర్తయైన ఈశ్వరునకు ఇంద్రుడు, మిత్రుడు మున్నగు నామము లెన్నో ఉన్నవి.

"ఇంద్రం మిత్రం వరుణ మగ్ని మాహు రథో దివ్యస్స సువర్ణ ః
ఏకం స ద్విప్రా బహుధా వద న్త్యగ్నిం యమం మాతరిశ్వానమాహుః ॥

ఋ. మం. 1 అను - -22సూ. 164 మం. 46

విప్రులు అంటే తెలిసినవారు అని అర్థం. పరమేశ్వరు డొక్కడే యనియు, తెలిసినవారు అతనినే ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని గరుత్మంతుడు మొదలైన భిన్న భిన్న నామములతో వ్యవహరింతురనియు నీ మంత్రమున జెప్పబడినది.

వేదమును వల్లెవేయు ఘన జటా పాఠకులు కొందరు వేదమంత్రముల అర్థమేమిటో ఎఱుగరు. పైగా ఈ మంత్రముల కర్థమేమిటని ఎవరైన అడిగితే, యిది కలియుగం వేదార్థం చెప్పరాదంటారు. (సభలో నవ్వులు).

హిందువులు విష్ణువు, ఈశ్వరుడు, బ్రహ్మ, వీళ్ళందరిని వేరువేరు దేవుళ్ళుగా కొలుస్తుంటారు. బ్రహ్మాది త్రిమూర్తులేకాకుండ యింకా చిల్లర దేవుళ్ళు అనేకులు వెలిశారు. ఈ దేవుళ్ళే కాకుండ యిప్పుడు సజీవదేవుళ్ళు కొందరు వెలిశారు. వీరు లోకానికి మేము Upto date (నవీన) దేవుళ్లమనికూడ చెపుతుంటారు. విలక్షణమైన జుట్టు పెంచుకొని లేదా పెట్టుకొని ఒకరు నేను సాయిబాబా అవతారం అంటున్నారు. మౌనవ్రతం పూని యింకొకరు నేను భగవదవతారం అంటున్నారు. ఈ విధంగా పలువురు దేవుళ్ళు, అవతారాలు వెలియడం వలన వేదమునందు నిర్దేశించిన అసలు బ్రహ్మతత్త్వమేమిటో తెలిసికొనలేని స్థితిలో మన మున్నాము.

మనం పిల్లలకు ఒక చిత్తరువును చూపించి దేవుడని చెప్పి నమస్కారం చేయుమంటాం. తెలివిగల పిల్లవాడెవరైనా దేవుడంటే యీ పటంలో కనబడే బొమ్మేనా అని ఎదురు ప్రశ్న వేస్తే మనం జవాబు చెప్పలేం మనం యిపుడు పిల్లలకు దేవుడంటే ఏమిటో చెప్పలేని స్థితిలో ఉన్నాము.

హిందువులలో వైష్ణవులనుచూస్తే శైవులకు గిట్టదు. శైవులంటే వైష్ణవులకు గిట్టదు. శివునికంటే మా విష్ణువు గొప్పవాడని వైష్ణవులు, విష్ణువుకంటె మా శివుడే గొప్పవాడని శైవులు పరస్పరం కలహించుకొంటూ ఉంటారు. ఈశ్వరుడు, విష్ణువు, బ్రహ్మ, మహాదేవుడు, నారాయణుడు, ఇలాంటి పేర్లన్నీ ఒక పరమేశ్వర తత్త్వమునకు పెట్టబడిన నామములు అని వీరు అంగీకరింపరు. బ్రహ్మ సృష్టికర్తయని, విష్ణువు పోషణకర్తయని, ఈశ్వరుడు లయకారుడని చెపుతున్నారు. ఇది సరికాదు. వాస్తవమున యీ పదములకున్న అర్థం వేరు.

'బ్రహ్మ' అంటే అన్నిటికంటే గొప్పది అని అర్థం. "బృహదితి బ్రహ్మ", బ్రహ్మము యొక్క గొప్పతనమును వేదమిట్లు వర్ణిస్తుంది. "పాదోऽస్య విశ్వాభూతాని త్రిపాదస్యా ऽమృతం దివి" - ఈ సమస్త ప్రపంచం బ్రహ్మముయొక్క నాలుగవ అంశంలో నున్నది. ఇంకను బ్రహ్మ మూడు అంశములు మిగిలియే యున్నవని వేదము చెపుతుంది.

ప్రపంచస్థితిని గురించి నేటి వైజ్ఞానికులు యిలా చెపుతున్నారు. మనకు అతిసమీపంలో ఉన్న గ్రహం చంద్రగ్రహం. ఇది భూమికి కొన్ని లక్షలమైళ్ళ దూరంలో ఉంది. సూర్యుడు కూడ ఒక నక్షత్రమే. సూర్యుడు కాక విశ్వంలో మనకుదూరంగా కోటానుకోట్ల నక్షత్రాలున్నాయి. మన సూర్యుడు ఆ నక్షత్రము లన్నిటికంటె చిన్నవాడు. ఒక నక్షత్రమునకు మరియొక నక్షత్రమునకు మధ్య చాల దూరం ఉంటుంది. శాస్త్రవేత్తలు ఈ దూరమును కాంతి సంవత్సరములలో కొలుస్తారు. కాంతి సంవత్సరములంటే చదువుకున్న వాళ్ళకు చాలమందికి తెలిసే ఉంటుంది. ఒక సెకనుకు కాంతి 1,86,000 మైళ్ళ దూరం ప్రయాణం చేస్తుంది. అంత దూరమును 60 చేత హెచ్చించితే నిమిషమునకు కాంతి ప్రయాణం చేయు దూరం వస్తుంది. అలాగే గంటకు, రోజుకు, సంవత్సరమునకు కూడ హెచ్చించుతూ పోవాలి. ఈ దూరాన్నే కాంతి సంవత్సరపు దూరం అంటారు. నక్షత్రములు కొన్ని మనభూమికి వందల కాంతి సంవత్సరముల దూరమున ఉన్నవనియు, వానిలో కొన్నింటి ప్రకాశము ఇంకను భూమికి చేరలేదనియు శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఇంతటి విశాల విశ్వముకూడ అనంతమైన పరమేశ్వర తత్త్వంలో ఒక భాగమేనని పైమంత్రాభిప్రాయం. కావుననే ఈశ్వరునకు బ్రహ్మమని పేరు.

శివుడంటే మేలుచేసే వాడని అర్థం. శంకరుడు అంటే శుభమును కలిగించువాడు. మహాదేవుడు : "మహాంశ్చ అసౌ దేవ ఇతి మహాదేవః" - దేవతల కన్నింటికంటె గొప్పదేవుడు. ఈశ్వరుడు అంటే ఐశ్వర్యవంతుడని అర్థం. అలాగే రుద్రుడు - "యో రోదయ త్యన్యాయకారిణో జనాన్ రుద్రః' ' దుష్టకర్మముల చేయువారిని ఏడ్పించువాడు కనుక రుద్రుడు అని అర్థం. ఈ పదముల కున్న అసలు అర్థములను విడిచి, భిన్న భిన్న దేవతలను కల్పించి

వారి కీ నామములు పెట్టారు. వీరికి భార్యబిడ్డలను కూడ కల్పించారు. మరియు విష్ణువు వైకుంఠమున ఉండుననియు ఈశ్వరుడు కైలాసవాసి యనియు, బ్రహ్మ సత్యలోకమున ఉండుననియు కల్పించిరి. ఇంకను భిన్న భిన్న దేవతలకు భిన్న భిన్న లోకములు కల్పించిరి. వేదములందు బ్రహ్మ, విష్ణువు, నారాయణుడు, సూర్యుడు, చంద్రుడు, అగ్ని మొదలగు పదములు ఉపయోగింపబడినను అవన్నియు ఒకే పరమేశ్వరు నుద్దేశించి వాడబడిన వనియే తెలియవలెను. విష్ణువు - వ్యాపకుడు (విష్ వ్యాప్తౌ), నారాయణుడు - "నరాణాం అయనం గతిః" -- నరులకు ముక్తి నిచ్చువాడు అని యర్థము. ఇలాగే ఎన్నో పదములు పరమేశ్వర పరముగా వేదములందు వాడబడియున్నవి. శ్రీ దయానంద మహర్షి తన సత్యార్థ ప్రకాశ గ్రంథమున ప్రథమ సముల్లాసములో నూటికి పైగా ఇట్టి పదములకు వ్యాఖ్యానము వ్రాసియున్నారు. కావలసినవారు చూచుకొనవచ్చును.

మరి ఆ పరమేశ్వర తత్త్వం ఎలాంటిది ? పరమేశ్వర తత్త్వం ఇంద్రియముల కందునది కాదు. ఇంద్రియముల ద్వారా తెలియబడు వస్తువులు ప్రాకృతిక పదార్థములు. శబ్దము ఉన్నది. ఇది చెవిద్వారా తెలియబడుతుంది. స్పర్శము - దీనిని చర్మముద్వారా ఎరుగగలము., రూపము - దీనిని నేత్రమువలన తెలియగలము. రసము - జిహ్వాద్వారా ఎరుగగలము. అలాగే గంధము - దీనిని ముక్కుద్వారా గ్రహించగలం, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములను దార్శనిక భాషలో ఇంద్రియార్థములని, విషయములని అంటారు. శబ్ద, స్పర్శాదులు పరమాత్మలో లేవు. కావున పరమాత్మ ఇంద్రియములకు గోచరం కాడు. ఇంద్రియగమ్య పదార్థం ప్రపంచ జడపదార్థమును కూడ తగిన పరిమాణములో ఉన్నపుడే ఇంద్రియములు గ్రహింపగలవు.

"పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః
తస్మాత్ పరాఙ్ పశ్యతి నాంతరాత్మన్" కఠోపనిషత్తు 4-2-1

పరమేశ్వరుడు ఇంద్రియములను బహిర్గతములుగా చేశాడు. అందువలన అవి వెలుపల చూచును. లోపల చూడవు. పరమేశ్వరుని

ఇంద్రియములతో చూడలేము.

మీరు గుడికి వెళ్ళుతారు. అక్కడ ఒక విగ్రహమునో లేక ఒక రూపమునో చూస్తారు. అంటే అది ఇంద్రియగోచర పదార్థమని అర్థం. అందుచేత విగ్రహాది మూర్తులు, రూపములు ఇంద్రియ గోచరములు కనుక యివి భగవంతుడు కాదు అని తేలుతుంది.

"అవ్యక్తో zయ మచింత్యో z య మవికార్యోz య ముచ్యతే"
గీత 2-25

అయం=ఈ ఆత్మ, అవ్యక్తం=ఇంద్రియములకు తెలియనిది అచింత్యం=ఇట్టిదని చింతింప వీలుకానిది, అవికార్యం=వికారము లేనిది అని చెప్పబడుతుంది.

భౌతిక వాదులు మనస్సుకు, ఇంద్రియములకు గోచరమగు యీ ప్రపంచం కాక భగవంతుని వేరే ఎందుకు అంగీకరించాలి అంటారు. వీరు ప్రత్యక్ష ప్రమాణమునే అంగీకరిస్తారు. ఒక్క ప్రత్యక్ష-ప్రమాణముతో ప్రపంచ గత పదార్థములను తెలిసికోలేమని నిన్నటి ఉపన్యాసములో చెప్పుకున్నాము. భగవంతుడు అనుమానాది ప్రమాణములచే తెలియబడునని సమాధానం చెప్పాలి.

బృహదారణ్య కోపనిషత్తులో మైత్రేయి యాజ్ఞవల్క్యాల సంవాద రూపమున ఒక కథ ఉన్నది. యాజ్ఞవల్క్యుడు గృహస్థుడు. ఆయనకు మైత్రేయి, కాత్యాయని అని యిరువురు భార్యలుంటారు. గృహస్థాశ్రమమును వదలి ఆయన వానప్రస్థాశ్రమమునకు పోదలచి, భార్య లిరువురిని రప్పించి తనకున్న ధనధాన్యములను వారికి పంచి తాను వారిని విడిచి వెళ్ళుటకు సిద్ధపడతాడు. ఈ ధనదాన్యాదులచే అమృతత్వము సిద్దించునా అని మైత్రేయి యాజ్ఞవల్క్యుని ప్రశ్నించుతుంది. ఇవి సుఖజీవనం గడపుటకే వినియోగపడతాయి గాని, వీనివలన అమృతత్త్వము (మోక్షము) సిద్ధింపదని యాజ్ఞవల్క్యుడు చెబుతాడు. ఇంకా యిలా అంటాడు. భర్తతన భార్యను ప్రేమించుతున్నాడు. అంటే అది భార్యకోసం కాదు. తన సుఖము కోసమే అలాగే స్త్రీ పురుషుని ప్రేమించడం తన సుఖము కొరకే నంటాడు. చూడండి,

భర్త చనిపోతే భార్య ఎందుకని ఏడుస్తుంది ? తన కిదివరలో ఉన్న సుఖ సంతోషాలు పోయాయి, ఇక ఉండవని, అంతేకాని భర్తపోయాడని కాదు. (సభలో చిరునవ్వులు) కావున ఆత్మ-తానుఅన్నింటికంటె ముఖ్యము కనుక తానంటే ఏమిటి? తాను పరమానందం పరమాత్మానందం -పొందడం ఎలా? అని ఆలోచించాలి.

"ఆత్మావాzరేద్రష్టవ్యః=ఈ ఆత్మ తెలిసికొనదగిన వస్తువు. ఎలా తెలుసుకోవాలి? శ్రోత్రవ్యఃమంతవ్యఃనిదిధ్యాసితవ్యః=మొదట ఈ ఆత్మను గురించి వినాలి. విన్నదానిని మననం చెయ్యాలి. తరువాత నిదిధ్యాసనం-అంటే యోగాంగానుష్ఠానం ద్వారా ధ్యానము చేసి ఈ ఆత్మను అనుభవంలోనికి తెచ్చుకోవాలి.

శ్రోతవ్యఃశ్రుతివాక్యేభ్యః మంతవ్య శ్చోపపత్తిభిః,
మత్వా చ సతతం ధ్యేయః, ఏతే దర్శనహేతవ ః ॥

ఈ ఆత్మను గురించి వేదవాక్కులద్వారా మొదట వినాలి. విన్నదానిని కారణయుక్తంగా మనన చెయ్యాలి. మననం చేసినదానిని ధ్యానం చెయ్యాలి. శ్రవణం, మననం, నిది ధ్యాసనం - ఇవి ఆత్మసాక్షాత్కారానికి సాధనములు.

హిందువులు కార్తీకాది మాసములలో పురాణ శ్రవణం చెయ్యాలి అని చెపుతారు. పురోహితులు కొందరు మనదేవాలయాల్లో భాగవతం, విష్ణుపురాణం మొదలైనవి వినిపించుతుంటారు కూడ పురాణం అంటే అనాదిసిద్ధములైన వేదగ్రంథములని అర్థము చెపితే ఫరవాలేదు. కాని భాగవతాది గ్రంథములకు పురాణములని పేరుపెట్టి జనులకు వినిపిస్తుంటారు. భాగవతాది గ్రంథములు నవీనములు. ఈ గ్రంథములలో పరస్పర విరుద్ధములైన విషయములు అనేకం చూడగలం. విష్ణుపురాణంలో, విష్ణువునకు ఆధిక్యత కల్పించి శివబ్రహ్మలకు అల్పత్వము నాపాదించుట చూడగలము. అట్లే శివపురాణములో శివునకు ఆధిక్యత కల్పించి విష్ణుబ్రహ్మలకు అల్పత్వము నాపాదించుట చూడగలం. మరియు ఒక విషయమును గూర్చి ఒకే గ్రంథమునందు పరస్పర విరుద్ధములైన వర్ణనలు కూడ ఈ పురాణాలలో చూడగలం.

ఉదాహరణకు మనమెంతో గొప్పదని యెంచే భాగవత గ్రంథమును (పోతన భాగవతం) తీసికోండి. దీనిలో "గజేంద్ర మోక్షము" "ప్రహ్లాద చరిత్ర'

రెండూ ఉన్నాయి. భగవత్తత్త్వమును గూర్చి పోతన ప్రహ్లాదునిచేత, "ఇందు కలడందు లేడను సందేహము వలదు చక్రి సర్వోపగతుండు" - అని చెప్పించుతాడు. అదే గ్రంథములో (గజేంద్ర మోక్ష ఘట్టంలో) గజేంద్రుడు (ఏనుగుల రాజు) మడుగులో దిగి ఒక మొసలిచేత పట్టువడి, పోరాడినవాడై శక్తియుడిగి, భగవంతుని గూర్చి రక్షించుమని ప్రార్థిస్తాడు. అపుడు అలవైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబు దాపల.... పూలపాన్పుపై లక్ష్మిదేవితో సరస సల్లాపము లాడుచున్న విష్ణువు వింటాడు. వెంటనే ఆయన భక్తుణ్ణి రక్షించుటకు బయలుదేరుతాడు. ఎలా ? "సిరికిం జెప్పడు, శంఖచక్ర యుగముం జేదోయి సంధింపడు, ఏ పరివారంబును జీరడు, అభ్రగపతిం బన్నింపడు, ఆకర్ణికాంతర ధమ్మిల్లము జక్క నొత్తడు, వివాదప్రోత్థిత శ్రీకుచోపరిచేలాంచలమైన వీడడు - అని యీ విధంగా విష్ణువు గజేంద్రుణ్ణి రక్షించడానికి బయలుదేరినట్లు వర్ణించుతాడు. ప్రహ్లాదచరిత్రలోనేమో భగవంతుడు అంతటా ఉన్నాడని అంటాడు. గజేంద్రమోక్షంలోనేమొ ఆయన వైకుంఠంలో ఉన్నాడని అంటాడు. ఇలాంటి పరస్పర విరుద్ధములు, యుక్తి విరుద్ధములు నైన విషయములు ఈ పురాణములలో చెప్పబడి ఉన్నాయి. అందుకనే "శ్రోతవ్యః శ్రుతివాక్యేభ్యః" - తాత్త్విక విషయములను వేదవాక్కులద్వారా వినవలెనని ఋషులు చెపుతున్నారు.. సంఘంలో వేదప్రచారం మళ్ళీ జరగాలి. భగవంతుడు అంతటా ఉన్నాడన్న సంస్కారం జనులలో వ్యాపించాలి. అప్పుడే మానవులు అంధ విశ్వాసములనుండి, అజ్ఞానము నుండి ఉద్ధరింపబడతారు.

"ఈశావాస్య మిదగ్ం సర్వం" - పరమేశ్వరతత్త్వం అంతట వ్యాపించి ఉండునది.

"అవినాశితు తద్విద్ధి యేన సర్వ మిదం తతమ్" - గీత. 2-17. "ఈ కనబడే ప్రపంచము నతంటిని విస్తరింపజేసి అందు ఏ పదార్థము వ్యాపకమై ఉన్నదో అది ఒక నిత్య పదార్థం అది యెన్నడు నశింపదు."

పరమేశ్వరుని స్థితి యిది. ఇక ప్రపంచస్థితి ఎటువంటిదో విచారించుదాము.

"నానతో విద్యతే భావః నాభావో విద్యతే సతః" గీత 2. 16, అంటే లేనిదానికి (అభావపదార్థమునకు) ఉనికి యుండదు, ఉనికి ఉన్నది (భావ పదార్థము) లేకుండా పోదు అని. "భావము" అంటే - "అస్తి, జాయతే వర్ధతే, విపరిణమతే, క్షీయతే, నశ్యతీతి భావః " పుట్టి పెరిగి నశించే పదార్థానికి భావమని పేరు. ఒక పదార్థము నశించినదంటే అది రూపాంతరము పొందిన దనియే అర్థము. కాని, అది పూర్తిగా లేకుండా పోయినదనికాదు, అట్లే అభావము అంటే అసలు ఉనికియే లేనిదని అర్థం. ఉనికియే లేని వస్తువు ఉద్భవించుటకే వీలుకాదు.

ఈ ప్రపంచం ఎలా ఉత్పన్నమయినది - అని మహమ్మదీయుల నడిగితే వారు, ఖుదా "కున్" అన్నాడు. అందుచేత ప్రపంచం ఇలా ఉద్భవించిందంటారు. మరి ఖుదా ఎందుకిలా ప్రపంచాన్ని సృష్టించాడు అని అడిగితే దానికి వారు "ఖుదాకి మర్జీహైఁ" అది భగవంతుని యిష్టము అంటారు. అంతేగాని "అకల్ కో దఖల్ నహీఁ" - దేవుని విషయంలో బుద్ధికేమి సంబంధం లేదంటారు. అకల్ అంటే బుద్ధి.

ఈ ప్రపంచం పుట్టింది అన్నాము. పుట్టుక అంటే అర్థమేమిటి ? అనేకం కలిసి ఒకటికావడం. సూక్ష్మాతి సూక్ష్మాణువులు అనేకం కలిసి ఒక స్థూలపదార్థంగా రూపొందటం పుట్టుక అనబడుతుంది. వస్త్రం పుట్టింది అన్నాము. అనేక తంతువులు కలిసి వస్త్రం అయిందని అర్థము.

కలిసిన వస్తువులు విడిపోవడమే వినాశము. నశించుట అంటే ఉన్న రూపం పోయి వేరొక రూపం రావడమే కాని వస్తువు పూర్తిగా లేకుండపోవడం కాదు.

అభావము అంటే త్రికాలములలో - భూత, భవిష్యత్ వర్తమాన కాలములలో ఉనికిలేదని అర్థం. ఉదాహరణకు : కుందేటి కొమ్ము, గొడ్రాలు బిడ్డడు, ఆకాశ కుసుమం, ఇవి అభావపదార్థములు. అంటే కుందేలుకు కొమ్ముకు మూడు కాలములలో ఎప్పుడూ సంబంధం ఉండదు. కనుక నిది అభావం. అలాగే గొడ్రాలు బిడ్డడు, అకాశకుసుమం ఇత్యాదులు కూడ.

కావున పుట్టిన వస్తువును దార్శనికులు కార్యమంటారు. కార్యకారణము

లను గురించి తెలిసికొందాము. కారణము-అంటే కార్యోత్పత్తికి నియమంగా పూర్వముండి తోడ్పడునది ఉదాహరణకు : మట్టికారణము, కుండ కార్యము.దారముకారణము, వస్త్రం కార్యం. అలాగే యిటుకలు కార్యం, మట్టిరేణువులు కారణం.

ఒక కార్యం కావాలి అంటే అనేక కారణాలుండాలి. ఒక కుండ తయారు కావాలంటే మట్టి, కుమ్మరి వాని సాధనములు ండాలి. కేవలం మట్టి ఉన్నంత మాత్రం చేత కుండ తయారు కాదు. మట్టి తనకు తాను కుండగా మారలేదు. కనుక ఒక కుమ్మరి కూడ అవసరం. మట్టి, కుమ్మరి రెండు ఉన్నా కావలసిన పనిముట్లు లేక కుండగాదు. ఈ కారణములలో మట్టి ఉపాధానకారణము, కుమ్మరి, వాని సాధనములు నిమిత్తకారణం. ఏ పదార్థము కార్యరూపమును ధరించునో అది ఉపాదాన కారణము. మట్టి ఉపాదానకారణము, కుండ కార్యము, ఇట ఇంకొక నియమం కూడ ఉంది. ఉపాదాన కారణంలోని గుణాలు కార్యంలో కూడ వస్తాయి. కాని నిమిత్త కారణంలోని గుణాలు కార్యంలో రావు. కుండకు మట్టి ఉపాదానకారణముగదా ! మట్టిలోని గుణములు కుండకు వస్తాయి. మట్టి నల్లగా ఉంటే కుండ నల్లగా ఉంటుంది. అలాగు మట్టి ఎఱుపుగా ఉంటే కుండ ఎఱుపుగా ఉంటుంది. ఆభరణాలకు బంగారం ఉపాదాన కారణము. బంగారం ఏ వన్నెలో ఉంటుందో అభరణాలు అదే వన్నెలో ఉంటాయి. తరువాత బంగారమును నగలుగా చేయాలి అంటే ఒక స్వర్ణకారుడు ఉండాలి. అతడే చేతన నిమిత్త కారణం. అలాగే మట్టి కుండగా మారుటకు చేతన నిమిత్త కారణం కుమ్మరి.

ఒక మట్టి ముద్ద ఉన్నది. ఇది ఎలా వచ్చింది ? అనేక అణువులు కలిసి ఒక ముద్దగా అయింది. అలాగే ఈ ప్రపంచంకూడ అణు సంయోగం వలన ఏర్పడింది. అంటారు పరమాణువాదులు. ఋషులలో పరమాణువాదికూడ ఒకడు ఉన్నాడు. ఆయనే కణాద మహర్షి. అయన వైశేషిక దర్శనకర్త. ఆయన 3000 సంవత్సరములకు పూర్వపువాడు. నేటి నవీన శాస్త్రజ్ఞులు (Scintists) Atoms ను (అణవులను) భేదించ గలుగుతున్నారు. పరమాణువులను యింకా భేదించలేక పోతున్నారు.

కుండను నిర్మించుటకు చేతన నిమిత్త కారణమైన కుమ్మరి కర్తగా ఎలా అవసరమో, ఈ ప్రపంచ నిర్మాణానికి కూడ ఒక కర్త అవసరం. ఒక కార్యమున్నది అంటే దాని కొక కర్త ఉన్నాడని అర్థము. (తమ చేతి గడియారమును చూపించుచు) గడియార మున్నది. దీనిలోని చేతబడిని - పనితనమును బట్టి గడియారమును చేసినవాడొకడు ఉన్నాడని తేలుతుంది. గడియారం తనకు తానుగా తయారు కాలేదు. అలాగే మనవాళ్ళు గ్రహాంతరములకు వెళ్ళు రాకెట్లు నిర్మించుతున్నారు. కనుక వాటికి కూడ కర్త ఉన్నాడు. కర్తకు, తాను చేయు కార్యమునకు సంబంధించిన పూర్ణజ్ఞానము ఉండి వుంటుంది.. గడియారముచేసిన వానికి దానిలోని భాగములకు (Parts)సంబంధించిన జ్ఞానము ఉండి తీరుతుంది. అలాగే, ఈ ప్రపంచమునకు సృష్టికర్తయైన పరమేశ్వరునికి ప్రపంచమునకు సంబంధించిన సంపూర్ణజ్ఞానము ఉంటుంది. మరియు కర్త తాను చేసిన దానిని పోషించగలడు : లయం జేయగలడు.

"ఈశావాస్య మిదగ్ం జగత్" - (ఈశ ఐశ్వర్యే, నియమనే) ఈశ్వరుడు అంటే ఐశ్వర్యవంతుడని, నియమించేవాడని అర్థం. సృష్టికర్తయైన పరమేశ్వరుడు ప్రపంచంలో నియమాలు కూడ పెట్టాడు. భూమి తిరుగుచున్నది. ఇదొక నియమం. అలాగే చంద్రుడు, సూర్యుడు తదితర గ్రహాలు కూడ ఒక నియమంగా తమతమ గతులు తప్పకుండా తిరుగుతూ ఉన్నవి. వాయువు వీస్తుంది. అగ్ని దహించుతుంది. ఇవన్నీ నియమాలు. నియమములో ఉన్న వస్తువులు క్రమబద్ధంగా ఉంటాయి. అడవిలో చెట్లు చేమలు ఉంటాయి., అవి ఒక నియమంగా ఉండవు. ఎక్కడ బడితే అక్కడ పెరుగుతుంటాయి. కాని గార్డెన్ (Garden=తోట) అలా కాదు. దానికొక తోటమాలి ఉన్నాడు అందుచేత గార్డెన్‌లో ఉన్న చెట్లు, మొక్కలు ఒక క్రమంలో ఉంటాయి. కాని అడవికి మాలి లేడు. అందుచేత అది క్రమపద్ధతిలో ఉండదు. భూమి చుట్టూ చంద్రుడు తిరుగుతున్నాడు. ఒక నియమిత పరిధిలో తిరుగుతున్నాడు. చంద్రుడు నియమం ప్రకారం భూమిచుట్టూ తిరుగకుండా అనియమంగా సంచరిస్తే ఎవరును నిర్ణీత సమయంలో చంద్రుని దగ్గరకు వెళ్ళనే లేరు. ఈ

సృష్టి నియమబద్ధంగా నడుస్తున్నది. దీనిని నియమించే పదార్థమునకే ఈశుడని పేరు.

'తేన త్యక్తేన భుంజీథాః'' - ప్రపంచమును త్యాగభావంతో - అనాసక్త చిత్తముతో అనుభవించు.

84 లక్షల జీవకోటిలోను మనుష్యుడు ఉత్తముడు. ఆహారము, నిద్ర, భయము, మైథునము (బిడ్డలకనుట) లలో మానవుడు అన్ని జీవరాసులతో తుల్యుడే. కాని, మిగిలిన జీవరాసుల కంటే అతడు జ్ఞానవంతుడు. కాన ఉత్తముడు. ఒక జ్ఞానములోనే అతడు ఉత్తముడు - గొప్పవాడు కాడు. క్రౌర్యంలో, ద్వేషించడంలో, అన్యాయాచరణంలో కూడ అతడు గొప్పవాడే !

అసలు జీవితం యొక్క పరమార్థం ఏమిటి ? సుఖం, సుఖశాంతులు అందరికీ కావాలి. సుఖము వద్దనేవాళ్ళు లేరు. కమ్యూనిష్టులకు కూడ సుఖం కావాలి. సుఖం కలిగితే మనం సంతోషిస్తాము. సుఖాన్ని కోరి ఆహ్వానించుతాం కూడ. కాని దుఃఖము మాత్రము కోరము, పశువుకు మేత చూపితే అది దానికి ఆహారమై సుఖమిస్తుంది కనుక తినడానికి దగ్గరకు వస్తుంది. కాని దుడ్డుకఱ్ఱను పైకెత్తితే దెబ్బవలన దుఃఖము కలుగుతుంది కావున పారిపోతుంది. ''దుఃఖం మా భూయాత్, సుఖం మే భూయాత్'' - నాకు దుఃఖం వలదు, సుఖం కావాలి అని ప్రతి ప్రాణి కోరుతుంది. సుఖాన్ని కోరే, మనిషి ఆలు బిడ్డలను పోషించుతుంటాడు. ఎన్నియిబ్బందులైనా పడి వాళ్ళను పోషించడానికి ప్రయత్నిస్తాడు. ఆఫీసులో పై అధికారులచేత ఎన్ని తిట్లు తిన్నా ఉద్యోగి యింటికి వచ్చేసరికి అది మరిచిపోతాడు. భార్యకులాసాగా కబుర్లు చెప్పి ఒక చిరునవ్వు నవ్వేసరికి తన బాధలన్నీ మఱచిపోతాడు (సభలో చిరునవ్వులు) సుఖాన్ని కోరే, మనిషి సంపదలను ప్రోగు చేస్తాడు. సంపద అంటే కేవలం డబ్బే కాదు. జీవితం సుఖముగా గడపుటకు అవశ్యకమైన వస్తు సముదాయం అంతాకూడ సంపద క్రిందకే వస్తుంది.

ఈ సంపదలను త్యాగభావంతో అనుభవించాలి. అని వేదాదేశం' ''తేన త్యక్తేన భుంజీథాః'' - త్యాగభావంతో అనుభవించడ మంటే నాది కాదని అనుభవించడం. ఈ సంపదలు, పశువులు, పుత్రులు, భార్య తనవి కావని

అనుభవించాలి. ఎందుకని ? తనవి కావు గనుక. తన శరీరము కూడ తనది కాదు. శరీరములు ఈశ్వరీయములు. అంటే మనకు శరీరము ఈశ్వరునిచేత యివ్వబడినది. మన శరీరములను మనమే నిర్మించుకొనగలిగి యున్నట్లయితే మనము వికలాంగులుగా, కురూపులుగా ఉండేవారం కాదు. (తమ శరీరమును చూపించుచూ) నేను యింతకంటె అందమైన శరీరమును నిర్మించుకొని యుందును. నెరసిన జుట్టు, వికారమైన ముఖము నాకు లేకుండెడివి. (సభలో నవ్వులు). అలాగే, ప్రతి తల్లిదండ్రులు బిడ్డలు రూపవంతులుగా నుండునట్లు కనియుండెడివారు. కాని అట్లు జరుగుట లేదు. మరియు పరమేశ్వరుడు మనకు శరీరమునేగాదు, బలముకూడ యిస్తాడు (ఓం య ఆత్మ దా బలదా యస్య విశ్వ ఉపాసతే, ప్రశిషం యస్య దేవా' యస్య చ్ఛాయామృతం యస్య మృత్యుః' కస్మై దేవాయ హవిషా విధేమ - యజుర్వేదము. 25-1) "ఆత్మదా, బలదా" అని వేదం చెప్తుంది.

ఇంకొక విషయం. ఈ శరీరం అరువు సొమ్ము అని గ్రహించాలి చూడండి. మన స్త్రీలు పెండ్లిండ్లకు, పేరంటానికి వెళ్ళేటప్పుడు తమకున్న నగలు చాలక ప్రక్కవారి నుండి అరువు తెచ్చుకొని మెడ నిండ వేసుకుంటారు. (శ్రోతలగు స్త్రీలలో చిరునవ్వులు). కాని ఆ సొమ్ములు వారి సొంతములు కావు. మరల ఎవరిది వారికిచ్చి వేయవలసిందే. అలాగే మనకీ శరీరం కూడ అరువు సొత్తు. ఇండ్లల్లో అద్దెకుంటున్నట్లుగానే మన మీ శరీరాలలో ఉంటున్నాము. ఇంటి యజమానుడు ఖాళీ చేయుమనగానే అద్దె కుండేవాడు యిల్లు ఖాళీ చేస్తాడు. అలాగే మనము కూడ ఏదో ఒకరోజు ఈ శరీరమనే అద్దె కొంపనుండి ఖాళీచేయవలసి ఉంటుంది. అప్పుడప్పుడు సినిమారికార్డుకూడ వింటుంటాము. "అద్దెకొంప లోకమింతేరా, తమ్ముడుః' ,వద్దూ పొమ్మనగానే వదలివేసి వెళ్ళాలి, ఇది మాయాసంసారం తమ్ముడూః, అని. (సభలో నవ్వులు) శరీరం చినిగిన వస్త్రంతో సమానం. ఒక చొక్కా చిరిగితే దానిని విడిచి వేరొక క్రొత్తచొక్కా తొడుక్కుంటాము. అలాగే ఈశరీరం మనకు వాసయోగ్యం కానపుడు దీనిని వదలి పెట్టవలసి ఉంటుంది. ఈ శరీరమును వదలిపెడితే వేరొక శరీరం వస్తుంది.

"మా గృధః కస్యస్వి ద్ధనమ్" ఎవరి ధనమును అభిలషింపకుము, ఎందువలన. ఈ శరీరము సంపదలు నీవికావు గనుక. మరి ఎవరివి? "కస్యస్విద్ధనం" - ఈ ధన మెవరిది ? కస్య-సుఖస్వరూపుడైన ఆ పరమేశ్వరునిదే.

మనం జీవించునది తినుటకుకాదు. బ్రతుకుటకు తింటున్నాము. Eat to live but dont; live to eat (బ్రతుకుటకు తిను, తినుటకు బ్రతుకవద్దు) అని ఒక ఇంగ్లీషు సామెత కూడ కలదు. (సభలో చిరునవ్వులు). కాబట్టి మన జీవితలక్ష్యం కేవలము ధనమును సంపాదించి, దాని ననుభవించుటకు కారాదు. కొందరు వంశ పారంపర్యముగా ముదిమనుమలు తిన్నను తరుగనంతగా సంపాదించి ఆ సంపదలను తామనుభవింపక ఎప్పుడో రాలిపోతారు. ఆ ధనమును వాళ్ళనుభవింపరు. ఇతరులను అనుభవింప నీయరు. ఊరకే ప్రోగుచేస్తుంటారు. పశువుల గాటిలో అప్పుడప్పుడు కుక్కలు పడుకొంటూ ఉంటాయి. ఆ కుక్క తాను గడ్డిని తినదు. పశువు మేత మేయబోతే భౌ, భౌ అని దానిని తిననియ్యదు (సభలో చిరునవ్వులు) అధిక ధనవంతుల స్థితి యిట్టిదే.

ఎక్కువ సంపాదించినందువలన యింకొక యిబ్బంది కూడ ఉంది. సంపాదించిన ధనాన్ని ఎలా భద్రం చెయ్యాలి అనేదొక సమస్య. మరి బ్లాక్ మనీ గనుక సి.ఐ.డీలు పట్టుకుంటారేమోనని భయం . ఉన్నధనం ఉన్నట్లు లెక్కచెబితే ఇన్‌కంటాక్సు వాళ్ళతో పేచీ (సభలో నవ్వులు). ఇన్ని ఇబ్బందులున్నాయి ధన సంపాదనలో. కనుక ధన సంపాదన మన జీవిత లక్ష్యం కారాదు. జీవితానికొక లక్ష్యం చూడాలి. మిగిలినవి రేపు చెప్పుకొందాం.

గుంటూరు, 26-12-1968

బుధవారం. సా॥ 6-00 గం.

మహాజనులారా !

గత దినం సాయంత్రం ఈశావాస్యోపనిషత్తులోని మొదటి మంత్రం వివరించుకొన్నాము. ఇవ్వాళ రెండవ మంత్రాన్ని గురించి చెప్పుకొందాము. గత దినం చెప్పుకొన్న విషయం సంగ్రహంగా ఒకసారి చెప్పుకొని తరువాత

మంత్రం చెప్పుకుందాము. పరమేశ్వరుడు ఈ ప్రపంచానికి సృష్టికర్త. ఆయన దీన్ని పోషింపగలడు. నాశనము చేయగలడు. ప్రపంచం ఈశ్వరుని ఐశ్వర్యం కనుక ప్రపంచ గత పదార్థములను మానవులు తమవి గావని తెలుసుకొని త్యాగభావంతో అనుభవించాలి. ఇతర ధనాదులను లోభబుద్ధితో గ్రహింపరాదు. పరమేశ్వరుడు సర్వత్ర వ్యాపకుడై ఉండుటచేత మనల నాయన ఎల్లప్పుడు ఎల్లవిధముల చూస్తూఉంటాడు. కనుక తప్పులు చేయరాదు. అని తెలిసికొన్నాము.

మనకు శరీరములుంటేనే కర్మలాచరింపగలం. ప్రపంచంలో మూడు మూల పదార్థాలున్నాయని మనకు వేదము ద్వారా తెలుస్తుంది.

ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే
తయో రన్యః పిప్పలం స్వాద్వ త్త్యనశ్న న్నన్యో zభిచాకశీతి ॥

తా ॥ ఒకింత సమానఖ్యాతి కలిగి కలిసియుండు రెండు సుపర్ణులు ఒకే వృక్షమును పరిష్వంగ మొనర్చుచున్నవి. అందొకటి వృక్షఫలములను రుచి చూచుచున్నది. రెండవది తినక అంతట ప్రకాశించుచున్నది.

ఈ మంత్రంలో అలంకారికంగా ప్రపంచ మూలపదార్థములు మూడు వర్ణింప బడినాయి. ఇందు చెప్పబడిన రెండు సుపర్ణులు - అంటే రెండు చేతన పదార్థములు - జీవేశ్వరులు. జీవేశ్వరులు ఇచట పక్షులుగా చెప్పబడిరి. వృక్షము జడపదార్థము. ప్రకృతి ఇచ్చట వృక్షముగా చెప్పబడింది. "వృశ్చ్యతే ఖండ్యతే ఇతి వృక్షః" - వ్రయ్యలు చేయదగినది (ఖండ ఖండములుగా చేయదగినది) కనుక వృక్షము అనబడుతుంది. అట్లే ఈ జగత్తుకూడ పరమాణువులచే నిర్మించబడి మరల ఖండింపబడదగియున్నది. జీవుడీ ప్రకృతి రూపవృక్షము నంటిపెట్టుకొని యుండి, అందు ఫలించు ఫలములను అనుభవించుతాడనియు, పరమేశ్వరుడు ప్రపంచమందు వ్యాపకుడై ఉండి జీవుడుచేసే కర్మలను వీక్షిస్తూ కర్మల కనుకూల ఫలములను ఇస్తుంటాడనియు వర్ణింపబడినది.

మనము చేసే ప్రతికర్మకు ఫలం ఉంటుంది. అది మంచి ఫలం గాని చెడుఫలం గాని కావచ్చు. కర్మలు చేసేవాడు తాను చేసేకర్మలకు కర్త

అవుతాడు. కర్త అయిన వాడు తానుచేసిన కర్మల ఫలాన్ని తప్పకుండ అనుభవించాలి. ఇది న్యాయం కూడ. కర్మ సిద్ధాంతం వేద సిద్ధాంతములలో ముఖ్య సిద్ధాంతం. కర్మలు చేయుటలో జీవుడు కర్త కావున అతడు స్వతంత్రుడుగ కూడా ఉంటాడు. ''స్వతంత్రఃకర్తా'' అని పాణిని. కర్తకు కర్మ చేయడంలో స్వాతంత్ర్యం ఉంది. అతడు మంచి చేయవచ్చు : చెడుగు చేయవచ్చు. ఆస్తికులలో కొందరి కీ విషయం తెలియదు. కొందరు ఆస్తికులు తమ అస్తిత్వమును అంగీకరించరు కూడ. అంతా భగవంతుడేచేస్తున్నాడు. జీవుని ప్రమేయం ఏమి లేదని ఒకమిత్రుడు ఇంతకుముందు నాతో అన్నాడు. నే నా మిత్రునితో పరమేశ్వరుడు దొంగతనం చేస్తాడా ? వ్యభిచరిస్తాడా ? అన్నాను. (సభలో నవ్వులు). అతడు ఏమీ ఆలోచించకుండానే అవును, చేస్తాడు అని సమాధాన మిచ్చాడు. పాపం అతని నేమనగలం ? కాని వైదికులు మాత్రం దీనిని అంగీకరింపరు. వైదికులు జీవునికికర్మలు చేయుటయందు స్వాతంత్ర్యమున్న దంటారు. కాని తాను చేసిన కర్మ ఫలితాలు అనుభవించుటలో మాత్రం అతడు అస్వతంత్రుడని అంగీకరిస్తారు. అందువలననే.

"కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన
మా కర్మఫల హేతు ర్భూః . . . . - గీత 2-47

కృష్ణుడర్జునునితో అంటాడు. అర్జునా నీవు కర్మలాచరించుటకే అధికారివి; కాని వాటి ఫలములపై నీ కధికారం లేదు. అని, మాకర్మఫల హేతుర్భూః అంటే కర్మఫలానికి నీవు హేతువు (కారణము) కావద్దు అంటాడు.

మన అనుభవంలో కూడ యిది యథార్థమని తెలుస్తుంది. నేను కడుపునిండ తినవచ్చు. ఎక్కువ తక్కువలు కూడ తినే స్వాతంత్ర్యం నాకుంది. కాని ఎక్కువ తిన్నందువల్ల వచ్చే కడుపునొప్పి నేనువద్దంటే ఆగదు. నాకు అందులో స్వాతంత్ర్యం లేదు. అలాగే నేను విషం తింటే వద్దనే వాళ్ళెవరూ లేరు, కాని తిన్న తరువాత దాని ఫలం నా చేతిలో ఉండదు. విద్యార్థి ఉన్నాడనుకొండి. పరీక్ష పేపర్లకు సమాధానాలు వ్రాయటంలో స్వతంత్రుడు. అతడు ప్రశ్నలకు సమాధానాలు బాగా వ్రాయనూవచ్చు. ఏమి వ్రాయకుండా వట్టి కాగితం తిరిగి యిచ్చి వేయనూవచ్చు. లేక పేపరు యిచ్చిన Examiner

(పరీక్షాధికారిని) తన కిష్టం వచ్చినట్లు తిడుతూ వ్రాయనూ వచ్చు (సభలో నవ్వులు) కాని అతనికి వచ్చేపరీక్షా ఫలితాలు అతడు ఆశించినట్లుండవు. పరీక్షాధికారి విద్యార్థి ఆశించిన మార్కుల కంటె తక్కువ వేయవచ్చు ; లేక ఎక్కువ వేయవచ్చు ; లేక విద్యార్థి వ్రాసిన విపరీత సమాధానాలకు సున్నా చుట్టనూ వచ్చు ; లేక అతడు కాపీ చేశాడని తెలిస్తే డీబార్ చేయనూవచ్చు. అందుచేత పరీక్షాఫలితాలు విద్యార్థి చేతుల్లో లేవు. అలాగే మనం చేసిన కర్మలకు వచ్చే ఫలం మన చేతులలో లేదు. ఆఫలాలను మనం అనుభవించాలి. శుభ కర్మలను చేసి ఉంటే సుఖరూపంలోను, దుష్కర్మలను చేసిఉంటే దుఃఖరూపంలోను ఫలముల ననుభవించుతూ ఉంటాము. జీవుడు శరీరంతోనే కర్మలు చేస్తాడు. దాని ద్వారానే శుభాశుభ కర్మల ఫలితాలను అనుభవిస్తాడు. శరీరం జీవుని కొక బంధనం. జీవుడీ శరీర బంధనం నుండి తప్పుకుంటే ముక్తు డవుతాడు.

జీవుడు బద్ధుడా ? నిత్య బద్ధుడా ? లేక బంధనం నుండి తప్పుకొనుటకు వీలున్నదా ? అని అంటే జీవుడు నిత్యబద్ధుడు కాదు. నిత్యబద్ధుడైన వాడు ముక్తుడు కానేలేడు. బంధం మధ్య వచ్చి ఉంటే అది పోగొట్టుకొనుటకు కూడ వీలుంటుంది. క్రైస్తవులు జీవుడు తాను చేసిన కర్మలకు ఫలితంగా స్వర్గమో నరకమో అనుభవిస్తా డంటారు. వారి దృష్టిలో జీవులు పరమేశ్వరునిచేత సృష్టింపబడతాయి. మన మది అంగీకరించము. జీవులు నిత్యులు : దేవునిచేత సృష్టింపబడునవి కావు. అదీకాక క్రైస్తవులు మానవులలోనే జీవులను అంగీకరించుతారు. పశు పక్ష్యాది జంతుకోటిలో జీవులను నంగీకరింపరు. మానవులలో కూడ పురుషులలోనే జీవాత్మ ఉన్నదంటారు. స్త్రీలలో జీవాత్మ లేదట ! యెహోవా జీవవాయువును ఒక్కపురుషుని నాసికారంధ్రములందే ఊదుతాడు. స్త్రీ శరీరములో ఊదడు. స్త్రీ శరీరమును పురుషుని ప్రక్కటెముక నొకదానిని బయటికి తీసి నిర్మిస్తాడు. అందుచేత వారు నరునిలో జీవుడున్నాడుకాని, స్త్రీలలో జీవాత్మ ఉన్నదని అంగీకరింపరు. క్రైస్తవులు పునర్జన్మకూడ అంగీకరింపరు. జీవుడు చేసిన పుణ్యాపాపములలోని హెచ్చు తక్కువలను బట్టి వారికి స్వర్గమో నరకమో వస్తుందంటారు. ఒక జీవుడు

60 మంచి పనులు చేసి 40 చెడ్డపనులు చేస్తాడనుకోండి. చెడ్డపనులకంటె మంచి పనులు ఎక్కువ చేశాడు కనుక అతనికి స్వర్గం వస్తుందట ! ఒకడు 60 చెడ్డపనులుచేసి 40 మంచి పనులు చేస్తే అతనికి నరకం వస్తుందట ! అదీగాక, 60 మంచి పనులు చేసేవాడొకడు, 70 చేసే వాడింకొకడు, 80 చేసేవాడు వేరొకడు ఉన్నా, వీరందరికి హెచ్చుతక్కువ భేదం లేకుండ అందరికి స్వర్గం సమానంగానే వస్తుందట ! అలాగే చెడ్డపనులు చేసేవారికి వారు చేసిన చెడుగుల సంఖ్యలో భేదములున్నను నరకం ఒకలాగే ఉంటుందట ! ఇదెక్కడి న్యాయమో తెలియదు. వైదికమతం దీని నంగీకరింపదు. ఇందు తాము చేసిన మంచి పనులకు చెడ్డపనులకు తగినట్లు ఫలం హెత్చుతగ్గులుగా జీవులనుభవింపవలసిందే. ఇదే న్యాయం కూడ. క్రైస్తవులు చెప్పునట్లు ఎక్కువ మంచిపనులు చేసినవానికి స్వర్గమిచ్చి, అతడు చేసిన దుష్కర్మల ఫలితాన్ని అనుభవింపనీయక తీసివేస్తే అది అన్యాయం అవుతుంది. చేసిన కర్మలకు చేసినట్లు తగిన ఫలితం యివ్వడం న్యాయం. అలాగే ఎక్కువ చెడుగుల చేసినవానికి కేవలం నరకమునిచ్చి అతడు చేసిన మంచిపనులకు ఫలము నీయకపోవడంకూడ న్యాయం కాదు. జీవులకు శరీరం ఎందుకు వచ్చింది ? చేసిన కర్మల ఫలము ననుభవించుటకు. మనకు శరీరం భగవంతుడిస్తాడు. ఈ జన్మలో మనం చేసిన కర్మలఫలం అనుభవింపక మిగిలిఉంటే వాని ననుభవించడానికి అతడు మనకు జన్మాంతరమిస్తాడు. జీవునకు ఒక జన్మకాదు అనేక జన్మలుంటా యనేది వైదిక మతం. అటులయినచో నీ శరీరంలోనే సర్వ కర్మల ఫలముల ఎందుల కనుభవింపరాదు. అనే ప్రశ్న రావచ్చు. అలా అనుభవించుటకు వీలులేదు. ఈ శరీరంలో అనుభవించుటకు వీలులేని ఫలాలుకూడ కొన్ని ఉంటాయి. అందుచేత భగవంతుడు జీవునికి శరీరాంతరములను కల్పించి ఆ కర్మల ఫలితాన్ని వానియందు అనుభవింప జేస్తాడు. ఇది వేద సిద్ధాంతము.

జీవునికి శరీరం రావడానికి కర్మలు కారణమని చెప్పుకున్నాము. మరి అలాంటప్పుడు జన్మబంధం ఎలా తొలగుతుంది - అంటే జీవుడు కర్మలు చేస్తూ కూడ బంధనంలో పడని ఉపాయం మనకు వేదం చెబుతుంది. అదేమంటే,

కర్మలు చెయ్యాలి, కాని ఫలితాన్ని మాత్రం ఆపేక్షింపరాదు. కర్మలు కర్తవ్యబుద్ధి (Duty) తో ఆచరించాలేగాని ఫలాపేక్షతో కాదు. ఫలాపేక్షతో చేస్తే కర్మలు బంధన కారణం అవుతాయి. భగవద్గీతలో ఈ కర్మసిద్ధాంతమే విస్తారంగా బోధింపబడింది.

భగవద్గీతలో కృష్ణుడు పెక్కుమారులు తనను ద్దేశించి అహం శబ్దాన్ని వాడతాడు. ఈ అస్మత్ శబ్దప్రయోగం వలన మన భాష్యకారులు - వ్యాఖ్యాతలు కృష్ణుణ్ణి దేవునిచేశారు. ఇది సరికాదు. అహం శబ్దం జీవపద సూచకంగానే వాడబడింది గీతలో. అహం అంటే నేను అని అర్థం. "నేను" అంటే ఈ శరీరం కాదని ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాలి. నేను లావుగా ఉన్నాను. అంటే నా శరీరం లావుగా ఉన్నదని అర్థంచెప్పుకోవాలి. కాని "నేను" అనేదానికి లావుతనం ఉండదు. శరీరం ఆత్మకాదు. ఆత్మ కానిదాన్ని మనం ఆత్మ అనుకుంటాము. శరీరాలు ఆత్మకు అనేకం వస్తుంటాయి పోతుంటాయి. ఇక యీ నేను అనే దేమిటో విచారించి తెలుసుకోవాలి. ఇది తెలుగులో "నేను", ఆంగ్లములో "ఐ' ' హిందీలో "మై" సంస్కృతంలో "అహం" అను పదాలతో వ్యవహరింప బడుతుంది. నా కన్ను, నా ముక్కు, నా చెవి, నా నాలుక, నా శరీరము, నా మనస్సు అని మనం అంటున్నాము. అట్లు నా యిల్లు, నా భార్య, నా కుమారులు, నా సంపదలు అన్నపుడు నేను వేరు, నా యిల్లు, భార్య కుమారులు, సంపదలు వేరు అని నేను కాదు అని తెలుస్తుంది. అలాగే నా ముక్కు, నా చెవి, నా చేయి, నా శరీరము, నా మనస్సు, అన్నపుడు నేను వీటి కన్నింటికంటె వేరైనవాడననియు, శరీరము, మనస్సు ఇంద్రియాదులు నేను కాదనియు సులభముగ తెలియుచునే ఉన్నది. ఈ "నేను " అనునది ఇంద్రియములకు, మనస్సుకు తెలియబడదు. "నేను ఇంద్రియములద్వారా, మనస్సుద్వారా ఈ ప్రపంచవిషయాలను తెలుసుకుంటున్నాను". అంటే, నాకు మనస్సు, ఇంద్రియాలు ఈ ప్రపంచమును తెలిసికొనుటకు సాధనములు మాత్రమే అని యర్థము. కావున నన్నవి తెలుసుకోలేవు. ఈ "నేను" అనునది శరీరంలో ఉన్నంతవఱకు దానికి సంబంధించిన కొన్ని గుణములు శరీరంలో వ్యక్తమవుతున్నాయి. అవి ("ఇచ్ఛాద్వేష ప్రయత్న సుఖదుఃఖ జ్ఞానాన్యాత్మనో

- లిఙ్గాని న్యాయదర్శనం 1-1-10) ఇచ్ఛ (కోరటం). ద్వేషం, ప్రయత్నం సుఖం, దుఃఖం, జ్ఞానము, ఈ గుణాలు మరణానంతరం - అంటే శరీరమునుండి "నేను" అను పదార్థం నిష్క్రమించిన తరువాత శరీరమున వ్యక్తమగుట లేదు. కావున ఇవి "నేను" అను వస్తుగుణములే యగును. ఇవి శరీరగుణములు కావు. అయి ఉంటే శరీరాన్ని మనం తగులబెడుతుంటే దానిలో బాధ వ్యక్తం కావాలి, వస్తు ధర్మం వస్తువుతో ఉంటుంది, వస్తువును విడిచి ఉండదు. అగ్నికి దాహక శక్తిఉంది. ఉష్ణత దాని స్వాభావిక గుణం. అగ్ని వున్న దహిస్తుంది. లేకున్న దహింపదు. అట్లే ఇచ్ఛ, ద్వేషం, ప్రయత్నం, సుఖం, దుఃఖం, జ్ఞానం యివన్నీ కూడ జీవుని గుణాలు. జీవుడన్నా "నేను" అన్నా ఒకటే ఇచట జీవుని గురించి ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే జీవస్వరూప మేమిటో అతని గుణము లేమిటోమొదట తెలుసుకుంటేగాని అతడుచేసే కర్మలు. వాటి ఫలితాలు ఆ కర్మలవలన జీవునికి బంధమోక్షము లెలా సిద్ధిస్తాయి. అనే మిగిలిన విషయాలు అర్థంకావు. నేత్రాది ఇంద్రియములు ప్రాకృతికములని అందుచేత అవి ప్రాకృతిక పదార్థాలనే తెలుసుకోగలుగుతాయని నిన్నచెప్పాను. "నేను" అనేది ఒక సూక్ష్మవస్తువు. అది ప్రాకృతిక పదార్థ సమ్మేళనంవలన యేర్పడినది కాదు. స్వతఃసిద్ధమైన చైతన్యపదార్థం. అందుచేత నేత్రాది ఇంద్రియముల కది గోచరించేదికాదు. కేవలము అది శరీరములో వున్నపుడు అందులో వ్యక్తమయ్యే గుణాలను బట్టియే దానిని తెలుసుకుంటాము. ఇట్లు కర్మ సిద్ధాంతం కొంత తెలిపి యిపుడు రెండవ మంత్రమును చదువుతున్నాను.

కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమా ః
ఏవం త్వయి నాన్యథేతోz స్తి న కర్మ లిప్యతే నరే ॥ 2

భావార్థము : పరమేశ్వరుడు సర్వద్రష్ట న్యాయాధీశుడు నని యెంచి అతని యాజ్ఞయే చేయదగినదని నిర్ణయించి, మానవులు సోమరితనమును దరిజేరనీయక శుభకర్మములు ఫలాపేక్ష లేకయే చేయుచుండవలెను. అశుభకర్మముల నాచరింపరాదు. బ్రహ్మచర్యమును పాలించుచు విద్యా సుశిక్షణలను బొందవలెను. ఉపస్థేంద్రియమును నిగ్రహించి వీర్యమును పైకిలాగి, ఓజస్సుగా మార్చి అల్పమృత్యువును జయింపవలెను. యుక్తాహార

విహారముల మూలమున నూరేండ్లు జీవింపవలెను. మానవులు శుభకర్మముల నాచరించు నెడల దుష్కర్మములు వారికి దూరమగును. విద్య, ఆయుస్సు సుశీలత వారికి పెంపొందును.

మనం నిత్యజీవితంలో అనేక కర్మలు చేస్తుంటాము. కొన్ని కర్మలకు ఫలం వెంటనే లభిస్తుంది. కొన్ని కర్మలకు ఉద్దిష్టప్రయోజనం వెంటనే సిద్ధించదు (ఏ ప్రయోజనము నుద్దేశించి కర్మ చేయబడుతుందో అది ఉద్దిష్ట ప్రయోజనము) ఇక్కడ ఉపన్యాసం జరుగుతుందని విన్నాము. ఉపన్యాసం వినడానికి ఒక మైలు దూరం నుండి నడచివచ్చాము. ఈ నడచిరావడమనేది కర్మ దానికి రెండు ఫలాలు. ఒకటి ఇక్కడకు చేరుట రెండవది ఉపన్యాసం వినుట. ఈ రెండవ ఫలమే ఉద్దిష్టఫలం. ఇది కొన్ని కర్మలకు వెంటనే సిద్ధిస్తుంది. కొన్నింటికి సిద్ధింపదు. అన్నం తినుట నీళ్ళు త్రాగుట అను నిట్టి కర్మలకు ఉద్దిష్టఫలం ఆకలి దప్పికలు తీరుట అవి వెంటనే సిద్ధించును. కాని నేను రాత్రి విరేచనానికి మాత్ర వేసుకున్నా ననుకోండి. విరేచనం వెంటనే కాదు. మరుసటి రోజుదాకా ఆగాలి. వ్యవసాయదారుడు పొలములో విత్తనం వేశాడు. అతనికి పంట వెంటనే రాదు. ఐదు లేక ఆరునెలలు ఆగినతరువాత గాని ఫలం చేతికి రాదు. అలాగే విద్యార్థి పరీక్ష వ్రాస్తాడు. కాని ఫలితం వెంటనే తెలియదు. కొన్నాళ్ళు ఆగాలి. ఇలా ఉంటాయి కర్మలు, వాటి ఫలితాలు. మనం ఈ శరీరంలో చేసే కొన్ని కర్మలకు ఫలితం వెంటనే అనుభవిస్తాం. కొన్ని కర్మలు అనుభవించకుండ మిగిలిపోతాయి. ఆ కర్మశేషాన్ని అనుభవించడానికి వేరొక శరీరం వస్తుంది. మరి ఈ విధంగా శరీరం తర్వాత శరీరం జీవునికి వస్తున్నాయి కదా ! ఈ శరీర బంధనం నుండి తప్పుకోవడానికి వీలున్నదా ? అంటే వీలున్నదనే మనకు వేదం చెబుతున్నది.

("కుర్వన్ - ఏవ - ఇహ - కర్మాణి-జిజీవిషేత్ - శతమ్ - సమాః" అని. మంత్రమును పదవిభాగం చేసి చదువుతూ శ్రీ గోపదేవ్‌గారు యిలా అన్నారు)

వైదిక భాష ఎంతో సులభ గ్రాహ్యంగా ఉంటుంది. కొందరు వేద భాష కఠినం అనుకుంటారు. కాని అది యథార్థం కాదు. భగవద్గీత ఈ రెండవ మంత్రము నాధారము చేసికొని నిర్మింపబడింది. ఇందులో అతిశయోక్తి

ఏ మాత్రము లేదు. మంత్రము అనగా, మననము చేసి తెలిసికోదగిన దని యర్థము. వేదమంత్రములలోనున్న వైశిష్ట్యం ఇదియే.

యజుర్వేదంలో "పశ్యేమ శరదః శతమ్ " - నూరు సంవత్సరముల వరకు చూతుముగాక ! "జీవేమ శరదః శతమ్" - నూరు వత్సరములు జీవింతుముగాక ! "శృణుయామ శరదః శతమ్" - నూరు వత్సరములు విందుము గాక! "అదీనాః స్యామ శరదః శతమ్ - నూరేండ్లు దీనులము కాకుందుము గాక ! "భూయశ్చ శరదః శతాత్" - నూరు సంవత్సరములకు పైబడికూడ నిట్లే జీవింతుముగాక ! అని యున్నది.

కావున సామాన్యముగా మనుష్యుని ఆయుర్దాయము 100 సంవత్సరములని తెలియనగును. అంతకు ఎక్కువకూడ జీవించవచ్చు లేక నూరు నిండక పూర్వమే మరణించవచ్చు. జీవించినంతకాలము కర్మలు చేయవలసిందేనని వేదం చెబుతుంది. "కుర్వన్ +ఏవ" - అనుటలో, "ఏవ' ' పదములో బలమున్నది. "కుర్వన్ + ఏవ" అంటే చేస్తూనే ఉండు అని అర్థం. పరుగెత్తుతూనే ఉండు, అంటే, మధ్యలో ఆగరాదని అర్థమవుతుంది. కావున జీవించినంతకాలం మానవుడు కర్మలు చేయవలసిందే. వాటిని విడువరాదు. వేదము అకర్మణ్యత నంగీకరింపదు. ఇది మొదట గుర్తుపెట్టుకోవాలి. కాని కర్మలు ఫలకాంక్షారహితములై ఉండాలి. అప్పుడు, కర్మ న లిప్యతే - కర్మము అంటదు - బంధనహేతువుకాదు.ఇతః అన్యథా నాస్తి-ఇంత కంటె వేఱువిధము లేదు.

కర్మలు అంటే చేసే పనులు. యత్ క్రియతే తత్ కర్మ -। ఏది చేయబడుతుందో అది కర్మ. శిష్టసంప్రదాయం వేదవిహితకర్మలనే కర్మలుగా అంగీకరించుతుంది.

భగవద్గీతలో వాడబడిన కర్మపదము వేదవిహిత కర్మలను బోధించునని మనం గ్రహించాలి. కర్మలు ముప్విధములు, నిత్యకర్మలు, కామ్యకర్మలు, నైమిత్తిక కర్మలు, నిత్యకర్మలు ప్రతిదినముమనము చేయవలసినవి. కామ్యకర్మలు కొండొకఫలం కోరి చేసేవి. నైమిత్తిక కర్మలు ఒక నిమిత్తముతో చేసేవి. సకాలంలో వర్షాలు కురియనపుడు ప్రజలు చాల యిబ్బందులు

పడతారు. యజ్ఞయాగాది క్రతువులనుచేసి మేఘము నుత్పత్తి చేసి వర్షాలు పడేలా చేసేవారు మన పూర్వులు. Science(సైన్సు) వృద్ధి అయిన తరువాత యిప్పుడో మనవాళ్ళు విమానములలో వెళ్ళి మేఘములపై ఉప్పును చల్లుసరికి మేఘములు చల్లబడి వర్షించుతున్నాయి. ఇలాంటి కర్మలు నైమిత్తిక కర్మలు అనబడతాయి.

నిత్యకర్మలు ఐదు విధములు. అవియే పంచమహాయజ్ఞములు, బ్రహ్మ యజ్ఞము, దేవయజ్ఞము, పితృయజ్ఞము, అతిథి యజ్ఞము, భూత యజ్ఞము లేక బలివైశ్వదేవము. ఈ యజ్ఞములు గృహస్థుడు నిత్యము తప్పకుండా చేయాలి. యజ్ఞము అంటే మంచిపని లేకుంటే ఉత్తమకర్మ అనబడుతుంది. "యజ్ఞోవై శ్రేష్ఠతమం కర్మ".

వేదములందు ఆచరింపదగినవిగా చెప్పబడిన కర్మలు విహితకర్మ లనబడును.

"కృషిమిత్ కృషస్వ" - వ్యవసాయం చెయ్యి

"సంగచ్ఛధ్వం" కలిసి నడవండి

"సంవదధ్వం" - కలిసి మాట్లాడండి

"సం వో మనాంసి జానతామ్" - ఏక మనస్కులై తెలుసుకోండి లేక ఆలోచనలో ఒకటిగా వుండండి.

వేదములో చేయకూడదు అని నిషేధింపబడినవి నిషిద్ధకర్మలు అనబడును.

"అక్షైః మా దీవ్యః" పాచికలు (జూదము) ఆడవద్దు.

"గాం మా హిగ్ంసీః - గోవును చంపవద్దు.

"అవిం మా హిగ్ంసీః" - గొఱ్ఱెను చంపవద్దు.

"మా హిగ్ం సీః సర్వాభూతాని" - ఏ ప్రాణిని హింసింపవద్దు.

అని యీ విధంగా వేదంలో విహితకర్మలు, నిషిద్ధకర్మలు చూడనగును. విహితకర్మలుసంఘశాంతి కారకములు. నిషిద్ధకర్మలు సంఘమునకు అశాంతి కలిగిస్తాయి. దొంగతనం, వ్యభిచారం, అసత్యం చెప్పడం యిలాంటివన్నీ సంఘానికి అశాంతి కారకములు.

"వేదోదితం స్వకం కర్మ నిత్యం కుర్యా దతంద్రితః" - మను.

వేదవిహిత కర్మలు అలసతను వీడి నిత్యము చేయుచుండాలి. అని మనుధర్మశాస్త్రం కూడ చెపుతుంది. నూరేండ్ల పర్యంతము (జీవించినంత కాలం) కర్మలు చేయవలసిందే. వాటిని విడువరాదు.

"యజ్ఞ దాన తపఃకర్మ నత్యాజ్యం కార్యమేవ తత్" - గీత 18-5

యజ్ఞము, దానము, తపస్సు యీ కర్మలు వదలిపెట్టరాదు. తప్పక చేయవలసినవేఅని గీత కూడ చెపుతుంది.

న కర్మణా మనారంభా న్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే,
నచ సన్న్యసనా దేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥ గీ 3-4

మనుజుడు కర్తవ్యకర్మల నాచరింపనంత మాత్రంచేత నిష్కర్మికాడు. కర్మలు చేయక వానిని విడిచినంత మాత్రమున సిద్ధుడునుకాడు.

కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్,
ఇంద్రియార్థాన్విమూఢాత్మా మిథ్యాచారః! స ఉచ్యతే ॥గీ 3-9

కొందరు హస్తపాదాది కర్మేంద్రియములను కట్టిపెట్టి కర్మల నాచరింపనివారై మనస్సులో మాత్రం ఇంద్రియార్థములైన రూపరసాదులను స్మరించుతుంటారు. అలాంటివారు, కర్మసంన్యాసులు కాని, జ్ఞానులుకాని కారు. వారు కేవలము మూఢాత్ములు, మిథ్యాచారులు, అసత్యాచరణ కలవారుగా ఎంచబడుతారు. ఇవి నా మాటలుగావు సుమండీ! శ్రీకృష్ణుడంతటి తత్త్వవేత్త చెప్పాడు. మేము కర్మసంస్యాసులము అని చెప్పుకొనేవారిని గురించి కృష్ణుడెంత కఠినంగా అన్నాడో చూడండి! "మిథ్యాచారఃసఉచ్యతే" - అతడు మిథ్యాచారు డనబడుతాడు అన్నాడు. మీరు సంన్యాసులను చూచేవుంటారు. వారు కాషాయ వస్త్రములను ధరించి గొప్ప కర్మ సంన్యాసులుగా కనబడతారు. అందరియెదుట వారేమీ తీసికోరు. ఏ కోరికలు లేనివారివలె నటించుతుంటారు. కాని లోలోన విషయ సుఖములను గూర్చి చింతించుతూనే వుంటారు. పైకి ఒక విధముగ లోపల వేరొక విధముగా వర్తిస్తుంటారు. వీరే మిథ్యాచారులు అనబడతారు. సంన్యాసులు కూడ లోకహిత కర్మలయందు - వేదవిహిత కర్మలయందు వర్తించుతూనే వుండాలి. నేలవిడిచి సాముచేయరాదు.

మనమందరము కర్మఠులము కావాలి. వేద విహితకర్మలను నిత్యము ఆచరించుతూ వుండాలి. నేడు వైదికులమని చెప్పుకొనేవారిలో కూడ వేదవిహిత కర్మలు లేవు. ఇది చాల శోచనీయము.

మనం చేయవలసిన నిత్య యజ్ఞములలో మొదటిది బ్రహ్మయజ్ఞము. దీనిని గురించి చెప్పుకొందాము.

బ్రహ్మ అంటే పరమేశ్వరుడు. ఆయనను ఉదయము లేవగనే నిద్ర మంచముపై నుండియే స్మరించాలి. ఉదయముననే అంటే సూర్యోదయం కాకముందే యని యర్థం. "య ఉద్యంత మాదిత్యం స్వపితి" సూర్యుడు ఉదయించిన తరువాత నిద్రపోయే వానికి ఆయువు క్షీణిస్తుంది. సూర్యోదయాత్పూర్వమే లేచి, (ఓం ప్రాతరగ్నిం ప్రాత రింద్రం హవామహే ప్రాత ర్మిత్రావరుణా ప్రాత రశ్వినా, ప్రాతర్భగం పూషణం బ్రహ్మణస్పతిం, ప్రాతః సోమ ముత రుద్రం హువేమ ॥ - ఋగ్వేదం. 3-41-11 - ఇట్టి మంత్రముల తాత్పర్యము "వైదిక దినచర్య" యందు చూడనగును) "ప్రాత రగ్నిం ప్రాత రింద్రం హవామహే..." (ప్రాంతఃకాలమున దేవుని ప్రకాశశక్తిని, ఐశ్వర్యశక్తిని మేము కోరుచున్నాము) ఇలాంటి ప్రాతఃస్మరణ మంత్రములతో పరమేశ్వరుని స్మరించాలి. భగవంతుడు సృష్టి స్థితి లయ కారకుడు. ఈ ప్రపంచాన్ని జీవుల భోగార్థమై ఆయన సృష్టించాడు. కనుక ఆయనను మనం మరవరాదు. మనం ఆయనకు కృతజ్ఞులం (చేసిన మేలు మరవని వాడు) కావాలిగాని కృతఘ్నుడు (చేసిన మేలు మరచువాడు) కారాదు. సామాన్యంగా లోకంలో ఎవరైనా మనకు మేలుచేస్తే మనం అతనిని మరువము. మనకు భగవంతుడుచేసిన మహోపకారము అసలే మరవరానిది. మన కాయన శరీరముల నిచ్చాడు. ఈ శరీరముల ద్వారా సుఖముల ననుభవించుటకు అనేక పదార్థములను సృష్టించాడు. ఆయన ప్రతిదినము జీవుల నన్నింటిని తన సన్నిధికి ఆకర్షించి ఆనందము కలుగజేసి శారీరిక మానసిక విశ్రాంతిని కలిగించుచున్నాడు. ఈ విశ్రాంతిని మనం సుషుప్త్యవస్థ (నిద్ర)లో పొందుతున్నాము. నిద్ర మన స్వాధీనంలో ఉండదు. నిద్ర మన స్వాధీనంలో ఉంటే మనం కోరినపుడు నిద్ర పోగలం. ఆవశ్యకము లేదనుకుంటే వెంటనే మేలుకోగలం. కాని మన మలా

చేయలేం. ఒక్కొక్కనాడు భర్త భార్యతో విసుగుకుంటూ అంటాడు. ఏమే ! నేను రాత్రి సరిగా నిద్రపోలేదే ? అని. (సభలో నవ్వులు). కనుక భగవంతుడు మనలను నిద్రపుచ్చుతుంటాడు. ఆయనే నిద్రనుండి మనలను లేపు తుంటాడు గూడ. కొందరిపై ఆయనకు ప్రేమాభిమానము లెక్కువగా వుంటాయి కాబోలు పాపము వారిని ఉదయం ఎనిమిది గంటలైనా లేపడు. వారు అలా నిద్రపోతూనే ఉంటారు. (సభలో నవ్వులు) సూర్యోదయాత్పూర్వమే మేల్కొని మనము శౌచాది కాలకృత్యములను నెరవేర్చుకొని ఒక చోట గూర్చుండి సంధ్యోపాసన చెయ్యాలి. సంధ్య అంటే "సం" బాగా "ధ్య" చింతించడం=అంటే భగవంతుని గూర్చి బాగా చింతన చేయటం సంధ్య అవుతుంది. ప్రతిదినం ఉదయం సాయంత్రం (సంధ్యాసమయములందు) పరమేశ్వరుని ఉపాసించాలి. ఉదయం సంధ్యావార్చిన అనంతరం కొంత స్వాధ్యాయం కూడ చేయడం అవసరం. స్వాధ్యాయ మంటే వేదాదిసద్గ్రంథ పఠనము, పరమేశ్వర నామమైన ఓంకారమును జపించడమును, గాయత్రీ మంత్రము కూడ జపించవచ్చును. వీనివలన మనస్సు పవిత్రమౌతుంది. ఇవి యన్నియు బ్రహ్మ యజ్ఞము క్రింద పరిగణింపబడుతాయి.

రెండవది దేవయజ్ఞం :

అసలు దేవతలంటే ఏమిటో మనకు అర్థం తెలియదు. పురాణములలో అనేక దేవతలు కల్పించబడ్డారు. వారికి కనురెప్పలు వాలవట ! అలాగే గ్రుడ్లు తెరచుకొనియే నిద్రిస్తుంటారట ! అమృతం త్రాగుతారట ! వారికి చావేలేదట! కాని పాపం - స్వర్గసుఖాలు ఎప్పుడు వారే అనుభవించుతున్నారు. మే మెందులకు అనుభవించ"రాదని చెప్పిఅపుడపుడు రాక్షసులు దేవతలపై దండెత్తుతూ ఉండేవారట ! రాక్షసుల ధాటికి ఆగలేక పాపం యీ దేవతలు ఈస్వర్గాన్ని వదలి పలాయనం చిత్తగిస్తుండేవారట ! నానాయాతనలు పడేవారట! స్వర్గంలో నిత్యం సుఖాలే అనుభవిస్తుంటారు అనుకోబడే యీ దేవతలు కూడ పాపం అపుడపుడు యిలా దుఃఖాలపాలవుతుంటారట : (సభలో నవ్వులు) ఈ రాక్షసులను జయించుటకు భూమిపై నున్న రాజుల సహాయం కోరి వారు భూమికి వస్తూపోతూ ఉండేవారట ! మరి యిపుడెవరూ భూమికి వస్తున్నట్లు

లేదు. బహుశ : ఈ దేవతలు ఏ రాకెట్టో తగిలి చచ్చి ఉంటారు ! (సభలో నవ్వులు) వేదాల్లో ఈ దేవతలు లేరు. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమ యిత్యాది దేవవేశ్యలెవరూ వేదాల్లో కనబడరు. వీరు పురాణాలలోనే ప్రత్యక్ష మవుతుంటారు మనకు.

కాని, అసలు దేవత లెవరు ? "భూమి ర్దేవతా, అగ్ని ర్దేవతా, చంద్రమా దేవతా, సూర్యో దేవతా" - భూమి, అగ్ని, చంద్రుడు, సూర్యుడు, వాయువు వీళ్ళంతా (వేదంలో చెప్పబడిన) దేవతలు. వీళ్లు నిత్యం మనకు గోచరించుతారు. "త్రయ స్త్రిగ్ంశో వై దేవాః" - దేవతలు ముప్పది ముగ్గురని వేదమునందు చెప్పబడింది. ఈ ముప్పది ముగ్గురు దేవత లెవరో తరువాత చెప్పుకుందాము. యాస్క మహర్షి వైదిక శబ్దములను నిర్వచించుచు (నిరుక్తమునందు) "దేవః కస్మాత్" - దేవత అంటే ఎవరు అని ప్రశ్న వేసికొని, "దేవో దానాద్ వా" "ద్యోతనాద్వా", "దీపనాద్వా" "అథ ద్యుస్థానాద్వా" అని సమాధానం చెప్పినారు. అంటే దానాద్ వా - దానము చేయడం, ద్యోతనాద్వా - స్వయంగా ప్రకాశించడం, దీపనాద్వా - ప్రకాశింపజేయడం, అథద్యుస్థానాద్వా - ద్యుస్థానమున ఉండడం. ఈ లక్షణాలువేనిలో ఉంటాయో అవి దేవతలని చెప్పబడతాయి. భూమి ఒకదేవత. దీనిలో సర్వం ఉంటాయి. భూమికి వసుధ అని కూడ పేరు. "వసు" అంటే ధనము. "ధ" అంటే ధరించునది అని అర్థం. దీనిలో సమస్త వస్తువులు - వెండి, బంగారము మొదలైన వన్నీ ధరింపబడి ఉంటాయి. గనుక భూమిని వసుధ అన్నారు. ప్రాణులు తాము జీవించుటకు ఆవశ్యకమైన పదార్థాలన్నీ యీ భూమినుండే సంపాదిస్తాము. స్త్రీలు పెట్టుకునే ఆభరణాలు యీ భూమి నుండి లభ్యమయ్యే వెండి బంగారు నుండే తయారవుతాయి. ఇలా ఆలోచించితే మన కీ భూమి వలన ఎన్నో ఉపయోగాలున్నట్లు తెలిసికొంటాము. తరువాత అగ్ని : ఇది కూడ దేవత. శరీరంలో వేడిలేనిదే మనం అసలు జీవించలేం. అగ్నితో అన్నం వండుతాము. దీపాలు పెట్టుకుంటాం. లోహాలను కరిగించి మనకు కావలసిన వస్తువులను తయారు చేసుకుంటాము. విజ్ఞాన శాస్త్రం (Science) వృద్ధి అవుతున్న కొద్దీ, ఈ అగ్ని వలన ఎన్నొ క్రొత్త క్రొత్త ప్రయోగాలు చేసి చివరికి రాకెట్లపై గ్రహాంతరయానం కూడ చేస్తున్నాం తరువాత వాయువు

గూడ దేవత ; వాయువు లేనిది క్షణంగూడ బ్రతుకలేం. సమస్త జీవకోటికి వాయువు ప్రాణాధారం. మనకిది బాగా తెలుసు. తరువాత జలం , ఇది గూడ దేవతయే. భూమికంటె నాలుగురెట్లు జలమున్నది ; ఇదే సముద్రం. దీనినే వరుణదేవత అంటారు "నీరే ప్రాణాధారము" అని మనకందరకు తెలుసు ఇక విద్యుత్తు ; ఇది గూడ దేవత. వైదిక భాషలో దీనిని ఇంద్రు డంటారు. తెలుగులో దీన్ని మెఱపు అంటారు. ఇలా దేవతలు చాలా ఉన్నాయి. ఈ దేవతలకు మించి మనకు ఉపయోగపడే దేవత లెవరూ లేరు. పురాణములలోని దేవలోకము, దేవేంద్రుడు, రంభాదులు కల్పితములే.

మనం భూమి, జలము, వాయువులను, ఉపయోగించుకొని వాటిని మలినం చేస్తుంటాము. భూమి నుండి ఉత్పత్తియైన అన్నాదులను స్వీకరించి మలముగా విడుస్తుంటాము. జలమును త్రావి మూత్రరూపమున విడుస్తుంటాము. వాయువును పీల్చి దాన్ని మలినం చేస్తాము. కనుక మరల యీ భూతములన్ను సంస్కరించుకొనకుండ ఉపయోగించు కొనేట్లయితే మనకు హాని కలుగుతుంది. దేశంలో వ్యాధులు ఎక్కువవుతాయి. అందుచేత పృథివ్యాది భూతములను సంస్కరించుటకు నిత్యం యింటింటా అగ్ని హోత్రం చేస్తుండాలి. పూర్వం ఈ అగ్ని హోత్రమును నిత్యకర్మగా చేస్తుండేవారు. ఇదియే దేవ యజ్ఞము. దీనిని గురించియే గీతలో ఇట్లున్నది.

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః

అనేన ప్రసవిష్యధ్వ మేష వో z స్త్విష్టకామధుక్ ॥ గీ. 3-10

సృష్ట్యారంభమున పరమేశ్వరుడు యజ్ఞముతోబాటు మానవులను సృజించి ఈ యజ్ఞముతో అభివృద్ధి పొందుడు. ఇది మీ వాంఛితములను తీర్చుతుంది. కామధేనువు వంటిది అని ఉపదేశించి యున్నాడు.

దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః

పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ ॥ గీ-3-11

మానవులారా ! యజ్ఞముతో మీరు దేవతలను భావింపుడు. అంటే సంస్కరింపుడు అని. అపుడు శుద్ధములైన ఆ దేవతలు మిమ్ముల నాదరింతురు -మిమ్ములను ఆరోగ్యవంతులను జేయుదురు. ఇట్లు దేవతలు, మీరు "పరస్పర

శుద్ధి వృద్ధులను జేసికొనుచు పరమ శ్రేయస్సు ననుభవింతురు గాక !

కనుక నిత్యము అగ్ని హోత్రము ద్వారా యీ దేవతలను సత్కరించాలి. సత్కరించడం అంటే సంస్కరించడం. అపుడు వాయ్వాది దేవతలు శుద్ధములై ప్రాణులకు ఆరోగ్యదాయకము లౌతాయి. ఎలా సంస్కరించాలి ? యజ్ఞము (అగ్నిహోత్రం)లో హవ్య ద్రవ్యమును ఉపయోగించుతారు. దీనిని మనం అసలు మఱచిపోయాము. నేయి, ఓషధులు, కర్పూరం, కుంకుమపువ్వు, యివన్నీ హవనద్రవ్యంగా యజ్ఞములో ఉపయోగించబడతాయి. ఈ హవనద్రవ్యం అగ్నిలోనే ఎందుకువేయాలి ? జలాదులయందు ఏలవేయరాదు? అని సందేహం కలుగవచ్చు. "అగ్ని ర్వై దేవానాం ముఖం" - అగ్నియే దేవతలకు నోరు" అన్నారు. మనం పదార్థములను నోటిలో వేసికొంటే శరీరానికంతటికి అవి పోషకము లౌతవి. అంతేగాని నోరుతానే తిని యింతలావు కాదు. (సభలో నవ్వులు) అలాగే అగ్నిలో వేసిన పదార్థములు కూడ భస్మమై-సూక్ష్మరూపం ధరించి - వాయువులో చేరుతాయి. వాయువు ద్వారా మిగిలిన భూతములలో వ్యాపించుతాయి. అలా భూమి వాయుజలములు శుద్ధములవుతాయి. అగ్నిలో వేసిన పదార్థములు నష్టము లవుతాయని పదార్థ విద్య తెలియనివా రనుకుంటారు. కాని అవి వ్యర్థములు కావు. సూక్ష్మరూపము పొంది వాయువులో వ్యాపించుతాయి. ఆ వాయువు నాఘ్రాణించే అసంఖ్యాకములైన ప్రాణులకు ఆరోగ్యము, పుష్టి కలుగుతాయి. కనుక యజ్ఞం వలె ప్రాణులకు మేలుచేసే సత్కర్మ యింకొకటి లేదు. అందుకనే 'యజ్ఞో వై శ్రేష్ఠతమం కర్మ' అన్నారు. ఈ విషయం మనమహర్షులు బాగుగా ఎఱిగిఉండటం చేత వారు యజ్ఞ ప్రక్రియల నేర్పరచి యున్నారు. ఉదాహరణకు నాల్గు మిరపకాయలు నిప్పులో వేసి చూడండి. అవి కాలి, భస్మమై సూక్ష్మరూపం ధరించి వాయువులో వ్యాపించుతాయి. ఆ వాయువును పీల్చుకొన్న వారికి వెంటనే తుమ్ములొస్తాయి. అలాగే మంచివస్తువులను, పుష్టికారక పదార్థములను అగ్నిలో వేస్తే అవి సూక్ష్మమై శరీరంలో ప్రవేశిస్తాయి. మనకు ఆరోగ్యం చేకూరుతుంది. సైంటిస్టులు యజ్ఞములో వేసే ఓషధులు మొదలైన హవన సామగ్రిని పరీక్షించి యివి శరీర రుగ్మతలను కూడ కుదర్చగలవి, యజ్ఞ

కార్యం ఉత్తమమైనదేనని అంగీకరించారు కూడ.

మా ముసలమ్మ ఒకామె ఉండేది. ఆమె ప్రతిరోజూ వండిన అన్నంలో కొంచెం తీసి ముందుగా అగ్నిలో వేస్తుండేది. తరువాత మాకు అన్నం పెట్టేది. అవ్వా, ఎందుకని యిలా చేస్తున్నావు ? అని మేమడిగితే ఏదోలే నాయనా, ఇది ఆచారం అంటుండేది. కాని పాపమామెకు దీని ఉద్దేశ్య మేమిటో తెలిసేది కాదు. పూర్వం ఇంటింటా జరిగే యజ్ఞం నేడు ఈ రూపంలో మిగిలిపోయింది.

"తైర్ దత్తానప్రదాయైభ్యో యో భుం క్తే స్తేన ఏవ సః" - గీ. 3-13

భగవద్గీతలో కృష్ణుడొకచోట అంటాడు. ఈ దేవతలచేత యీయబడిన పదార్థములను వాని కర్పింపకుండ ఎవడు తానే భుజించుతాడో వాడు "స్తేన ఏవ" - దొంగే అంటాడు. కనుక పదార్థాన్ని తన కొఱకే పచనం చేయటం పాపం. తాను వండుకొనినది ఇతరులకు కూడ కొంతపెట్టాలి. ఇది దైవయజ్ఞం అనబడుతుంది. భగవద్గీత 3 వ అధ్యాయంలో ఈ యజ్ఞకర్మములకు సంబంధించిన శ్లోకాలు ఉన్నాయి. చూచుకోవచ్చును.

తరువాత పితృయజ్ఞము :

పితరుల నుద్దేశించి చేయు కార్యము పితృయజ్ఞమగును. చనిపోయిన తల్లిదండ్రులు పితరులు కారు. వీరికొరకు చేయు పిండదానాదులు యజ్ఞము కాదు. బ్రతికియున్న తల్లిదండ్రులే పితరులు. కనుక బ్రతికి యున్న మాతాపితరులకు - వృద్ధులకు చేయబడు సపర్య పితృయజ్ఞ మనబడుతుంది. లోకంలో బ్రతికినవాళ్ళకు అన్నంలేక అవస్థలు పడుతుంటే మనవాళ్ళు చచ్చినవాళ్ళకు పెడతారు. ఇదేం న్యాయమో మరి ః (సభలో నవ్వులు) పితరులు అంటే ఎవరు ? "మాతా చ పితాచ పితరౌ" - తల్లి దండ్రి వీరిని పితరులు అంటారు. బ్రహ్మచారి పితకాడు. నే నున్నాను. నేను పితను కాను. నేను నా మాతా పితరులకు అన్న వస్త్రాదులిచ్చి శ్రద్ధతో వారిని సేవించుటకు వీలున్నది.

నాలుగవది అతిథి యజ్ఞం :

అతిథి అంటే తిథి లేకుండా వచ్చేవాడు తిథి అంటే ఒక నిశ్చిత సమయం. నిశ్చిత నమయం యేదీ లేకుండా వచ్చేవాడు అతిథిఅనబడతాడు. వెనుకటి

రోజుల్లో అతిథులకు సత్కారం బాగా చేస్తుండేవారు గృహస్థులు. ఇప్పుడు అన్ని వస్తువులకు రేట్లు పెరిగిపోయాయి. పాపం యిక వాళ్ళేం పెడతారు. అందుచేత వచ్చిన అతిథి ఏ హోటల్లోనో భోజనం చేసి యింటికి వస్తాడు. అన్నం తినుమంటే తినడు. హోటల్లో భోజనంచేశాలే అంటాడు (సభలో నవ్వులు) భిక్షాటనమే వృత్తిగా పెట్టుకుని రోజూ వచ్చేవాళ్ళు అతిథులు కారు. విద్యావంతులు, పరోపకారులు, జితేంద్రియులు, సత్యవాదులు, కపటము మొదలైన దోషాలు లేనివారు నిత్యము పర్యటనచేయు ధార్మిక పురుషులు అతిథు లనబడతారు. వీరికి ఆతిథ్యమిచ్చి సంతోషపెట్టడం వేదవిహిత కర్మగా గుర్తించాలి.

అయిదవది భూత యజ్ఞం :

దీనినే బలివైశ్వదేవ యజ్ఞమనికూడ అంటారు. ఇంటిలోవుండే కుక్క, గోవు మొదలైన పెంపుడు జంతువులకు ఆహారము పెట్టి రక్షిస్తుండాలి. అవి గృహము నాశ్రయించుకొని గృహరక్షణకై తోడ్పడుతుంటాయి. ఇది భూతయజ్ఞ మవుతుంది.

ఈ విధంగా నిత్యకర్మలంటే ఏమిటో తెలిసికొన్నాము. వీటినే కర్తవ్యకర్మలని కూడ అంటారు. మనం చేసే పనులు నిత్యకర్మలు, నైమిత్తిక కర్మలు, కామ్యకర్మలు అని మూడురకములుగా వుంటాయని చెప్పుకున్నాము. ఈకర్మలను ఫలము కోరక చేసేట్లయితే నీవు బద్ధుడవుకావు. నీకు ప్రత్యవాయము అంటదు అంటాడు కృష్ణుడు. ప్రత్యవాయము అంటే పాపమని అర్థం. (విశేషించి) ప్రత్యవాయమనగా పంచమహాయజ్ఞములు ఆచరింపనందువలన కలిగే పాపం. ఇలా వేదవిహిత కర్మలు చేస్తూ ఉండాలి.

"కుర్వ న్నేవేహ కర్మాణి జిజీవిషేత్ శతగ్ం సమా :"

జీవించినంతకాలం ఈ సత్కార్యము లాచరించుతూనే వుండు. "అన్యథా నాస్తి - తరించుటకు మరొక ఉపాయం లేదు. అని వేదమాత చెపుతుంది. మీరొకటి గుర్తుపెట్టుకోవాలి. ఈ యజ్ఞ ప్రక్రియలు, వీటి వుపయోగములు వైదికమతావలంబులైన ఒక్క హిందువులకే తెలుసునుగాని ప్రపంచంలో క్రైస్తవాది మరే యితర మతస్థులకు తెలియదు. గృహస్థు లయినవారు

ముఖ్యంగా యీ యజ్ఞాది సత్కర్మలను చేస్తూ ఉండాలి. విడువరాదు.

"కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయః" - గీ. 3-20

జనకచక్రవర్తి మొదలైనవారంతా కర్మలచేతనే సిద్ధిని బొందారు. రాజ్యభారం వహిస్తూ జనకుడు కర్మలు చేశాడు. ఆనాటి ప్రామాణిక బ్రహ్మవేత్తలలో ఆయన ఒకడుగా పేరు పొందాడు. ఒకమారు మిథిలా నగరం తగులబడుతుంటే సభలోని పండితులంతా కలవరపడి అటూయిటూ పరుగులెత్తారు. ఒక్క జనకుడు మాత్రం నిశ్చలంగా ప్రశాంతంగా కూర్చుండిపోయాడు. అదేమిటని అడిగితే మిథిలానగరం సర్వస్వము దగ్ధమైనా నాదేమీ పోదని ఆయన జవాబిచ్చాడు అంతటి నిర్లిప్తు డాయన. నీటిలోని తామరాకు చందమున వర్తించాడాయన ప్రపంచంలో వుంటూ. ప్రపంచ కార్యక్రమాలలో పాల్గొంటూకూడ. అందులకనియే జనకుడు రాజైనను ఆయనను రాజర్షి అన్నారు. ఆయన రాజే కాకుండా ఋషికూడ నని అర్థం.

"న నిరగ్నిర్ న చాక్రియః" - గీ. 6-1

అగ్ని హోత్రాది కర్మలు చేయనంత మాత్రం చేత ఒకడు సంన్యాసి కాదు. కర్మలను త్యజించడం కాదు సంన్యాసి లక్షణం. కర్మ ఫలములను త్యజించడం సంన్యాసం అవుతుంది. అదే కర్మయోగం అంటాడు కృష్ణుడు.

అందుచేత విహిత కర్మలను మనం విస్మరించకుండా చేయాలి. కర్మఫలములను ఈశ్వరున కర్పించి, జనన మరణ దుఃఖములనుండి విడివడి విముక్తులం కావాలి. అందుకొఱకు జీవించినంతకాలం తప్పనిసరిగా కర్మలు చేయవలసిందే. "కుర్వ న్నేవేహ కర్మాణి జిజీవిషేత్ శత్గ్ం సమాః" మిగిలింది రేపు చెప్పుకుందాము..

గుంటూరు, 27-12-1968
శుక్రవారం సా॥ 6-00 గం॥

మహా జనులార !

ఇంతవరకు మనం రెండు మంత్రములు చెప్పుకున్నాము. మొదటి మంత్రంలో, "ఈశ్వరుడు అంతటా వ్యాపించి ఉంటాడని, ఆయన ఈ ప్రపంచానికి కర్త అని, యీ సృష్టి పరమేశ్వరుని ఐశ్వర్యమని, కనుక మనం త్యాగబుద్ధితో

ఈ ప్రపంచగత పదార్థములను అనుభవించా'' లని చెప్పుకున్నాం. రెండవ మంత్రములో - ''కర్మలు చేయటంలో జీవులు స్వతంత్రులని, అలసత్వం విడిచి వేదవిహిత కర్మలను నిత్య ంచేస్తూ ఉండాలని, యీ వేదవిహిత కర్మలు కూడ ఫలాపేక్షారహితంగా చేయాలని, అలాచేస్తే కర్మ బంధన హేతువు కాదని, అపుడు జీవుడు ముక్తుడౌతాడని చెప్పుకున్నాం. నేడు మూడవమంత్రము చెప్పుకుందాము.

అసూర్యా నామ తే లోకా అంధేన తమసా వృతా ః

తాంస్తే ప్రేత్యాపి గచ్ఛంతి యే కే చాత్మహనో జనా ః ॥ 3

భావార్థము : ఎవరు అజ్ఞానముతో కూడుకొని, ఆత్మకు విరుద్ధముగ నడుచుకొందురో వారు అసురులు, దైత్యులు, రాక్షసులు, పిశాచులు, దుష్టులు నగుదురు. వారు మనస్సులో నొకటి యుంచుకొని, వాక్కుతో వేరొకటి చెప్పుదురు. కర్మలలో మరియొకటి చేయుదురు. అందువలన వారు అవిద్యాది దోషములలో చిక్కుకొని దుఃఖముల పాలగుదురు. ఆనందమును బొందజాలరు. అట్లుకాక యెవరు మనోవాక్కాయ కర్మలలో నొక్కటిగా నుందురో వారే దేవతలు, ఆర్యులు ననబడుదురు. వారు శుభగులై లోకమును పవిత్ర మొనర్తురు. అతుల సుఖముల నిహపరములం దనుభవింతురు.

పరమేశ్వర విజ్ఞానమైన వేదమున నిర్దేశించిన కర్మలను చేయని వారిని, పరమేశ్వరుని తెలుసుకొనని వారిని అసురులు అంటారు. సురలు అంటే దేవతలు, అసురులు అంటే రాక్షసులు అని సామాన్యంగా అందరికి తెలుసు. లోకులు అంటే జనులు, లోకశబ్దం మనుష్యవాచకం జీవులు నివసించే చోటునుకూడ లోకశబ్దంతో వ్యవహరిస్తారు. (లోకస్తు భువనేజనే) ఆత్మయంటే అంతటా వ్యాపించి ఉన్న వస్తువు. ''అతతి సర్వత్ర వ్యాప్నోతి ఇతి ఆత్మ''. ఆత్మహనులు అంటే ఆత్మను హత్య చేసేవారు, కాని ఆత్మ చచ్చేదికాదు. మరి ఈ ఆత్మను చంపడం అంటే ఏమిటి ? పరమేశ్వరుడు వేదములో మానవులకు కొన్ని ఆదేశములు నిచ్చియున్నాడు. ఆ యాదేశములకు విరుద్ధముగా నడచువారు ఆత్మఘాతకులు అనబడతారు. పితృఘాతకుడు అంటే ఏమిటి ? తల్లి దండ్రుల మాటలు వినక వారు చెప్పిన దానికి విరుద్ధంగా నడిచేవాడు అనికదా అర్థము.

ఈ ప్రపంచాన్ని సృష్టించి, పోషించి, లయంచేసే శక్తిగల ఆత్మ ఒకటి ఉన్నదని అంగీకరించని వారిని భౌతికవాదులు అంటారు. వారుకేవలం పంచభూతముల సమ్మేళనమువలననే యీ సృష్టి యేర్పడుతుందంటారు. మన శరీరంకూడ పంచభూతాత్మకమే యంటారు. మరి వీళ్ళ గమ్యం ఏమిటి అంటే, శరీరసుఖములను అనుభవించడమే "యావజ్జీవేత్ సుఖం జీవేత్" జీవించినంతకాలం సుఖంగా జీవించు, "ఋణం కృత్వా ఘృతం పిబేత్" - అప్పుచేసి నెయ్యి త్రాగు. "భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః" - ఈ శరీరం తగలబడిన తరువాత మరల ఎట్లు వచ్చును ? కనుక నీవు అప్పుతీర్చే పనేలేదు (సభలో నవ్వులు) అందుచేత ఎలాగైనా సరే జీవించినంతకాలం అప్పుచేసి అయినా సుఖము లనుభవించడానికే ప్రయత్నం చెయ్యి, అంటారు భౌతికవాదులు.

ఇక ఆత్మవాదులు, ఈ శరీరంకంటే భిన్నమైన ఒక వస్తువు కలదని అంగీకరించుతారు. వీరికి లక్ష్యము ధర్మార్థ కామమోక్షములు. కేవల కామభోగం కాదు.

మానవుడు జీవితంలో సాధించవలసినవి నాలుగున్నాయి. వీనినే "పురుషార్థములు" అంటారు. పురుషుడు అంటే జీవుడు. పురము అంటే శరీరము. ఈ శరీరమనే పురములో ఉండు జీవుడు పురుషుడు అనబడును. అలాగే పరమేశ్వరునికి గూడ పురుషశబ్దం వాడతారు. మఱి పరమేశ్వరునికి శరీరమేమిటి ? ఈ ప్రపంచం ఆయన శరీరం. అర్థింపబడేవి అంటే కోరబడేవి అని అర్థం. ఈ శరీరంలో ఉన్న పురుషుని చేత కోరబడేవి నాలుగున్నాయి. వీనినే పురుషార్థము లని లేక చతుర్విధ పురుషార్థములని అంటారు. ధర్మము, అర్థము, కామము, మోక్షము, వేదకాలంలో వీనిని బాగుగా ఎఱిగి పొందుటకు ప్రయత్నం చేసేవారు. వేదకాలం అంటే, వేదములు జనబాహుళ్యమున ప్రచారంలో ఉన్న రోజులు. మనమిపుడు అవైదికుల మయినాము. మనకు ధర్మం అంటే ఏమిటో తెలియదు. అర్థం, కామం, యివి మనకు బాగా తెలుసు. మోక్షం అంటే కూడ తెలియదు. మనం ధర్మ మోక్షములను మఱచాము. పురుషార్థములలోని అద్యంతములను మఱచి, మధ్యలోనున్న అర్థకామములను మాత్రం బాగా గుర్తుంచుకున్నాం.

అంటరానితనం ఒకప్పుడు మనదేశంలో ధర్మంగా ఉండేది. ఇపుడు కూడ అది పూర్తిగా పోలేదనుకోండి. పసిపిల్లలకు పెండ్లిండ్లు చేయటం ధర్మంగా యెంచారు. ఒక పురుషుడు చాలమందిని వివాహం చేసుకోవడం ధర్మంగా ఎంచారు కొన్ని రోజులు. బెంగాల్లో యీ ఆచారం ఎక్కువగా ఉండేది. కాశీలో వేదాంతం చెప్పే పండితు లొకరుండేవారు. కొన్నాళ్లు ఆయనవద్ద చదువుకున్నాను. ఆయనకు ఏడుగురు పెండ్లాలని నాకు తరువాత తెలిసింది. ఇది తెలిసి నేను విస్తుపొయ్యాను. గురువే ఏడుగురిని సంపాదిస్తే శిష్యులు యింకా ఎక్కువమంది భార్యలను సంపాదించాలేమోనని అనుకున్నా. (సభలోనవ్వులు)తరువాత ఆ గురువు గారిని వదిలివేశాను.

అష్టవర్షా భవేత్ గౌరీ నవవర్షా చ రోహిణీ
దశవర్షా భవేత్ కన్యా అత ఊర్ధ్వం రజస్వలా ॥

ఎనిమిదేండ్ల పిల్ల గౌరి యని, తొమ్మిదేండ్ల అమ్మాయి రోహిణి అని, పదేండ్లుంటే కన్య అని, పదేండ్లు దాటితే రజస్వల అనబడుతుందని శ్లోకార్థం. కన్యాదానం చేయాలంటే10 సంవత్సరములు లోపే చేయాలట. ఇలాంటి శ్లోకాలు ఆధారం చేసుకొని పూర్వము చిన్నపిల్లలకు పెండ్లిండ్లు చేసేవారు. 60 ఏండ్ల వృద్ధునికి పెండ్లిచేయటం ధర్మం అనుకునేవారు. అందుచేతనే కాటికి కాళ్ళుచాచిన వృద్ధులకు బాలికల నంటగట్టేవారు. ఈ వృద్ధులు చచ్చిపోవటంతోఅన్నెం పున్నెం ఎరుగని బాలికలు వితంతువు లయ్యేవారు. ఇప్పటికీ దేశంలో బాలవితంతువులు వేలలో లక్షలలో కనుపించుతారు. ఇది యంతయు ధర్మమని చేసిన కర్మలఫలము, మనమంతా వైదికులం. మనం వేదవిహిత కర్మల నంగీకరించుతాము. పైన చెప్పిన అంటరానితనము, బాల్య వివాహము, వృద్ధవివాహము, బహువివాహము మున్నగునవన్నియు వేదవిహితములు కావు. అందువలన నవి ధర్మములును కావు. అధర్మాలను ధర్మాలుగా నెంచి చేశారు.

తరువాత అర్థం : భారతయుద్ధానికి పూర్వమే అర్థమునకు విలువ హెచ్చింది. భారతయుద్ధానికి ముందు ఒకరు భీష్ముణ్ణి నీవు పాండవపక్షపాతివి కదా? ఎందుకు పాండవుల తరపున యుద్ధం చేయవు ? అని అడిగితే

అయనంటాడు. నేను అర్థానికి దాసుణ్ణయినాను. దుర్యోధనుని ఉప్పు పులుసు తిన్నాను. కనుక పాండవుల తరపున వచ్చి యుద్ధం చెయ్యలేను అన్నాడు. "అర్థస్య పురుషో దాసః, దాసస్తు అర్థో న కస్యచిత్" "ధనమునకు దాసుడు పురుషుడు. ధనము పురుషునకు దాసుడు కాదు." కావున భీష్ముని కాలంనాటికే దేశంలో యీ పరిస్థితి వచ్చింది. నేటి మానవులు అర్థానికి దాసులయి, ధర్మ మోక్షములను విసర్జించినారు. నేడు డబ్బుతో కాని పనిలేదు. ఇది మీకు బాగా తెలుసు. ఈ అర్థప్రభావంవలన పరిస్థితులు తారు మారయినాయి. ధర్మము అధర్మముగాను అధర్మము ధర్మముగాను చెలామణీ అవుతున్నది. అర్థవంతు డెట్టివాడైనా, ధార్మికుడుగా ఎంచబడుచున్నాడు లోకంలో. అసలు ధర్మమంటే ఏదో అధర్మమంటే ఏదో కూడ మనకు తెలియుటలేదు. కనుక ధర్మ నిర్వచనం ఆవశ్యకం. మన పూర్వపు తత్త్వవిదుడైన కణాదుడు (వైశేషిక దర్శనకర్త) ధర్మమంటే ఏమిటో ఇలా నిర్వచించాడు.

"యతో అభ్యుదయ నిశ్శ్రేయస సిద్ధిః సధర్మః " - వై.ద. 1-1-2

"దేనివలన అభ్యుదయము, నిఃశ్రేయసముసిద్ధించుతాయో దానికి ధర్మమని పేరు".అభ్యుదయ మంటే మనుష్యుని ఐహికాముష్మిక అభివృద్ధి, నిఃశ్రేయసం అంటే మోక్షమని అర్థం. ఈ రెంటిని దేనిద్వారా సాధించగలమో అది ధర్మం. స్వర్ణకారుడుబంగారం మంచిదో కాదో పరీక్షించుటకు తనదగ్గర గీటురాయి నొకదానిని ఉంచుకొంటాడు. మీరు కల్తీ బంగారాన్ని అతనికిస్తే దానిపై అటు యిటు గీచి, యిది కల్తీబంగారమని చెప్పేస్తాడు.మనం అలా చెప్పలేం. అలాగే ధర్మానికి కూడ ఒక గీటురాయి ఉన్నది. ఏపనిచేస్తే ప్రాణికోటికి మేలు కలుగుతుందో అది ధర్మం. ఏకార్యమువలన కీడు కలుగుతుందో అది అధర్మం. ఈ గీటురాయిని మన దగ్గర ఉంచుకుంటే మనం చేసే పనులు ధార్మికములైనవో కావో తెలుసుకోగలం. బాల్యవివాహములు అధర్మం అన్నాము. వివాహం సంతానార్థం ఉద్దేశింపబడింది.

సంతానం కలగాలంటే యుక్తవయస్కులైన వారికే వివాహం చెయ్యాలి. కనుక బాల్యవివాహములు చేసినందువలన ఉపయోగం లేదు. కావున అది అధర్మముకాక మరి యేమిటి ?

"బ్రహ్మచర్యేణ కన్యా యువానం విందతే పతిమ్" - అథర్వణ వేదం

కన్య బ్రహ్మచర్య వ్రతమును పూర్తిచేసి యువకుని పెండ్లి చేసుకుంటుంది, అని మంత్రార్థం. దీనివలన బాల్యవివాహములు చేయరాదని అర్థమౌతుంది.

"త్రీణి వర్షాణి ఉదీక్షేత కన్యా ఋతుమతీ సతీ "

కన్య ఋతుమతి అయిన తరువాత మూడేండ్లవరకు పెండ్లి చేసుకోరాదంటాడు మనువు. తరువాత తగినవరుడు దొరకకపోతే పెండ్లి చేయరాదు. ఇంటిలో ఉన్నా ఫరవాలేదు అని మనూక్తి. ధర్మసూక్తులిట్లుండ వానిని విస్మరించి బాల్యవివాహాలు ధర్మమని యాచరించి దేశాన్ని దుఃఖ భూయిష్టం చేశాము. ధర్మం అని చాలాకాలం పాటించాం, అందువల్ల కలిగిన నష్టం కళ్లార చూస్తున్నాం అంటరానితనం అధర్మం, మన సాటి మానవులను కొందరిని నన్ను ముట్టకు, నన్ను ముట్టకు అని దూరంగా ఉంచుతున్నాము. అందుచేత వారు క్రైస్తవ మతంలో కలుస్తున్నారు. ఈనాడు దేశంలో వందల వేల సంఖ్యతో మిషనరీలు పనిచేస్తున్నారు. హిందువులు సామూహికంగా మతాంతరులుగా చేయబడుతున్నారు. రామకృష్ణాది నామములు పెట్టుకొనినవారిని యాకోబు, జాకోబులుగా చేస్తున్నారు. ఏమిటి యీ అన్యాయం. ఇది యిలా సాగిపోవలసిందేనా ! నేడు (హిందూ) ధర్మరక్షకులుగా చెలామణి అవుతున్న పీఠాధిపతులు చెప్పేది ఏమిటో తెలియునా ! "పోతే పోయారులే మాల ముండాకొడుకులు, అంతమాత్రం చేత మన ధర్మం నశింపదు" అంటారు. వీరిని మనమేమనాలో తెలియదు. క్రైస్తవులుగా మాఱిన హిందువులలో రాష్ట్రీయ భావన లేకుండా చేస్తున్నారు. 'ఇది భారతదేశం. నేను భారతీయుణ్ణి. ఇతర దేశస్థుడు నాపై పెత్తనం చెలాయించరాదు. అనే దేశభక్తి కూడా వారిలో లోపిస్తున్నది. దేశ ఐక్యతకు విరుద్ధంగా వర్తిస్తున్నారు. అస్సాం, నాగాలాండ్ మొదలయిన చోట్ల యివ్వాళ క్రైస్తవ మిషనరీలు చేసే పనేమిటో మీకు తెలుసు. వారు మతం ముసుగుతో దేశాన్ని చీలదీయుటకు ప్రయత్నాలు చేస్తున్నారు. నేడు దేశంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడండి. ఈ యనర్థానికి కారణం ఏమిటి ? అంటరానితనం ధర్మం అనుకొని అచరించుటయే

కదా ! ఇట్టి నష్టదాయక కార్యం ధర్మమెట్లవుతుంది.

ధర్మం అంటే అభ్యుదయానికి నిఃశ్రేయసమునకు తోడ్పడేదని మనం చెప్పుకున్నాం కదా !

నిః శ్రేయసము అంటే మోక్షము. మోక్షము అంటే "విడుపు" అని అర్థం. మనం బంధనంలో ఉన్నాము కనుక మనకే యీ విడుపు ఆవశ్యకం. ఏమిటా బంధనం, అంటే దుఃఖమే. మనం దుఃఖగ్రస్తులం. అంటే దుఃఖముచేత బంధింపబడినవాళ్ళం. లేక దుఃఖంతో కూడుకొన్నవాళ్ళం. పసిబిడ్డగా పుట్టినది మొదలు మరణ పర్యంతం దుఃఖమే మనలను వెంటాడుతున్నది. బాల్యంలో, యౌవనంలో, కౌమారంలో, వృద్ధాప్యంలో కూడ యీ దుఃఖం మనలను అనేక విధాలుగా పీడించుతున్నది. ఈ దుఃఖ విముక్తికి మార్గం ఏమిటో ఆలోచించాలి. అది కనుగొనేందుకే బుద్ధుడు రాజ్యాన్ని, భార్యను, బిడ్డను కూడ విడిచి అరణ్యములకు పోయాడు.

దుఃఖం ఆధ్యాత్మికం, ఆదిభౌతికం ఆధిదైవికమని మూడువిధాలుగా ఉంటుంది. "తాపత్రయమ్" అని కూడ దీనినే అంటారు. ఆధ్యాత్మిక దుఃఖం శరీర, మనస్సులకు సంబంధించి రెండు విధములుగా ఉంది. వాత, పిత్తశ్లేష్మము లను ధాతువుల వైషమ్యమువలన శరీరమునకు కలుగు జ్వరం మొదలైన వ్యాధులుశారీరికములు, కామము, క్రోధము,లోభము, మోహము, మదము, ఈర్ష్య యిలాంటి వికారములచేత మనసులో ఏర్పడు దుఃఖము మానసికము. తరువాత ఆధిభౌతిక దుఃఖము తనకంటె అన్యమైన మనుష్య, పశు, పక్షి, మృగాదులచేత ఏర్పడు దుఃఖము ఆధి భౌతికము. మూడవది ఆధిదైవికదుఃఖము, భూమి కంపిస్తుంది. వేలకువేలు ఇండ్లు కూలిపోతాయి. లక్షలాది జనులు చనిపోతారు. అలాగే అగ్ని ప్రకోపిస్తుంది. ఇళ్ళనేకం దగ్ధమౌతాయి. గాలివాన వస్తుంది. తీవ్రంగా వరదలు వస్తాయి. పంటలు నాశనమౌతాయి. వీటివలన మనకు దుఃఖములుమూడు విధములుగా ఉన్నాయి. ఈ త్రివిధ దుఃఖములయొక్క అత్యంతాభావమే (బొత్తిగా లేకుండా పోవడమే) మోక్షం అనబడుతుంది. మన జీవితానికి లక్ష్యం యిదే.

మఱి మనకు అర్థం, కామం ఆవశ్యకం లేదా అని అడుగవచ్చు.

కావాలి. అవికూడ కావాలి. కాని ఎంతవరకు ? శరీరయాత్రకు ఆవశ్యకమైనంత వరకు, అర్థం సంపాదించవలసిందే ; ఆ సంపాదించడం ధర్మపూర్వకంగా ఉండాలి. అధర్మంగా ధన సంపాదన చేయరాదు. సామాన్య మానవులు ధర్మానుకూలంగా సంపాదించుకొంటారు. వారికి రెక్కాడితే గాని డొక్కాడదు. ధర్మవిరుద్ధంగా సంపాదించడమనేది చాలవరకు అధిక ధనవంతులే చేస్తుంటారు. బ్లాక్ మార్కెట్ వ్యాపారం, దొంగనోట్లు ముద్రించడం యిత్యాదులన్నీ ధర్మవిరుద్ధ సంపాదనలే ఇవి కూడవు. ఈ అర్థసంపాదన వలన ప్రయోజనం ఏమిటి ? శరీరసుఖము లనుభవించడమేకదా ! భౌతికవాదుల లక్ష్యం ఏమిటి ? జీవించినంతకాలం శరీరసుఖము లనుభవించడం ; తినడం త్రాగడం, కామోపభోగములలో తేలియాడటం (అంగనాలింగనాజన్య సుఖమేవ పుమర్థతా) కాంతాలింగన సుఖమే పరమ పురుషార్థమని యెంచడం వారి లక్ష్యం. ఎల్లప్పుడు ఇంద్రియ సుఖములో మైమరచి ఉండేవారిని ప్రాణపోషణ తత్పరులై దుష్కర్మ లాచరించేవారిని అసురులు అంటారు. వీరిని అసురులని, పిశాచులని, దైత్యులని, రాక్షసులని దుష్టులని, వేదం నిర్వచించింది.

"అసుర్యా నామ తే లోకా :, అంధేన తమసావృతాః"

వీరు అజ్ఞానమనే చీకటిచేత ఆవరింపబడి యుంటారు. తమోగుణము వీరిలో ఎక్కువగా ఉంటుంది. ఈ మనుష్య దేహం ప్రాకృతికం, అంటే ప్రకృతి సంబంధమైనది. ఇంద్రియములచే తెలియబడే యీ లోకపదార్థములన్నీ ప్రకృతినుండి ఏర్పడినవే. ప్రకృతివికారములు గనుక ఇవి ప్రాకృతికములు సత్వము, రజస్సు, తమస్సు అను యీ మూడు ప్రకృతి గుణాలు, ప్రతి వస్తువులోను యీ మూడు గుణాలుంటాయి. అలాగే మానవశరీరంలో కూడ ఉంటాయి. కాని ఈ గుణాలు అందరిలో ఒకే పరిమాణంలో ఉండవు. హెచ్చు తక్కువలుగా ఉంటాయి. కొందరిలో సత్వగుణం ప్రధానంగా ఉండి, రజోగుణము, తమోగుణము అప్రధానంగా ఉంటాయి. రజోగుణము ప్రధానంగా ఉన్నవారికి సత్వగుణం, తమోగుణం అప్రధానంగా ఉంటాయి. అలాగే తమోగుణం ప్రధానంగా ఉన్నవారికి మిగిలిన రెండు గుణాలు అల్పంగా ఉంటాయి. బుద్ధితో - జ్ఞానంతో పనిచేసేవారు సత్వగుణ ప్రధానులు. "సత్వం

ప్రకాశకం" - లోకంలో ప్రకాశింపజేసేవి - వెలుగు నిచ్చే పదార్థములు సత్వగుణ ప్రధానములు. జ్ఞానంకూడ సత్వగుణమువలన కలుగుతుంది ఎవరిలో ఏవిధమైన ప్రకృతి ఉన్నదో నారావిధమైన పనులు చేస్తుంటారు. ప్రకృతి అంటే యిక్కడ స్వభావమని అర్థం. నా ప్రకృతి ఏమీ బాగుగాలేదయ్యా అంటాము. అంటే నా స్వభావము బాగుగా లేదని అర్థం. వాడి ప్రకృతే అంతలే, అంటాము. అంటే వాడి స్వభావమే అంత అని అర్థం.

"కార్యతే హి అవశః కర్మ సర్వః ప్రకృతిజై ర్గుణైః" - గీ. 3-5

తమ స్వభావసిద్ధ గుణముల కనుకూలముగ నందరు పనులు తప్పకుండా చేస్తారు, అనుటలో అభిప్రాయ మిదే. రజోగుణము ప్రధానముగ ఉన్నవారు శారీరిక కృత్యాలు ఎక్కువగా చేస్తుంటారు. ఎప్పుడూ ఏదో ఒకపని చేస్తూనే ఉంటారు. అలా చేయకపోతే వారికేమీ తోచదు. ఒకవేళ వారికి జ్వరం వచ్చి డాక్టరు "తిరగవద్దు, విశ్రాంతి తీసుకోమని అంటే సరేలే అంటారు. డాక్టరు వెళ్ళిన తరువాత మళ్ళీ యేదో ఒకపనిని చేస్తూనే ఉంటారు. (సభలో చిరునవ్వులు) కొందఱు తమోగుణం ప్రధానంగా కలిగిఉంటారు. అంటే అజ్ఞానం వారిలో ఎక్కువగా ఉంటుంది. వారికి అలసత (సోమరితనం) నిద్ర, మతిమఱపు, విపరీతజ్ఞానం (ఒకటి చెబితే యింకొకటి అర్థం చేసుకోవడం) యిది ముఖ్యంగా ఉంటాయి. ఇలాంటి కఠిన విషయాలు చెబుతూ ఉంటే పాపం వారు నిద్రపోతూ ఉంటారు. (సభలో నవ్వులు) కొందఱు నిద్రరాక ఏమి తోచనప్పుడు ఊరికే ఎందుకుండాలనో యేమో, ప్రక్కింటివారితో తగాయిదా లాడుతుంటారు (సభలో నవ్వులు)

కావ్యశాస్త్ర వినోదేన కాలో గచ్ఛతి ధీమతాం
వ్యసనేన చ మూర్ఖాణాం నిద్రయా కలహేన వా ॥

కావ్యశాస్త్ర వినోదాలతో బుద్ధిమంతుల కాలం గడుస్తుంది. మూర్ఖులు వ్యసనాలతో, నిద్రతో, కలహాలతో కాలం గడపుతారు.

చీట్లాట (కామోత్పన్నములగు దశ వ్యసనములు- మృగయాక్షో దివాస్వప్న ః పరీవాదః స్త్రియోమదః తౌర్యత్రికం వృథాట్యాచ కామజో దశకో గణ ః ॥ మను.

వేటాడుట, పాచికలాడుట, పగలు నిద్రించుట, కామకథయో లేక

యితరులను నిందించుటయో, స్త్రీలతో అతి సంగమము, మాదక ద్రవ్య సేవనము) జంతువుల వేటాడుట, మద్యమాంసాదులు తినడం, త్రాగడం, వ్యభిచారాది దుర్వృత్తులకు లోనుగావడం వ్యసనాలు (పాడుట, వాయించుట, నాట్యమాడుట లేక ఆడించుట, మరియు వీనిని వినుట, చూచుట, వృథాగా యిక్కడ నక్కడ తిరుగుట యీ పదియు కామోత్పన్నములగు వ్యసనములు. ఇవన్నీ తమోగుణ లక్షణాలు ఇలాంటివారు "అంధేన తమసావృతాః" - అంధ తమస్సులో ఉంటారని వేదం చెబుతుంది. అంధ తమస్సంటే కటికచీకటి - అత్యంతం అజ్ఞానంలో ఉంటారని అర్థం. వారికి జీవేశ్వర పదార్థాలు రెండూ తెలియవు. పంచభూతములతో నిర్మింపబడిన ఈ శరీరమే వారికి తెలుసు. "తాన్ ప్రేత్యాపి గచ్ఛంతి"=వారు చచ్చిన అనంతరము కూడ మరల యిలాంటి ఆసుర జన్మలనే పొందుతుంటారు. "యే కే చాత్మహనో జనాః" -వీరే ఆత్మ ఘాతుకులని, ఆత్మహత్య చేసేవారని యీ మంత్రం మనకునేర్పుతుంది.

శరీరంలో జీవాత్మ అనేది ఒకటున్నదని, దాని సత్తావలన యీ శరీరం పనిచేస్తూ ఉంటుందని నిన్నటి ఉపన్యాసంలో చెప్పాను. నేటి భౌతిక శాస్త్రజ్ఞుల (Materialists) రాసాయనికంగా జీవాత్మను సృష్టి చేయలేకపోతున్నారు. జీవాత్మ భౌతిక పదార్థం కాదు గనుక అది సృష్టిచేయబడదు. జీవాత్మలో ఇచ్ఛా, ప్రయత్నం, జ్ఞానం (Will efffort, knowledge) యిత్యాది గుణములున్నాయి. పాంచ భౌతిక పదార్థములు. జ్ఞానాది గుణములు లేవు. అవి జడములు. కనుక భౌతిక పదార్థ సమ్మేళనం వల్ల జీవపదార్థాల్ని ఉత్పత్తిచేయడం అనేది పొసగదు. విద్యుచ్ఛక్తి నీళ్ళనుండి తీయడం కనిపెట్టారు శాస్త్రజ్ఞులు ఆ విద్యుత్తు నీళ్ళలో ఉన్నది కనుక దాన్ని కనిపెట్టారు. నీళ్ళలో లేకపోతే కనుగొనేదెలా ? అందుచేత భౌతికవాదులు రాసాయనికంగా జీవపదార్థాల్ని (జీవాత్మను) ఉత్పత్తిచేసే పర్యంతం - "జీవాత్మ సృష్టింపబడేదికాదు. అది పాంచ భౌతికము అసలేకాదు. అది చేతనపదార్థము " - అనే మనవాదనను నిరాఘాటంగా ప్రచారం చేసికోవచ్చు. ఇప్పటివరకు మన యీ వాదనలో లోపం ఏమీలేదని మాత్రం గట్టిగా చెప్పగలను .ఒకవేళ వారు జీవాత్మను రాసాయనికంగా సిద్ధము చేయగలిగినట్లయితే, ఆనాడే మన వైదిక సిద్ధాంతములను విస్మరించుదాము.

కానివా రలా చేయలేరనే నా నమ్మకం

ఇప్పటికి మూడు మంత్రాలు చెప్పుకున్నాము. మొదటి మంత్రంలో సృష్టి స్థితి లయకారుడైన పరమేశ్వరుని గురించి కొలదిగా తెలుసుకున్నాము. ఇపుడు మనం ముందు చెప్పుకోబోయే మంత్రాలలో భగవంతుని గూర్చి విశేషంగా తెలుసుకుంటాము.

అనేజ దేకం మనసో జవీయో
నైనద్దేవా అప్నువన్ పూర్వ మర్షత్
త ద్ధావతో z న్యా నత్యేతి తిష్ఠత్
తస్మి న్నపో మాతరిశ్వా దధాతి ॥ 4.

భావార్థము : పరమాత్మ అనంతుడగుటచే, మన సెక్కడికి పోయినను నక్కడ పరమాత్మముందే యుండును. ఆపరమాత్మ జ్ఞానము శుద్ధ మనస్కునకే కలుగును. నేత్రాది ఇంద్రియములకు పరమాత్మ గోచరింపదు. అవిద్వాంసులకు నందదు. స్వయము కదలక ప్రపంచమును నియమబద్ధముగా చలింపజేయును. అన్నింటికి నాధారము. ధార్మికుడైనవాడు కర్తవ్యముల నాచరించుచు ఫలములను పరమాత్మున కర్పించి కర్మయోగియై పరబ్రహ్మను బొందగల్గును.

ఏజత్ : అంటే కంపించేది. అనేజత్ - అంటే కంపించనిది లేక కదలనిది అని అర్థం. అంతటా వ్యాపించియున్న తత్త్వం కదలదు. పరిమిత మైన వస్తువే కదలుతుంది. కదలడం అంటే ఏమిటి ? ఒకచోట ఉన్న వస్తువు యింకొకచోటికి చేరడం. దీన్నే ఇంగ్లీషులో Motion (మోషన్) అంటారు. "మోషన్" అంటే సంస్కృతంలో "గతి" అని అర్థం. (చేతనొక పుస్తకం తీసికొని) నా చేతిలో యిపుడొక పుస్తకం ఉంది. ఇది పరిమిత వస్తువు. దీన్ని ఒకచోటినుండి యింకొకచోటికి చేర్చవచ్చు, కాని పుస్తకం దానంతట అది కదలదు. కదిలించే వ్యక్తి ఒకరుండాలి., ఒక (Philosopher) తాత్త్వికుడు, "వస్తువున్నచోట కదలిక అనేది ఉండదు వస్తువు లేనిచోట వస్తువేలేదు కాబట్టి కదలడమనేది లేదు. కనుక (There is no motion at all) అసలు కదలిక అనేది లేదు" అన్నాడు ! ఇది అతని ఆలోచనాఫలం. లోకంలో కదలికే లేదనుట

సరియగునా ? (సభలో చిరునవ్వులు) మఱియొక తత్త్వవేత్త ఈ వాదాన్ని ఖండిస్తూ, "అసలు కదలుట అంటే వస్తువు ఒకచోటినుండి యింకొక చోటకి పోవడం. అంతే కాని ఉన్నచోట కదలకపోవడం లేనిచోట కదలడం కాదు" అన్నాడు. కాబట్టి కదలిక అనేది ఉంది అన్నాడు. ఇలా ఉంటుంది (logic) తర్కము.

పరమేశ్వరుడు కదలడు. అత దంతట ఉండును. ఆయన సర్వ వ్యాపకుడు. సృష్టికర్త. కర్త ఎక్కడుంటాడో అక్కడ కార్యం ఉంటుంది. కుమ్మరి ఉన్నచోట కుండ చేయబడుతుంది. కుమ్మరి ఒకచోట వుంటే కుండ వేరొక చోట చేయబడదు. అలాగే వస్త్రం నేసే సాలీడు ఎక్కడున్నాడో అక్కడే వస్త్రం నేయబడుతుంది. సాలీడు ఒకచోట ఉంటే వస్త్రం యింకొక చోటనేయబడదు. అలాగే సువిశాలమైన ఈ విశ్వంలో అణువుల నుండి బ్రహ్మాండము వఱకు సృష్టి సాగిపోతూనే ఉన్నది. కనుక పరమేశ్వరుడు అణువునుండి బ్రహ్మాండము పర్యంతము, యింకా దానిని మించి కూడ ఆయన వ్యాపించియే ఉన్నాడు. ఎక్కడెక్కడ సృష్టి కార్యము కొనసాగుతున్నదో అక్కడక్కడ ఆయన వ్యాపించియే ఉన్నాడు. ఆయన అంతటా ఉన్నాడు కనుక "అనేజత్" - కంపించడు. అనేజత్ అంటే భయపడడు అని కూడ అర్థం ఉంది. కంపనం భయ లక్షణం, భయపడిన వానిని చూడండి, అతడు కంపించుతాడు - వణుకుతాడు, అలా పరమేశ్వరుడు భయపడడు -కంపించడు. ఆయన "ఏకం" - ఒకటే వస్తువు, ఇవ్వాళ మనం సర్వవ్యాపకుడయిన యీ అసలు దేవుణ్ణి మరచాం. మనకు ఊరినిండా దేవుళ్ళే. అంకమ్మ, పోలేరమ్మ, పోతురాజు, పుట్టలమ్మ, తట్టలమ్మ యిలా అనేకమంది వెలిశారు. వీటిని ఆధారం చేసుకొని పాశ్చాత్య విద్వాంసుడైన మోక్షముల్లరు వేదాలలో అనేకమంది దేవతలున్నారు. భారతీయులకు ఏకేశ్వరవాదం తెలియదని ప్రచారం చేశాడు. కొందఱు భారతీయులుకూడ దీనిని సమర్థిస్తూ గ్రంథాలు వ్రాశారు. అప్పుడు దయానందుడు మోక్షముల్లరుతో (Correspondence) ఉత్తర ప్రత్యుత్తరములు జరిపాడు. మోక్షముల్లరు వ్రాసిన వేదభాష్యములోని తప్పులను ఎత్తిచూపుచు వేదంలో ఏకేశ్వరవాదమే ఉన్నది, అనేక దేవతలు లేరని చెప్పి దీనికి ప్రమాణంగా " ఏకం సద్ విప్రా బహుధా

వదన్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః" (ఇంద్రం మిత్రం వరుణ మగ్ని మాహురథో దివ్యస్స సువర్ణో గరుత్మాన్।

ఏకం సద్ విప్రా బహుధా వద న్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహు ః॥ - ఋ. మం. 1 అను. 22 సూ. 164 మం 46

పరమేశ్వరుడు ఒక్కడే అయ్యు, విజ్ఞులచేత, ఆయన ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని, దివ్యుడు, సుపర్ణుడు, గరుత్మంతుడు, యముడు, మాతరిశ్వా యిత్యాది పేర్లతో చెప్పబడుచున్నాడు ; అని మంత్రార్థం, ఈ పేరులకున్న అర్థము శ్రీదయానందుని "సత్యార్థ ప్రకాశమను గ్రంథములో మొదటి సముల్లాసమున చూడనగును) అదే ఋగ్వేద మంత్రాన్నిచూపుచు ఆయనకు ఉత్తరాలు వ్రాశాడు. మేమనే దేవతలు వేరు అన్నాడు దయానందుడు. తరువాత మాక్సుముల్లరు తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు కూడ.

నేటి భారతీయులు వేదార్థాలు విస్మరించి అనేక దేవుళ్ళను కల్పించు కున్నారు. ఈ దేవుళ్ళు పరస్పరం తగవులాడుకుంటారు కూడ. మన పురాణాల్లో యిది చూడగలం. విష్ణువు అంటే శివభక్తులకు గిట్టదు. శివుడంటే విష్ణుభక్తులకు గిట్టదు. అందుచేత ఒకరిని దూషించుతూ యింకొకరు కథలు వ్రాసుకున్నారు పురాణాల్లో. విష్ణువుచేత వ్యభిచారం చేయించారు. శివుణ్ణి తెలివి తక్కువవాణ్ణి చేశారు ఈ కథల్లో. భస్మాసుర కథ మీకు తెలిసే ఉంటుంది. భస్మాసురుడు శివుణ్ణి గూర్చి ఘోరమైన తపస్సు చేస్తాడు. శివుడు మెచ్చి నీకేం వరం కావాలో కోరుకో మంటాడు మరి శివునికి ఈ రాక్షసుని హృదయంలో ఉండే కోరిక ఏమిటో తెలియదు కాబోలు ! "నేను ఎవరినెత్తిపై చేయిబెడితే వాడు భస్మం కావాలి" అని వాడు కోరుతాడు. వెనుక ముందు లేమి ఆలోచించకుండ పాపం శివుడు సరే యని వరమిస్తాడు. అలాగైతే నీవిచ్చిన వరం పనిచేస్తుందో లేదో తెలుసుకుంటాను, కొంచెము సేపు అగు అని, అటుఇటు చూచి ఇతరులెవ్వరు లేనందున శివుని నెత్తిపైనే చేయిపెట్టి చూడదలంచి వెంటపడతాడు "సంహారకర్త" అని చెప్పబడే శివుడు పాపం పలాయనం చిత్తగిస్తాడు రొప్పుతూ రోజుతూ, రాక్షసుడూ ఆయన్ని వదలలేదు. వెంటబడతాడు. శివు డిలా ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలిసి ఆయన్ని రక్షించడానికి విష్ణువు "మోహిని" రూపంలో

వచ్చి రాక్షసుడికి కనబడతాడు. రాక్షసుడు మోహిని రూపలావణ్యాలకు ముగ్ధుడై ఈశ్వరుణ్ణి వదలిపెట్టి మోహిని మాయలో పడతాడు. విష్ణువు మోసం చేత రాక్షసుడు చస్తాడు. తరువాత శివుడు కూడ ఈ మోహిని రూపానికి పరవశుడై మోహంలో పడతాడు. సరే రాక్షసుడు మోహంలో పడ్డాడంటే అర్థముంది. కాని భగవంతుడనుకొనే శివుడు కూడ యీమె మోహంలో పడతాడు (సభలో నవ్వులు). ఎంత చిత్రమో చూడండి 'విష్ణువు నన్ను రక్షించడానికి మోహిని రూపంలో వచ్చాడు' అని శివుని కామాత్రం బుద్ధి ఉండవద్దూ ! భస్మాసురుడు వెంటబడితే శివుడు పారిపోతాడు. మఱి ఆయన మూడవ నేత్రం ఏమైందో ! ఆ మూడవ నేత్రం తెఱచి చూచిన వాడు చచ్చి ఉండేవాడు కదా ! ఇక మనం భగవంతుడనుకొనే విష్ణువునకు పట్టినగతి చూడండి. చేతనైతే తాను ముఖాముఖి తలపడి యుద్ధంచేసి భస్మాసురుణ్ణి చంపాలి. అలా చేయడు. ఆడవేషం వేసుకొని వస్తాడు ! (సభలో నవ్వులు) మాయ చేసి వాణ్ణి చంపుతాడు.

వృంద కథ మీకు తెలిసే ఉంటుంది. 'తులసి' సినిమా మీరు చూచే ఉంటారు. ఒక మారు శివునికి జలంధరునితో యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో జలంధరుని ధాటి కాగలేక శివుడు ఓడిపోయే పరిస్థితులేర్పడతాయి. అపుడు దేవతలంతా ఒకచోట చేరి, అరే ! శివు డంతటి బలవంతుడు ఈ రాక్షసుని చేతిలో ఓడిపోయే లాగున్నాడు. జలంధరుని కింతటి బలమెక్కడినుండి వచ్చింది అని ఆలోచించి, జలంధరుని భార్య వృంద. ఆమె పాతివ్రత్య మహిమచేత జలంధరుని కింతటి శక్తి వచ్చింది. అని నిర్ణయించుకుంటారు. ఆమె పాతివ్రత్యాన్ని భంగం చేస్తేకాని, యీ రాక్షసుని శక్తి తగ్గిపోదు అని ఆలోచించి, ఇంద్రాది దేవతలంతా విష్ణువు దగ్గరకు వెళ్ళి, మహాప్రభో! శివుడు వృందపాతివ్రత్య ప్రభావం చేత జలంధరుని చేతిలో ఓడిపోయేటట్లున్నాడు. మీరెలాగైనా సరే ఆమె పాతివ్రత్యాన్ని భంగంచేసి పుణ్యం కట్టుకొని శివుని రక్షించాల్సిందేనని కాళ్ళా వ్రేళ్ళా పడతారు. సరే ! అని విష్ణువు ఒప్పుకుంటాడు. పాపం ! వృంద విష్ణుభక్తురాలు. ఆమె తన భక్తురాలని విష్ణువుకు తెలుసు అయినా ఆమె పాతివ్రత్యాన్ని చెడగొట్టాలని విష్ణువు వెళతాడు. జలంధరుని రూపంతాను ధరించి, వృందను నమ్మించి ఆమెను చెరుస్తాడు. తరువాత

జలంధరుడు యుద్ధంలో చనిపోతాడు. విష్ణువుచేసిన యీ కిరాతకం చివరకు వృంద తెలుసుకుంటుంది. తెలుసుకొని విష్ణువుతో, నేను నీ భక్తురాల్ని, నన్నే ఈ విధంగా మోసం చేశావు. ఓరీ పాపాత్ముడా ! నీది హృదయం కాదు పాషాణం! నీవు పాషాణమైపో, అని శాపం పెడుతుంది. అందుకని యిపుడు పాపం విష్ణువు సాలిగ్రామమై గండకీ నదిలో పడి ఉన్నాడు. తాను సాలిగ్రామమైంది చాలక, వృంద మీద వ్యామోహం వదల్లేదో ఏమోమరి, విష్ణువు వృందను శాంతపరచి, భూమి మీద తులసి చెట్టువై పుట్టుమని వృందకు మళ్ళీ జన్మ కల్పిస్తాడు. చూడండి ఎంతటి అన్యాయమో !

ఇలాంటి కథలను పౌరాణికులు మన ఆడవాళ్ళకు వినిపిస్తుంటారు. గుళ్ళల్లో, గోపురాల్లోను. పాతివ్రత్యాన్ని చెడగొట్టడం మహిమా ? చేతనైతే తానే జలంధరునితో పోరాడరాదూ ! ఇలాంటి విష్ణువు అసలు దేవుడెలా అవుతాడు? చెప్పేవారికి బుద్ధిలేకపోతే వినేవారికైనా బుద్ధి వుండాలి. వృంద పాతివ్రత్య ప్రభావం వల్లనే జలంధరునికి యింతటిశక్తి వచ్చిందని గదా దేవతలు చెప్పిరి? శివునికి ఇద్దరు భార్యలున్నారు కదా ! గంగా, గౌరి అని, వారూ పతివ్రతలే, మరి జలంధరునికి ఒక భార్యవల్లనే అంతటి శక్తివస్తే, ఇద్దరు భార్యలున్న శివునికి రెట్టింపుశక్తి రావద్దూ ? (సభలో నవ్వులు), అలాకాక, జలంధరుని శక్తి పెరిగి శివుని శక్తి క్షీణించుతుంది. ఇదెక్కడి న్యాయం ! త్రిమూర్తులలో శివ, విష్ణువుల గతి యిలా ఉంది. ఇకపోతే బ్రహ్మవట్టి అబద్ధాలకోరు అయినాడు, కనుక అతనికి గుళ్ళూ లేవు పూజలూ లేవు పొమ్మన్నారు. (ఈ కథలు వింటున్నంత సేపు సభికులు, ఉత్సాహ, ఉద్వేగ, ఆనందాలతో ఊగిపోయారు).

ఇలాంటి కథలు మన పురాణ వాఙ్మయంలో వ్రాయబడి ఉన్నాయి. పైగా వీటిని సినిమాతీసి జనులకు చూపించుతున్నారు. క్రైస్తవులు, యితర మతస్థులు యివి చూచి, పురాణాలు చదివి, మీదేవుళ్ళు చూశారూ ఎలాంటివారో అని మనల్ని అడుగుతున్నారు. వారికి చెప్పగలిగే సమాధానం ఏమిటి ? అందుకనే హేతుబద్ధంకాని వాఙ్మయం,యిలాంటి పుక్కిటి పురాణాలు పోవాలి. అవి మనదేశం నుండి ఎంతత్వరగా పోతే అంతమంచిది. హేతుబద్ధమైన,

అభేద్యమైన, వేదవాఙ్మయ పునాదులపై మన మతాన్ని పునర్నిర్మించాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది.

ఒకప్పుడు భారతదేశం అన్ని దేశాలవారికి విద్య నేర్పింది (కంఠస్వరం పెంచుతూ)

ఏతద్దేశ ప్రసూతస్యసకాశా దగ్రజన్మనః

స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవా ః ॥ మను. 2..20

"భూమండలంలోని ఓ మానవులారా ! ఈ భారతదేశంలో పుట్టిన బ్రాహ్మణులనుండి మీకు కావలసిన విద్యలలో శిక్షణ పొందండి ! అని మహర్షులు ఎలుగెత్తి చాటారు. అలాంటిదిపోయి, మనదేశాని కిపుడు పట్టినగతి చూడండి.

పరమేశ్వరుడు అనే పదం పురుషవాచకంగా ఉంది. ఆయన మగవాడా అని కొందరికి సందేహం కలుగవచ్చు. ఆయన మగవాడుకాదు. ఆడదికాదు, నపుంసకుడసలే కాదు. అదొక తత్త్వం కాని, స్త్రీలింగ, పుంలింగ, నపుంసకలింగ పదములతో కూడ ఆ తత్త్వం చెప్పబడుతుంది. లక్ష్మి, సరస్వతి, శక్తి యివన్నీ భగవత్తత్త్వమునకు పేర్లే మనవాళ్ళు పురాణాలలో సరస్వతిని నెమలివాహనం ఎక్కించారు. లక్ష్మిని గజలక్ష్మిని చేశారు. కాళికి పెద్దనాలుక పెట్టి భయంకరంగా చేశారు (సభలో నవ్వులు) అలాగే శివుణ్ణి ఎద్దునెక్కించారు. విష్ణువును గ్రద్ధ నెక్కించారు. బ్రహ్మను హంసనెక్కించారు. ఇలా వీరికి దూర ప్రయాణాలు చేయడానికి పాపం వాహనాలు కూడ సిద్ధం చేశారు. వేదంలో నివి లేవు. తరువాత బ్రహ్మ, తత్, సత్ యిలాంటి పదాలు నంపుసక వాచకములు. ఇవికూడ పరమేశ్వరుని పేర్లే. ఆయన అనంత కల్యాణ గుణ విశిష్టుడు గనుక, ఆయనచేసే కార్యములనుబట్టి యిలా అనేక పేర్లతో వేదాల్లో వ్యవహరించ బడినాడు.

'అనేజత్ అంటే కంపం లేనివాడని అర్థం. కంపం భయలక్షణం. భయం ఎప్పుడు కలుగుతుంది. యిద్దరున్నప్పుడు. 'ద్వితీయాద్వై భయం భవతి=తనకు మించిన బలవంతుడుగాని, తనకు దీటైనవాడుగాని ఉంటే రెండవవానికి భయం కలుగుతుంది. కాని పరమేశ్వరుని స్థితి అలాకాదుగా !

'న తత్ సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే - అంటే పరమేశ్వరునికి సమానుడు గాని అధికుడుగాని లేదని అర్థం, అర్జునుడు అద్వితీయ ధనుర్ధారి" అన్నపుడు దేశంలో యిక ధనుర్ధారులే లేరని అర్థంకాదు. అర్జునునికంటె మించిన వారుకాని, అర్జునునితో తుల్యులుగాని లేరని అర్థం. అట్లే బ్రహ్మముకూడ "ఏకమేవాద్వితీయమ్" అనబడినది.

'మనసో జవీయః-అతడు మనస్సుకంటే వేగవంతుడు. అసలు మనోవేగమే అన్నింటికంటె పెద్దది. మనస్సు రాకెట్టుకంటె వేగవంతమైంది. చంద్రుడు అనగానే క్షణంలో మనస్సు ఆలోకం వెళ్ళి వస్తుంది. మరి మనస్సుకంటె పరమేశ్వరుడు వేగవంతుడనటంలో అర్థమేమిటి ? అంటే పరమేశ్వరుడు అంతటా ఉన్నాడు కనుక, మనస్సు ఎక్కడికి వెళ్ళితే అక్కడ ముందే తాను ఉంటాడు. కాబట్టి, మనస్సుకంటే పరమాత్మతత్త్వం వేగవంతమైంది అని చెప్పబడిందీ మంత్రంలో.

నైనద్దేవా ః అప్నువన్ - ఆతనిని నేత్రాది యింద్రియములు పొందనేరవు. దేవతలు అంటే యిక్కడ యింద్రియములని అర్థం. కన్ను, ముక్కు, నాలుక, చెవి, చర్మము యివి యింద్రియములు. ఇవి దేవత లనబడతాయి. దేవతల కధిపతి ఇంద్రుడు. ఇంద్రుడంటే జీవుడని అర్థం. "ఇంద్రస్య సాధన మింద్రియం" (ఇది ఐశ్వర్యే-ధాతువుతో ఇంద్ర శబ్ద మేర్పడుతుంది.) ఇంద్రునికి (జీవునికి) సాధనములు కనుక వీటికి ఇంద్రియములని పేరు వచ్చింది.

ఒకమారు నేను తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్ళాను. మా మిత్రు లొకరు అపుడు దేవాదాయ మంత్రిగా ఉంటుండేవారు. ఆయన అచటికి వెళదాము రమ్మంటే వెళ్ళాను. మంత్రిగారి వెంట వెళ్ళాను గనుక మాకు (Special) ప్రత్యేక దర్శనం దొరికింది. క్యూలో నిలబడిన వేలాది యాత్రికుల్ని ఆపివేసి ఆలయాధికారులు మాకు దర్శనం ఏర్పాటు చేశారు. నిజానికి భక్తులెవరు ? క్యూలో నిలబడిన జనం. వారు గంటల తరబడి నిలబడి ఎంతో ప్రయాసపడుతున్నారు కూడా, వాళ్ళకు ముందు దర్శనం యిచ్చి, తరువాత మాకు దర్శనం కలిగించాలిసింది. అది న్యాయం, కాని మంత్రిగారాయె, మరి ఆయన మెప్పు పొందొద్దూ! పైగా ఆయన దేవాదాయపు మంత్రిగారు కూడ. అందుచేత మాకు ఆలయాధికారులు (Special) దర్శనం ఏర్పాటుచేశారు

(సభలో నవ్వులు) సరే, మేం గర్భగుడి దగ్గర ప్రవేశించాం, మంత్రిగారు, నేను కాక మా వెంట బ్రాహ్మణ పండితులొకరు కూడ ఉన్నారు. ఆయన ఉపనిషత్తులు, దర్శనాలు సంస్కృత సాహిత్యం చదివిన పండితులు. మంత్రిగారు, పండితులు వేంకటేశ్వరుని విగ్రహానికి నమస్కారం చేస్తున్నారు. నేను యీ తతంగం అంతా చూస్తూ నిలబడ్డాను. ఆ బ్రాహ్మణ పండితుడు నాతో, గోపదేవ్ గారు ! చూశారు, స్వామి ఎంతటి దేదీప్యమానంగా దర్శనం యిస్తున్నాడో, ఆహా ! ఆహాహా : అని తన్మయం చెందుతూ విగ్రహానికి నమస్కరించుతున్నాడు. నేను, అదేమిటండీ, నల్లగా బాయి కనబడుతుంటే, దేదీప్యమానంగా దేవుడు దర్శనమిస్తున్నా డంటారు. ఏమైనా దీనిలో అర్థముందా అన్నాను. "అమ్మో అపచారం, అపచారం స్వామి సన్నిధిలో యీమాటలటండీ", అని పండితులు చెంపలు వేసుకున్నాడు. అదేమిటండీ తమరు తెలిసినవారు గొప్ప పండితులు ! మీరు కూడ యిలా అజ్ఞానులవలె వింతగా మాట్లాడుతున్నారు. అసలు భగవంతుడు ఇంద్రియములకు గోచరించడు, "నైనద్దేవా ఆప్నువన్" అని వేదవాక్యము కదా ! దీని అర్థమేమిటి స్వామి ! కండ్లతో విగ్రహాన్ని చూస్తూ, తమరు భగవంతుడు దర్శనమిస్తున్నా డంటారు. ఇదేం న్యాయం చెప్పండి అన్నాను. పాపం పండితుడు మళ్ళీమళ్ళీ చెంపలు వేసుకుంటూ, గోపదేవ్ గారూ! ఈ కాసేపు ఆగండి, ఆ విషయాలు మనం తరువాత మాట్లాడుకొందాం, స్వామి సన్నిధిలో యీ విషయాలు మాట్లాడుతున్నందుకు నాకు పాపం చుట్టుకుంటుంది. దయచేసి నన్ను వదలిపెట్టండి అని, పాపం పండితుడు బాధపడినాడు. నాకు నవ్వు వచ్చింది (సభలో నవ్వులు), ఈ విధంగా పండితులు చదువుకొన్నవారు కూడ, ఎలా ఉన్నారో చూడండి. సామాన్యులు విగ్రహాది జడ పూజలు చేస్తున్నారంటే ఉపేక్షించవచ్చు. పాపం వారికి తెలియదు. అంతా తెలిసినవాళ్ళు, బాగా చదువుకున్న వాళ్ళు కూడ ఎందుకిలా విగ్రహాది జడ పూజలు చేస్తారో నాకర్థం కాదు. మీరు తిరుపతి వెళతారు. మీకా విగ్రహంలో ఏం కనబడుతుంది. మీరుసామాన్యంగా గుళ్ళల్లో చూచే విగ్రహాలకంటె అది కొంచెం ఎత్తుగా ఉంటుంది. దానిపై ఎన్నో ఆభరణాలు కప్పబడతాయి. వజ్రాలు, వైడూర్యాలు, ధగధగ మెరిసే రాళ్ళు పొదిగిన బంగారు కిరీటం - యిలాంటివి కనబడతాయి. ఇవి మీరు ఏగుళ్ళోను చూచి

ఉండరు గనుక అచటికి వెళ్ళి, వీటిని ఒక్కసారి చూచేసరికి మీకు ఆశ్చర్యం కలుగుతుంది ! తన్మయులౌతారు. నిజంగా విగ్రహమే దేవుడయినట్లయితే ఏ గుడికి వెళ్ళినా ఏ విగ్రహం ముందు నిలువబడినా మీకు అలాంటి తన్మయత్వమే కలగాలి. కాని కలుగదు. అలంకరణ, సొమ్ములు యివి లేని వట్టి విగ్రహం ముందు నిలబడితే మీ రాకర్షింపబడరు. ఇక్కడ, మీరు వేళ్ళే గుళ్ళలో విగ్రహాలకు అలాంటి అలంకరణ చూడరు. అక్కడ వేంకటేశ్వరుని విగ్రహానికి నగ, నట్రా పెట్టి అలంకారాలు ఎక్కువ చేస్తారు. కాబట్టి మిమ్ముల నా విగ్రహం తతిమ్మా వాటికంటె బాగా ఆకర్షిస్తుంది. అందుచేత మిమ్ముల నాకర్షించేది విగ్రహముపైనున్న సొమ్ములు, వజ్రాలు, బంగారం యివేకాని దేవుడు కాదు. మనం సామాన్యంగా యిళ్ళల్లో కాసో, అరకాసో బంగారం చూచి ఉంటాం. అక్కడకు వెళ్ళి వేంకటేశ్వరుని విగ్రహం మీద లక్షలాది ఖరీదుగల బంగారం, వజ్రాలు ఒక్కసారి చూచేసరికి అబ్బో ! అని ఆశ్చర్యపడతాం (సభలో నవ్వులు) ఇదే అక్కడుండే విశేషం. అంతకంటే మరేంలేదు.

రంగులు కంటికి కనబడతాయి. అలాగే దృశ్య వస్తువులన్నీ కంటికి కనబడతాయి. కొందరు నాకు రాత్రి దేవుడు కలలోకి వచ్చాడు, ఆయన యిలా ఉన్నాడు, అలా ఉన్నాడు అని వర్ణిస్తారు కూడ. కలలో వచ్చిన రూపాలు అవి నిజమెలా అవుతాయి ? పగలంతా పటములను ముందు పెట్టుకొనో, లేక విగ్రహాల ముందో కూర్చుండి వాటిని చూస్తారు గనుక, అవే రాత్రి కలల్లో కనబడుతుంటాయి. దేవుడలా కనబడతాడా ?

సర్వే వేదా యత్ పద మామనంతి
తపాంసి సర్వాణి చ యద్వదంతి
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి
తత్తే పదం సంగ్రహేణ బ్రవీ మ్యోమిత్యేతత్ ॥ కఠ. 2-15

ఋగాది వేదాలు ఎవరిని గురించి చెబుతున్నాయో, ఎవరిని కోరి మహర్షులు జీవితాంతం యింద్రియ నిగ్రహాది తపస్సులను, బ్రహ్మచర్యాది వ్రతములను పాలించుచున్నారో అటువంటి పరమేశ్వరుడు వీళ్ళకు కలల్లో కనబడటమా ? పాపం కొందరది నిజమేనని నమ్మి అలా చెప్పిన వ్యక్తికి

పూజలు పురస్కారములు కూడ చేస్తుంటారు. కల అంటే ఏమిటి ? 'స్మృతి రేషా స్వప్నదర్శనం'' - అంటాడు శంకరుడు. స్వప్నం అంటే స్మృతి అన్నమాట, పూర్వం తాను చూచిన దృశ్యాలు, అనుభవించిన విషయాలు, సంస్కార రూపంగా అంతఃకరణములో ఉంటాయి, ఆ సంస్కారములే కలల్లో ఉద్బుద్ధమౌతాయి. ఉద్బుద్ధం కావడమంటే ప్రకటం కావడం. లేక వ్యక్తమవడం, కనుక కల స్మృతి మాత్రమే నని గ్రహించాలి.

ఇంద్రియాలకు గోచరించే సమస్త పదార్థాలు, రూపాలు యివన్నీ ప్రకృతి సంబంధమయినవే. ఇంద్రియములు ప్రాకృతికములే గనుక ప్రాకృతిక పదార్థాలనే గ్రహించగలవు.

ఇక్కడ యింక కొంచెం మీకు వివరించాలి. మనకు కనబడే నల్లతెల్ల గ్రుడ్లు ఇంద్రియం కాదు. అది నేత్ర గోళం. నేత్రేంద్రియము యీ గోళములో ఎక్కడో సూక్ష్మంగా ఉంటుంది. అది ఉంటేగాని వస్తువులను మనం చూడలేము. కొందరికి నేత్రగోళములు బాగానే ఉంటాయి. కాని వస్తువు కనబడదు. కారణం ? వారి నేత్రములో నేత్రేంద్రియం లోపించిందన్న మాట. అలాగే కొందరికి పెద్దపెద్ద చెవులుంటాయి. కాని వినబడదు. కారణం, శ్రోత్రేంద్రియం ఆ చెవిలో లోపించినదన్న మాట. కొందరునశ్యం పీలుస్తారు. వారు ప్రతిరోజు రెండు వ్రేళ్ళతో యింతింత పొడుం తీసుకొని డబ్బాలకు డబ్బాలు (చిన్న చిన్న పొడుంకాయలు) ముక్కుల నిండ ఎక్కిస్తారు. కొన్నాళ్ళకు ముక్కులు లొట్టలుపడి బుర్రలవుతాయి. వారి మాట కూడ అదోలా ఉంటుంది. పండితులు కూడ యీ పొడుం ఎంతో ప్రీతితో సేవించుతుంటారు (సభలో నవ్వులు). వారలా కొన్నాళ్ళు బాగ పీల్చేసరికి చివరకు ముక్కులో ఉండి గంధం గ్రహించే యింద్రియం చెడిపోతుంది అపుడు వారికే దిచ్చి వాసన చూడుమన్నా బాగానే ఉందంటాడు. (సభలో నవ్వులు) తరువాత రసనేంద్రియం : ఇది నాలుకలో ఎక్కడో ఉంటుంది. పదార్థమేదైనా నాలుకపై వేసుకుంటే మీకు వెంటనే రుచి తెలియదు. నాలుకను అంగిలితో చప్పరించితే గాని మీకు రుచి తెలియదు. అంటే రసనేంద్రియం నాలుకలో ఎక్కడో సూక్ష్మంగా ఉండటం చేత చప్పరించినపుడుగాని ఆ పదార్థం యొక్క రుచి తెలియదు. తరువాత

చర్మం : దీనిలో స్పర్శేంద్రియం ఉండటం చేత పదార్థములు చర్మమునకు తగిలినపుడు, అవి వేడిగా ఉన్నది చల్లగా ఉన్నది కనుక్కుంటుంది. గాలిని మనం కంటితో చూడం. కాని స్పర్శజ్ఞానం చేత ఆగాలి వేడిగా ఉందో చల్లగా ఉందో గ్రహించగలం. కొందరి శరీరం చర్మవ్యాధులకు లోనై స్పర్శేంద్రియం చెడిపోతుంది. మసలిపోయే నీళ్ళు పోసుకున్నా వారికేమీ బాధ అనిపించదు.

ఇప్పుడు యింద్రియాలంటే ఏమిటో వాటికుండే గ్రహణశక్తి ఏమిటో తెలిసికొన్నాము. ఇలా యింద్రియులు సూక్ష్ములై అతీంద్రియము లగుచున్నవి. ఇంద్రియములే యింద్రియ గోచరములు కానపుడు భగవంతుడు యింద్రియ గోచరుడెలా అవుతాడు ? కనుక నేను దేవుణ్ణి కళ్ళారా చూచాను అని అనడం వేద విరుద్ధం. కొందరు దేవుడు అవతారా లెత్తుతుంటాడని అంటారు. భక్తులు కోసం. భక్తుడు కోరితే దేవుడు ఏరూపమైన ఎత్తుతాడట. గాడిద కావాలంటే భగవంతుడు గాడిద అవుతాడట ! (సభలో నవ్వులు), ఎట్లా అనుకుంటే అల్లా భగవంతుడు వేషాలు వేస్తాడట. మరి భగవంతుడు వీధుల్లో తిరిగే పగటి వేషగాడు కాబోలు, వేషాలు మార్చడానికి. భగవంతు డిలా వేషాలు ఎప్పుడూ వేయడు. ఆయనకు వేరేపనేమీలేదా ? వేషాలు వేసుకోవడమే పనా ? ఆయన ఏకరసుడు, సర్వవ్యాపి, సృష్టికర్త, సర్వజగన్నియామకుడు, అచలుడు, అనంతుడు, ఇంద్రియములకు గోచరం కాని పరమసూక్ష్మ తత్త్వమది. ఈ విషయాలు మనం బాగా గుర్తుపెట్టుకోవాలి.

"తద్ధావతోऽన్యా నత్యేతి తిష్ఠత్" - ఆ పరమాత్మ తాను కదలక, ఎక్కిడికి వెళ్ళి విచారించిన అక్కడుంటాడు. అంటే మనస్సు, వాక్కు, యింద్రియములను అతిక్రమించి సర్వత్ర ఆయన వ్యాపించి ఉంటాడు. సర్వత్ర వ్యాపించినవాడు కదలడు. కదలిక అనేది పరిమిత వస్తువుకే ఉంటుందని చెప్పుకున్నాము. కనుక పరమేశ్వరుడు తాను స్వయముగా కదలక ప్రపంచమును నియమబద్ధంగా చలింపచేస్తాడు. అన్నిటికి ఆయన ఆధారం.

"తస్మి న్నపో మాతరిశ్వా దధాతి' - మాతరిశ్వా అంటే జీవుడు. తస్మిన్ - ఆ పరమాత్మయందు. అపః - కర్మలు, దధాతి - ఉంచును. జీవుడు కర్మలను పరమేశ్వరుని యందుంచును. అనగా జీవుడు ఫలాపేక్ష లేకుండ కర్మలు చేస్తాడని అర్థం. ఫలాపేక్షారహిత కర్మ ముక్తికి మార్గము. కర్మఫలాలను భగవ

దర్పణంగా చేయుట వలన జీవుడు ముక్తుడౌతాడు. ఇప్పటికే 7-30 గంట లయింది. బస్. మిగిలింది రేపు.

గుంటూరు, 28-12-1968
శనివారం , సా॥ గం॥ 6-00

మహాజనులార !

ఇంతవరకుఅసురులు అజ్ఞానముతో కూడి ఆత్మకు విరుద్ధముగ నడచుచు ఆత్మఘాతకులవుతారని, అలాకాక ఎవరు మనోవాక్కాయ కర్మలలో ఒకటిగా ఉంటారో వారు దేవతలనబడతారని చెప్పుకున్నాము. ఈశ్వరస్వరూపాన్ని గురించి కూడ కొంత తెలుసుకున్నాము. పరమాత్మ కదలడని, అంతటా వ్యాపించి ఉంటాడని, ఆయన ఒక్కడే నని,మనస్సుకంటే వేగవంతుడని, నేత్రాది యింద్రియములు ఆయనను చూడలేవని, ఆ పరమాత్మతాను చలింపక ప్రపంచమును నియమబద్ధంగ చలింపజేస్తాడని, జీవుడు శరీరములో నుండి కర్మలాచరించుతాడని, ఆ కర్మలు ఫలం ఆశించకుండ చేయడం ముక్తికి మార్గమని తెలుసుకొన్నాము. నేడు అయిదవ మంత్రము చెప్పుకొందాము.

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే
తదంతరస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యత : ॥ 5

భావార్థము : ఆ బ్రహ్మము మూఢదృష్టులకు కంపించు (చలించు) నట్లుండును. వాస్తవమున నయ్యది వ్యాపకమగుటచేత కంపించదు. పరమేశ్వరుని ఆజ్ఞకు విరుద్ధముగా వర్తించువారు ఇటునటు ఎంత తిరిగియు వాని నెఱుంగ జాలరు. ఈశ్వరాజ్ఞల ననుష్ఠించువారు తమలోనే అత్యంత సమీపమున నున్న బ్రహ్మమును గుర్తింతురు. ఆ బ్రహ్మము ప్రకృతి మొదలు స్థూల భూతములవరకు గల సమస్త పదార్థములలోను లోపల వెలుపల వ్యాపించి యున్నది. జీవులలోను అంతర్యామియై ఉన్నది. జీవుల పాపపుణ్య కర్మలను నిరీక్షించుచు, వానికి తగిన ఫలములను సుఖదుఃఖ రూపమున ఇచ్చుచుండును. ఆ బ్రహ్మమునే యెల్లరు ధ్యానింపవలెను. దానికే భయపడవలెను.

ఇక్కడ తత్ పదము బ్రహ్మవాచకం. "తత్" అనగా "అది" ప్రసిద్ధమైనది - అని యర్థం. ఓం తత్ సదితి నిర్దేశో బ్రాహ్మణ స్త్రి విధః స్మృతః - గీ. 17-23

బ్రహ్మ పదార్థాన్ని "ఓమ్" "తత్", "సత్" అని నిర్దేశించుతారు. నిర్దేశించుట అంటేచెప్పడం. అది సర్వవ్యాపకమై ఉంటుంది. సర్వవ్యాపక వస్తువు కదలదు. కాని అజ్ఞానుల దృష్టిలో అది కదలినట్లుంటుంది. అలాగే పరమేశ్వర తత్త్వం తెలియనివారికి దూరంగ ఉంటుంది. తెలిసినవారికి అతి సమీపంలో ఉంటుంది. "తద్దూరే తద్వంతికే". ఆ బ్రహ్మపదార్థాన్ని తెలిసికోవడం ఎలా ? "త దుపాసితవ్యం" - అది ఉపాసించదగింది.

"త దుపాసితవ్యం,తదన్వేష్టవ్యం, తద్ విజిజ్ఞాసి తవ్యం" - ఆ బ్రహ్మ ఉపాసింపదగింది, అన్వేషింపదగింది, తెలిసికొనదగింది అని. ఉపాసన - (ఉప+ఆసనం) అంటే సమీపంలో కూర్చోవడం అని అర్థం. బ్రహ్మోపాసనం అంటే బ్రహ్మకు సమీపంలో కూర్చుండుట. సమీపించడమంటే ఏమిటి ? దగ్గఱకు చేరడం. మనవాళ్ళు దేవుణ్ణి ఉపాసించాలని చెప్పి గుళ్ళకు గోపురాలకు, కొండలకుగుట్టలకు వెళ్ళుతుంటారు. వారికి దేవుడంతటా ఉన్నాడని తెలియదు. కావుననే అట్లు చేస్తారు. ఉపాసించుట యన దగ్గరకు చేరుట. అనగా ఎవనిని ఉపాసింపదలచితిమో అతనికి తమకు మధ్యనున్న యెడము - దూరమును తొలగించుకొనవలెను. పరమేశ్వరుని ఉపాసించుట యన అతనికి జీవునకు మధ్యనున్న దూరమును తొలగించుకొనవలెనుగదా !

పరమేశ్వర తత్త్వం వ్యాపకతత్త్వం. వ్యాప్యతత్త్వం జీవుడు. "వ్యాప్య" మంటే కొంత ప్రదేశములో ఉండేది. "వ్యాపక" మంటే అంతటా నిండి ఉండేది. పరమేశ్వరుడు ఉపాస్యవస్తువు. జీవుడు ఉపాసకుడు. మఱి ఈ జీవుడు ఎక్కడున్నాడో ముందు తెలుసుకోవాలి. తరువాత పరమేశ్వరుణ్ణి సమీపించడం ఎలాగో తెలుసుకోవచ్చు. జీవుడు హృదయాకాశంలో ఉన్నాడు. యోగులు కూడ అట్లే యెంచుతారు. జీవునితోపాటుగా మనస్సు కూడ హృదయంలో ఉంటుందని ఋషుల భావం.

హృత్ప్రతిష్ఠం యదజిరం జవిష్ఠమ్
తన్మే మనః శివ సంకల్ప మస్తు ॥ యజు. 34-6

"ఏది హృదయమున నుండునో, మనుష్యులను వికలపరచునో, ఎక్కువ వేగవంతమో ఆ నా మనస్సు శివసంకల్పమగు గాక" ! అని మనం శివ

సంకల్ప మంత్రములలో చదువుతుంటాము. హృదయమంటే గుండెకాయ.

పరమేశ్వరుడు అంతటా నిండిన వ్యాపక తత్త్వమని చెప్పుకొన్నాము. అతడు అంతటా ఉన్నాడు కనుక జీవునికి లోపల బయట కూడ ఉన్నాడు. అలాగైతే జీవుడు మఱి పరమేశ్వరునికి దగ్గర ఉండియే యున్నాడు. ఇంక ఉపాసించుట - దగ్గర చేరుట - యననేమి ?

దూరం మూడు రకాలుగా ఉంది. ఒకటి దేశ దూరం, రెండవది కాలిక దూరం(అంటే కాలభేదం) పరమేశ్వరునిలో నీ రెండుదూరములు లేవు. వేదములో చెప్పబడ్డ విష్ణువు వ్యాపకుడు పురాణాలలోని విష్ణువు వైకుంఠవాసి, ఇక్కడ దేశ దూరం ఉంది. అలాగే రాముణ్ణి కృష్ణుణ్ణి మనముదేవుళ్ళనుకుంటే వారికి మనకు దేశం దూరం ఉంది. రాముడు అయోధ్యలో పుట్టాడు. కృష్ణుడు బృందావనంలో జన్మించాడు. ఇలా దేశ దూరమే కాక వారికి మనకు కాల దూరం కూడ ఉంది. కొన్ని యుగాలు తేడా ఉంది. రాముడు త్రేతాయుగంలో పుట్టినాడు కృష్ణుడు ద్వాపరయుగంలోనివాడు. నేను మా తాత గారిని ఉపాసించాలనుకుంటాననుకోండి. ఆయనకు నాకు కాల దూరం ఉంది. ఇద్దరం ఒక యింట్లోనే పుట్టినందున మా యిద్దరి మధ్య దేశదూరం లేనప్పటికి మా మధ్య కాలదూరం ఉంది. కనుక , నే నాయనను ఉపాసించడం కుదరదు. అలాగే, గతించిన రాముడు, కృష్ణుడు మున్నగుమహాపురుషులను నేను ఉపాసించాలంటే, వారికి నాకు మధ్యలో దేశదూరం, కాలదూరం రెండూన్నాయి. కనుక వారిని ఉపాసించడానికి కూడ వీలులేదు. కాని పరమేశ్వరునిలో మాత్రం యిలా కాల సంబంధమైన దూరంగాని, దేశ సబంధమైన దూరంగాని లేవు. ఆయన ఒకకాలంలో ఉండి యింకొక కాలంలో లేక పోడు. మూడుకాలాల్లోనూ ఆయన ఉన్నాడు. కడచిన కాలంలో ఉన్నాడు (భూతకాలం) ఇప్పుడున్నాడు (వర్తమాన కాలం) , ఇక ముందు కూడ ఉంటాడు (భవిష్యత్ కాలం), ఆయన ఒక క్షణం ఉండి మరొక క్షణంలో లేనివాడు కాడు. నిరంతరం ఉంటాడు. కనుక పరమేశ్వరునిలో కాల సంబంధమైన దూరంలేదు. అలాగే ఆయనలో దేశ సంబంధమైన దూరం కూడ లేదు. పరమేశ్వరుడు సర్వవ్యాపకుడగుటచేత ఆయన యిక్కడ ఉన్నట్లే, అన్నిచోట్ల ఉన్నాడు. అతడు ఒకచోట ఎక్కువగా

ఉండి మరొక చోట తక్కువగా లేదు. అంతటా సమంగా వ్యాపించి ఉన్నాడు.

దేవుని స్థితిగతులు తెలియక క్షేత్రాలలో, తీర్థాలలో దేవుణ్ణి వెతకడానికి వెళ్ళేవారికి చాలా యిబ్బందులున్నాయి. మొదటిది ఆర్థిక నష్టం, శ్రమపడి ఎంతో ఖర్చుపడి అంతదూరం వెళ్లినా, డబ్బుపెట్టి టిక్కెట్టు కొననిదే దేవుని దర్శనం లేదంటారు. కొబ్బరికాయ కొడితే దానికి పన్ను, స్పెషల్ దర్శనాని కింతపన్ను అని అక్కడుండే ఆలయాధికారులు పన్ను వసూలు చేస్తారు. చివరకు దేవుని ప్రసాదం కూడ పూజారులు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతుంటారు (సభలో నవ్వులు), ధన సంపాదనే ఈ ఆలయాలలో ప్రధానంగా ఉన్నట్లు కనబడుతుంది మనకు పైగా యిక్కడ నుండి బయలుదేరితే మీరు ఆ క్షేత్రాలకు వెళ్ళగలరో లేదో కూడ చెప్పలేం. రైలు ప్రమాదాలు, కారు ప్రమాదాలు సంభవించవచ్చు. తిరుపతికి వెళ్ళే టూరిస్టుబస్ రైలుకు ఢీకొని అందులోని యాత్రికులుఒకరిద్దరు తప్ప అందరూ చనిపోయారన్న సంగతి మనకు తెలుసు. ఈ ప్రమాదాలే కాకుండా తిరుపతి దేవాలయంముందే దేవుని దర్శనం కోసం నిలువబడిన యాత్రికులు త్రొక్కిసలాడి 19 లేక 20 మంది (స్త్రీలు పిల్లలుకూడ) మరణించినట్లు మనకు తెలుసు. దేవుని సన్నిధిలో యీ ప్రమాదాలా ! మిమ్ములను నేను యాత్రలు చేయవద్దనడం లేదు. కాని దేవుని కోసమని యాత్రలు చేయడం చాల పొరపాటంటున్నాను. అక్కడుండే దేవుడే యిక్కడా ఉన్నాడు. మేము దేవుణ్ణి చూడటానికి కాదు ; దేశం చూడటానికి యాత్రలు చేస్తున్నాం. అంటారా అలాగైతే మంచిదే, నాకేమీ అభ్యంతరం లేదు. విహారయాత్రల వల్ల విజ్ఞానం వృద్ధి అవుతుంది కూడ. దేవుని కొఱకు దేవాలయాలకు కూడ వెళ్ళ నావశ్యకత లేదు. మనలో ఉండే దేవుణ్ణి మరచి దేవాలయాలకు వెళ్ళడం అనేసరికి పరమేశ్వరునికి మనకు మధ్యలో దేశ దూరం ఉందని చెప్పాలి. అలా చెప్పుట సరికాదు.

ఇలా పరమేశ్వరునికి మనకు మధ్య దేశ దూరం, కాలదూరం ఏమీలేదని తెలుసుకున్నాము. కాని యింతటితో సమస్య పూర్తికాలేదు. ఆయనకు మనకు మధ్యలో యింకొక దూరం కూడ ఉంది. అది "అజ్ఞాన మనే దూరం", అజ్ఞానమంటే తెలియనితనం. మీరు ఆఫీసు పని చేస్తుంటారు. మీ సీట్లోనే

కలం ఒకచోట పెట్టి (మరచిపోయి) ఆఫీసంతా వెతుకుతారు. నా కలం తీశావా అని కనపడిన ప్రతివాణ్ణి అడుగుతారు. మళ్ళీ కలాన్ని మీ సీట్లోనే చూస్తారు. అరే ! యిక్కడే ఉంచుకుని ఆఫీసంతా వెతికానే అని నవ్వుకుంటారు. మన యిండ్లలో వృద్ధులుంటారు వారు కంటి అద్దాలు ముక్కుపైన ఉంచుకొని ఇంటిలో ఉండే పిల్లలను తిడుతుంటారు, తన కళ్ళద్దా లెవరో తీశారని. ఏ మనుమరాలో వచ్చి అదేమిటి తాత ! కంటి అద్దాలు నీ ముక్కుపైనే ఉన్నాయిగా, మమ్ముల నరుస్తావేం అంటే, కళ్ళజోడు చూచుకొని అరే, యిక్కడే ఉన్నాయమ్మా, నేను మరచిపోయాను అంటాడు. అంటే తెలియనితనం వల్ల వస్తువు దగ్గరుండి కూడ దూరమవుతుంది. కాబట్టి పరమేశ్వరుని ఉపాసించడం అంటే ఆయనను తెలుసుకోవడమని అర్థం. అందుచేత తెలియని వాళ్ళకు తద్దూరే' పరమేశ్వరుడు దూరం. తెలిసిన వాళ్ళకు తద్ అంతికే - ఆయన దగ్గరే ఉన్నాడు, అని మంత్రం చెపుతుంది.

జీవునికి పరమేశ్వర సాక్షాత్కారము అసాధ్యమని మాత్రం ఎంచరాదు. ప్రయత్న సాధ్యమే. ఒక వ్యక్తి పరమేశ్వర సాక్షాత్కారము పొందితే అన్యులు కూడ దానిని పొందవచ్చును. ఒకరికి సాధ్యమైన పని యింకొకరికిని సాధ్యమే. పరమేశ్వర సాక్షాత్కారము కోరినవ్యక్తి బాహ్య పదార్థములను కోరరాదు. అతనికి పరమ వైరాగ్యం కలగాలి. వైరాగ్యం అంటే -

"దృష్టానుశ్రవిక విషయ వితృష్ణస్య వశీకార సంజ్ఞా వైరాగ్యమ్"

యో. ద. 1-15

అనుశ్రవ మంటే వేదమని అర్థం. (అనుశ్రవో నామ వేదః) వేదము ద్వారా బోధింపబడిన పారలౌకిక (జన్మాంతరములకు సంబంధించిన) విషయములు అనుశ్రవికము లనబడును. దృష్ట పదార్థాలు - అంటే ఇంద్రియ గ్రాహ్యములైన ఐహికవిషయములు. దృష్టములు అనుశ్రవికములు అను ఉభయ విధ పదార్థములలో వాంఛలుడుగడం వైరాగ్యమనబడుతుంది. వైరాగ్యం కొరకు సాధన చెయ్యాలి. భక్తి ప్రపత్తులు కలిగి ఉండడం వైరాగ్యం కాదు. అజ్ఞానాన్ని పోగొట్టదలచుకుంటే మనసు శుద్ధం కావాలి. మనసు శుద్ధం కావాలి అంటేయమ నియమాదులను సాధన చెయ్యాలి. గుడికి వెళ్ళి మూర్తి

పూజలు చెయ్యడం భక్తియని మోక్షాని కిది మొదటి మెట్టని కొందరంటారు. కాని దయానందు డిది నరకానికి మొదటి మెట్టన్నాడు. అందువలన నతనిని ద్వేషించి విషంబెట్టి చంపారు. మనుష్యుడు జడపూజలు చేస్తే జడుడవుతాడు. మూర్ఖుణ్ణి ఉపాసించే విద్యార్థికి మూర్ఖత్వం వస్తుంది. అలాకాక జ్ఞానం గల టీచర్ కు అప్పగించితే పిల్లవాడు జ్ఞాని అవుతాడు. మన ప్రాచీన ఋషులు జడపదార్థాలను ఉపయోగించుకున్నారే గాని, వాటి నుపాసించలేదు. పరమాత్మనే ఉపాసించారు.

పరమేశ్వరుని జ్ఞానము కలగాలి అంటే మనం మొదట సాధించవలసినవి యమనియమాలు, అహింస సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం యివి యమములు. శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము ఇవి నియమములు. ఇవియే నిజమైన వ్రతాలు శివరాత్రి, గోకులాష్టమి మున్నగు వ్రతాలు వ్రతాలు కావు.

అహింస ఆచరించవలసిన వ్రతములలో మొదటిది. "సర్వదా సర్వథా సర్వభూతానాం అనభిద్రోహః అహింసా" - ఎల్లప్పుడు, సర్వవిధముల సమస్త ప్రాణులయెడ వైరభావం లేకుండుట అహింసావ్రతమౌతుంది. శివభక్తుడు, శివరాత్రిరోజు మాంసము తినడు. అనాడు తినుట పాపమంటాడు. ఆ ఒక్కరోజు తినకుండ ఉండి దేవుణ్ణి మెప్పించాలనుకుంటాడు పాపం. కాని ప్రతిరోజు తింటాడు. ఒక శివరాత్రి నాడు తింటేనే పాపంవస్తే మరి రోజూ తినడంచేత యింకా ఎక్కువ పాపం రాదూ ? (సభలో నవ్వులు). పూర్వం తిరుపతి నడచివెళ్ళే రోజుల్లో మాంసాదులు తినక అహింసావ్రతాన్ని పాటించేవాళ్ళు యాత్రికులు. ఇప్పుడు కార్లమీద తిరుపతి వెళ్ళి అన్ని పనులు చేసివస్తున్నారు (సభలో నవ్వులు). కురుక్షేత్రమున ప్రాణిహింసచేయను, కాశియందు ప్రాణిహింస చేయను, అని కొన్ని ప్రదేశములలో హింసను వర్జించడం దేశావచ్ఛిన్న అహింస. అట్లే ఏకాదశినాడు ప్రాణహింసచేయను, పూర్ణిమనాడు హింసింపను, అనడం కాలావచ్ఛిన్న అహింస. ఇలా దేశ, కాల భేదములులేకుండ సర్వత్ర సర్వకాలము లందు అహింసను పాటిస్తే అది మహావ్రత మౌతుంది. కొందరసమర్థులు మానసికంగా హింసిస్తారు. శత్రువులను పైకి ఏమి అనలేక

లోలోపల మాత్రం, వారి గొడ్డుబిడ్డలు నాశనమయితే బాగుండును. ఆస్తిపాస్తులు హరించుకుపోతే బాగుండును. అని మనస్సులోనే అనుకుంటారు. ఇదికూడ హింసయే (సభలో నవ్వులు). ఇది మానసిక మైన హింస. అహింసావ్రతం పాలించాలనుకునే వ్యక్తి యిలాంటి కుబుద్ధితో ఉండరాదు.

సత్యం : తెలిసింది తెలిసినట్లు చెప్పుట. అసత్యం చెప్పుట హింసలోనే చేరుతుంది. కావున అహింసకుడు సత్యమేచెప్పాలి.

తరువాత అస్తేయం : స్తేయం అంటే దొంగతనం. అస్తేయం అంటే దొంగిలించకుండటం. మనవస్తువుల నెవరైన దొంగిలించితే మన కెంతో వ్యధ కలుగుతుంది. అలాగే మన మెవరివైనా అపహరించితే వారికి దుఃఖం కలుగుతుందని యెంచి దొంగతనం చేయకుండా ఉండాలి. ఇది అస్తేయం అనబడుతుంది అస్తేయవ్రతం కూడ అహింసలో ఒక భాగం.

బ్రహ్మచర్యం : సంతానోత్పత్తికి మూలమైన ఉపస్థేంద్రియమును నిగ్రహించడం బ్రహ్మచర్యం అవుతుంది. వ్యభిచరించరాదు. వీర్యమును సాధ్యమైనంతవరకు తక్కువఖర్చు చేయాలి. అదికూడ భార్యయందే వినియోగించాలి. సంతానార్థమై, శరీరంలో ఎంత ఎక్కువ వీర్యమును నిలువచేసుకొంటే సాధకుడు అంత బలిష్ఠుడు, తేజోవంతుడు, శక్తి సామర్థ్యాలు కలవాడు అవుతాడు. అట్లు నిలువచేసిన వీర్యము ఓజస్సుగా మారి అతనిలో మేధాశక్తి వృద్ధి అవుతుంది. వీర్యనష్టమువలన ఆయువు క్షీణించుతుంది. (మరణం బిందుపాతేన జీవనం బిందు ధారణాత్) 'నాయమాత్మా బలహీనేన లభ్యః - బలహీనులచేత ఈ ఆత్మ తెలియబడదు. బ్రహ్మచర్య వ్రతమును పూని సమర్థుడైన సాధకునకే ఆత్మ సాక్షాత్కారము కలుగుతుంది.

అపరిగ్రహం : పరిగ్రహమంటే అన్ని వైపులనుండి పట్టుకొనుట. బాగుగా గ్రహించుట లేక సేకరించుటని అర్థం. 'అపరిగ్రహ' మంటే తనకు కావలసినవరకే గ్రహించడం అని భావము. ఈ అపరిగ్రహ వ్రతమును గూర్చి గాంధీమహాత్ము డెంతో ఆలోచించాడు. తుదకాపదమున కర్థము 'నాన్ ప్రొసెషన్ (Non-Possession) అని నిశ్చయించాడు. అంటే కూడబెట్టకుండుటని అర్థం. తనకు కావలసినవరకే పశు, ధనాదులను కూడబెట్టాలి. అంతేగాని వంశపారం

పర్యం, మనుమలు ముదిమనుమలు తిన్నా తరుగనంతగా ప్రోగుచెయ్యరాదు. అలా చెయ్యడం తన భావిసంతతిని సోమరులుగా, అయోగ్యులుగా తయారుచెయ్యడ మవుతుంది. ప్రతివ్యక్తి తనకు కావలసిన వరకు ఉంచుకొని మిగిలిన స . వన ం సంఘశ్రేయస్సునకు, దీనులకు, దరిద్రులకు ఉపయోగించాలి. అలా చేసేటట్లయితే సంఘంలో యిప్పుడున్న విపరీతమైన ఆర్థిక వ్యత్యాసా లుండవు. కమ్యూనిజం దేశంలో వ్యాపించుటకు అవకాశం లేదు. ఈ అపరిగ్రహ వ్రతమును గాంధీజీ బాగుగా పాటించాడు. చనిపోవునాటికి ఆయనతన సంతతికేమీ మిగల్చలేదు. అపరిగ్రహవ్రతం పూని చివరకి ఆయన జీవిత భీమా పాలసీలుకూడ కడుతూ కడుతూ మానేశాడు. దక్షిణాఫ్రికాలో ఉన్నపుడు ఆయనచేసిన సంఘసేవలకు సంతసించి ప్రజలాయనకు నగలు నాణ్యాదులు బహూకరించగా వానిని తాను తీసికొనక, కొన్ని లక్షల రూపాయలు విలువగలిగిన ఆ సంపదను దరిద్రనారాయణ బ్యాంకిలో వేసి ఆ నిధిని సంఘశ్రేయస్సునకై వినియోగించాడు.

ఇపుడు మనం చెప్పుకొనిన యీ అయిదింటిని యమములంటారు. మనుష్యుడు సంఘజీవి. సంఘము వ్యక్తిమీద , వ్యక్తి సంఘముమీద ఆధారపడి ఉండటం చేత ప్రతి మనుష్యుడు ఈ యమములను సంఘశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తన నిత్యజీవితంలో ఆచరించుటకు పూనుకోవాలి. ముఖ్యంగా ముముక్షువు కాగోరువారు వీటిని తప్పనిసరిగా ఆచరించాలి.

తరువాత నియమములు ! అవియును అయిదు, శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము.

శౌచము - అంటే శుద్ధి, ఇది రెండు విధములు. బాహ్యశుద్ధి, మానసిక శుద్ధి

అద్భిర్ గాత్రాణి శుద్ధ్యంతి మనః సత్యేన శుద్ధ్యతి
విద్యా తపోభ్యాం భూతాత్మా బుద్ధిర్ జ్ఞానేన శుద్ధ్యతి ॥

- మనుస్మృతి 5-106

స్నానముచేత శరీరావయవములు శుభ్రపడతాయి. సత్యము నాచరించడం

చేత మనస్సు శుద్ధమౌతుంది. విద్య, తపస్సు, వీనివలన జీవాత్మ పవిత్రమవుతుంది. పృథివి మొదలు పరమేశ్వరుని పర్యంతముగల పదార్థ జ్ఞానమువలన దృఢనిశ్చయము కలిగి బుద్ధి స్థిరమవుతుంది.

శారీరిక శుద్ధికంటె మానసిక శుద్ధి ముఖ్యము. గంగలో స్నానము చేసినంతమాత్రం చేత మానసికశుద్ధి కలుగదు. గంగలో స్నానంచెయ్యడం అందరికి సాధ్యంకూడ కాదు. అందుచేత గంగా స్నానం చేయనివారికి సంతోషపెట్టడానికోఏమో, గంగలో స్నానం చేయకపోయినా, గంగను స్మరించినంత మాత్రముచేత గంగా స్నాన ఫలం కలుగుతుందని శ్లోకాలు వ్రాసిపెట్టారు.

గంగే గంగేతియో బ్రూయాత్ యోజనానాం శతై రపి
ముచ్యతే సర్వ పాపేభ్యః విష్ణులోకం స గచ్ఛతి ॥

హే గంగే ! గంగే ! అని వందలకొలది ఆమడల దూరంనుండి స్మరించినంత మాత్రముచేతనే (గంగలో స్నానం చేయకపోయినప్పటికి) మనుష్యుడు తాను చేసిన పాపములనుండి విముక్తుడై నేరుగా వైకుంఠమునకు పోతాడట ! చూడండి, ముక్తికి ఎంత సులభోపాయం కనిపెట్టారో (సభలో నవ్వులు)

తరువాత సంతోషం సంతోషమంటే తృప్తి తన శ్రమకు లభించిన దానితో తృప్తి పడి ఉండడం. ఇతరులు తనకంటె ఎక్కువ సుఖ సంతోషములతో ఉన్నారని ఈర్ష్య పడరాదు.

తపస్సు : తపస్సంటే ఇంద్రియ నిగ్రహం. ఇంద్రియములతో చెడుగులు చేయకుండా ఉండటం. అంతేగాని, ఇంద్రియ శక్తుల్ని ఉడిగించడం కాదు. కొందరు మౌనవ్రతము పూని మేము తపస్సులో ఉన్నామంటారు. వారు నోటితో మాత్రం మాటలాడరు. మనసులో ఆలోచిస్తూనే ఉంటారు. తనకేదైనా కావాలన్నా, దగ్గరకు వచ్చిన వారికి సమాధానాలు చెప్పాలన్నా కాగితం మీద వ్రాసి యిస్తుంటారు. (సభలో నవ్వులు). **నోటితో మాటలాడకపోతే తపస్సు** చేసినట్లు కాదు. భగవంతుడు మనకు వాక్కును ప్రసాదించినందుకు "శ్లక్ష్ణయా

మధురయా వాచా ' - మృదువు, ప్రీతియుక్తమునైన మాటలు మాటాడాలి. అంతేగాని నోటిని కట్టివేసి కొని కూర్చోరాదు. వంకరచూపులు మానాలి. దొంగచూపులు పనికిరాదు. (సభలో చిరునవ్వులు) నేరుగా చూడటం నేర్వాలి. నేత్రేంద్రియాన్ని అదుపులో ఉంచడానికి ప్రయత్నం చెయ్యాలి.' అంతేగాని కన్ను పాపం చేసిందని దానిని పొడుచుకోరాదు. కన్నులు పొడుచు కోవడం సరైన పనియా ! కన్నులు పోయిన తరువాత మనుజుడేమి చేయగలడు ? ఏమి సాధించగలడు ? ఇంద్రియములలో పటుత్వము ఉన్నపుడే వాటిని నిగ్రహించాలి. అవి పటుత్వం కలిగి ఉంటేనే ఏదైనా సాధించగలం. ఇంద్రియములు బలహీనములైతే ఏమీ సాధించలేము.

భద్రం కర్ణేభి ః శృణుయామ దేవా ః
భద్రం పశ్యే మాక్షభి ర్యజత్రా ః
స్థిరై రంగై స్తుష్టు వాగ్ం స స్తనూభి ః
వ్యశేమహి దేవహితం యదాయు ః ॥ యజుర్వేదం 25-21

మే మెల్లప్పుడు శుభమునే వీనులతో విందుముగాక ! కల్యాణకర దృశ్యములనే కన్నులతో చూతుముగాక ః సుస్థిరములైన శరీరాంగములతో పరమేశ్వరుని స్తుతించుచు, విద్వాంసులకు హితకరములగు కార్యముల నాచరించుచు జీవింతుముగాక ! ఈవిధంగా వర్తించడాన్ని ఇంద్రియ నిగ్రహ మనాలి.

తరువాత స్వాధ్యాయం. ప్రతిరోజూ, సద్గ్రంథ పఠనముచేయడం స్వాధ్యాయ మవుతుంది. వేదాది శాస్త్రములు చదవాలి. మహాపురుషుల జీవిత చరిత్రలు చదవాలి. శంకర, దయానందాది మహాపురుషుల జీవిత చరిత్రలు చదువడం చేత మనకెంతో మేలు కలుగుతుంది. నిత్య జీవితంలో వారిని మనం ఆదర్శంగా ఉంచుకొని మన జీవితాలను సరిదిద్దుకోగలం. సైన్సు గ్రంథాలు చదవటం కూడ మంచిదే. అందుచేత ప్రకృతి రహస్యాలను తెలిసికొనగలం. నవలలు, అనార్ష గ్రంథాలు పఠించడం వలన మనకేమి ఉపయోగం లేదు. శ్రీ దయానందమహర్షి తమ 'సత్యార్థ ప్రకాశము' అనే గ్రంథంలో ఒక జాబితా యిచ్చారు. ఏ గ్రంథములు చదువతగినవో, ఏవి

కూడనివో, ఏవి ఆర్షగ్రంథములో, ఏవికావో, అనార్షగ్రంథములు విషమిశ్రిత అన్నం వలె త్యాజ్యము లన్నాడాయన. విషము కలిసిన అన్నంలో, విషము ఏ భాగంలో ఉందో తెలియదు గనుక, మన మా అన్నమునుతినం అలాగే సామాన్యులు అనార్ష గ్రంథములలో ఎక్కడ లోపం ఉందో గ్రహించలేరు గనుక, వానిని చదవటం వలన నష్టం కలుగుతుందని, సత్యము తెలియదని, అందుచేత వేదాది సద్గ్రంథములనే స్వాధ్యాయము క్రింద పఠించాలన్నా డాయన. స్వాధ్యాయం క్రింద నిత్యం కొన్ని పేజీలైనా చదవాలనే నియమం పెట్టుకోవడం మంచిది.

చదువురానివారు చేయవలసిందేమిటి ; స్వాధ్యాయో నామ ప్రణవ జపః' - వారు నిత్యము "ఓం" కారమును జపించడమే స్వాధ్యాయ మవుతుంది. ఏకాంత ప్రదేశంలో కూర్చొని ప్రణవ జపం చేయడం మంచిది. తాను చేసే సాధన ఎంత గుప్తంగా ఉంటే సాధకున కంత మంచిది. ఒక్కొక్కరు బజారులో **అరుగుమీద కూర్చుండి జపమాలను త్రిప్పుతుంటారు** "రాం, రాం" అని. వచ్చే పోయే వారితో ముచ్చట్లు కూడ నడుస్తుంటాయి. యీ జపంలోనే (శ్రీ గోపదేవ్ గా రిచట, తమ చేతి వ్రేళ్ళతో జపమాలను తిప్పుచున్నట్లు అభినయించుతూ, యిలా అన్నారు (చిరునగవుతో) ఏమేవ్ ! అమ్మాయి ఏం చేస్తూంది ? కాస్త మంచినీళ్ళు పట్టుక రమ్మను "రాం, రాం" అంటాడు (సభలో నవ్వులు). ఎవరైనా ఆ బాటనేపోతుంటే వారి నిటు రమ్మని పిలుస్తాడు. వారితో అంటాడు. ఏంరా! యివ్వాళ ధాన్యం రేటు ఎలాగుంది ? "రాం, రాం" మినుముల రేటు మరీ ముంద మోసిందేం ! "రాం, రాం" (సభలో నవ్వులు) శనక్కాయలకు అసలు రేటు వస్తుందంటావా" "రాం, రాం" (సభలోనవ్వులు) అంటూ యిలా బేరాలాడుతుంటారు. ఇలా ధార్మిక జీవనం నేడు అంతాఆడంబరముతోనే నడుస్తున్నది. అభ్యాసకుడు ఏకాంతంగా కూర్చుండి, "ఓంను" మాటి మాటికి స్మరించాలి "ఓం" అంటే రక్షకుడని అర్థం. 'అవతి ఇతి ఓం', ఓంకారము పరమేశ్వరుని నామములన్నింటిలో ఉత్తమమైనది ఆయన సృష్టికర్త, రక్షకుడు. ఇతర చింతలు లేక నిరంతరం మన మాయనను ధ్యానించాలి. పరమేశ్వర సాక్షాత్కారం పొందాలి. కొందరు సంశయిస్తుంటారు మనకిది

సాధ్యమా అని. దీనిలో సంశయించవలసిన పనిలేదు. మనుష్యులకు చెప్పేవి సాధ్యమౌతాయి, ప్రయత్నం చేస్తే అసాధ్యమౌతాయనుకోరాదు.

ఈశ్వర ప్రణిధానం : నిధానం అంటే ఉంచటం, ప్రణిధానం అంటే బాగా ఉంచడం. ఈశ్వర ప్రణిధాన మంటే ఈశ్వరునియందు బాగా ఉంచడం, ఏమి ఉంచాలి ? మనం చేసే ప్రతికర్మను ఆయనయందుంచాలి. అంటే మనం చేసే కర్మలు పరమేశ్వరార్పణంగా చేసి, కర్మ ఫలములను త్యజించాలి. (దీనినే నిష్కామకర్మ లేక కర్మయోగ మని అంటారు) మరియు భగవంతునియందు భక్తి ప్రపత్తుల నుంచాలి. మనసు నెప్పుడూ ఆయన యందే ఉంచి ఆయననే స్మరించుతూ ఆయనను గూర్చి మననం చెయ్యాలి. ఇది కూడ ఈశ్వర ప్రణిధానమే. ఇపుడు నియమములను గూర్చి తెలుసుకున్నాం. నియమములు వ్యక్తి శ్రేయ స్సాధకములు. కనుక సాధకుడు వీనిని గూడ నిత్యము అనుష్ఠించాలి.

యమాన్ సేవేత సతతం న నియమాన్ కేవలాన్ బుధ :
యమాన్ పత త్యకుర్వాణో నియమాన్ కేవలాన్ భజన్ ॥ మను. 3-20

యమముల నెప్పుడూ సేవించవలసిందేకాని మానరాదు. కేవల నియమములనే సేవించనురాదు. సంఘశ్రేయస్సును దృష్టిలో నుంచుకొని యమములను పాటించాలి. అలా చేయని సాధకుడు సంఘద్రోహియై పతితుడవుతాడు. అలాగని చెప్పి నియమములను మానరాదు. వ్యక్తి శ్రేయస్సు దృష్ట్యా నియమములనూ సేవించవలసిందే. నేను ధ్యానం చేసుకుంటాను. లేక చదువుకుంటాను. ఇవి నా వ్యక్తిగత శ్రేయస్సుకై చేసే పనులు. దానివలన నితరుల కేమి హానిలేదు. అందుచేత ముముక్షువు కాగోరు నతడు యమ నియమములను రెంటినీ ఆచరణలో పెట్టాలి.

ఇంతవరకు మనం యమనియమాలను గూర్చి చెప్పుకొన్నాం. వీటిని బాగా అభ్యాసంలో పెట్టే కొలది వైరాగ్యం వస్తుంది. ప్రాపంచిక వస్తువులయందు, విషయ సుఖములయందు విముఖత జనిస్తుంది. చూడండి. ఫ్యాన్సీ షాపుల్లో ఉండే వస్తువులు, రబ్బరు పరుపులు (Foam beds) అన్నీ మన ఇండ్లల్లో ఉంటాయి. నిజానికిన్ని వస్తువులు మన యిండ్లల్లో అవశ్యకత లేదు సుఖముల నపేక్షించి వీటిని సంపాదిస్తుంటాము. కాని భోగలాలసులం కారాదని యోగంలో

వృద్ధిపొందే కొలది మనకు తెలుస్తుంది. శరీర సుఖాలే మనగమ్యం కారాదు.

యమ నియమములను గాంధీజీ పాటించాడు. ఆయన సత్యవ్రతమును బాగా ఆచరించాడు 'యే వై అనృతం వదంతి తేవై మనుష్యాః, యే వై సత్యం వదంతి తే వై దేవాః' - అబద్ధం చెప్పినంతకాలం మనుష్యులు మనుష్యులుగానే ఉంటారు. సత్యం చెప్పుతున్నపుడు మనుష్యులు దేవత లనబడతారు. అలాగే గాంధీజీ అహింసాదులను కూడ బాగా సాధించాడు. సంపూర్ణంగా సాధించనప్పటికి తీవ్రంగా కృషి చేశాడు. కాని బుద్ధుడు అహింసావ్రతంలో పూర్ణతను సాధించాడు. ఆయన అజాతశత్రువన బడినాడు.

" అహింసా ప్రతిష్ఠాయాం తత్సన్ని ధౌ వైరత్యాగ ః " యో.ద. 2-35

అతని సమీపంలో జాతివైరంకూడ ఉండేది కాదు. ముంగిసకు పాముకు, పిల్లికి ఎలుకకు, అలాగే పులికి మేకకు పుట్టుకతోనే విరోధం ఉంటుంది. దీన్ని జాతివైరం అంటారు. మన ఋషులు ఆశ్రమాల్లో జాతి వైరం వీడి లేళ్ళు, పులులు కలిసిమెలసి తిరుగుతుండేవని కథల్లో చదువుతాము. బుద్ధుని జీవితంలో యిలాంటి సంఘటనలు ప్రత్యక్షంగాచూడగలం. ఆయన జీవితం కట్టుకథకాదు. అది History (చరిత్ర ప్రసిద్ధమైనది) ఆయన కాలంలో అంగులీమాలు డనే క్రూరుడైన ఒక బందిపోటు దొంగ ఉండేవాడు. అతడు అరణ్యమార్గమునపోయే బాటసారులనుదోచుకోవడమే కాకుండ వారిని చంపి వారి వ్రేళ్ళను నరికి మాలగాచేసి మెడలో వేసికొంటూ ఉండేవాడు. అందుచేత అతనికి అంగుళీమాలుడనే పేరువచ్చింది. అతణ్ణి మార్చవలెనని యెంచి బుద్ధుడు బయలుదేరుతాడు. అనేకులు ఆయనకు అడ్డుతగిలి మీ రచటికి వెళ్ళవద్దు ; వాడు మిమ్ములనుకూడ చంపగలడు. మహాక్రూరుడని చెపుతారు. కాని బుద్ధుడు అతని దగ్గరకు వెళ్ళడానికే నిశ్చయించి వెళతాడు. బుద్ధుడు తనను సమీపించుట చూచి ఆయనను హతమార్చుటకు అంగుళీమాలుడు విల్లునెక్కుపెడతాడు. కాని బుద్ధు డేమాత్రము చలించలేదు. చిరునగవుతో తన కారుణ్య దృక్కులను అంగుళీమాలునిపై బరపుతాడు. అంగుళీమాలుడు భయకంపితుడై గజగజ వణకుచు వచ్చి బుద్ధుని పాదములపై బడి తనను రక్షించుమని వేడుకుంటాడు. తుద కాతడు బుద్ధుని శిష్యులలో ఒకడౌతాడు.

అంతవరకు ఎందుకు - లోకంలో, తల్లి ప్రేమించినట్లు బిడ్డను మరెవరూ ప్రేమించరు. కొడుకుదుష్టుడైనా అతన్ని తల్లి ప్రేమించడం మానదు. ఆ ప్రేమ ప్రభావంవలన ఊరందఱికీ అతడు చెడుగుచేసినా తన తల్లిదగ్గరమాత్రం అది చేయలేడు. కనుక అహింసా వ్రతమునకు ఫలం వైరత్యాగమని బోధపడుతుంది.

తరువాత ఆసనం - "స్థిర సుఖ మాసనం" - (యో. ద.న 2-46) స్థిరంగా, సుఖంగా, ఎక్కువ కాలం ఏ ఆసనంలో కూర్చోగలడో అది సాధకునికి ఉపకరిస్తుంది. ప్రతిదినం అభ్యాసం ఒక నిర్ణీత సమయంలో ఏకాంతంగా చేయాలి. సాధకుడు ప్రతిదినం ఉదయం 4 గంటలకు (బ్రహ్మ ముహూర్తం) నిద్ర మేలుకోవాలి. తరువాత ఆసనబద్ధుడై ఒకచోట కూర్చుండి మొదట ప్రాణాయామం చెయ్యాలి.

ప్రాణాయామము : - ప్రాణాయామమునుగురించి సాధకులలో అనేక అపోహలున్నాయి. ప్రాణాయామముచేయడమే యోగమనియెంచి యిల్లు వాకిలి వదలేవాళ్ళున్నారు. ఇది చాల పొరపాటు. ప్రాణాయామమే యోగ పరమావధికాదు. అది ఒక శారీరిక ప్రక్రియ ,ప్రాణాయామమును Breathing Exercise అంటారు. లేక శ్వాసకోశములకు సంబంధించిన వ్యాయామమంటే సరిపోతుంది. దీనివలన రక్తము శుద్ధమై శరీరము వ్యాధిరహిత మౌతుంది. ఆరోగ్యము కాపాడబడుతుంది. కొంతవరకు చిత్త వేగము కూడ అరికట్ట బడుతుంది. ప్రాణాయామమువలన కలుగు ఫలితమింతమాత్ర ముంటుంది. కాని యోగాభ్యాసి చిత్తైకాగ్రతను మొదట సాధించాలి. మనస్సులో ఈర్ష్యాది దోషములు నశించాలి. అపుడు మనస్సు శుద్ధమౌతుంది. మనస్సు శుద్ధమై ఏకాగ్రత కుదిరినపుడు ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. "కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్" - ఒకానొక ధీరపురుషుడు (ధ్యానశీలుడు) ఆత్మను దర్శిస్తాడు.

సమాధి నిర్ధూత మలస్య చేతసో నివేశితస్యాత్మని యత్సుఖం భవేత్ ।
న శక్యతే వర్ణయితుం గిరా తదా స్వయం తదంతఃకరణేన గృహ్యతే ॥

సమాధిద్వారా, మాలిన్య రహితమైన శుద్ధ చిత్తము ఆత్మయందు ప్రవేశించినపుడు సుఖం కలుగుతుంది. అలా కలిగేసుఖం ఎలా ఉంటుందో

మాటలతో వర్ణించుటకు వీలుకాదు. అది స్వయముగా అనుభవించవలసిందే.

సమాధి అంటే ఏకాగ్రత అని అర్థం. అంతేకాని కాళ్ళు చేతులు విరుగగొట్టి పూడ్చిపెట్టడం సమాధికాదు. (సభలో నవ్వులు) "యోగఃచిత్త వృత్తి నిరోధః" - (యోగ.ద. 1.2.) చిత్తవృత్తులను నిరోధించడమే యోగము లేక సమాధి అనబడుతుంది. చిత్తవృత్తిరెండు విధములుగా ఉంటుంది. బాహ్యము అంతరము నని. మనస్సు బాహ్యవిషయములందు వర్తించడం బాహ్య ప్రవృత్తి. మనస్సును బాహ్యప్రవృత్తులనుండి తొలగించి అంతర్ముఖంచేస్తే అది లోలోపలనే తిరుగుతూ (సంకల్పించుతూ) ఉంటుంది. ఇది అంతఃప్రృవత్తి. సాధకుడు యీ రెండువిధములైన చిత్తవృత్తులను నిరోధించడమే యోగం లేక సమాధి అవుతుంది. ఈ స్థితిలో తానెవరో తెలుసుకుంటాడు. పరమాత్మ అంటే ఏమిటో కూడ తెలిసికొంటాడు. దీనినే అమనస్కస్థితి లేక అమనస్క యోగమని అంటారు. పరమాత్మ స్వరూపం "అవాఙ్మానస గోచరం" - అని సామాన్యంగ అంటుంటారు. ఇది సరికాదు. అది సామాన్యమనస్సునకే అందదు కాని వృత్తిరహితమై నిర్మలమైన మనస్సున కది అందదని అర్థంకాదు. "మనసైవానుద్రష్టవ్యః" - శుద్ధ మనసుతోనే ఆత్మను తెలిసికొనవలసి ఉంటుంది. అది ఎక్కడ తెలుసుకోవాలి. అంటే "స్వయం తదంతః కరణేన" - తనలోనే తెలుసుకోవాలి.

మరి ఆ సుఖం ఎలాంటిది ; అని అడుగవచ్చు. సామాన్యంగా లౌకిక సుఖాలనే వర్ణించి చెప్పలేం. ఆత్మసుఖం చెప్పేదెలా ? తల్లిదండ్రులు ప్రేమాతిశయంతో బిడ్డను ముద్దుపెట్టుకుంటారు. అపుడు వారికొక విధమైన సుఖం కలుగుతుంది. ఆ సుఖం ఎలా ఉన్నదని అడిగితే వారేమని చెబుతారు ? అలాగే, మిఠాయి తింటాం. ఒక విధమైన రుచి అనుభవిస్తాం. ఆ రుచి ఎలా ఉందోచెప్పమంటే మన మేమని చెప్పగలం. చెప్పలేం. మనం చేయగలపని, ఆ మిఠాయిని విరిచి తినుమని చెప్పడం. అంతేగాని యథార్థమైన రుచి ఏమిటో మనం వర్ణించి చెప్పలేం. మనం ప్రతిదినం నిద్రలో సుఖం అనుభవించుచున్నాం. నిద్రపోతున్నంతసేపు మన కేమీ తెలియదు కాని తెల్లవారి మేల్కొన్న తరువాత మాత్రం, నేను రాత్రి హాయిగా, సుఖంగా నిద్ర

పోయాను అని ప్రక్కవారికి చెపుతాము. ఆ హాయి ఎలా ఉంటుందో మాటలతో చెప్పలేం. అది అనుభవింపవలసిందే, పరమేశ్వరుడు ప్రతిదినము యీ సుఖాన్ని సమస్త ప్రాణికోటికి సుషుప్తి అవస్థలో కలిగించుతున్నాడు. కాని మనమా సుఖాన్ని తెలిసి అనుభవించడం లేదు. మనవాళ్ళు గాఢనిద్రలో వున్న వ్యక్తిని మేల్కొల్పబోతే పాపం కలుగుతుంది ఊరుకోమంటారు. అంటే గాఢ నిద్రలో అతడనుభవించే సుఖాన్ని భంగంచేస్తే పాపం కలుగుతుందని వారి అభిప్రాయము. గాఢనిద్రలో పరమేశ్వరుని సుఖం ఎలా ఉంటుందో తెలియకుండానే అనుభవిస్తాం. కాని, ఆ సుఖాన్ని తెలిసి అనుభవించే స్థితి ఒకటుంది. అదే సమాధ్యవస్థ. అది యోగికుంటుంది. యోగి సమాధ్యవస్థలో ఆ సుఖాన్ని తాను తెలిసే అనుభవిస్తుంటాడు. దీనినే ముక్తిసుఖమని కూడ అంటారు. అంటే ముక్తుడైన జీవుడు దేహపాతానంతరం నిరంతరం యిట్టి ఆనందస్థితిలోనే ఉంటాడు. "సమాధి, సుషుప్తి, మోక్షేషు ఏకరూపతా" - (అని సాంఖ్య దర్శనకర్త కపిలుడు. 5-116) అంటే సమాధి యందు, సుషుప్తి యందు, మోక్షమునందాత్మ ఒకేస్థితిలో ఉంటుంది. అయినా సమాధి, మోక్షము యీ రెంటిలో ఆత్మానందాన్ని జీవుడు తెలిసి అనుభవిస్తాడు. సుషుప్తిలో అలాకాదు. మోక్షేచ్ఛ ప్రతివానిలో ఉంది. కాని ఆ ముక్తి సుఖాన్ని ఎలా పొందాలో తెలియకే మానవుడు తంటాలుపడుతున్నాడు. క్షణికములైన యింద్రియ సుఖములే శాశ్వతానందప్రదములను భ్రాంతిలో చిక్కుకున్నాడు మానవుడు. అతడు బాహ్యవస్తువులలో ఏదో సుఖమున్నదనే భ్రమలోపడి వాటిని సంపాదించడానికే జీవితాంతం శ్రమించుతున్నాడు. అలాంటి అజ్ఞానులకు పరమేశ్వరుడు దూరం. కాని, నిజానికి ప్రతియితర వస్తువునకంటె ఆయన మన కతి సన్నిహితుడు. మన భార్యకంటె మన శరీరం దగ్గర మనకు. మన శరీరంకంటె మన మనస్సు మనకింకా దగ్గర. మన మనస్సుకంటెకూడ భగవంతుడు మన కింకా సన్నిహితుడు. మన కాయన అన్నిటికంటె అతి సన్నిహితు డవటం చేతనే ఆయనను మనం తెలుసుకో లేకుండ ఉన్నాం. ఆడవాళ్ళు కంటికి కాటుక పెట్టుకుంటారు. ఆ కాటుక కంటికి అతి సమీపములో ఉంటుంది. కాని, కన్ను దానిని చూడలేదు. కారణం (అతిసామీప్యా దతి

దూరాత్ - అతి సమీపంలో ఉన్నా, అతి దూరంలో ఉన్నా వస్తువును గ్రహించలేము. అలాగే పరమాత్మ మనకు అన్ని పదార్థములకంటె అతి సమీపంలో ఉన్నాడు. కాని, మనస్సులో ఉండే మాలిన్యాలు కారణంగా పరమాత్మను మనం తెలుసుకోలేక పోతున్నాం. పరమాత్మతత్త్వం సర్వవ్యాపకం. అది దండలో దారం మాదిరిగా ఉండదు. పూలదండలో దారం పూలకు లోపలే ఉంటుంది. బయట ఉండదు. కాని, పరమాత్మ తత్త్వం లోపల బైట కూడ వ్యాపించి ఉంటుంది.

అసలు, లోపల వెలుపల అనే భావం స్థూలపదార్థములయందే వర్తిస్తుంది, సూక్ష్మపదార్థములలో యిది వర్తించదు. సూక్ష్మపదార్థం స్థూలములో చొరబడగలదు. మన శరీరం సావయవం - అంటే అవయవములతో కూడినది, స్థూలమైనది. పరమాత్మ నిరవయవం. సూక్ష్మమైనది. పరమాత్మ, సూక్ష్మతత్త్వమైన కారణం చేత స్థూలమైన శరీరంలో కూడ అది వ్యాపించి ఉంటుంది. గోడలో గాలి ఉన్నది, ఆకాశం ఉన్నది. గోడలో రెండు ఉన్నా ఉండటంలో తేడా ఉంది. గాలికంటేకూడ ఆకాశం సూక్ష్మతత్త్వం. అందుచేత ఆకాశం గోడలోని ప్రతి అణువుకు లోపల వెలుపల కూడ వ్యాపించి ఉంటుంది. కాని గాలి అలాకాదు. గోడలో ఏర్పడిన సూక్ష్మరంధ్రములందే అది ఉంటుంది. ఇంకొక ఉదాహరణ చెబుతాను. ఇనుప గుండు ఉంది. అది స్థూలం. అగ్ని దానికంటే సూక్ష్మం. సూక్ష్మమైన అగ్ని స్థూలమైన ఇనుపగుండులో వ్యాపించగలదు. ఇనుపగుండునుబాగా ఎఱ్ఱగా కాల్చామనుకోండి. అపుడు అగ్ని ఇనుపగుండులో ప్రవేశించి దానిలో అంతటా వ్యాపించి ఉంటుంది. మీరపుడు గుండును రెండుగా నరికితే, అగ్ని ఇనుపగుండులో ప్రతి అణువులోను వ్యాపించి ఉన్నట్లు తెలిసికుంటారు. అలాగే పరమాత్మ "తదంతరస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః" - పరమేశ్వరుడు ఓతప్రోతమై (ఓతప్రోతమంటే పడుగు పేక అని. వస్త్రంలోని నిలువు పోగులను పడుగు అని, అడ్డు పోగులను పేక అని అంటారు. నిలువుపోగులు అడ్డుపోగులు కలిసి వస్త్రంగా తయారుచేయబడతాయి. దీన్నే ఓత ప్రోతం అంటారు. లోపల వెలుపల అంతటా ఉన్నాడు. ఇచట లోపల వెలుపల అనే పదాలు వివరించాలి.

అపుడు గాని విషయం పూర్తిగాదు. మనవాళ్ళు విగ్రహారాధన చేస్తుంటారు. భగవంతుడు విగ్రహానికి లోపల వెలుపల కూడ వ్యాపించి ఉన్నాడు. విగ్రహం భగవంతుణ్ణి నియమించదు అంటే తానున్న మేరలో భగవత్తత్వం లేకుండ చేయబడదు. ఉదాహరణకు, సముద్రంలో కడవముంచాం అనుకోండి. నీరు కడవకు లోపల వెలుపల కూడ నిండిఉంటుంది. కాని కడవగా చేయబడిన యిత్తడిలోమాత్రం నీరు చొరలేదు. అలాగే రబ్బరుబంతి ఉంది. బంతిలో గాలి కొట్టామనుకోండి, అపుడు బంతికిలోపల వెలుపలకూడ గాలి ఉంటుంది. కాని రబ్బరులో మాత్రం గాలి ఉండదు. మరి పరమాత్మ తత్త్వం అలాకాదు. అన్ని పదార్థముల్లోను అణువణువునా అది చొచ్చుకుపోయి ఉంటుంది. మరి యిలాగైతే అది ఆకాశపదార్థమా ! అని అడుగవచ్చు. కాని, అది ఆకాశముకంటె కూడ యింకా సూక్ష్మతత్త్వం. ఆకాశం శబ్దగుణం కలిగింది ("అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం తథాఽరసం నిత్య మగంధ వచ్చయత్.... " కఠ. 2. 15. **బ్రహ్మము శబ్ద, స్పర్శ, రూప. రస. గంధము లను గుణములకు ఆస్పదములగు** ఆకాశాది పంచభూతములకు భిన్నమైన సూక్ష్మతత్త్వము. అది నాశము లేనిది) పరమాత్మ అలాంటిది కాదు.

పరమేశ్వరుడు విగ్రహానికి లోపల వెలుపల వ్యాపించి అంతటా ఉన్నాడని మీరంటున్నారు కదా ! మరి విగ్రహాన్ని మనమెందుల కుపాసించరాదు. అని మీరడుగవచ్చు. దానికి నేను విగ్రహాన్ని పూజించితే అది విగ్రహారాధనే అనిపించుకుంటుంది గాని, పరమేశ్వరాధన ఎలా అవుతుంది అంటాను. పరమేశ్వరుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వజగన్నియామకుడు, సూక్ష్ముడు, మరి విగ్రహంలోయీ లక్షణాలేవీ లేవు. అది జడము. మనవాళ్ళు విగ్రహాలకుచేసే పూజా పురస్కారములను ఒకమాటు విమర్శాత్మక దృష్టితో పరిశీలించి చూస్తే నిజానికి వారు పరమేశ్వరుణ్ణి ఉపాసించడం లేదనియు, కేవలం విగ్రహాన్నే పూజించుతున్నారనియు మనకు విదితమవుతుంది.

విగ్రహారాధన చేసేవాళ్ళు ఏమిచేస్తారు ? తమ యిష్టదేవతను విగ్రహంలోనికి ఆవాహనంచేస్తారు. ఆవాహనమంటే పిలవడం. తరువాత

షోడశోపచారాలుచేస్తారు. షోడశోపచారాలంటే ఏమటి ? చూడండి, మన యింటికి బంధువులు వస్తారు. వారిని లోపలకురండీ అని మర్యాదచేసి పిలుస్తాము. లోపలకు వచ్చిన తరువాత అందరూ బాగున్నారా అని కుశల ప్రశ్నలు వేస్తాం. కాళ్ళు కడుగుకోవడానికి నీళ్ళు (పాద్యం) యిస్తాము. తరువాత కూర్చోండి అని ఆసనం యిస్తాం. మీకు మంచినీరు కావాలా అనిఅడిగి అవశ్యకమంటే త్రాగడానికి మంచినీళ్ళు యిస్తాం. స్నానం చేయుమని నీళ్ళుతోడి వస్త్రం యిస్తాం. స్నానమైన తరువాత, లక్షణంగా భోజనం పెడతాం. భోజనానంతరం తాంబూలం యిస్తాం కొలది సేపు విశేషాలు మాట్లాడుతాం, తరువాత, మీరు చాలదూరంనుండి వచ్చారు, పాపం అలసిపోయినట్లున్నారు, కొంచెం సేపు విశ్రాంతి తీసికోండి అని పడక వేస్తాం. రెండుమూడు రోజులు చూస్తాం. తరువాత, మీరేం పనిమీద వచ్చారు ? పని అయిపోయిందా, సరే యిక వెళ్ళండి అంటాం (సభలో నవ్వులు). అలాగే, ఆవాహనం దగ్గరనుండి ఉత్సర్జనం వరకూ చేసిన మర్యాదలు షోడశోపచారాలు, ఇవన్నీ కూడ దేవుని పేరుతో విగ్రహానికి చేస్తారు. అవాహనం చేసినపుడు దేవుడువచ్చి విగ్రహంలో కూర్చుంటాడట, మళ్ళీ, ఉత్సర్జనం చెప్పగానే ఆయన విగ్రహం విడిచి వెళ్ళుతాడట. (ఉత్సర్జనం అంటే విడిచిపెట్టడం) నిజంగా ఆవాహనం చేసినపుడు దేవుడు వచ్చి విగ్రహంలో కూర్చుంటే విగ్రహం చైతన్యవంతమై కదలినట్లుగాని, మాట్లాడినట్లుగాని కనబడాలి. కాని అదేమి లేదు. సర్వవ్యాపకుడైన పరమేశ్వరుడు విగ్రహంలోకి ఎలావచ్చి కూర్చుంటాడు ? అసలు అంతకుముందు తాను విగ్రహంలో లేకపోతేగదా, వీళ్ళు అవాహన చేయగానే వచ్చికూర్చోడానికి? మళ్ళీ, వెళ్ళిపో (ఉత్సర్జనం) అనగానే ఆయన విగ్రహం విడిచి వెళ్ళుతాడట. ఎక్కడకు వెళ్తాడు ? సర్వవ్యాపక పదార్థం ఎక్కడికి కదులుతుంది ? ఎక్కడికి పోతుంది ? వీళ్ళు రమ్మని పిలువగానే రావడానికి యిక వెళ్ళిపో అనగానే వెళ్లడానికి భగవంతుడేమైనా నౌకరా ? చాకరా ? ఆయన కింకేమి పనిలేదా ? ఊరికే అటుయిటు తిరగడమేనా ? గుడి ఒకటి కట్టి దానిలో రాతివిగ్రహం పెట్టి దేవుణ్ణి ప్రతిష్ఠ చేస్తున్నాం. అంటారు ? వీళ్ళు సర్వవ్యాపకుడైన భగవంతుణ్ణి అచట ప్రతిష్ఠచేసేవాళ్ళా ! గుడి తలుపులుమూసి ఆయనను బంధిస్తారా ? రాతి

విగ్రహం కనక ఉలకదు, పలకదు. అందుచేత గుడికి తాళం వేసినా ఊరుకుంటుంది, ఉక్కపోసినా ఊరుకుంటుంది. (సభలో నవ్వులు) విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేస్తున్నాం అంటాడు. దీనిలో ఏమైనా అర్థముందా ? నిజంగా విగ్రహానికి ప్రాణమేవచ్చి, భక్తులు సమర్పించే నైవేద్యాలు తినడం మొదలుపెడితే, అసలు పూజారులకేమైన మిగులుతుందా అని. రాళ్ళు దేవులైన రాసులు మ్రింగవా' అన్నాడు వేమన (సభలో నవ్వులు). ఆకలిగొన్నవాడికి పట్టెడన్నం పెట్టం, గుడిగోపురాలకు ఎంతైనా ఖర్చు చేస్తాం. ధార్మికతంటే యిదేనా ? దేవుణ్ణి స్నానం చేయించుతున్నాం అని చెప్పి (విగ్రహానికి) మూతితుడుస్తారు, ముక్కు తుడుస్తారు. కళ్ళు, ఒళ్ళు కడుగుతారు. దేవుడు మైలపడతాడా ? నిజానికి దేవుడే మైలపడితే ఆయన్ను నిర్మలం చేసేవాళ్ళమా? (సభలో నవ్వులు) మన యిండ్లలో చిన్నపిల్లలు పెండ్లిండ్ల ఆట ఆడుతుంటారు. బొమ్మలన్నీ ఒకచోట పెట్టి ఒకబొమ్మకు తాళిబొట్టుకట్టి యిది పెళ్ళికూతురంటారు. ఇంకొక బొమ్మను పెండ్లికొడుకును చేస్తారు. పెండ్లయిన తరువాత యీ రెంటిని ఒకచోట పడుకోబెట్టి పెండ్లికొడుకు పెండ్లికూతురు యిపుడు ఏకాంతసేవలో ఉన్నారని చెప్పి ఇలా ఆటలాడుతుంటారు. అలాగే మన ఆలయాల్లో దేవుళ్ళకు పాపం నిత్యం పడకలు, ఏకాంతసేవలు ఏర్పాటు చేస్తుంటారు పూజారులు ! విగ్రహాలను ఒకచోట పడుకోబెట్టి వింజామరలు వీస్తుంటారు జోలలు పాడి దేవుళ్లను నిద్రపుచ్చుతారు. మళ్ళీ మేలుకొలుపులు పాడుతుంటారు, తెల్లవారింది యికనైనా లెమ్మని ! మరి దేవుడు అంత మొద్దునిదుర పోతాడు కాబోలు (సభలో నవ్వులు) ("య ఏష సుప్తేషు జాగర్తి కామం కామం పురుషో నిర్మిమాణః . . . " కఠ. 5-8) భగవంతుడు నిత్య జాగరూకుడు, అనుక్షణం ఆయన సర్వం గ్రహించుతుంటాడు" అని మనకు వేదశాస్త్రాలు బోధిస్తుంటే వీళ్ళు ఆయనను నిద్రపుచ్చనిదే వదలి పెట్టరు. మళ్ళీ ప్రతిరోజూ మేలుకొలుపులు పాడవలసిందే. ఇంకొక విశేషం. మనవాళ్ళు దేవుళ్లకు ప్రతియేటా పెండ్లిళ్ళు చేస్తుంటారు. అపుడు అమ్మవారికి మెడలో పూజారే తాళి కడుతుంటాడు : పాపం : దేవుడేమీ పట్టించుకోడు. ఎవరు కట్టితే ఏమి పోయిందిలే తాళి అనుకుంటాడో ఏమోమరి. ఇలా ప్రతియేటా దేవునికి

పెండ్లి చేస్తుంటారు. ఆయన భార్యకు ఏటా విడాకులిస్తాడో ఏమో : (సభలో నవ్వులు)

ఇలా దేవుణ్ణి మనవాళ్ళు ఒక పెద్ద సంసారిని చేసి పెట్టారు. సృష్టి స్థితి లయ కారకుడు, సర్వజ్ఞుడు అయిన భగవంతుణ్ణి ఎంత అధమ స్థితికి దిగలాగారో చూడండి. అసలైన పరమేశ్వరుణ్ణి మరచి, విగ్రహాది జడమూర్తులను ఎలా పూజిస్తున్నారో చూడండి. నిజానికి విగ్రహారాధన ఒక విధంగా చూస్తే ఆత్మవంచన కూడ.

అందుచేత పరమేశ్వరుని తత్త్వ మేమిటో, ఆయన స్వరూప స్వభావాలేమిటో అనుభవ పూర్వకంగా తెలిసికోవాలంటే, యోగమార్గం అనుష్ఠించాలి. యమ నియమాదులను ఆచరించడమే ముక్తికి మార్గం. ఇక వేరే మార్గం లేదు. 'నా z న్యః పంథా విద్యతే అయనాయ ' - పరమాత్మ జ్ఞానానికి ఖ్మించి తరించడానికి వేరు మార్గం లేదు. మిగిలింది రేపు .

గుంటూరు, 29-12-1968

ఆదివారం, సా. 6-00 గం॥

మహాజనులారా !

"తదేజతి తన్నైజతి...." అనే మంత్రంలో పరమేశ్వర తత్త్వాన్ని గురించి నిన్న కొంతవఱకు చెప్పుకున్నాం. ఇపు డింకొక మంత్రం చెప్పుకొందాం.

యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యే వానుపశ్యతి .

సర్వభూతేషు చాత్మానం తతో స విచికిత్సతి ॥ 6

భావార్థము : సర్వవ్యాపియు, న్యాయకారియు, సర్వజ్ఞుడు, సనాతనుడు, సర్వాత్మయు, అంతర్యామియు, సర్వద్రష్టయు నగు పరమాత్మను గుర్తించి సుఖ దుఃఖము లందును, హాని లాభము లందును తనతో తుల్యముగ ఎల్ల ప్రాణములను ఎఱుంగు విద్వాంసుడు ధార్మికుడగును. అతడే మోక్షమున కర్హుడగును. ముక్తుడగును.

భూతము అంటే తయారయిన వస్తువు. 'భూ' ధాతువున కర్థము ఉనికి. చేతనా చేతనములు, స్థావరజంగమములు యివన్నీ భూతములనబడతాయి. వీటిలో పరమేశ్వరుడు వ్యాపించి ఉన్నాడని తెలుసుకోవాలి. మనకు ఈ సృష్టిని

గూర్చి , పరమేశ్వరుని గూర్చి చాల సందేహాలు కలుగుతాయి. పరమేశ్వరుడు సర్వవ్యాపకుడవునా, కాదా ! సర్వజ్ఞుడవునా, కాదా ! అనునివి సందేహాలు.

కర్తలేనిచోట కార్యము జరుగదు. ఈ సృష్టికార్యము అణువులు మొదలు బ్రహ్మాండము వరకు అంతటా జరుగుచున్నది. కాబట్టి దీనికర్త అయిన పరమేశ్వరుడు అంతటా వున్నాడని నిన్న తెలుసుకున్నాం, మనుష్యుడు తానెంతటి విజ్ఞానియైనా అతనికి అన్ని విషయాలు తెలియవు. అతని విజ్ఞానంలో పూర్ణత ఉండదు. పరమేశ్వరుడు ఒక్కడే సంపూర్ణజ్ఞాని. మనకు బొత్తిగా తెలియని విషయంలోగాని పూర్ణంగా తెలిసిన విషయంలోగాని సందేహం కలుగదు. కొంత తెలిసి, కొంత తెలియని విషయంలో మనకుసందేహం కలగడానికి కారణం ఆయనను గూర్చి మనకు స్వల్పంగా తెలుసు. చాల భాగం తెలియదు. కావున పరమేశ్వరుని విషయమున సందేహాలు కలుగును. సందేహ నివృత్తికై యత్నించువాడు యమ నియమాలతో పాటు - శమము, దమము, తితిక్ష, ఉపరతి అను నవియు సంపాదించాలి.

శమము, దమము రెండూ ఇంద్రియ నిగ్రహానికి సంబంధించినవి. దమము - బాహ్యేంద్రియ నిగ్రహము, దమము అంటే అణచుట అని అర్థం. నేత్రాది జ్ఞానేంద్రియములను, వాక్కు, మొదలైన కర్మేంద్రియములను నిగ్రహించుట దమము. బాహ్యమున ఉన్న ఇంద్రియములు కాక లోపల ఇంకొక ఇంద్రియము కూడ ఉంది. అది మనస్సు అది మహావేగవంతమైనది. దానిని నిగ్రహించడం 'శమము అనబడుతుంది. ఇంద్రియ జయము ఒకనాటితో చేకూరునది కాదు. అంత సులభము కాదు. నిరంతరం దీర్ఘకాలం సాధనం చెయ్యాలి. దీర్ఘకాలమంటే యావజ్జీవితమునని, అప్పుడప్పుడు చేసే సాధనల వలన ఇంద్రియములు మనకు లోబడినట్లు కనబడినా, మనకు సంపూర్ణ ఇంద్రియ నిగ్రహం కలిగిందని భ్రమ పడరాదు. ఇంద్రియములు మనలనెప్పుడు బోల్తా కొట్టించుతాయో తెలియదు. నిరంతరం చాల జాగరూకులమై ఉండాలి.

మనసు వాయువువలె అతి చంచలమైంది. దానినెలా నిగ్రహించాలి? అని అర్జును డడిగితే కృష్ణు డంటాడు.

అసంశయం మహాబాహో ! మనో దుర్నిగ్రహం చలమ్,

అభ్యాసేన తు కౌంతేయ ! వైరాగ్యేణ చ గృహ్యతే ॥ గీ. 6-356

అర్జునా ! మనస్సును నిగ్రహించుట సులభము కాదని నీవు చెప్పిన దానిలో సందేహం ఏమాత్రం లేదు. దానిని నిగ్రహించుట అత్యంత కఠినమే. కాని అభ్యాస వైరాగ్యముల వలన దానిని వశపఱచు కొనవచ్చును. అంటాడు కృష్ణుడు. అందుచేత మనస్సును నిగ్రహించడం కష్టం కావచ్చు గాని "అసంభవం" మాత్రం కాదని మనం గుర్తుంచుకోవాలి.

ఒక మిత్రుడు నన్నడిగాడు. ఏమండి ఆకారంలేని వస్తువును గూర్చి మనం ధ్యానమెలా చెయ్యగలం ? ఒక రూపము ఉంటేగదా మనస్సును దానిపై నిలుపగలం అన్నాడు. సామాన్యంగా యీ సందేహం గుళ్ళు గోపురాలకు వెళ్ళేవారికి కలుగవచ్చు. మనోనిగ్రహం అంటే ఏమిటి ? మనస్సును కదలకుండా చెయ్యడం. మీరు ఏ విగ్రహంపైనో దృష్టి నిలిపారనుకోండి, అపుడేమవుతుంది. మనసు ద్వారా బొమ్మను చూస్తారు. అప్పుడు బొమ్మ కళ్ళు, ముక్కు, చెవులు, ఇతరావయవాలు అన్ని కనబడతాయి. అప్పుడు మనసుకు ఏకాగ్రత యెక్కడ కలిగింది ; కనుక అసలు మనస్సును దాని స్థానమునుండి బయటికి కదలనీయకుండా ఉంచటం మనోనిగ్రహం అవుతుంది.

భగవద్గీతలో నిత్యాభ్యాసాన్ని గుఱించి ధ్యానయోగంలో యిలా చెప్పారు.

శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిర మాసన మాత్మన :
నా త్యుచ్ఛ్రితం నాతి నీచం చైలాజిన కుశోత్తరమ్ ॥ గీ. 6-11
తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియ క్రియ :
ఉపవిశ్యాసనే యుంజాద్ యోగమాత్మ విశుద్ధయే ॥ గీ. 6-12
సమం కాయ శిరోగ్రీవం ధారయన్నచలం స్థిర : ॥
సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥ గీ. 6-13

'యోగం యుంజ్యాత్' - నిత్యం యోగం చెయ్యాలి. మనసును పవిత్రం చేసుకోవాలి. ఏకాగ్రత నలవఱచుకోవాలి. అపుడు మనస్సు ద్వారా సూక్ష్మ వస్తుజ్ఞానం కలుగుతుంది. అంతేగాని నిత్యం "ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యయుత్సవః మామకా : పాండవాశ్చైవ కి మకుర్వత సంజయ"(ఈ శ్లోకాన్ని శ్రీ గోపదేవ్ గారు పెద్దగా కంఠం యెత్తి ఒకలయలో విలక్షణంగా

ఉండేట్లు చదివారు, సభికులలో నవ్వులు వినయ్యెను) అని పెద్దగా చదివి నందువల్ల మోక్షం వస్తుందని కొంద రెంచుతారు. శ్లోక పఠనం వల్ల ముక్తిరాదు. 'శుచౌ దేశే - యోగాభ్యాసం చెయ్యడాని కనువుగా యింట్లో నొక ప్రత్యేక స్థలం ఉండాలి. అది పరిశుభ్రంగా ఉండేట్లు చూచుకోవాలి. స్థిరం ఆసనం ప్రతిష్ఠాప్య' - అక్కడ కదలకుండా ఉండే ఆసనాన్ని ఏర్పాటుచేసుకొని ఎక్కువసేపు కూర్చుండుటకు ప్రయత్నం చెయ్యాలి. తూగుటుయ్యాలలు, ఈజీచైర్లు యివి పనికిరావు (సభలో నవ్వులు). చైలాజిన కుశోత్తరమ్ ' - ఆ ఆసనంపై వస్త్రము, మృగచర్మము దర్భలు వరుసగా ఒకదానికంటే మఱియొకటి క్రింద ఉండేట్లు వేసికోవాలి. మృగచర్మమునకు బదులు కంబళి పఱచుకోవచ్చు. (మృగచర్మము స్వయంగా చచ్చిన లేడిదైతే వాడాలి) నాత్యుచ్ఛ్రితం నాతినీచం - ఆసనం ఎక్కువ ఎత్తుగాగాని మరీ గుంటలో గాని ఉండరాదు. ఎత్తుబల్లపై యోగంచేస్తే నిద్రవచ్చినపుడు పడితే పళ్ళూడతయ్ (సభలో నవ్వులు). మరీ గుంటలోనేమో వేడి ఎక్కువవుతుంది. కనుక సమతలముగా నున్న ఆసనముపై కూర్చోవాలి. ఆసనాలు చాలా ఉన్నాయి. శరీరారోగ్యానికి పనికివచ్చే ఆసనాలు కూడ ఉదయం కొలదిసేపు అభ్యసించవచ్చు. ఇవిగాక అసలు ముఖ్యమైన ఆసనాలు రెండున్నాయి. సిద్ధాసనం, పద్మాసనం. ఈ రెంటిలో ఎక్కువకాలం సుఖంగా కూర్చుండుటకు తనకు యోగ్యమైన ఆసనమేదో సాధకుడు నిర్ణయించుకోవచ్చు. అలా నిర్ణయించుకొని నిత్యం ఆ ఆసంలోనే కూర్చుండి యోగం అభ్యాసం చేయాలి. కనీసం, తక్కువలో తక్కువ ఒక అఱగంటైనా కదలకుండాకూర్చుంఢ కలిగే స్థితి సంపాదించాలి. ఎక్కువలో ఎక్కువ 3 గంటలవరకు కూర్చోవచ్చు. మొదటిరోజు అయిదు నిమిషాలతో ప్రారంభించి క్రమంగా అఱగంటవఱకు ఆసనములో కదలకుండా కూర్చొన గలిగే స్థితి సంపాదించాలి. యోగాభ్యాసంలో అభిరుచి కలిగే కొలది యింకా కాలం పొడిగించవచ్చు. ఇది మెల్ల మెల్లగా సాధించాలి. అంతేగాని మొదటిరోజే 2 గంటలసేపు ఆసనంలో కూర్చొని కాళ్ళు నొప్పులు పుట్టినవని చెప్పి, గోపదేవ్ గారు చెప్పిన యోగాభ్యాసం కష్టమే ననుకొని అసలు అభ్యాసం చెయ్యడం మానరాదు (సభలో నవ్వులు). 'సమం కాయం శిరోగ్రీవం ధారయ న్నచలం స్థిరః'

- శిరస్సు, మెడ, మేరుదండము (వెన్నుపాము) వీనిలో వంపులేకుండా సమంగా ఉండేట్లు కూర్చోవాలి. మేరుదండములో వంపు వుండరాదు. వంపుంటే వంకర ఆలోచనలు వస్తాయి. నిటారుగా కూర్చోవాలి.దిశ శ్చానవలోకయన్' - దిక్కులేమి చూడరాదు. 'సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం' - నాసికాగ్రమంటే ముక్కు చివరి భాగం భ్రూమధ్యముగాని, ముక్కుకొనగాని, యీ తావులందు ఏదో ఒకచోట, ప్రేక్ష్య - చూడాలి, 'సంప్రేక్ష్య' - అంటే యింకా బాగా చూడాలి. కాని ఎవరిముక్కు ? బొమ్మనో లేకపోతే పటములో ఎదురుగా పెట్టుకొని దాని ముక్కుచూడరాదు. లేక భార్యను పిలిచి, ఏమే ! కాసేపు నీవు అలా ఎదురుగా కూర్చో. నీ ముక్కు చూస్తూ నేను ధ్యానం చెయ్యాలి. అనిచెప్పి భార్యభర్తలు ఎదురెదురుగా కూర్చుండి పరస్పరం ముక్కులు చూచుకోడం కాదు (సభలో నవ్వులు), స్వం నాసికాగ్రం - అందుకనే తన ముక్కుకొననే చూడుమన్నాడు. అలా చెప్పకపోయినట్లయితే, భార్యలేని నాబోటివాడి గతేంకాను (సభలో నవ్వులు) అలా తన నాసికాగ్రాన్ని చూస్తూ, యత చిత్తేంద్రియ క్రియః' - ఇంద్రియములయు మనస్సుయొక్కయు వ్యాపారములు కట్టిపెట్టి, న కించి దపి చింతయేత్ - ఏమీ చింతించరాదన్నాడు. చింతించడం అంటే ఆలోచించడం మనస్సులో ఏవిధమైన వృత్తులు (సంకల్పములు లేకుండ ఉండటం). ఇది అసలు యోగం చెయ్యవలసిన పద్ధతి. మన యోగులు మనస్సును ధారణ చేయుటకు (నిలుపుటకు) శరీరంలోకొన్ని ప్రదేశాలు చెప్పారు. భ్రూమధ్యం, హృదయం. కంఠం, నాభి, శిరస్సున్నూ. ఈతావుల్లో ఎక్కడైనా మనస్సును నిలుపుటకు అభ్యాసం చెయ్యవచ్చు.

తితిక్ష: తితిక్ష అంటే ద్వంద్వసహనము. శీతోష్ణములు, లాభాలాభములు, జయాపజయములు, సుఖదుఃఖములు, యిలాంటివన్నీ ద్వంద్వములు, వీటిని సహించేగుణం మనలో వృద్ధిచేసుకోవాలి. బాగా సంతోషం కలిగినా బాగా దుఃఖం కలిగినా మనకు కండ్లవెంట నీళ్ళు వస్తాయి. ఇవి రెండూ వికారాలే. మనం వీటికి లోనుకాగూడదు. ద్వంద్వాదులను సమానంగా అనుభవించడం అలవాటు చేసికోవాలి. మనకేదైనా కష్టమొస్తే యిరుగు, పొరుగు వారిని కూడ నిద్రపోనియ్యం, ఏడుపులు పెడబొబ్బలు పెడతాం. (సభలో నవ్వులు) సుఖం వచ్చినా దానిని ఇతరులకు తెలుపకుండా ఉండలేము.

ఉపరతి : - ఉపరతి అంటే వైరాగ్యం అని అర్థం. నిర్లిప్తుడై ప్రపంచమునందు వర్తించడం వైరాగ్యం అవుతుంది. ఇవన్నీ గుర్తుపెట్టుకుని సాధించాలి. ఇవి సాధించితే ఆత్మదర్శనానికి యోగ్యుడవుతాడు.

మనకు ఆత్మ దర్శనం ఎందులకని కావడం లేదు ? మనస్సులో మాలిన్యములున్నందున. అ మాలిన్యము లేవి ? ఈర్ష్య, పరాపకార బుద్ధి, అసూయ, అసహనము, ఇవి మనసులో లేకుండా చేసుకోవాలి. అపుడు మనస్సు పవిత్రమై ఆత్మదర్శనానికి యోగ్యమై ఉంటుంది. మొదటిది ఈర్ష్య, తోటి వాళ్ళకు తనకంటె ఎక్కువ సంపదలుంటే మనుష్యుడు ఈర్ష్య పడతాడు. ఈ దుర్గుణాన్ని జయించడం ఎలా ? తోటి వారితో (మైత్రీ కరుణా ముదితో పేక్షాణాం సుఖదుఃఖ పుణ్యా పుణ్య విషయాణాం భావనా తశ్చిత్త ప్రసాదనమ్ ॥ యో. ద. 1-33) మైత్రి కలిగి యుండటమే దీనిని జయించడానికి ఉపాయం. మిత్రుని అభివృద్ధికి ఓర్వలేక స్నేహితు డుండడు గదా ! తరువాత పరాపకారబుద్ధి, బాధలుపడే వాళ్ళను (దుఃఖితులను) చూచి దయ కలగాలి. దీనినే కరుణ అంటారు. వారికి ఆర్థికంగాగాని, శారీరికంగాగాని చేతనైనంత సహాయం చెయ్యాలి. కనీసము మాటలతోనైనా వారిని ఓదార్చాలి. అపుడు వారికి కొంత బలం వస్తుంది. నాకేమిలే అని పట్టించుకోకుండ ఉండటం భావ్యం కాదు. ఇతరులకు మేలు చేసే వానికి యితరులు కూడ మేలు చేస్తారు. ఇలా చేయడం వల్ల పరాపకారబుద్ధి తొలగుతుంది. తరువాత అసూయ, సుఖపడే వాళ్ళను చూచి సంతోషించాలి. కాని తన కది లేదని అసూయ పడరాదు. ఇలా సంతోషించడాన్ని మోదం అంటారు. ఈ గుణాన్ని వృద్ధిచేసుకున్నందువల్ల చిత్తంలో అసూయ అనే మాలిన్యం తొలగుతుంది. మన మిత్రులుగాని, బంధువులుగాని సుఖసంతోషాలతో ఉంటే మన మెంతో ఆనందిస్తాము గదా ! తరువాత అసహనం, దుష్టులను చూచినపుడు అసహనము(అమర్షము) కలుగుట లోకసామాన్యము. ముముక్షువు ఒకటి గుర్తుంచుకోవాలి. అతడు దుష్టులకు దూరంగా ఉండాలి. దీనిని 'ఉపేక్షా భావం అంటారు. ఈ ఉపేక్షాభావం వలన, అసహనమనే చిత్తమాలిన్యం తొలగుతుంది. సాధకు డీవిధంగ ప్రపంచంలో వర్తించడంవల్ల మనస్సు పవిత్రమౌతుంది. అపుడు బాహ్యావృత్తులు నశించి మనస్సు నిలుస్తుంది. అది ఒకటే ఉపాయం. మోక్షఫలం

కోరినవారు వీనిని తప్పక ఆచరించాలి. ఇలా మనస్సు పవిత్రమైనపుడు దానికి సూక్ష్మవస్తువును గ్రహించే శక్తివస్తుంది. దానితో ఆత్మను దర్శించగలడు. దర్శించడ మంటే అనుభవించడం. స్వయం తదంతఃకరణేన గృహ్యతే' ఆత్మపదార్థమును ఎవరికి వారు స్వయంగా తమ అంతఃకరణము ద్వారా తెలిసికోవలసిందే - అనుభవించవలసిందే. 'యస్తు సర్వాణి భూతాని ఆత్మన్యేవానుపశ్యతి - సర్వభూతములలో ఉన్న వ్యాపక తత్త్వాన్ని ప్రతిక్షణం గుర్తించాలి. ఇదే ఉపాసన అని చెప్పుకున్నాము.

తరువాత ప్రార్థన అంటే ఏమిటో యిపుడు చెప్పుకుందాం. అర్థన అంటే కోరడం. ప్రార్థన అంటే బాగా కోరడం. మనుష్యుడు దేనిని కోరతాడు. తన దగ్గర లేనిది, తనకు తక్కువగా ఉన్నది కోరతాడు. ధనం లేని వాళ్లు ఉన్నవాళ్ళను కోరి ధనం తెచ్చుకుంటారు. కాని, నిజమైన వైదికుడు భగవంతుణ్ణి వెండి బంగారములు అడుగడు. సంపదలు కోరడు, అడిగినవాళ్ళకు సాయిబాబా కాసులు యిస్తాడట. అవి ఎలా యిస్తాడు ? తనవద్దనున్న కాసులనే, మీకు కనబడకుండ యిస్తాడు, మఱి ఆ యిచ్చే కాసులయిపోతే ఆయన యింకేంచేస్తాడు ? భగవంతుని స్థితి అలాలేదు. పరమేశ్వరుడు యీ భూమిలో రత్నములు, వెండి, బంగారము మొదలైన విలువైన సంపద లుంచాడు. మనకు బుద్ధికూడ ఇచ్చాడు. ఆ బుద్ధితో నివి సంపాదించడానికి ప్రయత్నం చెయ్యాలి. అంతేగాని, భౌతికపదార్థాల నిమ్మని భగవంతుణ్ణి అడగడం ప్రార్థన కాదు. మనం నిత్యం సంధ్యలలో భగవంతుని యిలా ప్రార్థిస్తాము.

ఓం భూర్భువః స్వః తత్సవితు ర్వరేణ్యమ్ ।
భర్గో దేవస్య ధీమహి, ధియో యో నః ప్రచోదయాత్ ॥

యజు - 3, ఋ. 3-6-2-10.

ఇది నిచృత్ గాయత్రీమంత్రము. యజుర్వేదములోనిది, దీనిలో 23 అక్షరాలుంటాయి. 3 పాదాలుంటాయి, ఈ మంత్రం గాయత్రీ ఛందస్సులో ఉంది. పూర్వం చిన్ననాడే యీ మంత్రాన్ని గురువులచేత పిల్లలకు చెప్పించేవాళ్లు. పెద్దవాళ్లకు కూడ యిపుడిది తెలియదు. అసలు శూద్రాదులు యీ మంత్రాన్ని వినరాదు ; స్మరింపరాదు ; అని కొందరు స్వార్థపరులు యిప్పటికి ప్రచారం

చేస్తునేఉన్నారు. ఇది అందఱు గర్హింపదగ్గ విషయం. ఈ మంత్రంలో ఉన్నదేమి ? ఓం, భూః, భువఃస్వః. ఇవి పరమేశ్వరునికి వాడబడిన పదాలు. 'ఓం.' అంటే రక్షకుడు. 'భూః' అంటే ఉనికికలవాడు, భువః, అంటే కేవలం జ్ఞానస్వరూపుడు. స్వరూపమంటే ఆకారమనికాదు. డెఫినిషన్ (Definition) అంటే పెద్దగా చిక్కులేదు. సంస్కృత భాషలో దీనిని 'లక్షణం' అంటారు. పరమేశ్వరుని లక్షణం జ్ఞానం (చిత్) అని. తరువాత స్వః - అంటే ఆనందం, మన సుఖానికిఆయన సుఖానికి తేడా ఉంది. ప్రాకృతిక పదార్థాల సంయోగం వలన కలిగే సుఖం మనది. ఆయన సుఖం అలాంటిదికాదు. అది ఆనందం; నిత్య సుఖం. కనుక ఓం, భూః, భువః, స్వః అను యీ పదాల్లో మనమేం తెలుసుకుంటాం ? పరమేశ్వరుడు సత్, చిత్, ఆనందస్వరూపుడని. 'సత్' అంటే పరమేశ్వరుడు కేవలం సత్తామాత్రుడని, ఆయన ఉనికి భూత భవిష్యత్ వర్తమాన కాలముల మూడింటిలో కూడ ఉంటుందని, ఆయన ఒకప్పుడుండి యింకొకప్పుడు లేకుండా ఉండనివాడు కాదని మనం గ్రహించుతాం. తరువాత చిత్. చిత్ అంటే పరమేశ్వరుడుకేవలం జ్ఞానస్వరూపుడని, ఆయనలో అజ్ఞానం అణుమాత్రం కూడ లేదు. ఆయన కేవలం జ్ఞానస్వరూపుడు. ఆయన కేవలం ఆనందరూపుడు కూడ. దుఃఖం ఆయనలో లేదు.

ఈ మంత్రం రెండుమూడు మారులుచెబితే మీకు వస్తుంది. కొందఱికి యిప్పటికే వచ్చి ఉంటుందనుకుంటాను. ఈ మంత్రమును ప్రచారముచేసిన ఋషి-విశ్వామిత్ర మహర్షి. ఈ మంత్రమునకు అంటే విషయము సవిత. ఛందస్సు-గాయత్రి. సవితా అంటే లౌకిక భాషలో సూర్యుడంటారు. కాని వైదికభాషలో ప్రపంచాన్ని సృష్టించేవాడు అని అర్థం. ఇది తెలియక యీ మంత్రం చదువుతూ చాలమంది సూర్యుడికి అర్ఘ్యం యిస్తారు.

ఇది సూర్యునికి సంబంధించిన మంత్రం కాదు. పరమేశ్వరుని ధ్యానించే మంత్రం. దీనిని సావిత్రీమంత్రమని కూడ అంటారు. 'తత్ వరేణ్యం భర్గః' శ్రేష్ఠమైయొప్పు జ్ఞానానందాదిరూపం వరింపదగినది. 'వయం ధీమహి' - అట్టి పరమాత్మ స్వరూపమును మేము ధ్యానింతుము. 'ధియో యోనః' - (ఆయన) మా బుద్ధులను 'ప్రచోదయాత్' - ప్రేరేపించును గాక! అంటే మనమీ

మంత్రంలో పరమేశ్వరుణ్ణి జ్ఞానమిమ్మని కోరతాం. ఇది వైదికులు పరమేశ్వరుని గూర్చి చేసే ప్రార్థన. ప్రపంచంలో మరేమతంలోను యిలాంటి ప్రార్థన చూడము. ఒక్క వైదిక మతస్థులే జ్ఞానము నిమ్మని భగవంతుని ప్రార్థిస్థారు. ఇది గుర్తుంచుకోవాలి.

మహమ్మదీయులు చేసే భగవత్ ప్రార్థన ఏమిటి ? - లా ఇలాహీ యిల్లిల్లాహ మహమ్మదుర్‌రసూలల్లాః' - అంటే ఏమిటి ? అల్లాతప్ప మరొకటి లేదు' మహమ్మదు సందేశహరుడు (పైగంబర్) దీనిని మహమ్మదీయులు 'పాకేకలాం- పవిత్రవాణి అంటారు. మఱి యీ ప్రార్థనలో భక్తుడు భగవంతుణ్ణి ఏమి కోరుతున్నాడో తెలియదు. క్రైస్తవులు భగవంతు నిలా ప్రార్థిస్తారు Our Father which are in heaven, Hallowed be thy name. thy kingdom come. thy will be done in earth, as it is heaven, Give us this day our daily bread" - New Testment, Mathai 6-10 పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధపఱచబడుగాక! నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక ! అని ప్రార్థిస్తారు. 'మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము' అని అడుగుతారు. ఇక బౌద్ధులకు, జైనులకు అసలు దేవుడు లేడు. కనుక వారు ప్రార్థన చేయరు. ఆహారపదార్థాల కొరకు భగవంతుని ప్రార్థించు నావశ్యకత లేదు. అవి డబ్బిస్తే లభ్యమవుతాయి. కాని జ్ఞానం మనకు బజారులో దొరకదు. అందుచేత మనం భగవంతుణ్ణి జ్ఞానమిమ్మనే ప్రార్థిస్థాం.

ఇంకా ఏమని మనం భగవంతుని ప్రార్థిస్తాం. ఓజో z సి, ఓజో మయి ధేహి - వీర్యంకంటె మించిన తేజస్సు కలది ఓజస్సు. పరమేశ్వర ! నీవు ఓజస్సువు. నాకా ఓజస్సును కలిగింపుమని అడుగుతాం. అలాగే మన్యు రసి మన్యుం మయి ధేహి - నీలో మన్యువున్నది. నాకా మన్యువును కలిగించుమంటాము. మన్యువు అంటె ఒకరకం కోపము. ఇతరులపై కక్షసాధించేది లేక వారికి హాని కలిగించేది క్రోధం అనబడుతుంది. మన్యువు అంటె యితరుల మేలు కోరి వారిపై తనకు కోపమున్నట్లు అభినయించడం. గురువు శిష్యుణ్ణి దండించుతాడు. ఎందుకు ? శిష్యుని మేలు గోరి.

పిల్లలను పెద్దవాళ్లు కొడతారు. ఎందుకని ? వాళ్ళు చెడిపోతారేమో బాగుచేద్దామని.ఇది మన్యు వనబడుతుంది. ఈ మన్యువును మనకిమ్మని భగవంతుని ప్రార్థిస్తాము.

కనుక మనం నిత్యం గాయత్రీ మంత్రంతో రెండువేళలా జ్ఞానమును భగవంతుని నుండి అర్థించాలి. డబ్బున్నవాడిని అర్థిస్తే వాడు డబ్బు ఇస్తాడు. అలాగే భగవంతుని అర్థిస్తే మనకు జ్ఞానాది కోరికలు నెరువేరుతాయా ? అని అడుగవచ్చు. అర్థించడమంటే కోరడమని లేక సంకల్పించడమని అర్థం. మనం ఒక వస్తువును అర్థించడం ఎప్పుడు జరుగుతుంది ? అది మన దగ్గర లేనప్పుడు లేక ఉన్నది కొఱతగా ఉన్నప్పుడు. పరమేశ్వరా, మాకుజ్ఞాన మిమ్ము అని అర్థించుతాము. ఇది కోరిక అంటే మనలో జ్ఞానం కొఱతగా ఉన్నదని గుర్తించామన్నమాట. ప్రతిరోజు యిది గుర్తించడం నేర్చుకోవాలి. కాని అంతటితో ఊఱకుంటే లాభం లేదు. తనలోని కొఱత ఏమిటో గుర్తించి తన కది కావాలని కోరిన తరువాత, దాన్ని సాధించడానికి ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నం చెయ్యకుండా కోరికలు తీరవు. మఱి ప్రయత్నం చేయడం వల్ల కోరికలు తీరితే, అసలు భగవంతునితో మనకు ప్రసక్తి యేల అని అడుగవచ్చు. అంటే యిక్కడొక చిక్కుంది. నాలో జ్ఞానం తక్కువని నాకెప్పుడు తెలుస్తుంది? నాకంటె అధికజ్ఞానం కలవాణ్ణి గుర్తించినపుడు (తమ చేతి రెండు వేళ్ళను చూపుతూ) ఇక్కడ రెండు వ్రేళ్ళున్నాయి. వీటిల్లో ఒక వ్రేలును ముడిచాను. అది పెద్దదో చిన్నదో మనకు తెలియదు. కాని ప్రక్కన రెండవ వ్రేలుకూడ ఉన్నదనుకోండి. అపుడు అరెంటిలో ఉండే తారతమ్యము తెలుస్తుంది. ఏది పెద్దదో ఏది చిన్నదో చెప్పగలం. అలాగే మనకుండే జ్ఞానం కొఱత గలదని మనకెపుడు తెలుస్తుంది ? మనకంటె మించిన జ్ఞానవంతుని మనం గుర్తించినపుడు. అధోధః పశ్యతః కస్య బలవాన్ నోపచయ్యతే - (పంచతంత్ర) అంటే తనకంటె క్రిందివాణ్ణి చూచినచో తాను బలవంతుడుగా కనబడతాడు. తనకంటె ఎక్కువ వాళ్ళను చూచినపుడు తాను తక్కువగా కనబడ్తాడు. మఱి ప్రపంచంలో సంపూర్ణ జ్ఞాని ఎవరూ లేరు. ప్రతివారికి ఏదో ఒక కొఱత ఉండనే ఉంటుంది. కనుక మనం వారితో పోల్చుకోవడం కంటె సంపూర్ణజ్ఞానియైన పరమేశ్వరునితోనే

పోల్చిచూచుకొని మనలో ఏమేమి కొఱత లున్నయ్యో గుర్తించడం ఉత్తమం అంటే మనం భగవంతుణ్ణే ఆదర్శంగా పెట్టుకోవాలి. ఆయన్ని ఆదర్శంగా పెట్టుకొని, మన కొఱత లేమిటో గుర్తించి. మనం కోరువానిని సంపాదించడానికి స్వయంగా ప్రయత్నం చెయ్యాలి. ఇదే ప్రార్థనలో ఉండే విశేషం.

తరువాత స్తుతి చేయుట, అంటే స్తోత్రం చేయడం లేక కీర్తించడం. పరమేశ్వరునిలో, న్యాయము, దయ, జ్ఞానము ఇత్యాది గుణములనేక మున్నాయి. ఇవి భగవంతుని గుణాలు. వీటిని మనం స్తుతి చేసిన కొలది ఈ గుణాలు మనలో వృద్ధి పొందుతాయి.

భక్తులు కొందఱు తిరుపతి వేంకటేశ్వరుని, అలివేలు మంగమ్మను ప్రార్థించుతుంటారు. కొన్నాళ్ళు వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తారు. నాకు అది కావాలి. ఇది కావాలి అని కాని ఏమి ప్రయోజనం ఉండదు. ఇక ఈయనతో లాభం లేదని చెప్పి అలివేలు మంగమ్మ దగ్గఱకు వెళ్ళుతాడు, రికమెండేషన్ కోసం. అమ్మా ! ఓ అలివేలుమంగా ! మీ భర్తగారైన శ్రీ వెంకటేశ్వర్లు నా ప్రార్థననేమీ ఆలకించడం లేదు. తల్లీ ! నీవైనా చెప్పి చూడవమ్మా ! ఆపుడపుడు కొండదిగి ఆయన ఏ అర్థరాత్రో నీతో ఏకాంతసేవకు వచ్చినపుడు కాస్త నా సంగతి వారికి విన్నవించుతల్లీ ! (సభలో నవ్వులు) అని ప్రార్థిస్తాడు. పాపం అలివేలు మంగమ్మ చెబితే మాత్రం ఆయన ఎందుకు వింటాడు ! అసలు ఆమె ఆయన మీద అలిగి, కొండ దిగివచ్చి వేరే ఉంటున్నది గదా ! మరి వేంకటేశ్వరస్వామి అయినా ఏదో ఆమెతో రాజీపడి పైకి తీసుకొని వెళ్ళడాయె ! పోనీ ఆమెకైనా బుద్ధి కలిగి పైకి వెళుతుందంటే అదీ లేదాయె (సభలో నవ్వులు) మరి యీ భక్తుల కోరికలు ఎలా తీరుతవో ! ఒకవేళ ఎవరైనా చూస్తే బాగుండదని చెప్పి, ఎవరికీ తెలియకుండ ఆయన ఆలివేలు మంగమ్మ దగ్గరకు అప్పుడప్పుడు వెళ్ళి వస్తుంటాడేమో తెలియదు ! (సభలో నవ్వులు)

నేడు ఆస్తిక్యం యీ స్థితిలో ఉంది మనలను భౌతికవాదులు, కమ్యూనిష్టులు విమర్శించుతున్నారంటే అందులో తప్పేముంది ? ఆస్తిక్యం వెఱ్ఱితలలు వేసింది M.A చదివేవాడు, తాను పాఠాలు చదివితే ప్యాసవుతా ననుకోడు. తిరుపతి కొండెక్కి బుఱ్ఱగొరిగించుకుంటే పరీక్షలలో ప్యాసవుతా

నను కుంటాడు (సభలో నవ్వులు) అతనికి తన మీద, తన ప్రయత్నం మీద విశ్వాసమే లేకుండా పోయింది.

'సర్వభూతేషు చాత్మానం తతో న విచికిత్సతి' - ఎవడు సమస్త ప్రాణులలోను, ప్రకృతి మొదలు పృథివివఱకు గల అన్ని పదార్థము లందును వ్యాపకుడైన పరమాత్మను ఎఱుగునో అతడు సందేహమును పొందడు. ఇంకొక్క విషయం చెప్పి మిమ్ములను వదలిపెడతాను.

(శ్రీ గోపదేవ్ గారు ఉపనిషత్తు గ్రంథాన్ని తమ చేతిలో నిడుకొని తెఱచి చదువుతూ) ముండకోపనిత్తులో ఒకచోట యిలా చదువుతాము.

శౌనకో హవై మహాశాలోऽ ఙ్గిరసం విధివ దుపసన్న ః
పప్రచ్ఛ, కస్మిన్ను, భగవో విజ్ఞాతే సర్వమిదం విజ్ఞాతం భవతీతి ॥

ముం. 1-1-3

'శౌనకోహ వై' - పూర్వం శునక మహర్షి కుమారుడైన, మహాశాలః' గొప్ప సంపన్న గృహస్థు డొకడు. అంగిరసుడనే మహర్షి దగ్గరకువెళ్ళాడు. ఎలా వెళ్ళాడు ? విధివత్ - విధి ననుసరించి గురువు దగ్గరకు వినయంతో వెళ్ళాలి. ఇది మన ప్రాచీన ఋషి సంప్రదాయం. మనం ధార్ష్ట్యంతో జ్ఞానం సంపాదించలేం. వినయం ఆవశ్యకం. ఇంకా అతనిలా వెళ్ళాడు.

త ద్విజ్ఞానార్థం స గురుమే వాభిగచ్ఛేత్,
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మ నిష్ఠమ్ ॥

విజ్ఞానం కొఱకు గురువుగారి దగ్గఱకు వెళ్ళాడు. ఏమి తీసుకొని వెళ్ళాడు ? 'సమిత్పాణిః - అగ్నిలోవేసే పుల్లలు తీసుకొని వెళ్లాడని అర్థం. అంటే ఆరోజుల్లో అగ్నిహోత్రాలు ఋష్యాశ్రమాలల్లో ఉండే వన్నమాట. గురువు ఎలాంటి వాడై ఉండాలి ? విజ్ఞానవంతుడై ఉండాలి. అంటే అతడు శ్రోత్రియు డంటే వేదవిదుడు. వేదశాస్త్రములను బాగా చదువుకొని, అర్థసహితంగా, క్షుణ్ణంగా శిష్యునికి చెప్పగలిగి ఉండాలి. తరువాత బ్రహ్మనిష్ఠుడై కూడ ఉండాలి. అంటే వేదములను బాగా చదువుకొని కేవల శబ్దార్థ జ్ఞానమున్నా లాభం లేదు. అతడు సామాన్యపండితుడౌతాడు. అందుచేత గురువు పరమేశ్వర నిష్ఠగలవాడై కూడ ఉండాలి. అంటే సమాధ్యవస్థలో పరమే శ్వరానుభూతిని

పొందినవాడుగ ఉండాలి.

అలాంటి గురువును శౌనకుడు, 'విధివ దుపసన్నః' - శాస్త్ర విధి ననుసరించి సమీపించినవాడై అడిగాడు. భగవన్ ఓస్వామీ, 'కస్మిన్ను విజ్ఞాతే ఇదం సర్వం విజ్ఞాతం భవతి ' - ఏది తెలుసుకుంటే యీ సర్వము తెలుస్తుంది ? అని. తరువాత అంగిరసుడు, ఈ ప్రశ్నకు సమాధానంగా 'ముండకోపనిషత్తు ను బోధిస్తాడు.

ఇచట భగవన్ అనే పదం వాడబడింది. భగవద్గీతలో కృష్ణుని కీపదం వాడటం వలన సంస్కృత విద్యావిహీనత చేత. మనం కృష్ణుణ్ణి దేవుణ్ణి చేశాము. భగవాన్' పదం మనుష్యులకు వాడే పదం. గీతలో కృష్ణుని కిదే వాడారు మనుష్యులకు భగవాన్ పదం వాడితే, అది ఆదరార్థమే వాడతారు. సంస్కృత గ్రంథాలలో కొందరు మహర్షులకు కూడ యీ 'భగవాన్ పదం వాడబడింది. అలాగే భగవాన్ పదం పరమేశ్వరునికి కూడ వాడతారు. సమస్త ఐశ్వర్యము కలవాడు, భజించుటకు యోగ్యుడు కనుక ఆయనను భగవాన్ అన్నారు. ఈ భేదాన్ని మనం గుర్తించాలి.

పరమాత్మ తత్త్వం అత్యంత సూక్ష్మమైంది. నల్లపూస కనబడిన వానికి తాటికాయ బాగా కనబడుతుంది. కనుక సూక్ష్మతత్త్వమైన పరతత్త్వము తెలిసిన వానికి, స్థూలతత్వములు లేక భౌతిక పదార్థములు సులభంగా తెలుస్తాయి. సర్వభూతములు అంటే - యీచరాచర జగత్తు అంతా కూడ - పరమాత్మలోనే ఉన్నవని అతడు తెలిసికొంటాడు. ఇది సమాధిస్థితిలో అనుభవించుతాడు సాధకుడు.

భిద్యతే హృదయగ్రంథి శ్ఛిద్యంతే సర్వ సంశయా ః
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥ ముం. 2-2-8

తస్మిన్ దృష్టే పరావరే - పరమేశ్వర సాక్షాత్కారం పొందిన వ్యక్తికి హృదయములోని గ్రంథులు - ముడులు అంటే అజ్ఞాన వాసనలు విడిపోతాయి. సమస్త సందేహములు ఛేదింపబడతాయి. అతనిలో కర్మలు క్షీణించుతాయి. అంటే అతడు చెడ్డకర్మలు చెయ్యడు. శుభకర్మలే చేస్తాడు. శుభకర్మలు కూడ ఫలాపేక్షారహిత భావంతో చేస్తాడు.

'తతో న విచికిత్సతి' - తరువాత అతడు సందేహమును పొందడు. సర్వసంశయములు అతనినుండి దూరమవుతాయి.. మిగిలింది రేపు.

గుంటూరు, 30-12-1968
సోమవారం, సా. 6-00 గం॥

మహాజనులార !

నిన్నటి దినం "యస్తు సర్వాణి భూతాని" అన్న మంత్రాన్ని చెప్పుకున్నాం. పరమేశ్వరుడు సర్వప్రాణులలోను, ప్రకృత్యాది పదార్థములందెల్లెడ వ్యాపించి యున్నాడనియు, అవి ఆయనలో ఉన్నవనియు, తెలిసినవ్యక్తి సందేహమును పొందడని తెలిసికొన్నాం. ఈ సృష్టికి మూలకారణం తెలుసుకోడానికి మనం అంతర్ముఖులం కావాలి. జీవుడు, పరమేశ్వరుడు, ప్రకృతి అని మూడు మూలపదార్థాలున్నాయి. వీటిని గుఱించి మనం తెలుసుకోవాలి. సామాన్యంగా జీవుడు. ఈ స్థూల ప్రపంచం రెండూ అందఱి అనుభవంలోనుంటాయి. కాని పరమేశ్వర సాక్షాత్కారం పొందినవారు బహు స్వల్ప సంఖ్యాకులుగా ఉంటారు. జీవుడు అంతర్ముఖుడైనపుడు సమాధ్యవస్థలో పరమేశ్వర సాక్షాత్కారం కలుగుతుంది. అపుడు సర్వ సంశయములు విచ్ఛిన్నము లవుతాయి. అలాంటి వ్యక్తి ఆత్మసాక్షాత్కారానంతరం ఏమిచేస్తాడో యీ క్రింది మంత్రంలో మనం తెలుసుకుంటాం.

యస్మిన్ త్సర్వాణి భూతా న్యాత్మైవా భూద్ విజానత ః
తత్ర కో మోహః కః శోక ఏకత్వ మనుపశ్యత ః ॥ 7

భావార్థము : సంన్యాసులు, విద్వాంసులు పరమాత్మయందు సంచరించి సమస్త ప్రాణులను తమతో తుల్యములయిన సుఖ దుఃఖములు గలవానిగ నెంచెదరు. వారు అద్వితీయుడగుపరమేశ్వరునే శరణుజొత్తురు. అట్టివారికి శోక మోహ లోభాదు లెన్నడును కలుగవు. అట్లే యెవరు తమ స్వరూపమును యథార్థముగా గుర్తించి, పరమాత్మనుగూడ తెలిసికొందురో వారు ఎల్లప్పుడు సుఖింతురు.

లోకంలో సాధారణ మానవులకు శోక మోహాలు కలుగుతాయి. ఆత్మ సాక్షాత్కారం పొందిన జ్ఞానుల కవి కలుగవు. 'మోహము - అంటే ప్రేమ అని

సామాన్యార్థం. విపరీతజ్ఞానము లేక భ్రమ, భ్రాంతి అనుట సరియైన అర్థం. ఉన్నదాన్ని ఉన్నట్లు గ్రహించక యింకొకటిగా భావించడం విపరీతజ్ఞాన మవుతుంది. త్రాడును త్రాడుగ చూడక. పాము అనుకోవడం విపరీత జ్ఞానం, దీన్నే రజ్జుసర్పభ్రాంతి అంటారు. విపరీత జ్ఞానం వలన దుఃఖం కలుగుతుంది. కాని వస్తుతత్త్వం ఏమిటో గ్రహించిన వ్యక్తికి దుఃఖాలుండవు. అందుచేత వస్తుతత్త్వజ్ఞానం కలగడం సుఖదాయకం. లౌకికపదార్థ జ్ఞానాన్ని ప్రాకృతిక పదార్థజ్ఞానం అంటారు. నేటి సైంటిస్టులు (Scientists) ప్రాకృతిక పదార్థజ్ఞానులు. వారికి అప్రాకృతిక జ్ఞానంతో సంబంధం లేదు. అప్రాకృతిక పదార్థములు రెండు. ఒకటి జీవుడు, రెండవది పరమాత్మ. ఈ రెంటిని గూర్చిన జ్ఞానం కలిగితే అతడు విజ్ఞాని అవుతాడు.

లోకంలో జీవుల సంఖ్య అసంఖ్యాకం. ఈ సంఖ్య ఎంతో మనకు తెలియదు. కాని పరమేశ్వరునికి మాత్రం తెలుసు. స్వరూపతః అన్ని జీవులు ఒకటే. జీవుడు సూక్ష్మపరిమాణం కలవాడు ఏనుగు శరీరంలో. పెద్దజీవుడు, క్రిమికీటాకాదులలోచిన్న జీవులు ఉండవు. జీవునికుండే లక్షణాలు మన మిదివఱకు చెప్పుకున్నాం. ఇచ్ఛ (రాగం) , ద్వేషము (వైరము). ప్రయత్నము, సుఖము, దుఃఖము, జ్ఞానము - ఈ గుణములు గలది జీవాత్మ. జీవునిలో, నాకిది కావాలి అని కోరే గుణం ఉంది. ఆ కోరిన పదార్థమును సంపాదించడానికి ప్రయత్నం కూడ చేయగలడు. ఆ ప్రయత్నం వలన అతడు కోరిన పదార్థం సిద్ధించితే సంతోషిస్తాడు. లేకపోతే దుఃఖిస్తాడు.

నేను జీవుణ్ణి గుఱించి 'సైంటిఫిక్' గా (నవీనశాస్త్ర దృష్ట్యా) చెప్పలేను. నాకు నేటి వైజ్ఞానిక పరిభాష (Scientific terminology) రాదు. మీకు వివరించి చెప్పటకు. జీవుడు శరీరము కంటె భిన్నమని మాత్రము చెప్పగలను. అతనికి జ్ఞానాదిగుణా లున్నవి. శరీరాని కవి లేవు. దాని గుణాలు వేరు. వికలాంగులకు కళ్ళు, కాళ్లు, చేతులు ఇత్యాది అవయవములు లేకపోయినా వారిలో జ్ఞానాది గుణాలు మాత్రం లేకుండా పోవు. శరీరంలోని మెదడు లాంటి సూక్ష్మపదార్థాలు అస్తవ్యస్తమైనపుడు అతని వర్తనం క్రమబద్ధంగా లేకపోవచ్చును. కాని జ్ఞానాది గుణములు మాత్రం లేకుండా పోవు.

కణాద మహర్షి తమ వైశేషిక దర్శనంలో అణువులచే ఈ ప్రపంచం

ఏర్పడిన దంటాడు. ఆయనప్రపంచగత పదార్థాలను ఆఱుగా నిర్ణయించినాడు. ద్రవ్యము, గుణము కర్మ, సామాన్యము, విశేషము, సమవాయము. ఈ యాఱింటిలో కూడ మొదటి మూడు పదార్థములు ముఖ్యములన్నారు. ద్రవ్యము - గుణము-కర్మ. ఈమూడు పదార్థములలో మరల ద్రవ్యమును 9 విధములుగా విభజించారు.

"పృథి వ్యాపస్తేజో వాయు రాకాశం కాలో దిగాత్మా మన ఇతి ద్రవ్యాణి" వైశేషికం 1-1-5.

పృథివి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము, కాలము, దిక్కు, ఆత్మ, మనస్సు ఇవి 9 ద్రవ్యములు.

ఆత్మనుకూడ ఒక ద్రవ్యంగా ఆయన నిర్ణయించాడు. ఆత్మద్రవ్యం కాకపోతే పంచభూతములతో నిర్మితమైన ఈ శరీరంపై ఆత్మ ఎలా అధికారం చలాయిస్తుంది ? కనుక ఆత్మకూడ కణాదమహర్షి ఒక ద్రవ్యమే నంటాడు. నేటి సైంటిస్టులు యింకా ఈ సిద్ధాంతమును కనిపెట్టలేదు. వారు ఆత్మ ద్రవ్యం - పదార్థం కాదంటారు. కాని అది భౌతిక పదార్థమైన శరీరంపై ఎలా పనిచేయుచున్నదా ? అని సంశయం కలిగి ఆ సమస్యను యింకను తేల్చలేక పోతున్నారు.

ఈ ఆత్మ భావవాదుల దృష్టిలో (Idia) కల్పిత వస్తువే కాని (Substance) పదార్థం అని వారంగీకరించరు. కల్పిత వస్తువు (Idia) కు (Existence) ఉనికి లేదు. కాని పదార్థాని కున్నది. పదార్థానికి లేక ద్రవ్యమునకు లక్షణమేమిటి? క్రియా, గుణములు కలిగినది ద్రవ్యం. గుణ క్రియా సుమవాయి కారణం ద్రవ్యం - అని వైశేషిక సూత్రం. సమవాయి కారణం అంటే ఏమిటి ? ఉపాదాన కారణాన్ని గుఱించి నేనిది వరకు చెప్పాను. ఉపాదాన కారణమునే సమవాయి కారణ మంటారు. మట్టి ఉపాదాన కారణం. కుండ కార్యం. కుండనుచేసే కుమ్మరి నిమిత్త కారణం. ఈ కార్యకారణ భావము బాగుగా తెలుసుకోవాలి. లేకపోతే తత్త్వజ్ఞానం కలుగదు. జీవునికున్న ఆరు గుణాల్లో మూడు ముఖ్యములు. Will (ఇచ్ఛ) (knowledge) (జ్ఞానం), Effort (ప్రయత్నం). Dead body (మృత శరీరం) లో నివి కనబడవు. వస్తుగుణము ఎప్పుడూ వస్తువు నాశ్రయించి ఉంటుంది. అగ్నికి కాల్చేగుణము

స్వభావం. అగ్ని కాల్చడం లేదంటే అచట అగ్ని లేదనే అర్థం. అట్లాగే dead body(శవంలో) ఇచ్ఛాది గుణములు వ్యక్తం కావడం లేదంటే జీవుని గుణములు జీవునితోనే వెళ్లిపోయినవని అర్థమౌతుంది. ఒకానొకప్పుడు అంటే మరణించినప్పుడు శరీరంలో ఇచ్ఛాదిగుణములు లేకుండా పోతవి. కారణం ? ఇచ్ఛాది గుణాలు శరీరమునకు సంబంధించినవి కాకపోవడం చేత అవి జీవ గుణాలని శాస్త్రకారుల దృష్టి.

ఆత్మ విషయమై మన శాస్త్రకారుల దృష్టి ఏమిటో మీకు చెప్పాను. నవీన శాస్త్రజ్ఞులలో ఒకడైన డెకార్టె (Decorte) మన శాస్త్రకారులు చెప్పిన దానికి అనుగుణంగా ఆత్మ విషయమై తన అభిప్రాయమేమిటో చెపుతాడు. అతడు చెప్పినది ఇంగ్లీషులో ఉన్నది. అదిచదువుతాను. సభికులలో అందరికి ఇంగ్లీషు రాకపోవచ్చును. అందుచేత ఇంగ్లీషు పాఠాన్ని మళ్ళీ తెలుగులో తర్జుమా చేసి చెపుతాను. (చిరునగవుతో) నాకు ఇంగ్లీషు అంతగా రాదు. కనుక యీ తర్జుమా చెయ్యడంలో నెనెంత వఱకు కృతకృత్యుడ నవుతానో మీరే గ్రహిస్తారు.

RENE DECORTE (1596-1650)

" The fact of my thinking reveals to me something that thinks. What is this something > It is. I. I think therfore I am. My very doubt proves my existence as a doubter. Otherwise doubt itself could not exist. Hence I know that I am a substance whose entire natureit is to think and for whose existance there is no need of any place, nor does it depend on any material thing ; so that this 'me' that is to say the soul by which I am what I am, is entirely distinct from my body and even more easy to know than is the latter ; and even if the body were not the soul would not cease to be what it is"

(రేనె డెకార్టె 1596 - 1650)

"నేనెంతగానో ఆలోచించగా నాకు అర్థమయిన దేమిటంటే, ఏదో ఒక వస్తువు నాలో ఉండి ఆలోచిస్తున్నదని. ఆవస్తువు ఏమిటంటే. అది 'నేను'

(జీవుడు) అని. కనుక 'నేను' ఉన్నాను. నాకు కలిగిన సంశయమే నేనొక సంశయాత్మనని రుజువు చేస్తున్నది. అలా కాని పక్షంలో అసలు నాలో సంశయమే ఉండెడిది కాదు. అందుచేత నేనొక పదార్థమనియు. ఆలోచించిడమే నా స్వభావ మనియు, నా ఉనికి ఏదో యొక భౌతిక పదార్థముపై గాని, ఒక ప్రదేశము పై గాని అధారపడిలేదనియు నేనెఱుగుదును. అందువలన ఆత్మ అనబడె యీ 'నేను' నేనుగానే ఉన్నాను. నేను పూర్తిగా నా శరీరము కంటె విలక్షణమైనవాడను. నేను నా శరీరము నెఱుగుటకంటెనన్ను నే నెఱుగుటయే సులభము. ఒకవేళ నా ఈ శరీరము మృతి నొందినను 'నేను' మృతి నొందను".

ఇంకొక మహాశయు డేమన్నాడో గమనించండి. ఈయన పేరు డాక్టరు వి.బి. యస్. హాల్డెన్ (Dr.V.B.S. Holdane) (చిఱునగవుతో) ఈ పేరు చదవటం కూడ నాకు సరిగా తెలియదు.

"We know a lot about life" but we do not know where and when it was born. Many people are content to give up the Quest and to say that the origin of life is a mistery beyond the range of science. This may prove to be true"

"ఆత్మ (life) ను గూర్చి మనకెంతో తెలుసు. కాని. అది ఎప్పుడుఎక్కడ ఉద్భవించినదో మన మెఱుగము. కొందఱు దీని మూలము భౌతిక విజ్ఞాన శాస్త్ర ఆవరణమునకు అవలి దనియు, దీని నన్వేషించుట కంటె ఊఱకుండుటయే ఉత్తమ మనియు నెంచి సంతృప్తి పడుదురు. ఇది యథార్థము వలెనే తోచుచున్నది".

అందుల కనియే జీవులు అనాది, స్వయంసత్తా కలిగినవని మన మహర్షులు నిశ్చయించారు. ఆత్మ ద్రవ్యం. అలాగే శరీరం కూడ ఒక ద్రవ్యం, అందుచేతనే ఆత్మ శరీరం మీద పనిచేస్తున్నది.

ఆత్మ సాక్షాత్కారం పొందినవ్యక్తి తనయందు తక్కిన జీవు లెలా స్నేహంతో వర్తిస్తాయో అలాగే తాను కూడ వాటి యందు వర్తిస్తుంటాడు. ఇతరుల సుఖ దుఃఖాలను తనతో పోల్చి చూచుకుంటాడు. ఒక వేళ అన్యప్రాణులవలన తనకు దుఃఖము కలిగినా, తాను మాత్రము వాటికి

దుఃఖము కలిగించదు అసంప్రజ్ఞాత సమాధిలోనో, సంప్రజ్ఞాత సమాధిలోనో ఆత్మసాక్షాత్కారం పొందినవ్యక్తి యీ సమస్త చరాచర జగత్తులో పరమేశ్వరుడు సమంగా వ్యాపించి యున్నాడని తెలుసుకుంటాడు. అతడు ప్రవర్తించే విధానమును గురించి - భాగవతములో ప్రహ్లాదుని గూర్చి యిలా వర్ణిస్తాడు కవి.

"తనయందు అఖిల భూతములందు ఒక భంగి సమహితత్వం బున బరగువాడు"

అలాంటి వానికి శోకమోహాలు కలుగవు. మిత్రులు-పుత్రులు భార్య వీరందరు నిజమునకు మనవారు కాదు. ధన ధాన్యములు కూడ మనవి కావు. మనవి కాని వానియందు ఇవి మనవని దృష్టి నుంచడం మోహం. ఈ పదార్థములు మనలను వీడి నపుడు మనం దుఃఖపడతాము. కాని, ఆత్మసాక్షాత్కారము పొందినవ్యక్తి యీ శోకమోహములకు వశుడు కాడు. ఇప్పటికి 7 మంత్రాలు చెప్పుకున్నాం. పరమేశ్వరునిగూర్చి కొంత వరకు ఈ మంత్రాల ద్వారా తెలుసుకున్నాం. ఇప్పుడు చెప్పుకొనబోయే మంత్రంలో ఆయనను గురించి మనంయింకా ఎక్కువగా తెలుసుకోగలం.

స పర్యగా చ్ఛుక్ర మకాయ మవ్రణ మస్నావిరగ్ం
శుద్ధ మపాప విద్ధమ్, కవిర్ మనీషీ పరిభూః
స్వయంభూర్, యాథాతథ్యతోఽర్థాన్
వ్యదధా చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః ॥

భావార్థము : అనంత శక్తియుక్తుడు, అజన్ముడు, నిరంతరము ఎల్లతావులందుండువాడు నిత్యముక్తుడు, న్యాయకారి, నిర్మలుడు, సర్వసాక్షి, నియంత, అనాది స్వరూపుడు నగు బ్రహ్మము - పరమేశ్వరుడు సర్గారంభమున వేదము మూలమున శబ్దార్థములు, వానికిగల సంబంధమును దెలుపు విద్యలను ఉపదేశింపకున్నచో లోకమున మానవులలో నెవరును విద్వాంసులయ్యెడివారు కారు. ధర్మార్థకామమోక్షముల ననుభవించుటకు సమర్థులయ్యెడివారు కారు. అందువలన నా బ్రహ్మమునే యెల్లప్పుడు నుపాసింపవలెను.

సః-అంటే అతడు లేక పరమేశ్వరుడు, పరిఅగాత్ - అంతటా వ్యాపించి

ఉన్నాడు. సృష్టికర్త సృష్టి ఎక్కడెక్కడ జరుగుచున్నదో అక్కడక్కడ ఉంటాడనియు, దేశకాల భేదము లేక ఆయన సర్వవ్యాపకుడై సదా ఉంటాడనియు, ఒకమారు చెప్పుకున్నాం. పరమేశ్వరుడు ఏదో యొక చోట ఉన్నాడనుట విరుద్ధ జ్ఞానం. ఫలానిచోటే దేవుడున్నాడనినచో వైదికులు నమ్మరు. దయానందుడు వేదములలో గాని, ఉపనిషత్తులలో గాని దేవాలయములను దర్శించుమని, విగ్రహాది జడమూర్తులను ఉపాసించుమని ఎక్కడా లేదన్నాడు. కనుక దయానందుణ్ణి నాస్తికుడన్నది లోకం. నా దృష్టిలో అసలు నాస్తికులు విగ్రహారాధకులే. ఈ విగ్రహారాధన పూర్వం వైదిక మతస్థులలో లేదు. ఇది బౌద్ధ, జైనుల నుండే మనకు సంక్రమించింది. బౌద్ధులు బుద్ధుని విగ్రహమును పెట్టి పూజిస్తారు. జైనులు వారి మత గురువులైన తీర్థంకరుల విగ్రహముల నారాధిస్తారు. జినుడు వారి ప్రధాన గురువు. ఆయనే జైనమతాన్ని స్థాపించాడు. ఆయన అసలు పేరు వర్ధమాన మహావీరుడు. ఆయనుపవాసాదికములచేత, తపస్సు చేత యింద్రియములను జయించాడు. కనుక ఆయన్ని జినుడన్నారు. ఆయన స్థాపించిన మతం కనుక జైనమతంగా వ్యాప్తిలోనికి వచ్చింది. ఈ బౌద్ధ, జైనులనుండే మనవారు విగ్రహములను పూజించడం నేర్చుకున్నారు. అజంతా, ఎల్లోర చూచినవారికిది తెలుస్తుంది. అజంతాలో బౌద్ధ శిల్పము కలదు. ఎల్లోరాలో బౌద్ధశిల్పంతోపాటు హిందూ శిల్పాలు కూడ ఉన్నాయి. బౌద్ధులు, జైనులు కూడ విగ్రహారాధన చేస్తారు కనుక వారిని మనం నాస్తికులన్నాము. జైనుల గుళ్ళలో పెద్ద పెద్ద గంటలు కట్టేవారు. అదిచూచి మనవారు కూడ గుళ్ళల్లో గంటలు కట్టడం మొదలు పెట్టారు. జైనులు విగ్రహారాధన చేస్తారు కనుక వారు ఆస్తికులు కారు.

'అస్తి ఇతి మతిర్ యస్య స ఆస్తికః' - ఉన్నది అను బుద్ధి కలవాడు ఆస్తికుడు. ఆస్తికుని భావము ఆస్తిక్యము. అంటే పరమేశ్వరుడున్నాడని అంగీకరించేవాడు ఆస్తికుడవుతాడు. జైనులు భగవంతు డున్నాడని ఒప్పుకోరు. కాని జినుడు మొదలుగా గల తీర్థంకరుల విగ్రహాలను దేవాలయములలో పెట్టి పూజిస్తుంటారు. వారి గుళ్ళల్లో జరిగే అలంకారములను, కర్మకాండలను చూచి సామాన్యజీవులు ఆకర్షింపబడినారు. మన వైదికులు వారి నెంత వారించినా వారు జైనుల మందిరాలకు పోవడం మానలేదు. అపుడు కొన్ని

నియమాలను జనులపై విధించారు కూడ.

న వదేద్ యావనీం భాషాం ప్రాణైః కంఠగతైరపి,

హస్తినా తాడ్యమానో z పి న గచ్ఛేత్ జైనమందిరమ్ ॥

ప్రాణాలు పోతున్నాసరే యవన (యవన భాష అంటే తురకం, ఇంగ్లీషు మొదలైన పరభాషలు. యవనులు అంటే తురకలు యవనుల తరువాత ఇంగ్లీషువారు వచ్చి మనపైన ఇంగ్లీషు రుద్దారు) భాష మాట్లాడరాదు. ఏనుగు చేత తరుమబడినను ప్రాణరక్షణార్థం జైనమందిరంలో ప్రవేశింపరాదు. అని నిషేధించినా జనులు జైనమందిరములకు వెళ్ళడం మానలేదు. పెట్టిన ఆంక్షల వల్ల లాభం లేకపోయింది. అప్పటినుండి వైదికులు కూడ జనుల నాకర్షించుటకు చారిత్రక పురుషులైన రాముడు, కృష్ణుడు మొదలగు వారికి గుళ్ళు కట్టారు. దయానందుడు విగ్రహాది జడమూర్తుల నుపాసించడం అవైదికం. అలా చేయుమని వేదాలలో ఎక్కడ లేదన్నందుకు,, ఆయనను నాస్తికుడన్నారు. అసలు నాస్తికులెవరు ? నాస్తికో వేద`నిందకః' - (మనువు) వేదములను నిందించేవారుకాని, వేదవిరుద్ధ క్రియల నాచరించేవారు కాని నాస్తికులన బడతారు. కనుక వేదవిరుద్ధమైన జడ పూజల నాచరించడంచేత నిజానికి నాస్తికులు విగ్రహారాధకులే. బుద్ధుడు అహింసావాది. జంతుబలులను నిషేధించాడు. యజ్ఞములలో సైతము జంతువుల్ని బలియివ్వరాదన్నాడు. ఆయనతో ఎవరో, యజ్ఞార్థము పశుబలుల నివ్వవచ్చునని, వేదములలో ఉన్నదని వాదించారు. నిజానికలా ఎక్కడా వేదములలో లేదు. కాని బుద్ధుడు వేదములను చదువలేదు. కనుక వారు చెప్పింది నిజమే ననుకొని, అలాగైతే నాకు వేదాలతో పనిలేదు పొమ్మన్నాడు. ఇక అప్పటినుండి బుద్ధుడు వేదములను ఒప్పుకోలేదు, కనుక ఆయన నాస్తికుడు అన్నారు. నిజాని కీనాడు మనం వైదికులం కాకుండా పోయాము. ఎందుచేత ? పరమేశ్వర స్వరూపం ఏమిటో తెలియకుండా విగ్రహాది జడమూర్తుల నుపాసించడం చేత.

తరువాత శుక్రం, -శుక్రం అంటే సామర్థ్యం కలవాడు. సృష్టిస్థితి లయములను చేయగల సామర్థ్యం కలవాడు గనుక భగవంతుడు శుక్రం అనే పదంతో చెప్పబడ్డాడు. శుక్రం వై వీర్యం - శక్తి సామర్థ్యములు కలవాడని అర్థం. పరమేశ్వరుడు చేసే పనేమిటి ? కారణ రూపంలో సూక్ష్మంగా ఉన్న ప్రకృతిని

స్థూలము చేస్తాడు. కనుక దేవుడు సృష్టిస్తాడు. మరి సాయిబాబా ఒక ఈగనైనా పుట్టించలేడు. రాముడు, కృష్ణుడు మొదలైనవారంతా సృష్టికర్తలు కారు. వారికి పూర్వమే ప్రపంచం ఉంది. వారీ జగత్తును సృష్టించలేదు. క్రీస్తును దేవుడంటున్నారు. మనం రామకృష్ణాదులను దేవుళ్ళనేసరికి వారు క్రీస్తే దేవుడు, ఆయన కన్యగర్భమున ఉద్భవించాడు అంటారు. మరి రామకృష్ణాదులను దేవుళ్ళని ఒప్పుకున్నప్పుడు క్రీస్తును కూడ ఒప్పుకోవలసి వస్తుంది కదా ! వారు క్రీస్తును Latest Addition, క్రొత్త అవతారం అంటున్నారు (సభలో చిరునవ్వులు) యిది యిలా ఉంటే కొందరు విజ్ఞానులు (Scientists) అసలు దేవుడే లేడు పొమ్మంటున్నారు (సభలో నవ్వులు) వారు నా దగ్గరకు వచ్చి, మీరు దేవుడున్నాడని ఎలా ఋజువు చేస్తారు. ఒక్కడా యిద్దరా, ప్రపంచలో అనేకమంది దేవుళ్ళు వెలిశారు గదా ! వారిలో మీరు ఎవరిని దేవుడంటారు అని అడుగుతుంటారు. నేను వారితో వీళ్ళెవరూ దేవుడు కాదు, అసలు భగవంతుడు శరీరధారణ చెయ్యడు, ఆయన సర్వవ్యాపి అని చెబుతాను. మొదట భగవంతుని లక్షణములేవో చెప్పి భగవంతుని ఆస్తికత్వమునుకారణయుక్తంగా నిరూపించేసరికి వారుకూడ అపుడు భగవంతుడొక డున్నాడని అంగీకరించుతారు.

'అకాయం' - భగవంతునికి శరీరం లేదు. ఆయన జన్మ ఎత్తడు. పుట్టడు, పెరగడు, మరణించడు. కొందరడుగ వచ్చు. "కుమ్మరి కుండలను చేస్తాడు. సాలి వస్త్రములను నేస్తాడు. వారికి శరీరం ఉంది కనుక అలా చేయగలిగారు. అట్లే ప్రపంచాన్ని సృష్టించిన పరమేశ్వరునికి శరీరం లేదంటే ఎలా" అని. అయితే యిక్కడ అకాయం నాస్తికాయం యస్య తత్ అకాయం' శరీరం లేనిది పరమాత్మ తత్త్వం. అని వేదము చెప్పుచున్నది. పరమాత్మకు శరీరం ఉంటే పరిచ్ఛిన్నమవుతుంది. హద్దు అనేది ఏర్పడుతుంది. అపుడు భగవంతుడు పరిమితుడౌతాడు. పరిమితుడైనవాడు అపరిమితముగానున్న యీ సృష్టిని చేయలేడు. కర్త ఒకచోట కార్యమింకొక చోట ఉండవు కదా ! కుమ్మరి ఒకచోట ఉంటే కుండ యింకొక చోట తయారు కాదు. ఎక్కడ కుమ్మరి ఉన్నాడో అక్కడే కుండ తయారవుతుంది. కనుక అపరిమితమైన యీ సృష్టి కార్యమును చేయుటకు పరమేశ్వరునకు శరీరం ఉండదు. కనుక ఆయనను అకాయం' అంటున్నది వేదమీ మంత్రంలో'

అపాణి పాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః ।

స వేత్తి వేద్యం న చ తస్యాస్తి వేత్తా తమాహు రగ్ర్యం పురుషం మహాంతమ్॥
శ్వేతా. అ. 3-19

పరమేశ్వరునికి చేతులు లేవు. కాని తన అనంతశక్తిచేత యీ ప్రపంచాన్ని నిర్మిస్తాడు. గ్రహిస్తాడు. ఆయనకు కాళ్ళు లేవు, కాని ఆయన సర్వవ్యాపకుడవటం చేత అన్నింటికంటె వేగము కలవాడు. ఆయనకు కన్నులు లేవు, కాని ఉన్నదున్నట్లు చూస్తాడు. ఆయనకుచెవులు లేవు. కాని అందరి మాటలు వింటాడు ఆయనలో అంతఃకరణము లేదు. కాని సమస్త జగత్తును తెలిసికొంటాడు. ఆయనను సంపూర్ణముగ తెలుసుకున్న వారెవరూ లేరు. ఆయన సనాతనుడు మహాపురుషుడు, సర్వశ్రేష్ఠుడు.

జీవులకు శరీరములు మూడు ఉంటవి. స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణ శరీరమని. పరమేశ్వరునికి యీ మూటితోను సంబంధం లేదు. ఇవి జీవునికి సంబంధించినవి, పరమేశ్వరునికి శరీరమేలేదు. కనుక, 'అవ్రణం. ఆయన వ్రణములు లేనివాడు. అలాగే అస్నావిరగ్ం' అంటే నరములు మొదలైన శరీర సంబంధమైన పదార్థాలేవి ఆయనలో లేవని. చూడండి - పరమేశ్వరుడు శరీర రహితుడని చెప్పడానికి ఎంతటి స్పష్టపదాలతో ఈ మంత్రంలో వివరించడం జరిగిందో. స్థూల శరీరం - ఇది అందరికీ తెలిసిందే. తరువాత సూక్ష్మ శరీరం - దీనినే వాహక శరీర మని కూడ అంటారు. అంటే జీవుడు స్థూల శరీరమును వదలి వెళ్ళేటపుడు యీ వాహక శరీరంతో వెళతాడు. ఇది 17 తత్త్వములు కలిగి ఉంది. పంచప్రాణములు - (ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము) పంచజ్ఞానేంద్రియములు, పంచ సూక్ష్మ భూతములు, మనస్సు, బుద్ధి మొత్తం యివి 17 తత్వములు. మూడవది కారణ శరీరము. ఇది ప్రకృతి రూపమై ఉంటుంది. ఈ మూడు శరీరములనుండి - ముక్తులమైతే గాని మనకు ముక్తి లభించదు. ముక్తిని వాంఛించే జీవుడు ఈ శరీరాలు తనకక్కరలేదని దానికి తగినట్లు ప్రయత్నం (సాధన) చెయ్యాలి. అపుడు ముక్తి వస్తుంది.

శంకరాచార్యుడు తత్త్వవిదుడు. ఆయన గొప్పతనమును యిచట ఉన్నవాళ్ళెవరూ కాదనరనే అనుకుంటాను. ఆయన ప్రస్థాన త్రయముపై

భాష్యము వ్రాశారు. ఈ సంగతి మీ కిదివరకే చెప్పాను. ఆయన బ్రహ్మ సూత్రములకు భాష్యం వ్రాస్తూ, కరణ వదితి చేత్ న ; భోగాదిభ్యః - (బ్ర.సూ. 2-2-40) అనే సూత్రానికి యిలా భాష్యం వ్రాస్తారు. ముందు సూత్రానికి అర్థం చెప్పి తరువాత ఆయన వ్రాసిన భాష్యాన్ని గురించి చెపుతాను. సూత్రార్థం భగవంతునికి శరీరమున్న దందురేని అది సరికాదు. శరీరమున్నచో భోగాదులు సంభవించును.

శంకర భాష్యం : "అథ లోక దర్శనానుసారేణ, ఈశ్వర స్యాపి కించిత్ కరణానా మాయతనం కామేన కల్ప్యేత ః ఏవమపి నోప పద్యతే సశరీరత్వేహి సతి సంసారి వద్ భోగాది ప్రసంగాత్ ; ఈశ్వరస్యా ప్యనీశ్వరత్వం ప్రసజ్యేత"

తాత్పర్యం : "లోకమున చూడబడునట్లు భగవంతునికి శరీరము, కల్పింతుమేని, అదియును తగదు. ఈశ్వరుడు శరీరధారి యగు నెడల సాంసారిక పురుషునివలె సుఖ దుఃఖాదులను అనుభవించవలసిన వాడగును. సుఖదుఃఖములకు లోబడునెడల ఈశ్వరునికి ఈశ్వరత్వము ఉండనేరదు. అతడు ఈశ్వరుడు కాలేడని భావము.

ఈశ్వరుడు - అంటే నియమించేవాడు అని అర్థము. జనులకు లోబడితే జనేశుడు (రాజు) కాదు. నరులకు లోబడితే నరేశుడు (రాజు) కాదు. ఈశ్వరుడు శరీరధారణ చేసినట్లయితే తన ఈశ్వరత్వమును పోగొట్టుకుంటాడు. ఆయనకు ఏవిధంగాను శరీరసంబంధం అంగీకరించరాదు.

'శుద్ధం' - పరమాత్ముని యింకొక లక్షణం శుద్ధ స్వరూపం. ఆయన మలిన రహితుడు. రాగద్వేషాది మలినము లాయనలో లేవు. ఆయన ఫలము కోరి కర్మలు చేయడు. ఈ సృష్టిని రచించటం జీవుల భోగము కొఱకేనని గుర్తించాలి. ఆయన విశ్వమంతట వ్యాపించి ఉన్నా నీళ్ళలోని తామరాకు వలె దేనిని అంటకుండా ఉంటాడు.

అపాపవిద్ధం : అంటే భగవంతుడు పాపముగూడ చెయ్యడు అని. చూడండి, ఈ మంత్రంలో పరమేశ్వర స్వరూపం ఎంతటి స్పష్టపదాలతో చెప్పబడిందో, ఈ మంత్రం పెద్ద పెద్ద అక్షరాలలో వ్రాసి ఫ్రేమ్ కట్టించి ప్రతి

యింటా తగిలించుకోవచ్చు. విష్ణువు, రాముడు, కృష్ణుడు వీళ్ళకు పాపం అంటింది కర్మఫలముల ననుభవించారు. విష్ణువు ఇంకా సాలిగ్రామమై నదిలో పడి ఉన్నాడు ! బహుశః అతడెప్పుడూ అలాగే ఉండవలసి వస్తుందేమో కూడ ! కాని పరమేశ్వరుడు పాపాలు చెయ్యడు కనుక ఆయనను 'అపాపవిద్ధం' అన్నారు.

'కవిః' - అంటే క్రాంత దర్శి. ఆయన పదార్థములను లోపల వెలుపల కూడ తెలుసుకోగలడు. ఆయన కావ్యం వేదం. పశ్య దేవస్య కావ్యం న మమార న జీర్యతి - దేవుని కావ్యం చావదు, జీర్ణించదు. మనవాళ్ళు వాల్మీకిని ఆదికవిని చేశారు. అసలు కవిని వదలిపెట్టి. అసలు ఆదికవి పరమేశ్వరుడు. రామాయణమునకు పూర్వమే కావ్యాదులున్నాయి. వేదం ఉన్నది. భాషా వైచిత్ర్యం కూడ వేదంలో ఉంది. వేద మంత్రములలోని లక్షణములను బట్టి భాషను బట్టి యిది గ్రహించగలం. లౌకిక కవులు భగవంతునివలె క్రాంతదర్శులు కాకపోవచ్చు.

వేదములు అపౌరుషేయములు. పురుష నిర్మితమైనవి కావు. అని కొందరందురు. పురుషుడంటే పరమేశ్వరుడు. పరమేశ్వరుడు కూడ వాటిని రచించలేదు. కనుక అవి అపౌరుషేయములు అని మీమాంసకుల వాదం. ఈ వేద శబ్దాలు నిత్యంగా ఆకాశంలో ఉంటాయి. వాటిని మహర్షులు తమ సమాధి స్థితియందు దర్శించి ప్రచారం చేశారు అని అంటారు. మంత్రముల కర్థమును కూడ వారు సమాధి స్థితులలోనే గ్రహించగలిగారు. మహర్షులు వేద మంత్రములను గ్రహించ గలిగిన Receiving Stations (గ్రహణ నిలయాలు) ఎక్కడో రేడియో స్టేషనునుండి ఈథరు (ఈథరు : ఇది ఒక విధమైన ఆకాశ పదార్థం.ఇది సర్వవ్యాపకంగా ఉంటుంది. దీనిని సైంటిష్టులు కనుగొన్నారు. దీనిలో కాంతి తరంగము సెకనుకు, 1,86,000 మైళ్ళ వేగంతో ప్రయాణించ గలదు) లోనికి ప్రసారం చేయబడిన కార్యక్రమములను రేడియోద్వారా మనం యింటిలోనే వినగలుగుతున్నాము. రేడియో మనకు Receiving Set (గ్రహణయంత్రం) అలాగే యిదిన్నీ.

ఇక వేదములు ఈశ్వరీయములను వారి దృష్టిలో, పరమేశ్వరుడు

నిత్యం. వేదం పరమేశ్వరుని జ్ఞానం. పరమేశ్వరుడు నిత్యము కనుక పరమేశ్వర జ్ఞానమైన వేదంకూడ నిత్యమే. అచ్చు వేసిన గ్రంథాలు నశించవచ్చు. కాని శబ్దరూపమైన వేద విజ్ఞానం మాత్రం ఎప్పుడూ నశించదు. ఎన్ని కల్పములు మారినా ఆ విజ్ఞానం మాత్రం అలాగే ఉంటుంది.

'మనీషీ' - 'మనసాం ఈశః' ఆయన జీవుల మనోవృత్తుల నెరుగువాడు కనుక మనీషి. జీవులు చేసే సత్సంకల్పములను, దుస్సంకల్పములను ఎప్పటి కప్పుడాయన గ్రహిస్తూనే ఉంటాడు.

పరిభూః - పరమేశ్వరుడు అంతటా ఉంటాడు గనుక ఆయనను 'పరిభూః' అన్నారు. లేక దుష్టులను పరిభవించగలవాడు - అన్నిటినిమించిన శక్తి కలవాడు అని కూడ అర్థం.

'స్వయంభూః' - అంటే ఆయన ఉనికి రెండవ పదార్థంపై ఆధారపడి లేదు. ఆయన స్వతఃసిద్ధంగా ఎప్పుడూ ఉంటాడు. పరమేశ్వరుని అంగీకరించని కేవల భౌతికవాదులు కొందరు, యీ సృష్టి స్థితి లయములకు కారణమైన పరమేశ్వరు డొకడున్నాడని మీరంటున్నారు కదా ? మరి ఆయనను సృష్టించిన వాడొక డుండాలి కదా ? ఆయ నెవరు ? అంటారు. ఆయన్ని సృష్టించిన వాళ్ళెవరు అని మళ్లీ అడుగుతారు. ఇలా చెప్పుకుంటూపోతే అది తెగదు. దీనినే అనవస్థాదోష మంటారు. అలా అడిగే వారికి ఒక నమస్కారం పెట్టి, సరే బాబు మీదే రైటు (Right మీరు చెప్పిందే నిజము) అని ఒప్పుకొని, నేను వాళ్ల నొకటి అడుగుతాను. తమరు అసలు యీ ప్రపంచం ఉన్నదని ఒప్పుకుంటారా ? ఆహా! ఒప్పుకుంటామంటారు. మరి యీ ప్రపంచానికి కారణ మేమిటి ? అంటే దానికి కారణమేముంది ? అది అలాగే ఉంది అంటారు. అవును, పరమేశ్వరునికి మాత్రం వేరే కారణమెందుకు ? పరమేశ్వర తత్వం కూడ 'అలాగే ఉంది' అని మీ రెందు కంగీకరించరు అంటాను. ఇక ఏం చేస్తారు. (సభలో నవ్వులు)

పరమేశ్వరుడు ఈ సృష్టికి కారణమన్నాం. సృష్టికార్యం. లాజిక్ (Logic) తర్కశాస్త్రమునకుండే బేస్ ఆధారమునుబట్టి కార్యానికి కారణం అడుగవచ్చు. కాని, కారణానికి కారణం అడుగరాదు. అంటే కార్యానికి కారణం ఉంటుంది.

మూలకారణానికి కారణం ఉండదు. ఉదాహరణకు ; వృక్షము - బీజము యీ రెంటిలో ఏదిముందు ? కొందరిదొక పెద్ద సమస్యగా చర్చించుకుంటారు. విత్తుముందని ఒకరు ; చెట్టుముందని యింకొకరు. ఇలా వాదిస్తుంటారు. నా ఉద్దేశ్యంలో యిదొక పెద్ద సమస్య కాదు. ఎలాగంటే విత్తనం కారణం. వృక్షం కార్యం. కార్యానికెప్పుడూ కారణం ముందుంటుంది. అందుచేత విత్తనం ఎప్పుడూ వృక్షానికి ముందే ఉంటుంది. Cause(కారణం And result (కార్యం) వీటిల్లో (Cause) కారణం ముందుంటుంది, తరువాత (Result) కార్యం వస్తుంది. ఎప్పుడూ మూలకారణానికి కారణం ఉండదు. అందువలన పరమేశ్వరుడు కారణరహితుడు.

"యాథా తథ్యతోz ర్థాన్ వ్యదధాత్ శాశ్వతీభ్యః సమాభ్యః"

సనాతనులు, అనాది స్వరూపులు - స్వరూపంతో ఉత్పత్తి వినాశములు లేని జీవుల కొఱకు యథాతథంగా పదార్థాలను పరమేశ్వరుడు చేస్తున్నాడు.

జీవుడు, ఈశ్వరుడు. ప్రకృతి యీ మూడు మూలపదార్థాలు కలిసి విశ్వ మనబడుతుంది. ఇందులో పరమేశ్వరుడు సర్వవ్యాపకుడై ఉంటాడు. ఆయన సర్వజ్ఞుడు ; సర్వ శక్తిమంతుడు. జీవుడు చేతనుడు ; ప్రకృతి జడము; ఇవి రెండును వ్యాప్యములు. ఈమూడు అనాదులు, శాశ్వతమైనవి. కాని ప్రకృతి పరిణామం చెందుతుంటుంది. రూపాంతరములు పొందుతుంటుంది. సర్వవ్యాపకుడైన పరమేశ్వరునిలో మిగిలిన రెండు పదార్థాలు - అంటే జీవ, ప్రకృతులుంటాయి. వ్యాపక తత్త్వంలో అన్ని పదార్థా లుంటాయి, కొందరు దీనిని కాదని, కేవలము (Absolute) ఒకే పూర్ణ పదార్థం మాత్రమే ఉన్నదంటారు. ఇది సరిగాదని తోస్తుంది.

ప్రపంచంలోని కార్యములు అనేక కారణములచే ఏర్పడుతున్నాయని మన కర్థమవుతుంది. కనుక ప్రపంచం కార్యమైతే యిది ఏర్పడుటకు అనేక కారణాలుండాలి, అనేది నియమం. కేవల భౌతిక వాదులు ప్రపంచమున కనబడు చైతన్యమునకు కారణం చెప్పజాలరు. భౌతిక పదార్థములకు కారణభూతములైన ఎలక్ట్రానిక్స్, (Electrons) న్యూట్రాన్స్, (Neutrons) ప్రోటాన్స్, (Protons) అను సూక్ష్మ పదార్థములలో చైతన్యం కనిపించదు.

కాబట్టి వానిచే ఏర్పడు స్థూల ప్రపంచమునందు కనబడు చైతన్యమునకు కారణము దురూహ్యము.

తరువాత - మరి కేవల చేతనవాదులు ఒకే ఒక చైతన్య పదార్థం (బ్రహ్మము) ఉంది. జగత్తు మిథ్య అంటున్నారు. సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' - యిలాంటి బ్రహ్మతత్త్వంలో జడతత్త్వం ఎలా వస్తుంది అని యీ కేవల చేతనవాదుల నడిగితే సమాధానం రాదు. అందుచేత, యీ ప్రపంచ సమస్యను కేవల చేతనవాదం కాని, కేవల భౌతికవాదం కాని పరిష్కరించలేవు. ఇందుకు 'త్రిత్వవాదమే' సరియైనదని వేదం బోధిస్తున్నది. ఋగ్వేదంలో ఒకచోట మూడు మూలపదార్థాలున్నాయని ఆలంకారికంగా వర్ణించబడింది.

"ద్వా సుపర్ణా సయుజా సఖాయా. . . . అభిచాకశీతి"

ఈ మంత్రార్థమును 26-12-68 తేది ఉపన్యాసములో చెప్పియే యున్నాను.

ఇలాగే ఉపనిషత్తులో కూడ చెప్పబడింది.

అజా మేకాం లోహిత శుక్ల కృష్ణాం బహ్వీః ప్రజాః సృజమానాం సరూపాః
అజో హ్యేకో జుషమాణో ऽనుశేతే జహాత్యేనాం భుక్తభోగా మజోऽన్యః॥ శ్వేతా. 4-5

తెలుపు, ఎఱుపు, నలుపు వర్ణములు కలిగిన ఒక ఆడు మేకను, తనకు సమానమైన బహు సంతానమును కను దానిని ఒకమగమేక ఊరకనే అంటిపెట్టుకొని ఉంటుంది. రెండవ మగమేక ఈ ఆడుమేకను అనుభవించిన తరువాత విడిచిపెడుతుంది. అని సామాన్యార్థము. ఇచట తెలుపు, ఎఱుపు, నలుపు వర్ణములుకల మేక సత్వరజస్తమో గుణములు గల ప్రకృతిని సూచిస్తుంది. సమానమైన బహు సంతానమును కనునది అనుటచే, ప్రకృతిరూప కారణమునుండి సమాన గుణములు కలిగిన స్థూల పదార్థములు ఏర్పడునని సూచింపబడినది. దాని నంటిపెట్టుకొని ఉన్న మగమేక పరమాత్మగా వర్ణించబడింది. అలాగే యీ ఆడు మేకను అనుభవించి విడిచిపెట్టే మగమేక ముక్తజీవుడుగా వర్ణించబడ్డాడు. ముఖ్యంగా ఈ మూడు అజ శబ్దంచేత చెప్పబడటం వలన యివి పుట్టినవి కావని తెలుస్తున్నది. పరమాత్మ. జీవ.

ప్రకృతులు ఇవి మూడును అజములు. అనగా వీని కెన్నడును జన్మములేదు. ఈ మూడును సమస్త జగత్తునకు కారణములు. వీనికి కారణ మేదియు లేదు. ఈ అనాదియగు ప్రకృతిని అనాదియగు జీవుడనుభవించుచు అందు తగులుపడుచున్నాడు. పరమాత్మ దానియందు చిక్కడు, దానిని భోగింపడు.

భగవద్గీతలోకూడ వేదవ్యాస మహర్షి యీత్రైత సిద్ధాంతమును పొందుపరచినట్లు మనం చూడగలం.

ద్వా విమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవ చ
క్షరః సర్వాణి భూతాని కూటస్థో ఽక్షర ఉచ్యతే ॥ గీ. 15-1.3
ఉత్తమః పురుష స్త్వన్య ః పరమాత్మే త్యుదాహృతః,
యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ గీ. 15-17

ఇందు మొదటి శ్లోకములో క్షర' - అక్షరు లను పురుషులిరువురు కలరని చెప్పబడింది. ప్రకృతి మొదలు పృథివ్యాది పంచమహాభూతములు, సమస్త ప్రాణుల శరీరములు 'క్షర' పురుషుడు. అనగా క్షర శబ్దం చేత యిచట ప్రపంచం చెప్పబడింది. క్షర మంటే నశించడం. నశించడమంటె యిచట రూపనాశనమేకాని పదార్థ నాశనం కాదని గ్రహించాలి. శరీరధారి యయి శుభాశుభ కర్మలనుచేస్తూ వాటి ఫలములను అనుభవించు కూటస్థుడు అక్షరశబ్దంచేత చెప్పబడినాడు. కూటస్థుడనగా జీవుడు కూటము అంటే మాయ లేక ప్రకృతి అని. మాయలో ఉండేవాడు కనుక జీవుడు కూటస్థుడు అనబడినాడు. తరువాత రెండవశ్లోకంలో ఈ క్షరాక్షరుల కంటె విలక్షణుడైన ఉత్తమపురుషు డొక డున్నాడని చెప్పబడింది. ఇచట చెప్పబడిన ఉత్తమ పురుషుడే పరమాత్మ. అతడు భూ నభోంతరాళములు మూడింటిని అనగా విశ్వము నంతటిని వ్యాపించి పాలించుచున్నాడు.

యాథాతథ్యతో ఽర్థాన్ వ్యదధా చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః' -

జీవుల కొఱకు పరమేశ్వరుడు యీ ప్రపంచపదార్థములను సృష్టించు తున్నాడు అని యిచట మంత్రార్థం. కొంద రడుగుతారు - అసలు పరమేశ్వరుడీ సృష్టిని ఎందులకు చేస్తున్నాడు ? అయనకేమైనా ఉపయోగం ఉందా ? అయన ప్రపంచాన్ని సృష్టించకుండినా బాగుండేది, మనకీ యాతనలు తప్పేవి (సభలో చిరునగవులు) అని.

పరమేశ్వరుడు యీ సృష్టిని ఎందుకు చేస్తున్నాడంటే జీవులు చేసిన కర్మలఫలితాన్ని వానిచేత అనుభవింపజేయడానికి. ఈ సృష్టిరచన వలన ఆయనకేమీ ఉపయోగం లేదు. మరి ఉపయోగం లేనపుడు అసలు సృష్టిని చేయకుండ ఊరుకోవడం మంచిదికాదా ? అంటే, అలా ఊరుకోడు. అది ఆయన స్వభావానికి విరుద్ధం. అగ్నికి స్వభావం కాల్చడం. అగ్నిని కాల్చవద్దంటే ఊరుకుంటుందా ? ఊరుకోదు అట్లాగే పరమాత్మ. సృష్టి, స్థితి, లయములు చెయ్యడం ఆయన స్వభావం. మనకు సుఖశాంతులను కలిగించే నిమిత్తం చేస్తున్నాడు. భగవంతుడు ఈ సృష్టి చేయకుండా వుంటే జీవుల కీ కష్టాలు పోతాయి కదా యని కొందరంటారు. కాని, మనం ప్రపంచంలో దుఃఖాలకంటె ఎక్కువగా సుఖాలనే అనుభవిస్తాము. కాని విచిత్రమేమంటే, దుఃఖాలనే గుర్తుపెట్టుకుంటాము. సుఖాలను మరచిపోతాం. ముసలివాడుకూడ చావడానికి ఒప్పుకోడు. ఇంకా కొన్నేళ్ళు బ్రతికితే బాగుండు ననుకుంటాడు (సభలో నవ్వులు). జీవ నేచ్ఛ మనిషిలో ఉంటుంది. ఎందుకని ? ఏదో విధంగా ఈ జీవితంలో ఇంకా సుఖాన్ననుభవిద్దామని అతని అభిలాష. నాకు 70 సంవత్సరాలున్నాయి. ఈ నా జీవితకాలంలో 4 సంవత్సరాలు మాత్రం కష్టాలనుభవించాను. మిగతాకాలం నాకు సుఖంగానే గడచిపోతున్నది. నిజానికి మనం ప్రపంచంలో ఒక క్రమబద్ధ జీవితం గడపేటట్లయితే దీర్ఘకాలం జీవించి అనేక సుఖాలనుభవించవచ్చు. ఒక మిత్రుడు నాతో, ఈ సంసారంలో సుఖం లేదు, నీ పనే హాయిగా ఉంది అన్నాడు. సరే, యింకేం సంసారాన్ని వదలిపెట్టి నాతో బయటికి రావయ్యాఅన్నాను. ఎలా ! మా వాళ్ళు ఒప్పుకోరుగదా అన్నాడు. సరే మీవాళ్ళకు నేను చెప్పి వొప్పిస్తాను రమ్మంటే ఆహా ‹ . . . . . వీలుకాదంటాడు (సభలో నవ్వులు). కనుక మనుష్యుడు సుఖాలే ఎక్కువ అనుభవిస్తుంటాడు. కేవలం దుఃఖా లనుభవిస్తున్నా డనడం సమంజసం కాదు.

జడపూజలు చేయడం మొదలు పెట్టిన దగ్గర నుండి మనము అసలు వస్తుతత్త్వం (పరమేశ్వరుని యథార్థస్వరూపం) మరచిపోయాము, ఈ మంత్రంలో పరమేశ్వర స్వరూపం ఎలా వర్ణించబడిందో మీరు విన్నారు. ఇంక కొంచెం

చెపితే గాని విషయం పూర్తికాదు. ఈ ఉపన్యాసంలో మనం స్థూల సూక్ష్మకారణ శరీరాలు మూటిని గురించి చెప్పుకున్నాం. ఈ మూడు శరీరాలుకాక జీవునికి నాలుగవ శరీరంకూడ కలుగుతుందని గరుడ పురాణంలో చెప్పబడింది. పౌరాణికులు దీనికి 'యాతనా శరీరమని' పేరు పెట్టారు. శాస్త్రములో ఎక్కడా జీవునికి యీ యాతనా శరీరమున్నట్లు చెప్పబడలేదు. అయినా యీ యాతనా శరీరమేమిటో, దీన్ని గురించి తెలుసుకోవడం మంచిది.

మనుష్యులు మరణించినపుడు యమకింకరులు వచ్చి జీవులను పాశబద్ధులను చేసి యమలోకమునకు తీసికొని పోతారని పౌరాణికులంటారు. ఈ యమదూతలు కాక కృష్ణా - కాకివలె నల్లగా ఉంటారట ! (సభలో చిరునవ్వులు) యమదూతలు జీవుణ్ణి మొదట యముని దగ్గరకు తీసికొనివెళ్ళినపుడు అతనికి శరీరం ఏమీ ఉండదు. కేవల జీవునికి కష్ట సుఖములు కలుగవు. ఎవరు కలిగింపలేరు.

జీవుణ్ణి శస్త్రములు ఛేదించలేవు, అగ్ని దహించలేదు, నీళ్ళలో వేస్తే తడవడు, వాయువు ఎండించలేదు అని చెబుతుంది గీత.

'అచ్ఛేద్యో z యమదాహ్యో z యమక్లేద్యో z శోష్య ఏవచ '

గీ. 2-254

అంటే అతనిని ఏవిధంగా కూడ శిక్షించడానికి వీల్లేదన్నమాట. మరి అలాంటి జీవుణ్ణి, యమధర్మరాజు అగ్నిలో పడేసినా, సలసలకాగే నూనె కళాయిల్లో వేయించినా, ఏనుగులచేత త్రొక్కించినా, కఱకు ఱంపాలతో కోయించిన లాభం లేదు. ఎలా శిక్షిస్తాడు? శిక్షిద్దామంటే వీలు కాదయ్యె. జీవునికి స్థూల శరీరం ఉంటేగాని శిక్ష అనుభవింపడయ్యె. అందుకని చెప్పి భటుల్ని పిల్చి, ఒరే ! వీడు పనికిరాడు. వీణ్ణి మళ్లీ భూలోకం తీసుకువెళ్ళండిరా అంటాడట ! (సభలో నవ్వులు). పాపం మరి యీ సంగతి యమధర్మరాజుకు ముందుగా తెలియదు కాబోలు ! సరే యమభటులు జీవుణ్ణి తీసికొని మళ్ళీ భూలోకం వస్తారట! అప్పటికి, యీ చచ్చినవాని బంధువులు దశగాత్రాలు చేయించడానికి సిద్ధంగా ఉంటారు. దశగాత్రాలని చెప్పి వీళ్ళు వరుసగా పిండాలు వేస్తారు. ఈ పదిరోజులు వేసిన పిండాలు తిని జీవునికి హస్త ప్రమాణం

యాతనా శరీరం వస్తుందట. 'హస్త పరిమితం యాతనా శరీర ముద్భవతి'. ఇక అప్పుడు యమభటులు జీవుణ్ణి తీసికొని యమలోకానికి ప్రయాణమవుతారట ! ఈ ప్రయాణం సంవత్సరంపాటు సాగుతుందట ! పంద్రెండు నెలల్లో పంద్రెండు చోట్ల మజిలీ (మకాం) వేస్తారట ! ఈ ప్రయాణంలో జీవుడు ఆకలిదప్పులకు మాడకుండ, పాపం యిక్కడ పురోహితులు మాసికాలని చేయించుతారు. కారణమేమంటే, యిక్కడ పురోహితులకు బంధుబాంధవులకు భోజనాదులు పెట్టి సంతృప్తి పరిస్తే, యమలోక ప్రయాణంలో ఉన్న జీవునికి మధ్యలో భోజనాది సమస్త సదుపాయాలు ఒనగూడుతాయట ! మరి కొన్ని కోట్లమైళ్ళ దూరాన, యమలోకానికి ప్రయాణంచేస్తున్న జీవునికి. యిలా మాసికాలు పెట్టడం వలన అన్నాదులు చేరుతుంటే, గ్రామాంతరం వేళ్ళేవారికి దారిబత్తెంతో పనిలేదుకదా? (సభలో నవ్వులు). యమలోక ప్రయాణంలో ఉన్న జీవుడు ఆయా మజిలీలలో విశ్రమించుతాడట ! అందుకు పడక కావాలి కనుక యిక్కడ పురోహితునికి ఒక పట్టెమంచం, పరుపు దానం చెయ్యమంటారు. అలాచేస్తే అక్కడ జీవుడు పడుకోటానికి మంచం, పరుపు లభిస్తాయట ! (సభలో నవ్వులు), అదీ గాక యీ ప్రయాణంచేసే మార్గంలో అనేక సూర్యులు ప్రకాశిస్తూంటారట ! జీవుని కపుడు ఎండకు తలమాడి కాళ్ళు, బొబ్బలు పెడతాయని పాపం యిక్కడ పురోహితునికి ఒక క్రొత్త గొడుగు క్రొత్త చెప్పుల జత దానం చెయ్యమంటారు. అలాచేస్తే మార్గమధ్యంలో నున్న జీవునికివి లభించి ప్రయాణంలో నాతడు బాధపడడట ! కాని వీరిచ్చినవన్నీ యిక్కడ పురోహితుని దగ్గరే ఉంటవి.

ఇంతటితోనే జీవునికి యిక్కట్లు తొలగలేదు, సుమండీ, అసలు పెద్దగండం ఉంది. మధ్యలో వైతరణీనది ఒకటి దాటాలి ! దానిలో చీము నెత్తురు ఆకాలం ఈ కాలం అనకుండా ఎప్పుడు పారుతునే ఉంటుందట అది ఎండకాలంలో కూడ ఎండదట ! ఆ నది కొన్ని యోజనాల వెడల్పుంటుందట; అది దాటాలంటే జీవుడు ఒక్కడే దాటలేడట ? ఆ చీము నెత్తురులో పడి పాపం ఎలా ఈదుతాడు ? అందుకని, సహాయంగా ఒక గోవును పంపితే ఆ గోవు

తోకను పట్టుకొని జీవుడు ఎలాగో నదిని దాటుతాడట ! దాటేటప్పుడు తలతప్ప అతని శరీరం యావత్తు చీము నెత్తురులోనే ఉంటుందట. అప్పుడప్పుడు అలలతాకిడికి చీము నెత్తురు ముక్కుల్లోనికి, నోటిలోనికి పోతుందట పాపం ! ఎలాగైతేనేం గోవు ఉంటే మాత్రం జీవుడు వైతరణి దాటుతాడట ! అందుకని యిక్కడ పురోహితునికి ఒక గోవును దానం చెయ్యమంటారు. అలా దానం చేస్తే అక్కడ జీవునికి గోవు లభించి వైతరణి దాటుతాడు (సభలో నవ్వులు). ఇంకొక విచిత్రమేమంటే, యిక్కడ మనం చేసే దానాలు, అంటే గోవు, మంచం, పరుపు, గొడుగు, చెప్పులు యిత్యాది దానాలు, యిక్కడ పురోహితునికి చేస్తేనే అక్కడ జీవునికి చెందుతాయట ! యింకెవరికైనా దానం చేస్తే అవి చెందవట ! మరి యీ పురోహితులు వారికి ఏజంట్లో ఏమో మరి !

తరువాత యమ భటులు జీవుణ్ణి యమధర్మరాజు దగ్గర ప్రవేశ పెడతారట, అపుడు యమధర్మరాజు లెక్కల గుమాస్తా అయిన చిత్రగుప్తుణ్ణి పిలిచి ఏమిటి వీడిసంగతి ! పాపపుణ్యాల జాబితా బయటికి తీసి వీడేమిచేశాడో చెప్పమంటాడట (సభలో నవ్వులు). మహాప్రభో ! ఈ జీవుడు ఫలానా ఫలానా పాపాలు చేశాడని చిత్రగుప్తుడు చెపితే యముడతనికి తగినశిక్ష విధించి బాధలు పెడతాడట.

మా అమ్మ చనిపోయినపుడు నేనసలు దశగాత్రాలు చేయించలేదు. దశగాత్రాలు చేస్తేగదా ఆమెకు యాతనాశరీరం వచ్చేది ? యాతనాశరీరం ఉంటే గదా మా అమ్మను యముడు శిక్షించేది ? యాతనాశరీరం లేనిదే యమధర్మరాజు కూడ మా అమ్మను ఏమీ చేయలేడుకదా ! అందుకని యీ సంగతి మా అన్నయ్యకు చెప్పి మా అమ్మకు దశగాత్రాలు చేయడం మాన్పించాను. యాతనా శరీరం లేదని యముడు మా అమ్మను తిరిగి పంపించివేశాడనుకోండి, మంచిదేకదా ! ఆమె వచ్చి యింట్లోనే ఉంటుంది. నష్టమేముంది. కాస్త యింటికి కాపలా అయినా కాస్తుంది గదా ! (సభలో నవ్వులు). నాకు తెలియని రోజుల్లో మా నాన్నకు మాత్రం రెగ్యులర్‌గా (Regular =క్రమముతప్పకుండా) తద్దినాలు పెడుతుండేవాడు మా అన్నయ్య. కాని మా అమ్మకు మాత్రం నేను పెట్టనివ్వలేదు. అందుచేత మా నాన్న సంగతి నాకు తెలియదు గాని, మా అమ్మ

మాత్రం నరకానికి వెళ్ళలేదని గట్టిగా చెప్పగలను (సభలో కడుపుబ్బ నవ్వులు వినవయ్యెను). మిగిలింది రేపు.

గుంటూరు, 31-12-1968
మంగళవారం, సా॥ గం. 6-00

మహాజనులార !

ఇంత వరకు 8 మంత్రాలు చెప్పుకున్నాం. ఈ మొదటి ఎనిమిది మంత్రములలో ఈశ్వరుని స్వరూపాన్ని గురించి తెలుసుకున్నాం. ఈ దినం యింకా విశేషంగా తెలుసుకుందాం. వేదము పరమేశ్వరు నొక్కనినే ఉపాసింపవలెనని చెపుతుంది. వేదములలో దేవునకు అనేకనామములున్నట్లు తెలుస్తుంది. వానిలో ఉత్తమనామం 'ఓం' అని ఎంచబడుతుంది. ప్రాచీన ఋషులు పరమేశ్వరుని 'ఓం' తోనే స్మరించారు. 'ఓం ఇతి ఉద్గీథ ముపాసీత' (ఛాం.ఉ.) భగవంతుని 'ఓం' అని ఉపాసింపవలెను. బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు, ఇంద్రుడు, లక్ష్మి, సరస్వతీ, శక్తి, కాళీ, అను నిట్టివి పరమేశ్వరుని నామములు. ఇలాంటి వింకా ఎన్నో ఆయనకున్నాయి. పై పేర్లకు ఒక్కొక్క దేవతను, ఆ దేవత కొక్కొక్క విగ్రహమును కల్పించి వానిని ఉపాసించడం మొదలుపెట్టారు పౌరాణికులు. దయానంద మహర్షి వీనిని నిరసించాడు. ఆయన ఈ యుపాసనలన్నీ అవైదికాలన్నాడు పరమేశ్వరుడు అంతటా ఉన్నాడు. ఆయన శరీర రహితుడు, సర్వశక్తిశాలి, శుద్ధుడు, పాపరహితుడు, కవి, మనీషి అని నిన్న చెప్పుకున్నాం. స ఏవ ఉపాసనీయ : అతడే ఉపాసింపదగినవాడు.

పరమేశ్వరునికి దేవుడు అనే పదంకూడ కలదు. వేదాలలో యీ 'దేవ' పదం చాలచోట్ల వస్తుంది. వ్యాఖ్యానకారులు వేదములలో చెప్పబడిన దేవతలు మొత్తం (33) ముప్పది ముగ్గురు. 'త్రయస్త్రిగంశో వైదేవాః' అని నిర్ణయించారు. **34వ దేవత పరమేశ్వరుడు.**

యాస్క మహర్షి తన నిరుక్తంలో 'దేవః' అనే పదాన్ని, దేవో దానాద్ వా, ద్యోతనాద్ వా, దీపనాద్ వా, అథ ద్యుఃస్థానాద్వా' అని నిర్వచించారు. వీటిని

గురించి ఒకనాడు (26-12-1968 తేది ఉపన్యాసములో దేవతలను గురించి చెప్పియున్నారు) సంక్షేపంగా చెప్పాను. దానము చేయుట, ప్రకాశించుట, ప్రకాశింపజేయుట, ద్యుఃస్థానమున నుండుట అను లక్షణములు గల భూమ్యాది పంచభూతములు, సూర్యచంద్రులు, విద్యుత్తు మున్నగు పదార్థములు శాస్త్రములందు దేవతలని వ్యవహరింపబడతాయని చెప్పాను.

కతి వైదేవాః' అవి ఎన్ని ? త్రయస్త్రిగ్ంశో వైదేవాః' - అవి ముప్పది మూడు. ఆ దేవత లెవరు? "అష్టౌ వసవః, ఏకాదశరుద్రాఃద్వాదశాదిత్యాః ఇంద్రః, ప్రజాపతిః",

అష్టవసువులు : ఆ ఎనిమిది దేవత లెవరంటే, పృథివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రములు. అష్టవసువులంటే పురాణాలలో చెప్పబడిన వసువులు కారు. పురాణాలలో అష్ట వసువులు శాపగ్రస్తులై శంతనునికి గంగ వలన పుడతారని, భీష్ముడు 8వ వసువని మనం చదువుతాము. వేదంలో చెప్పబడిన వసువులు వీరుకాదని గ్రహించాలి. 'వసంతి జీవా యేషు తే వసవః' - వేనియందు జీవులు వసించుతుంటాయో వానిని వసువు లంటారు. నీటిని వరుణలోకం అంటారు. అక్కడ జీవులుంటాయి. అలాగే వాయువులలో కూడ జీవులున్నాయి. భూమిపై ఉన్నాయి. అగ్నిలోకూడ జీవులున్నాయి. అవి అగ్నితత్త్వంగల తేజశ్శరీరములతో ఉంటాయి. జీవులు వసించుటకు తగిన స్థానములు కనుక ఈ ఎనిమిదింటికి వసువులని పేరు.

ఏకాదశరుద్రాః పది ప్రాణములు, జీవాత్మ కలిసి ఏకాదశ రుద్రులు అనబడతాయి. ప్రాణము, అపానము, ఉదానము, వ్యానము, సమానము అని ముఖ్య ప్రాణములు అయిదు. నాగ, కూర్మ, కృకల, దేవదత్త, ధనంజయము లను ఉప ప్రాణములు అయిదును కలిసి మొత్తం దశ ప్రాణములు. ఇవి శరీరంలో భిన్న భిన్న ప్రదేశములలో ఉండి పలు విధములైన పనులు చేస్తుంటాయి. 'హృదిప్రాణః' - హృదయంలో ప్రాణముంటుంది. ఇది ఊపిరితిత్తులు, గుండె వీటి చలనమునకు తోడు పడుతుంది. గుదే అపానః' - అపానము గుదస్థానములో ఉంటుంది. మలమూత్ర, వీర్య విసర్జనములు

దీని వలన కలుగుతుంటాయి. 'సమానో నాభి సంస్థితః - సమానమను ప్రాణము నాభిదేశమునందుండి జఠరాగ్నిని ప్రేరేపించి అన్నాదులను జీర్ణింప చేస్తుంది. 'ఉదానఃకంఠదేశస్థః' ఉదానమను ప్రాణము కంఠ మందుండి వాంతులు మున్నగు వానికి తోడుపడుతుంది "వ్యానః సర్వశరీరగః" - వ్యానము శరీరమంతటా ఉండి రక్త ప్రసరణకు తోడ్పడుతుంది. ఇవి అయిదును ముఖ్య ప్రాణములు. మిగిలిన ఉపప్రాణము లయిదును ఇలాగే శరీరమున పలురకముల కార్యములు చేస్తుంటాయి. ఈ పది ప్రాణములు, జీవుడు శరీరమును వదలిపెట్టినపుడు అతనితో కూడ వెళ్ళిపోతాయి. మనుష్యునికి ప్రాణములు పోయేటప్పుడు బంధువుల నందరిని ఏడిపిస్తాయి. కనుక నివి రుద్రులనబడతాయి. "రోదయంతీతి రుద్రాః" - ఇవి ఏడిపించే దేవతలు కనుక వీటిని రుద్రులన్నారు

ద్వాదశాదిత్యాః : ఆదిత్యులు పంద్రెండు. ఆదిత్యుడంటే సూర్యుడని అర్థం. సూర్యుని వలననే మనకు ఉదయ, సాయం సమయములు, రోజులు, నెలలు ఏర్పడుతున్నాయి. ఈ విధమైన కాలరూపంగా ఆయన జీవుల యొక్క ఆయువును హరించుతున్నాడు ; కనుక 12 నెలలకు ద్వాదశాదిత్యాః' అని పేరు. 'ఆదత్తే ప్రాణానికి ఆదిత్యః' ప్రాణుల ఆయువును గ్రహించుతాయి. గనుక 12 నెలలు ఆదిత్యులనబడినాయి. 32వ దేవత ఇంద్రుడు. ఇంద్రు డంటే మెఱపు అని. 33 వ దేవత ప్రజాపతి లేక యజ్ఞము వాయువు, జలము, ఔషధముల శుద్ధియును, విద్వాంసుల సత్కారమును, శిల్ప విద్యలను కలిగించి యజ్ఞము ప్రజలను పాలించుతుంది. కాబట్టి యజ్ఞమునకు ప్రజాపతి యని పేరు. ఈ ముప్పది మూడు దేవతలలో జీవుడు మాత్రము చేతన పదార్థము అంటే జ్ఞానం కలిగింది. మిగిలిన ముప్పది రెండును జడములు. కనుక చేతనుడైన జీవుడు ఈ ముప్పది రెండు పదార్థములను ఉపయోగించుకోవాలి. కాని ఉపాసింపరాదు. 34వ దేవత అయిన పరమేశ్వరుని మాత్రమే ఉపాసించుట యుక్తం. ఎందుకంటె పరమేశ్వరుడు పైన చెప్పిన 33 దేవతలకు స్వామి, అన్నిటికంటె గొప్పవాడు. సచ్చిదానందస్వరూపుడు. కనుక జీవుడు జడదేవతలను ఉపయోగించుకొని కేవలచైతన్య స్వరూపుడైన

ఈశ్వరుణ్ణే ధ్యానం చెయ్యాలి.

భగవద్గీతను విన్నవాళ్లు, చదివినవారు భగవంతు డవతరిస్తాడని అంటారు. రాముడు, కృష్ణుడు, క్రీస్తు మొదలైనవారు దేవుళ్ళు కాదని ఒకమారు చెప్పాను. అవతారవాదులు; రామ కృష్ణాదులు దేవుని అవతార మెందులకు కారాదంటారు. భగవద్గీతలోని రెండు శ్లోకాలు అవతారవాదులకు బలమైన ప్రమాణంగా కనబడతాయి.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత !
అభ్యుత్థాన మధర్మస్య తదా zz త్మానం సృజామ్యహమ్ ॥ గీ. 4-7
పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్,
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥ గీ. 4-8

ఎప్పుడెప్పుడు ధర్మమునకు ముప్పు కలుగుతుందో అప్పుడప్పుడు సత్పురుషులను రక్షించుటకు దుష్టులను శిక్షించుటకు, ధర్మమును సంస్థాపించుటకును నేను పుడుతుంటాను. ఇది పై శ్లోకముల అర్థం.

ఈ శ్లోకములను పరమప్రమాణముగా భావించి ఆస్తికులు భగవంతుడు అవతరిస్తాడంటారు. కాని వైదికులిది అంగీకరించరు. ఈ సిద్ధాంతం వేదశాస్త్రాల కనుకూలం కాదు. (పదచ్ఛేదం చేసి పదములను విడివిడిగా చదువుచు) చూడండి, అవతారపదం ఈ రెండు శ్లోకాల్లో లేదు. మరి దీన్నెలా కల్పించారో తెలియదు. కృష్ణుడు తానవతరిస్తుంటానని అన్నట్లు అవతారవాదులు చెపుతుంటారు. భగవద్గీతలో 700 శ్లోకాలున్నాయి. ఇచట గీతాపారాయణం నిత్యం చేసే భక్తులుంటారు. నాకెక్కడ అవతార పదం గీతలో కనబడలేదు. మరి వారికేమైనా తెలుసునేమో ! చూపవచ్చును.

భగవంతుడు జన్మించితే చచ్చి తీరాలి, 'జాతస్య హి ధ్రువో మృత్యుః - (గీ. 2-27) అని గీతే చెపుతుంది. అందుకని భగవంతుడు జన్మిస్తాడనకుండ ఆయన అవతరించుతా డంటారు ! ఆస్తికుడు దేవుడు చస్తాడంటే ఒప్పుకోడు. రామకృష్ణాదుల శరీరాలు మామూలు శరీరాలు కాదంటారు అవి లీలా మానుష విగ్రహాలట !

పిల్లవాళ్ళకు చదువుచెప్పే ఉపాధ్యాయులు బడి పిల్లలు ఏవైన ప్రశ్నలు

వేస్తే వాటికి సమాధానం చెప్పలేనపుడు కోపించి కూర్చోబెడతారు. (సభలో నవ్వులు) నేను ఇదివరలో ఎలిమెంటరీ స్కూలు టీచరుగా కొన్నాళ్ళు పనిచేశాను. ఒకరోజు పాఠం చెపుతుంటే ఆ పాఠంలో 'అంతఃకరణము' అనే పదం వచ్చింది. నేను తెలుగు నిఘంటువు చూచి దానికర్థము మనస్సని, చిత్తమని తెలుసుకున్నా. పాఠం చెపుతూ, అంతఃకరణమంటే మనస్సని అర్థం చెప్పాను. ఒక కుర్రవాడు లేచి సార్! మనస్సంటే ఏమిటి అన్నాడు. నేను ధీమాగా చిత్తమని జవాబిచ్చాను. ఇంకొక కుర్రవాడు లేచి, సార్! చిత్తమంటే ఏమిటండీ అన్నాడు. ఇక నాదగ్గర పదాలు అయిపోయినయ్. ఇంకేం చేస్తాను. వెధవా, చిత్తమంటే మనస్సనలేదా అని చెప్పి గదమాయించి కూర్చోబెట్టా ! (సభలో నవ్వులు)అలా ఉంటుంది మనవాళ్ళు చెప్పే, 'లీలామానుష విగ్రహం'. లీలేమిటి ? మానుషవిగ్రహ మేమిటి ? మానవ శరీరమును మానుష విగ్రహం అంటారు. మరి లీలేమిటి? అంటే ఈ శరీరం లేదనా ? రామునికి శరీరం లేనిదే ఆయనను కౌసల్య ఎలా ముద్దుపెట్టుకుంది ? ఆయన సీతతో చరింపలేదా ? రావణాదులు వేసిన బాణములకు ఆయన నొచ్చుకోలేదా ?

"ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం"

రామాయణం.

'నేను నన్ను, మనుష్యునిగా ఎంచుతున్నాను. నా పేరు రాముడు. నేను దశరథుని పుత్రుడను' అని ఆయన నిస్సందిగ్ధంగా చెపుతుంటే అవతారవాదులు ఆయనను భగవంతుడని, అవతారమని అంటుంటారు. శ్రీ కృష్ణుడంటాడు -

బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున !
తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరన్తప : గీత. 4-5.

'అర్జునా ! నాకును నీకును అనేక జన్మలు గడచినై. నేను వాటన్నింటిని ఎఱుగుదును, కాని నీ వెఱుగవు, అని కృష్ణుడు తాను జన్మలు ఎత్తినట్లు ఒప్పుకుంటున్నాడు. కనుక ఆయనకూడ అందరివలెజనన మరణములకు లోనయినట్లు తెలుస్తున్నది. యోగసిద్ధుడు కనుక ఆయనకు తానెత్తిన జన్మలు గుర్తున్నాయి. అర్జుననకవి గుర్తులేవు. కాని యిద్దరు జీవులే.

ఇక అవతార శబ్దాన్ని గురించి తెలుసుకుందాము. 'అవతరణ' మంటే

తరణం అంటే దాటడం, అవతరణం అంటే దిగడం అని అర్థం. దిగటం అంటే పైనుండి క్రిందికి వచ్చుట. "బాలః ప్రాసాదాత్ అవతరతి" - బాలుడు మేడనుండి దిగుచున్నాడు. ఒక శరీరధారి ఒకచోట నుండి ఇంకొక చోటికి దిగుట, ఎక్కుట సంభవిస్తుంది. మరి పరమేశ్వరుడలా కాదుగదా ! ఆయనసర్వవ్యాపి. శరీరము లేనివాడు. అలాంటివాడు అవతరించుతాడంటే ఎలా సాధ్యమౌతుంది. పైగా దేవుళ్ళని చెప్పబడే త్రిమూర్తులలో కూడ, ఒక్క విష్ణువుకే యీ అవతారాలు కల్పించారు. మరే దేవుళ్ళకు లేవు. ఆయనకు వైకుంఠము నొకదానిని సృష్టించారు. ఆయన వైకుంఠంలో ఉండి అప్పుడప్పుడు భూమికి దిగుతాడట !

అవతారములు రెండు విధములట : పూర్ణావతారములని, కళావతారములని. కృష్ణుడు పూర్ణావతారమట. రాముడు, పరశురాముడు తదితరులు కళావతారములట ! కళావతారములంటే ఆయనలోని కొన్ని కళలే యీ అవతారాల్లో ఉంటాయట. మరి రాముడుపుట్టకముందు కౌసల్య గర్భం ఖాలీగా ఉందా ! పరమేశ్వరు డామె గర్భంలో అంతకుముందే వ్యాపకమై ఉన్నాడుకదా ! ఆయన, ఈ ప్రపంచంలో లోపల వెలుపల అంతట వ్యాపించియే ఉన్నాడు. కదా. కనుక భగవంతుడు అవతరించుతాడనడం ఎట్లా పొసగుతుంది?

శరీరం జీవునికి కర్మఫలం అనుభవించడానికి వస్తుంది. శరీరం ఉంటేనే కర్మఫలాలను మన మనుభవించగలం. పరమేశ్వరుడు అవతార మెత్తి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తాడట ! శిష్టులను రక్షించి దుష్టులను మాత్రమే శిక్షిస్తాడట ! మరి కృష్ణుడు కంస, శిశుపాలాదులను మాత్రమే శిక్షించాడు. కాని ఆయన జరాసంధుని చేతిలో ఓడిపోయాడు. చివరకు అతన్ని భీమునిచేత చంపిస్తాడు. మీలో కొందరు గోపదేవ్ పురాణాలు బాగా చదువుకోలేదు, అందువలన జరాసంధునికి భీమునిచేతిలో చావవలసిన శాపమున్నదని తెలియదు అంటారేమో ! మరి కృష్ణుడు పరమాత్మ అయినపుడు, శాపమున్న సంగతి ఆయనకు తెలియవలయునుకదా ! బుద్ధి లేకుండా అతనితో యుద్ధం చేయడ మెందులకు ? పదహారుసార్లు తన్నులు తినడ మెందులకు ? (సభలో నవ్వులు) ఒక్కసారే భీమునిచేత చంపిస్తే పోదూ ! ఆయన చివరకు తన

యాదవ వంశం నాశనమవుతున్నా ఏమిచేయలేకపోతాడు ! తాను భిల్లుని బాణానికి గురియై చచ్చిపోతాడు. ఇదేమి టంటే భగవంతుడు రాముని అవతారంలో తప్పుచేశాడు. అందుచేత కృష్ణావతారంలో ఆ కర్మఫలం అనుభవించాడంటారు. మంత్రంలో 'అపాపవిద్ధం' - పరమేశ్వరుడు పాపముచేత అంటబడడు అని చెప్పబడినది కదా ! కనుక రామకృష్ణాదులు పాపఫలం అనుభవించుట చేత వారు, భగవంతు లెట్లవుతారు ?

పతంజలి మహర్షిని శిష్యులడుగుతారు. ఎలాంటివాడు ఈశ్వరు డనబడతాడని ఆయన చెపుతాడు.

'క్లేశ కర్మ విపాకాశయై రపరామృష్ట ః పురుష విశేష ఈశ్వరః'

యో. ద. 1-24

పురుష విశేషుడంటే - పురుషోత్తముడు, లేక పరమాత్మ అని. పరమాత్మ క్లేశములు, కర్మలు, విపాకాశయములు - వీటిచే అంటబడడు. జీవులే వీటి ననుభవిస్తారు.

"అవిద్యాఽస్మితా రాగ ద్వేషాభినివేశా ః (పంచ) క్లేశా ః "

యో.ద. 2-3

అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అని క్లేశములైదు. ఈ అయిదురకముల క్లేశములతో పరమేశ్వరునికి సంబంధం ఉండదు. ఉంటే అతడు పరమేశ్వరుడు కా డనవలసి యున్నది.

అవిద్య అంటే -

"అనిత్యాశుచి దుఃఖానాత్మసు నిత్య శుచి సుఖాత్మ ఖ్యాతి రవిద్యా "

యో.ద. 2-5

అనిత్యమైన వాటిని నిత్య మను కోవడం, అశుచిని శుచి అనుకోవడం, దుఃఖములను సుఖమను కోవడం, అనాత్మను ఆత్మయని యెంచడం అవిద్య అనబడుతుంది.

అరవిందుడు పూర్ణయోగమును గూర్చి ఎంతగానో చెప్పేవాడు. పూర్ణయోగంలో శరీరం చావదంటాడు. అది నిజమే ననుకొని అరవిందుడు మరణించునపుడు ఆయన శిష్యులు పేపర్లలో కూడ ప్రచారం చేశారు.

అరవిందుని శరీరం చెడదు ; అలాగే ఉంటుందని. చనిపోయిన తరువాత మూడు రోజులు ఆయన శరీరాన్ని అలాగే ఉంచారుకూడ. కాని వాసన పుట్టి మూడవనాడు పూడ్చివేయవలసివచ్చింది. శరీరం పంచభూతాత్మకం కనుక మరణానంతరం, దాని మూలపదార్థములలోని కది చేరిపోవడం ప్రకృతి ధర్మం. దాన్నెవరూ అరికట్టలేరు ? కనుక శరీరం నిత్య మెన్నడు కాదు.

మన శరీరంలోపల అన్నీ మలాలే. నవ ద్వారాలలోనుండి వచ్చేవన్ని మాలిన్యాలే. మలమూత్రములు, పుసి, గుమిలి, చెమట ఇత్యాది మలినాలు యీ నవరంధ్రాల నుండి ఎప్పుడూ వస్తుంటాయి. శరీరం అశుచికి పుట్ట. తోలు తీసి వ్రేలాడ గడితే యీ శరీరం భయంకరంగా ఉంటుంది. అందరి శరీరాలు యింతే కనుక అశుచియైన శరీరాలను శుచి అనుకోవడం అవిద్య. శంకరాచార్యు డంతటివాడు, ఒక మాలవాణ్ణి నీవు అస్పృశ్యుడవు, దూరముగా వెళ్ళు అంటాడు, తన అశుచమైన శరీరాన్ని గుర్తించకుండ యితరుని శరీరాన్ని అశుచి అనుకుంటాడు. ఇది అవిద్య. ఈ అవిద్య పండిత పామరులకు కూడ సమంగ ఉన్నట్లు తెలుస్తుంది. మనం మన శరీరం మాత్రం శుచి అనుకుంటాం. ఇతరులవి కావనుకుంటాం. సాటి మానవుణ్ణి కుక్క కంటె హీనంగా చూస్తాం. కుక్కలను, పిల్లులను యిళ్ళల్లో తిరుగ నిస్తాము. పైన ఎక్కించుకుంటాము. వాటిని ముద్దు పెట్టుకుంటాము కూడ (సభలో నవ్వులు) కాని సాటి మానవుణ్ణి మాత్రం దగ్గరకు చేరనీయము : ఇది అవిద్య.

ఇకపోతే 'అస్మిత' - అస్మిత మోహము, 'రాగము' - ప్రాపంచిక సుఖముల యందు అభిలాష కలగడం రాగ మన బడుతుంది. 'సుఖాను శయీ రాగః' - (యో.ద. 2-7) ప్రాపంచిక విషయములు మొదట సుఖముగానే ఉంటాయి. తరువాత దుఃఖములను కలిగిస్తాయి. కనుక రాగము కూడ ఒక క్లేశము. మనకు దేనివలన దుఃఖము కలుగుతుందో దానియెడ వైరభావము కలిగియుండుట ద్వేషము. 'దుఃఖాను శయీ ద్వేషః' (యో. ద. 2-8) ద్వేషమనేది కూడ ఒక క్లేశము క్రింద చెప్పబడింది. అభినివేశము - ఇది అయిదవ క్లేశము. అభినివేశ మంటే నేను చావ కుందును గాక! జీవింతునుగాక! అను భావము. ఈ అయిదు విధములైన క్లేశములకు పరమేశ్వరుడు అతీతుడుగా ఉంటాడు.

రెండవది. ఆయన శుభా శుభ కర్మలు కూడ చేయడు. మనము చేసే శుభా శుభ కర్మల వలన అంతఃకరణములో Impressions (సంస్కారములు) ఏర్పడతాయి. వీనినే వాసనలని విపాకాశయములని కూడ అంటారు. అవతార పురుషులు క్లేశాదులకు లోబడిన వారగుటచే వారు దేవుళ్ళు కారు.

కనుక పరమేశ్వరుడు క్లేశములు, కర్మలు, విపాకాశయములు వీటన్నింటికి అతీతుడు. కాని, అవతారవాదుల ప్రకారం, పై ఉదాహరణల వలన పరమేశ్వరుణ్ణి మనం ఎంత హీన స్థితికి తెస్తున్నామో అర్థమౌతుంది. వేదము లిట్టి సిద్ధాంతముల నంగీకరించవు.

ఇకపోతే 'ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' రాముడు, కృష్ణుడు, వీరుకాక ముందు ప్రపంచంలో ధర్మం లేదా ? పోతే రామునికి పూర్వం ఏకపత్నీ వ్రతం చేసినవారు, పితృవాక్యమును పాలించినవారు లేరా ? మరి ప్రత్యేకించి వీరు లోకానికి ఏమి నేర్పారో అర్థంకాదు. సృష్ట్యాది నుండి మన మహర్షులు ఈ ధర్మాలను బోధించడం లేదా ? వేదములలో ఈ ధర్మములు చెప్పబడడం లేదా ? భగవంతు డవతరించి లోకమునకు నేర్పిన క్రొత్త యేమున్నది ?

రాముని కాలంలో ఉన్న వాలి బలవంతుడు. అతడు రావణాసురుని కంటె బలవంతుడు. అలాంటి వానిని రాముడు చెట్టు చాటున ఉండి చంపుతాడు, చనిపోయే ముందు వాలి, రామా ! నీవు కాకితో కబురు చేస్తే నేను సీతను తెప్పించనా ! నన్నెందు కిలా దొంగచాటుగా చంపావని అడుగుతాడు, నీవు జంతువవు కనుక చాటున ఉండి వేటాడి చంపా నంటాడు రాముడు. మరి సుగ్రీవుడు (వాలి తమ్ముడు) కూడ జంతువే కదా ! కాని యతనితో రాముడు స్నేహం చేస్తాడు. ఇది ఎంతటి న్యాయంగా ఉందో చూడండి. జంతువు కనుక రాముడు వాలిని చెట్టుచాటున ఉండి చంపాడని వాల్మీకి తన రామాయణంలో అంటాడు. చూడండి, ఆయన ఎంతటి దుర్బల సమాధానం యిచ్చాడో !

నిర్మాణం చెయ్యడం కష్టమా లేక చెడగొట్టడమా ! నిర్మాణమే కష్టం. మేడ నిర్మాణం కష్టం. దాన్ని కూలద్రోయడం సులభం. అలాగే బిడ్డను చంపడం

సులభం కాని పుట్టించడం కష్టం. పుట్టించడం కష్టమని ఏ తల్లి నడిగినా చెపుతుంది. చంపటం సులభం. రావణాది దుష్టులను పుట్టించడానికి భగవంతు డవతరించాడా ! లేదుకదా ! మరి వాళ్ళను చంపడానికి అవతరించడ మెందుకు ? వాడి గుండెను ఆపివేస్తే సరిపోయేది కదా ! అపుడు రామావతారంతో పనిలేకుండా పోయేది. పైగా రావణాసురుని కాలంలో భగవదవతారమని చెప్పబడే పరుశురాము డెలాగూ ఉన్నాడు గద ! ఒకవేళ రావణుడు నరావతారం వలనగాని చావడంటే ! పరుశురాముడు కూడ నరావతారమే కద! ఆయనే రావణాసురుని చంపవచ్చును గదా ! వేరే, రాముడుగా భగవంతుడేల అవతరించవలసి వచ్చింది. దశావతారముల్లో ఒక్క పరశురాముడు మాత్రం బ్రాహ్మణావతారం. ఎందరో రాజులను చంపినవాడు. రావణాసురుణ్ణి అతడెందులకని చంపలేదు. రావణుడు పులస్త్యబ్రహ్మ కొడుకు. సాటి బ్రాహ్మణుడు. రాజు కాడు కదా ! బహుశా అందుకనే ఆయన రావణాసురుని చంపలేదేమో అనిపిస్తుంది. (సభలో నవ్వులు) మరి ఆ బుద్ధితో రావణుని వదలిపెడితే భగవంతుడు పక్షపాతి అగును కదా !

పైగా విష్ణువు అవతారములని చెప్పబడే వీళ్ళిద్దరూ (రాముడు, పరశురాముడు) ఒకళ్ళ నొకళ్ళు ఎదుర్కొంటారు. తామెవరో తెలుసుకోరు, శరీరం దాల్చడంతో వారికి మతి పోయిందేమో. లేకపోతే పరస్పరం యుద్ధం ఎందుకు చేస్తారు ? కాసేపు తన్నుకున్న తరువాత ఓహో మనమిద్దరం, విష్ణు అవతారం గదా అనుకుంటారు. (సభలో నవ్వులు). ఈ విధంగా అవతారవాదంలో పస కనిపించదు.

అదీగాక భగవంతుని అవతారాలన్నీ యీ దేశంలోనే పుట్టాయంటారు. ఇది ధర్మ భూమి కర్మభూమి యని చెప్పుకుంటారు. భగవంతుడు యిన్నిసార్లు యిక్కడే అవతరించాడంటే యీ దేశంలోనే పాపం ఎక్కువగా ఉన్నదని తేలుతుంది. ఇతర దేశాలలో ఈ అవతారాలులేవు. అందుచేత పాపంకూడ యింతగా అక్కడలేదేమో ! రావణాదులు, ముస్సోలిని, హిట్లర్లకంటే పాపులా! వారివలన వేలాది జనులు మరణించారు. అమెరికా వాడొకడు జపాన్‌లోని హిరోషిమా పట్టణంపై అణుబాంబువేసి క్షణంలో 2 1/2 లక్షల మందిని

చంపాడు (రెండవ ప్రపంచ యుద్ధంలో) రావణుడు వీళ్ళందరి కంటె ఎక్కువ పాపం చేశాడా ? మరి భగవంతుడు వారిని శిక్షించడానికి అవతరించ లేదెందుకు?

అందుచేత భగవంతు డెప్పుడూ శరీరధారి కాడని ఆర్యసమాజము వారంటారు. వేదములలో యిదే చెప్పబడింది. పగటివేషగాడి మాయలకే మనం లోనవుతాము. పరమేశ్వరుని లీలావిలాసములను తెలుసుకోగలమా ! భగవంతుడు సర్వ శక్తిమంతుడు కావున అవతరించగలడు అంటారు అటులయిన అతడు చావగలడా ? అంటే, అది ఒప్పుకోరు (సభలో నవ్వులు). భగవంతుడు సర్వవ్యాపి. శరీరధారణ చేయటం లేక అవతరించడం అనేది ఆయన స్వభావానికి విరుద్ధం స్వభావానికి విరుద్ధంగా చేయకపోవటం బలహీనత కాదు భగవంతుని చేత పగటివేషాలు వేయించడం ఆయన శక్తిసామర్థ్యాలకు నిదర్శనమా ? ఏ శరీరధారణ చేయకుండ ఈ మహావిశ్వమును సృష్టించగలిగిన పరమేశ్వరుని శక్తిసామర్థ్యములముందు రామకృష్ణాదులు చేసిన పను లెంతటివి?

భగవంతుడు సక్కుబాయికి పిండి విసిరాడట ! భూమిని చాపగా చుట్టి తీసికొని వెళుతుంటే హిరణ్యాకశిపుణ్ణి భగవంతుడు పంది అవతారంలో వచ్చి చంపాడట ! కూర్మావతారం. అంటే - తాబేలురూపం ధరించి భగవంతుడు మందరగిరిని మోశాడట ! ఇలాంటి కథలన్నీ మనం పురాణాల్లో చదువుతుంటాము. వేదాలల్లో యిలాంటి అవాస్తవికములు, హేతువిరుద్ధములు నైన విషయాలు ఎక్కడా చెప్పబడలేదు.

భగవద్గీతలో కృష్ణుడు 'సంభవామి' - పుడుతానంటాడు. పుడితే పుట్టనివ్వండి. చిక్కేమిటి, గాంధీజీ, అస్పృశ్యత దేశంలో ఉన్నంతకాలం నేను మరల అస్పృశ్యుల మధ్యలో పుట్టి అస్పృశ్యత (అంటరానితనం) నశించేవరకు విశ్రమించనంటాడు. దుఃఖములచే తపించు వారి కొఱకు, ప్రాణుల ఆర్తినాశనముకొఱకు జన్మలెత్తుతామంటారు మహాపురుషులు. తమకు స్వర్గం అక్కరలేదు. మోక్షసుఖం అక్కరలేదని మహాపురుషులు ఎంచుతారు. శ్రీ బాలగంగాధరతిలక్, - స్వరాజ్యం వచ్చేవఱకు నేను భారతదేశంలో మరల మరల పుడతానంటాడు. ఆయన చనిపోయేటప్పటికి మన దేశం స్వతంత్రం కాలేదనుకోండి. మహాత్ములు కోరి తాము పుట్టవచ్చును. కాని భగవంతుడు

పుట్టడమేమిటి ?

భగవంతుడు న్యాయకారి కనుక చేసిన తప్పులను ఆయన క్షమించడు. క్రైస్తవులు మనం చేసిన పాపాలను భగవంతుడు క్షమిస్తాడంటారు. క్రైస్తవులు తాము చేసిన తప్పులను ప్రతివారం ఫాదరీల చెవులలో చెపుతుంటే వారి పాపాలు పోతాయట. ఫాదరీ వాటిని భగవంతునికి (Submit) నివేదిస్తాడట క్రైస్తవులు ఒక వారంలో చేసిన తప్పులు ఫాదరీ చెవులలో చెప్పినందువల్ల తొలిగిపోతాయి కనుక, వారు మళ్ళీ వారం వచ్చేదాక, పాపాలు చెయ్యవచ్చు ననిపిస్తుంది. (సభలో నవ్వులు) ఇక మహమ్మదీయులు - తప్పులుచేసి 'తోబా' అని చెంపలు వేసుకుంటే పాపాలు పోతాయంటారు. వైదిక దేవుడు మాత్రం యిలా క్షమించడు. మీరు ఒప్పుకోకపోయినా ఫరవాలేదు. కర్మఫలితం తప్పని సరిగా అనుభవించాలంటుంది వేదం. 'నా' భుక్తం క్షీయతే కర్మ - అనుభవించకుండ కర్మఫలము వదలిపెట్టదు. చేసిన కర్మలఫలితము ననుభవింపజేసినప్పుడే భగవంతుడు న్యాయకారి అవుతాడు. మంచిచేస్తే మంచి, లేక చెడుచేస్తే చెడు తప్పనిసరిగా అనుభవింపచేస్తాడు. భగవంతుడు. లేకపోతే ఆయన అన్యాయకారి అవుతాడు. కొందరు తిరుపతి వెళుతుంటారు పాపాలు పోగొట్టుకోవడానికని, పాపపు డబ్బు కోట్లుగడించి ఎవరికి తెలియకుండా హుండీలో లక్షల రూపాయాలు పడవేస్తుంటారు.

దయాళుడు - భగవంతుడు దయాళు డనడంలో అర్థం, చేసిన తప్పిదములను క్షమించి విడిచిపెడతాడని కాదు. చేసిన తప్పులకు ఫలితమనుభవింప చెయ్యటంవల్లనే ఆయన దయాళు వవుతాడు, దొంగతనము చేసినవాణ్ణి క్షమించి విడిచిపెడితే మళ్ళీ దొంగతనాలు చేస్తాడు. కాని తగిన శిక్ష విధిస్తే దాన్ని మానుతాడు. వైద్యుడు రోగిపై దయదలచి చేదు మందును మ్రింగించడనుకోండి. వ్యాధి నయముకాదు. కాని బలవంతముగ నైనా రోగిచేత మ్రింగిస్తా డనుకోండి, వ్యాధి నివారింపబడుతుంది. అపుడు వైద్యుడు దయాళువా ! కాదా ! అలాగే పరమేశ్వరుడు కూడ దయాళువు కనుకనే తగిన శిక్షలు విధించి వాటిని మనచేత అనుభవింపజేస్తాడు.

అజన్ముడు : ఆయన జన్మలు ఎత్తడు. సర్వవ్యాపక పదార్థం జన్మ

లెత్తుటకు వీలులేదని యిదివరకే చెప్పుకున్నాము.

భగవంతునికి 'చిత్రగుప్తుడని కూడ పేరు, చిత్రాగుప్తిః యస్యస-ః చిత్రగుప్తః ఎవని రక్షణ క్రియ గుప్తంగా ఉంటుందో వాడు చిత్రగుప్తుడు. భగవంతుని క్రియలు చాల అద్భుతంగా ఉంటాయి. చూడండి, రాతి మధ్యలో కప్ప ఉంటుంది. అది జీవించడానికి తగిన నీళ్ళుకూడ అక్కడ ఉంటాయి. రాతిని పగులగొడితే, కప్ప బయటికివస్తుంది. రాతి మధ్యలో ఒక చిన్నగుంట, దానిలో నీరుకూడ ఉంటుంది. ఒకొక్క మారు రైలు ప్రమాదాలు జరిగి, బోగీ (రైలుపెట్టెల)లో ఉండేవాళ్ళందరూ చస్తారు. కాని కొండొక పసిపిల్ల బ్రతుకుతుంది. అలాగే 1932 సం॥ భూకంపంలో కొన్ని విచిత్ర సంఘటనలు జరిగాయి. అపుడు భూకంపం చాల ఉధృతంగా వచ్చింది. ఇంట్లో ఉంటే యిల్లుకూలి మీదపడుతుందనే భయంతో తల్లి బయటికి వస్తుంది. అమ్మా అంటూ పిల్లవాడు తల్లి వెనుకనే వస్తాడు. తల్లి నిలువబడినచోట భూమి చీలుతుంది. తల్లి అగాధంలో పడిపోతుంది. మరుక్షణమే చీలినభూమి మరల మూసుకుంటుంది. పిల్లవాడు మాత్రం రక్షింపబడతాడు. పరమేశ్వరుని రక్షణ క్రియలు ఎంత విచిత్రంగా ఉంటాయో చూడండి. కనుక చిత్రగుప్తుడంటే అర్థం యముని దగ్గర ఉండి లెక్కలు వ్రాసే గుమాస్తా కాదు. అది పరమేశ్వరుని పేరు. అలాగే 'యముడు' అన్నా పరమేశ్వరుని నామమే. యముడంటే నియమించే వాడని అర్థం.

అనాది : పరమేశ్వరుడు ఆది లేనివాడు. అంటే ఆయన ఎప్పటి నుండి ఉంటున్నాడో ఎవరికీ తెలియదు. ఆది అంటే మొదలు - కారణము. ఆదిలేనివాడు అనాది.

ఆనంతుడు : అంతము లేనివాడు కనుక అనంతు డనబడినాడు. అంతము అంటే చివర అని. చివర ఉన్నట్లయితే మొదలు ఉంటుంది. కనుక మొదలు చివరలున్నవాడు వ్యాపకుడు కాడు. ఆయన అనంతు డనబడినాడు.

నిర్వికారుడు : ఏ వికారములు లేనివాడు. అంటే ఆయనలో వృద్ధి క్షయాదు లుండవు.

అనుపముడు : ఉపమించడం అంటే పోల్చడం అని. ఆయన ఏ

వస్తువుచేత పోల్చుటకు వీలులేనివాడు. అతనికి సమానుడుకాని, అధికుడు గాని లేడు.

సర్వాధారుడు : విశ్వములోని సమస్త పదార్థములు ఆయన ఆధారముతోనే ఉంటున్నాయి.

సర్వవ్యాపకుడు : విశ్వమంతటా సూదిమోప సందులేకుండా సమస్త పదార్థములో వ్యాపించి ఉన్నాడు. కనుక ఆయన సర్వవ్యాపకుడు

అజరుడు : జర అంటే ముసలితనము. ఆయనకు ముసలితనమును లేదు. బాల్యము, యౌవనము,కౌమారము, వార్ధక్యము (ముసలితనము) అనేవి శరీరము ఉన్నవాళ్ళకు వచ్చే దశలు. భగవంతుడు అశరీరి కనుక ఆయనలో యివి లేవు. కనుక ఆయన అజరుడు.

అమరుడు : మరణం లేనివాడు చావుపుట్టుకలు శరీరానికి సంబంధించిన అవస్థలు. పరమేశ్వరునికి శరీరం లేదు. కనుక ఆయన మరణించడు. అందుచేత అమరుడు.

అభయుడు : భయములేనివాడు. ఆయన నిర్భయుడు. 'ద్వితీయాద్వై భయం భవతి' - (బృహదారణ్యకోపనిషత్తు). ఆయనకు సమానుడుకాని, ఆయనను మించినవాడు కాని రెండవ వాడెవ్వడు లేడు. కనుక ఆయన భయపడడు. అందుచేత ఆయన అభయుడు.

నిత్యుడు : ఆయన భూత, భవిష్యత్, వర్తమాన కాలము లన్నింటిలో ఉంటాడు. కనుక ఆయన నిత్యుడు.

పవిత్రుడు : ఆయన సమస్త మలినములకు దూరమైనవాడు కామ క్రోధములు ఈర్ష్యా ద్వేషములు, లోభమోహములు యిలాంటి వాయనలో లేవు. కనుక ఆయన పవిత్రుడు.

సృష్టికర్త : సూక్ష్మరూపములోనున్న మూలప్రకృతిని స్థూలముగా చేసి సూర్య, చంద్ర, నక్షత్రాది సమస్త పదార్థములను ఆయన నిర్మిస్తున్నాడు కనుక సృష్టికర్త.

ఈ విధంగా పరమేశ్వరుని మనం అంగీకరించాలి. ఇలా చెప్తే దయానందుణ్ణి, ఆర్యసమాజమువారిని లోకులు నాస్తికులని ప్రచారం చేస్తారు.

ఇది ఎంతటి అన్యాయమో చూడండి. ఆర్యసమాజమువారి మొట్టమొదటి నియమం చూడండి. "సమస్త సత్య విద్యలకును, విద్యవలన నెరుంగదగు సర్వపదార్థములకును ఆదిమూలము పరమేశ్వరుడు" ఇకరెండవ నియమంలో పరమేశ్వరుని గుణములు వర్ణింపబడినాయి. ఆయన "ఈశ్వరుడు, సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వశక్తిమంతుడు, న్యాయకారి, దయాళుడు, అజన్ముడు, అనాది, అనంతుడు, నిర్వికారుడు, అనుపముడు, సర్వాధారుడు, సర్వవ్యాపకుడు, సర్వాన్తర్యామి, అజరుడు, అమరుడు, అభయుడు, నిత్యుడు, పవిత్రుడు, సృష్టికర్తయునై యున్నాడు; అతనినే ఉపాసించుట యోగ్యము" అని. ఇప్పుడు మీకు తెలిసే ఉంటుంది. ఆర్యసమాజమువారు నాస్తికులో, ఆస్తికులో. ఆర్యసమాజమువారు నిజమైన ఆస్తికులేకాని, కొందరివలె ఆస్తికనామ ధారులైన నాస్తికులు కారని గుర్తించాలి. అందుకే మీకీ మాటలు వినిపించాను. పైన వివరించిన లక్షణములుకల పరమేశ్వరుడే ఉపాస్యుడని ఆర్యసమాజము వారు అంగీకరిస్తారు.

ఆర్యసమాజికులు పరమేశ్వరుణ్ణి గూర్చి చేసే వర్ణన అందరు అంగీకరించుతారు. కాని వాళ్లు చెప్పేది పెద్దమెట్లు, ఒక్కసారే మేడ పైకెగిరితే కాళ్ళు విరగవా అంటారు. అందుకని సగుణోపాసన మొదట చేయాలి అంటారు. సగుణోపాసన తేలిక నిర్గుణోపాసన కఠినమని అంటారు. విగ్రహ పూజను సమర్థించడానికి వారు సగుణోపాసన చేయాలని చెపుతారు. విగ్రహాలను పూజించవద్దని చెప్పడం ఆర్యసమాజికులు, క్రైస్తవులనుండి, మహమ్మదీయుల నుండి నేర్చుకున్నారని కూడ వారంటారు. ఇది చాల పొరపాటు. క్రైస్తవ మహ్మదీయులలో కూడ విగ్రహారాధన ఉన్నట్లు వారికి తెలియదు. క్రైస్తవులలో, క్యాథలిక్కులు మేరికన్య బొమ్మలను, శిలువలను ఆరాధించడం చూడగలం. మహమ్మదీయులకు వారి మస్జిద్‌లో విగ్రహాలు లేకున్నా, వారుచేసే 'హజ్ యాత్ర' వలన వారిలో కూడ విగ్రహారాధన ఉన్నట్లు తెలుస్తుంది. హజ్ యాత్ర చేస్తే పుణ్యవంతులవుతారని వాళ్ళ నమ్మకం. ఈ యాత్రలో వారు మక్కా, మదీనాలను దర్శించుతారు. మక్కాలో ఉన్న నల్లరాతిని ముద్దుపెట్టుకుని వస్తారు. అది ఒకప్పుడు శివలింగంగా ఉండేదని అభిప్రాయం. ఈ రాతికి

'సంగే ఆస్వద్' అని పేరు. 'సంగే ఆస్వద్' అనగా నల్లరాయి. కనుక వారిలోకూడ ఒక విధంగా విగ్రహారాధన ఉన్నదనే అర్థమవుతుంది. విగ్రహారాధన చేసేవాళ్ళను మహమ్మదీయులు 'కాఫిర్' లని బుత్ పరస్థ'లని అంటారు. బుత్‌పరస్థి శబ్దముబుద్ధపరః శబ్దమునకు వికృతము కావచ్చును. బౌద్ధులు విగ్రహారాధన చేస్తారు గనుక విగ్రహారాధన చేసేవాళ్ళను 'బుత్ పరస్థ' లని వారంటారు. 'హిందు' శబ్దం కాఫిర్ అనే అర్థంతోనే వాళ్ళు వాడతారు.

కనుక విగ్రహాది జడమూర్తుల నుపాసించవద్దనే సిద్ధాంతం, ఆర్యసమాజికులు క్రైస్తవులనుండి, మహమ్మదీయులనుండి నేర్చుకున్నారనడం పొరపాటు. పోతే రామ, కృష్ణాదులను మహాపురుషులుగా ఆరాధించితే ఫరవాలేదు. పరమేశ్వరుని స్థానంలో వారిని పూజించడంలోనే చిక్కువస్తుంది. సగుణోపాసన అంటే పరమేశ్వరునిలో ఉన్న గుణములను తెలిసికోవడం, నిర్గుణోపాసన అంటే భగవంతునిలో లేని గుణములేవో తెలుసుకోవడం, భగవంతుడు సగుణుడు నిర్గుణుడు అని కూడ అందరు అంగీకరించుతారు. ఆయన కేవలం సగుణుడుగాని కేవలం నిర్గుణుడు కాని కాదు.

ఒకపదార్థం తనకున్న గుణములచేత సగుణ మనబడుతుంది. తనలో అన్యపదార్థ గుణములు లేనికారణంచేత అది నిర్గుణమనబడుతుంది. అందుచేత ఏ పదార్థముగాని. సర్వగుణ సహితముగాని, సర్వగుణరహితముగాని కాదు. ఇట్లు ప్రతిపదార్థము సగుణము, నిర్గుణము, అని తెలియాలి.

ఉదాహరణకు : ప్రకృతి ఉన్నది . దాని గుణము లేమిటి ? శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము - యివి. ఈ గుణములు తనలో ఉండడం చేత ప్రకృతి 'సగుణ' మనబడుతుంది. దానిలో జీవుని గుణాలు పరమేశ్వరుని గుణాలు లేవుకనుక అది నిర్గుణమనబడుతుంది. అంటే జీవులలో ఉండే - ఇచ్ఛ, ద్వేష, సుఖ, దుఃఖ, ప్రయత్న, జ్ఞాన మనే గుణాలు, పరమేశ్వరునిలో ఉండే - సర్వవ్యాపకత్వ, సర్వశక్తిమత్వ, సర్వజ్ఞత్వాది గుణాలు ప్రకృతిలో లేవు గనుక అది నిర్గుణమనికూడ అనబడుతుంది.

అలాగే, జీవుడు కూడ, సగుణుడు, నిర్గుణుడు, అనబడతాడు. ఎలా! తనలో ఉండే ఇచ్ఛా ద్వేషాది గుణాలచేత జీవుడు సగుణు డనబడతాడు.

అతనిలో ప్రకృతి గుణాలు - సత్వరజస్తమస్సులు, జడత్వాది గుణాలు - సర్వవ్యాపకత్వాది ఈశ్వర గుణాలు లేవు. కనుక జీవుడు నిర్గుణు డనబడతాడు.

తరువాత పరమేశ్వరుడు కూడ అలాగే సగుణుడు, నిర్గుణుడు అనబడతాడు. తన గుణములైన సృష్టికర్తృత్వము, సర్వజ్ఞత్వము, సర్వశక్తిమత్వము, సర్వవ్యాపకత్వము ఇత్యాది గుణములచేత ఆయన సగుణు డనబడతాడు. జీవునిలో ఉండే ఇచ్ఛా, ద్వేషాది గుణాలు, ప్రకృతిలో ఉండే జడత్వాది గుణాలు ఆయనలో లేవు కనుక పరమేశ్వరుడు నిర్గుణు డవుతాడు.

కొందరు సగుణోపాసన తేలికంటారు. అలా అనడం మోసం. సగుణోపాసనకంటె నిర్గుణోపాసన తేలికనడం యుక్తం, మన గుణాలేమిటో మనకు తెలుసు. ప్రకృతిలో ఉన్న రూప, రస, గంధాది గుణాలన్నీ మనకు తెలుసు. ఇవి పరమేశ్వరునిలో లేవు. కనుక పరమేశ్వరుడు నిర్గుణుడని తెలుసుకొనడం సులభం. అలా ఆయన నిర్గుణుడని తెలిసికొని మనం భగవంతుని ఉపాసించాలి. ఇది నిర్గుణోపాసన అవుతుంది. ఇక సగుణోపాసన అంటే, - భగవంతునియందు ఏగుణము లున్నవో తెలిసి కొని, అతనిని భావించడం. అది సగుణోపాసన అనబడుతుంది. సర్వజ్ఞత్వం, సర్వవ్యాపకత్వం, సృష్టికర్తృత్వం,ఫలదాతృత్వం, ఆనందం,దయ, యిత్యాది గుణాలు, పరమేశ్వరుని గుణాలు. ఈ గుణములు తెలిసికోవడం సులభం కాదు. కనుక నిర్గుణోపానస కంటే సగుణోపాసన సులభం కాదని బోధపడుతుంది. ఏది సులభమైనా సులభం కాకపోయినా, భగవంతుని రెండువిధములా ఉపాసించడం అవసరం.

ఇచట ఒక విషయం చెప్పాలి. విగ్రహారాధకులు చేసే విగ్రహారాధన సగుణోపాసన కాదు. ఇది 'సాకార ఉపాసన అనాలి. సాకారం జడం. సాకారోపాసన చేస్తున్నారంటే ప్రకృతిని ఉపాసించుతున్నారని అర్థం. ఒక్కొక్కరు కొన్ని బొమ్మలను యింట్లో పెట్టుకొని, ఉపాసన చేస్తున్నామని చెప్పి రోజూ రెండు గంటలు వృథా చేస్తారు. (సభలో నవ్వులు)ఆ రెండు గంటలు అతనేమి చేస్తాడు ? ఆ బొమ్మలన్నింటికి తిలకం పెడతాడు, గంధం పూస్తాడు. పూలు అలంకరిస్తాడు. మరి ఒక దేవున కివన్నీ పెట్టి యింకొక దేవునికి పెట్టకపోతే ఆయనకు కోపం వస్తుందేమోని చెప్పి అన్ని బొమ్మలకు ఈ తతంగం అంతా

చేస్తాడు. తరువాత చెంపలు వేసుకుంటాడు (సభలో నవ్వులు). ఇది సగుణోపాసన కాదు. సాకార ఉపాసనే అవుతుంది. ఉపాసన అసలు మానసికం మాత్రమే నని గ్రహించాలి. బాహ్యముగా చేసేవి ఉపాసన కాదు. పరమేశ్వరునికి ఉన్న గుణాలేమిటో, లేని గుణాలేమిటో మొదట తెలుసుకోవాలి. ఆయనకున్న గుణాలను గూర్చి ధ్యానం చెయ్యడం సగుణోపాసన అవుతుంది. ఆయనలో లేని గుణాలను స్మరించడం నిర్గుణోపాసన అవుతుంది.

మీ కిపుడు సాకారోపాసన (విగ్రహాది మూర్తి పూజ) ఎలా సగుణోపాసన కాని, నిర్గుణోపాసనగాని కాదో వివరించడం జరిగింది. పరమేశ్వరుని గూర్చిన సగుణ, నిర్గుణ ఉపాసనలను గురించి శబ్దాలతో మాత్రం మీకిపుడు చెప్పాను. కాని యిది చాలదు. యోగాభ్యాసం చెయ్యాలి. స్వానుభవమును సంపాదించాలి. అపుడు మీరు నిజముగా పరమేశ్వరుని ఉపాసించినట్లవుతుంది.

సాకార ఉపాసన ఆర్యసమాజం ఒప్పుకోదు. అది కేవల నిర్గుణోపాసనం గాని, కేవల సగుణోపాసనం గాని ఒప్పుకోదు. ఇవి రెండూ చేయాలంటుంది.

'తమేవ విదిత్వాzతిమృత్యుమేతి నాన్యఃపంథా విద్యతే z యనాయ' యీ రెండు విధములైన ఉపాసనల ద్వారా పరమేశ్వరుని ఎరిగినవాడే ముక్తుడవుతాడు, వేరే మార్గం లేదు మిగిలింది రేపు చెప్పుకుందాము.

గుంటూరు. 1-1-1969

బుధవారం, సా॥ గం॥ 6-00

మహాజనులార !

మనం యిప్పటికి 8 మంత్రాలను గురించి చెప్పుకున్నాం. భగవంతుని స్వరూప స్వభావము లేమిటో తెలుసుకున్నాం. జీవుడు భగవత్తత్వాన్నే ఉపాసించాలని తెలుసుకున్నాం. స్తుతి ప్రార్థనలు - సగుణ, నిర్గుణోపాసనలు నిన్న చర్చించుకున్నాము.

శంకరుడు అద్వైత మతమును ప్రచారం చేశాడు. ఆయన కేవల చేతనవాది. అంటే పరమేశ్వరు డొక్కడే ఉన్నాడు. ప్రపంచం మిథ్య, అది ఉన్నట్లు తోస్తుందేగాని నిజమునకు లేదంటాడు. 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః' - బ్రహ్మము సత్యము, జగత్తు మిథ్య, జీవుడు బ్రహ్మమే

గాని వేరుగాదు అంటాడు.

మిథ్య అంటె సత్తాలేనిది, లేక ఉనికి లేనిదని అర్థం. ప్రపంచం మిథ్య అనడం వేద విరుద్ధం. లేని వస్తువు పుట్టడం గాని, పెరగడం గాని, నశించడంగాని సంభవించదు. కార్యరూపంలో కనబడిన వస్తుసముదాయం, కారణరూపంలో కనబడనంత మాత్రాన అసలు వస్తువే లేదనడం సరికాదు. అది నేటి విజ్ఞాన శాస్త్రానికి (Science) కూడ విరుద్ధం. అద్వైతులు, తమ సిద్ధాంతాన్ని నిరూపించుకోడానికి స్వప్న దృష్టాంతము, బింబ ప్రతిబింబవాదము, శుక్తిరజతభ్రాంతి, రజ్జుసర్పభ్రాంతి, ఎండమావులు యిలాంటి ఉదాహరణలను చెపుతారు. వీటిని సమాలోచిస్తే యివి విషమ దృష్టాంతములని, సరియైనవి కావని, అద్వైత వాదం హేతువాదానికి కూడ విరుద్ధమని తేలుతుంది.

జీవు డెవరు ? అంటే జీవుడు బ్రహ్మే నంటారు అద్వైతులు' బ్రహ్మకు లక్షణమేమి? ఉపనిషత్తులలో ''సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ'' అని వర్ణింపబడినది. మరియు దీనినే. నిత్య శుద్ధ, బుద్ధముక్త స్వరూపమనిరి. ఇది అద్వైతులు కూడ కాదనరు. అయితే జీవుడు అజ్ఞాని లేక అల్పజ్ఞాని. ప్రపంచములో మీ రెంతటి విజ్ఞానిని తీసుకొన్నా పరమేశ్వరుని జ్ఞానంతో పోల్చినపుడు అతని జ్ఞానం అల్పమని, పరిమితమని మన కర్థమవుతుంది. అందువలన జీవుడు బ్రహ్మమే యనుట సరికాదు.

ఇక ప్రపంచం లేదనడానికి వారు స్వప్న దృష్టాంతం చెపుతారు. మనం కలత నిద్రలో ఉన్నప్పుడు శరీరంలో ఏనుగు యీత్యాదులు కనబడతాయి. అవి నిజానికి శరీరంలో ఉన్నవా అంటే లేవు. కాని లేనివి ఉన్నట్లుగా కనబడతాయి. అలాగే ప్రపంచం కూడ ఒక కల, దీర్ఘ స్వప్నం అంటారు. ప్రపంచం లేకయే ఉన్నట్లు తోచును అని అద్వైతులంటారు.

స్వప్నం అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఎప్పుడైనా జాగ్రదవస్థలో చూచిన, వినిన వస్తువులే స్వప్నంలో కనబడతాయి. వస్తువు మాత్రం బయట ఉంటుంది. ఈ వస్తువులకు సంబంధించిన పూర్వానుభవం సంస్కార రూపంగా అంతఃకరణంలో ఉంటుంది. ఇలా ఉండిన పూర్వానుభవాలు

కలత నిద్రలో ఉద్బుద్ధ మౌతాయి. ఇదియే కల. 'స్మృతి రేషా స్వప్న దర్శనం' అంటారు శంకరులు. పూర్వం తెలిసినదాన్ని జ్ఞాపకమునకు తెచ్చుకోవడం స్మృతి లేక స్వప్నం అనవచ్చు. స్వప్నంలో కనబడిన వస్తువులు నిజానికి శరీరంలో లేవు. అంతమాత్రంచేత అవి బయట లేవన కూడదు. కనుక జగత్తు మిథ్య కాదు. స్వప్న దృష్ట వస్తువులు శరీరంలో లేకున్నను బయట ఉంటవి కదా !

అద్వైతులు ఇంకొక వాదన చేస్తారు. ఈ జగత్తు ఆదిలో లేదు. అంతంలో లేదు. కాని మధ్యలో ఉన్నట్లు కనబడుతుంది. అందుచేత జగత్తు మిథ్య అంటారు. ఈ వాదం కూడ శాస్త్రీయం కాదు. ఈ ప్రపంచ గత పదార్థాలు ప్రపంచం సృష్టించబడటానికి పూర్వం, ప్రపంచలయానంతరం లేవు అనడం సరికాదు. మనకవి కనబడనంత మాత్రం చేత మిథ్య అనడం ఉచితం కాదు. ఇవ్వాళ సైంటిస్టులు చేసే పనేమిటి ? కార్యాన్ని బట్టి కారణాన్ని కనుగొంటున్నారు. ప్రపంచ కార్యం. దీనికి కారణమైన మూలపదార్థాలేమిటి అని పరీక్షిస్తున్నారు. ఏయే పదార్థాలు కలిస్తే భూమి, జలము, వాయువు మొదలైనవి ఉత్పన్నం అయినవో ఆ మూలతత్త్వము లేమిటో అన్వేషించడమే నేడు వారు చేస్తున్నపని ఇప్పుడు ప్రపంచం కార్యరూపంలో ఉంది. ప్రపంచం స్థూల రూపముగా వ్యక్తము కాకపూర్వం సూక్ష్మమై కారణ రూపంలో ఉంది. ఇలా సూక్ష్మంగా ఉన్నదాన్ని స్థూలంగా చేస్తాడు పరమేశ్వరుడు సృష్టికాలంలో. అలాగే లయావస్థలో యిపుడు కార్యంగా ఉన్న జగత్తు సూక్ష్మంగా కారణరూపంలో ఉంటుంది. అంతేగాని లేనిది పుట్టదు, పుట్టినది లేకుండాపోదు. వస్తువు రూపాంతరం చెందవచ్చు. అంతే.

"నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః" గీ. 2-16

అందుచేత యీ ప్రపంచాని కంతటికి మూలతత్త్వం (ప్రకృతి) ఒకటున్నదని తెలుస్తుంది. కనుక జగత్తు మిథ్య అనడం సరికాదు.

ఇంకో విషయం : అసలు బ్రహ్మతత్త్వమే యిలా జీవ, జగత్తులుగా పరిణమించింది. అని కొందరు వాదిస్తారు. వారి వాదన ప్రకారం బ్రహ్మమే జీవుడుగా పరిణమించా డనుకోవాలి. ఈ వాదన కొంతవరకుసరిగా ఉన్నట్లే

కనబడుతుంది. కాని విచారించితే దీనిలోకూడ దోషముంది. లేనిది పుట్టిందనడానికి వీల్లేదు. కనుక పాలుపెరుగైనట్లు, మట్టికుండైనట్లు దారం వస్త్రమైనట్లు, బంగారం నగలైనట్లుగా పరిణమించితే, బ్రహ్మపరిణమించింది అనాలి. మరి బ్రహ్మమే జీవుడుగా పరిణమించితే, బ్రహ్మములో ఉండే గుణాలు జీవునిలో కనబడాలి. కాని కనబడవు. ఎందువల్ల అవి కనబడటం లేదు. అంటే, అనాదిగా మాయ ఉన్నది. ఆమాయకు లోబడి బ్రహ్మము జీవుడుగా వ్యవహరింపబడుచున్నాడంటారు. పోనీ ఈ మాయకు ఉనికి ఉన్నదా అని అడిగితే, దానికి ఉనికి లేదు. 'సత్తా లేనిది మాయ' అంటారు. మాయకు ఉనికి ఉన్నదంటే బ్రహ్మము, మాయఅనేవి రెంటుంటాయి. కనుక అద్వైతం సిద్ధంచదు. పైగా అనాది అని చెప్పబడే యీ మాయ వలన బ్రహ్మము ఎప్పుడూ జీవుడుగానే బద్ధుడై ఉండాలి. ఉనికి లేని మాయ బ్రహ్మము నావరించి అతనిని జీవునిగా చేయడమనేది పొసగదు. కనుక బ్రహ్మమే జీవుడుగా పరిణమించాడనడం కూడ సరికాదు.

అద్వైతులు 'సూర్యుడు ఒక్కడే అయినా నేఱుకుండల్లో ప్రతిబింబించి తాను అనేకమైనట్లు భాసించుతాడు. అలాగే బ్రహ్మతత్త్వం 'మాయ అనే ఉపాధిలో ప్రతిబింబించి జీవులుగా వ్యవహరింపబడుతున్నాడంటారు.

విమర్శించితే, స్వప్న దృష్టాంతంవలె యీ బింబ ప్రతిబింబ దృష్టాంతంకూడ సరిగా ఉన్నట్లు కనబడదు. ఎలాగంటే, ఒక సూర్యబింబం దూరంగా ఉండి, అనేక నీళ్ళకుండలుంటే దాని ప్రతిబింబం వాటిల్లో కనబడుతుంది. పైగా సూర్యుడు, కుండలు కూడ ఆకారం కలిగిన పదార్థాలవడం చేత నీళ్ళలో ప్రతిబింబాలు ఏర్పడతాయి. కాని బ్రహ్మతత్త్వం అలాంటిదికాదు. అది వ్యాపకతత్త్వం. వ్యాపకతత్త్వానికి ప్రతిబింబం ఏర్పడట మనేది పొసగదు.

కనుక కేవల బ్రహ్మతత్త్వ ప్రతిపాదనవలన కాని, కేవల ప్రకృతి తత్త్వ ప్రతిపాదనవలన కాని సమస్య పరిష్కారం కాదు. అందుచేత బ్రహ్మతత్త్వం, ప్రకృతితత్త్వం, జీవతత్త్వం, యీ మూడింటిని అంగీకరించితేనే యీ ప్రపంచ సమస్య పరిష్కార మౌతుంది.

జీవుడు పరమేశ్వరుని మాత్రమే ఉపాసించాలని వేద మేల చెప్పినదో

యీ మంత్రం వివరిస్తుంది.

"అంధం తమః ప్రవిశంతి యే zసంభూతి ముపాసతే

తతో భూయ ఇవ తే తమో య ఉ సంభూత్యాగ్ం రతా ః ॥ 9

భావార్థం : సమస్త జడజగత్తునకు ఉపాదాన కారణమగు ననాది నిత్య ప్రకృతిని ఉపాసింపదగినదిగా భావించి, అందు నిమగ్నులగువారు అవిద్యను బొంది, క్లేశముల ననుభవింతురు. ఆ మూల ప్రకృతినుండి యుత్పన్నమైన మహత్తత్వము (బుద్ధి), పృథివి మున్నగు స్థూలపదార్థములయందు చిత్తమును లగ్నముచేయువారు అంతకంటెను మిక్కిలి యగు నజ్ఞానమును బొంది ఎక్కువ కష్టముల పాలగుదురు. కావున సచ్చిదానంద స్వరూపుడగు పరమాత్మనే సదా ఉపాసింపవలెను.

తమస్సు అంటే చీకటి లేక అజ్ఞానం. అంధ తమస్సు అంటే కటికచీకటి లేక ఎక్కువ అజ్ఞానం. అని అర్థం. ఎవరు పరమేశ్వరుని విడిచి 'అసంభూతిని ఉపాసిస్తారో వారు అజ్ఞానంతో ఉంటారు. అలాగే, 'సంభూతిని' ఉపాసించేవారుకూడ భూయః - అంటె ఇంకా ఎక్కువ అజ్ఞానంలో ఉంటారని మంత్రార్థం. అసంభూతి, సంభూతి యీ రెండు పదముల కర్థం తెలుసుకుంటే యీ మంత్రం అర్థమవుతుంది.

సంభూతి అంటే పుట్టే వస్తువు. సంభవము అంటే పుట్టడం. 'సమ్యక్ భవతి ఇతి సంభవః' - కార్యపదార్థాన్ని సంభూతి అంటారు. ఇంద్రియములచే తెలిసికొనబడే పదార్థాలు సంభూతి అనగా స్థూల ప్రపంచం. కనుక ఈ స్థూల ప్రపంచాన్ని ఉపాసించేవారు అజ్ఞానులవుతారు. జడపూజలు చేసేవారు కష్టము లనుభవిస్తారు. కష్టసుఖాలు మనకు ప్రాపంచిక పదార్థాలవలననే కలుగుతాయి. కావున వాని ఉపాసన అజ్ఞానానికి దారితీస్తుంది.

వేదాహ మేతం పురుషం మహాంతం ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్ ।

తమేవ విదిత్వా zతి మృత్యుమేతి నాన్యః పంథా విద్యతే zయనాయ ॥

యజుర్వేదం. 31-18

తా॥ అజ్ఞానావరణమునకు ఆవలనున్న విజ్ఞాన మయుని, మహా పురుషుని నేను తెలుసుకున్నాను. అతనిని తెలుసుకుంటేనే మృత్యు ముఖము

నుండి (జనన మరణములనుండి) విడవడి అమృతత్వమును పొందగలం. వేరు మార్గము లేదు.

మనకు కలిగే కష్టములలో పెద్ద కష్టమేది? మృత్యువు. మనం మృత్యువునుండి తప్పించుకోవాలంటే మహాపురుషుని (పరమేశ్వరుని) తెలుసుకోవాలి. ఆదిత్యవర్ణం అంటే ప్రకాశమని అర్థం. ప్రకాశం, జ్యోతి యిలాంటి పదాలు జ్ఞానానికి బోధకాలు. తమసః పరస్తాత్ - ఆయనలో అజ్ఞానానికి తావులేదు. 'తమేవ విదిత్వైవ' - అతనిని తెలుసుకుంటేనే మృత్యువునుండి - అజ్ఞానమునుండి తరించగలం. 'న అన్యః పంథా విద్యతే z యనాయ' - వేరుమార్గంలేదు ; అని మనకు వేదం చెబుతుంది.

కాని జడోపాసకులు పరమేశ్వరుని పొందడానికి అనేక మార్గాలున్నా యంటారు. సీమిత వస్తువుకు అవధులుంటాయి. కనుక దాన్ని చేరడానికి మార్గాలుంటాయి. కాని పరమేశ్వర పదార్థానికి అవధులు (హద్దులు) లేవు. కావున కేవలం దాన్ని తెలుసుకోవడమే ముఖ్యం. 'నజ్ఞానా దృతే ముక్తిః - అంటే పరమేశ్వర సాక్షాత్కారం కలుగనంతవరకు ముక్తి లేదని అర్థం.

మొదట జీవేశ్వర ప్రకృతులను హేతుబద్ధంగా తెలుసుకోవాలి. దీన్నే సైద్ధాంతిక జ్ఞానమంటాము (Theoritical knowledge). అలా తెలుసుకున్న తరువాత పరమేశ్వర తత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి. ఆవిధంగా అనుభవించిన వ్యక్తికి ప్రాకృతిక పదార్థ బంధనాలు తొలగుతాయి. అపుడు ముక్తి సిద్ధిస్తుంది. యోగమార్గము వలననే యిది సాధ్యమవుతుంది. అంతేగాని విగ్రహాది జడమూర్తులకు, ధూప దీప నైవేద్యాలను సమర్పించినందు వలన సిద్ధించదు. సైంటిస్టులు కూడ స్థూల పదార్థాలను ఉపాసించుతున్నారు. అంటే ప్రయోగాలు చేసి వాటి తత్వములను తెలుసుకుంటున్నారు. జీవితం సుఖదాయకంగా ఉండేందుకు అనేక క్రొత్త క్రొత్త పదార్థాలను కనిపెడుతున్నారు. అలా మనం పదార్థాలను ఉపయోగించుకోవచ్చు. కాని వాటికి మ్రొక్కినందువలన ఉపయోగం లేదు.

తరువాత అసంభూతి : అసంభూతి అంటే పుట్టనిది. మూలరూపంలో ఉండేది. కారణము లేక సూక్ష్మరూపమున ఉన్న ప్రకృతి అనవచ్చు. ప్రకృతి

యింద్రియములకు గమ్యం కాదు. కాని యోగులు అంతర్ముఖులై సూక్ష్మ తత్వములను తెలిసికోడానికి ప్రయత్నాలు చేస్తారు.

ఆత్మపదార్థజ్ఞానం తెలియని వాళ్ళు - తన్మాత్రలు, అహంకారము, మూల ప్రకృతి అనెడి సూక్ష్మతత్వములలో మనస్సును ప్రవేశింపజేసి అదియే పరమార్థమని ఎంచుతారు. అట్టి వారిని ప్రకృతిలయులు అంటారు. ఏ యోగికి ఆత్మ పదార్థం తెలియదో అతడు ప్రకృతిని అధిగమించలేడు. ప్రకృతిలయులకు బాహ్యసంబంధమైన సుఖదుఃఖాలు ఉండవు. అయితే వీరికి ఆత్మానందానుభూతి మాత్రం ఉండదు. ప్రకృతిలయులు వేల సంవత్సరాలు బ్రతుకవచ్చు నంటారు. బాహ్యపదార్థాలను పరిశోధించే మన సైంటిస్టులు' కూడ యోగులే. వారు యంత్ర సహాయంతో అనేక వస్తువులను కనుగొంటున్నారు. మనస్సును ఏకాగ్రం చేస్తారు. కాని మనకు బాహ్యపదార్థ జ్ఞానం వలన ఆత్మానుభూతి మాత్రం కలుగదు. బాహ్య వస్తువుల నుండి విడివడి సమాధిస్థితిని పొందాలి. అపుడు ఆత్మానుభవం కలుగుతుంది. శరీరంలో మనకు మామూలుగా కలిగే అనుభవాలకంటె, కొన్ని విలక్షణమైన మార్పులు వస్తే పూర్ణానుభవం కాదు. ప్రాణాయామాదులు చేసి కొంత యోగ మభ్యసించిన వారికి మనస్సు శుద్ధమౌతుంది. అంటే సూక్ష్మ పదార్థాలను కనుగొనే శక్తిదానికి వస్తుందన్నమాట. చెవికి శబ్దములు వినబడతాయి. కొంద రీ శబ్దాన్ని (అనాహత నాదము) విని - శబ్ద బ్రహ్మను లేక నాదబ్రహ్మను తాము గ్రహించా మనుకుంటారు. అలాగే వింటుంటారు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ప్రకృతి సంబంధమైనవి. ఇవి బయట గోచరించినా, లోపల (అంతర్ముఖంగా) గోచరించినా ప్రకృతికి సంబంధించినవే. కనుక వీటిని ఉపాసించేవారు ప్రకృతిని ఉపాసించు తున్నారన్నమాట. అందుచేత వీళ్ళను ప్రకృతి ఉపాసకు లంటారు. అంటే వీళ్ళు స్థూల, సూక్ష్మ ప్రకృతులను ఉపాసించుతుంటారని అర్థం.

నిత్యో z నిత్యానాం చేతన శ్చేతనానాం
ఏకో బహూనాం యో విదధాతి కామాన్
త మాత్మస్థం యే z ను పశ్యంతి ధీరా
స్తేషాం శాంతి : శాశ్వతీ నేత రేషామ్ కఠ. 5-13

తా ॥ పరమాత్మ అనిత్యమైన ప్రాకృతిక పదార్థములందు నిత్యుడై ఉంటాడు. చేతనులైన జీవులలోనిత్యచేతనుడై ఉంటాడు. తానొక్కడే అయినా అసంఖ్యాకములైన జీవులలో తానుండి, వాటికి కర్మఫలముల నిస్తుంటాడు. ఏ ధీరులు తమలో ఉన్న ఆ పరమాత్మను (ధ్యానశీలురై) తెలుసుకుంటారో వారికి శాశ్వత శాంతి (ముక్తి) లభిస్తుంది. ఇతరుల కది లభింపదు.

కాబట్టి, ఆత్మస్థుని - అనగా తనలో ఉండే ఆపరమాత్మను తెలుసుకోవాలి. "తేషాం శాశ్వతీ శాంతి": - అలా తెలుసుకున్న వారికే శాశ్వత సుఖం లభిస్తుంది. వేరేమార్గం లేదు. కేవలం ప్రకృతి ఉపాసనవల్ల అంధతమస్సులో ఉంటారు. జడములను ఉపాసించడం వల్ల యింకా అంధతమస్సులో ఉంటారుఅని మంత్ర-తాత్పర్యం. తరువాత మంత్రం చెప్పుకుందాము.

అన్య దేవాహుః సంభవా దన్యదాహు రసంభవాత్ ।
ఇతి శుశ్రుమ ధీరాణామ్ యేనస్తద్ విచచక్షిరే ॥ 10

భావార్థము : కార్యరూప జడ వస్తువుల నుపాసించుటవలన కల్గు ఫలము వేరనియు, కారణ రూప పదార్థము నుపాసించుటవలన కలుగు ఫలము వేరనియు, విద్వాంసులు, ధీరులునైనవారు చెప్పుదురు. కాబట్టి మానవులారా ! మీరును ఆయా వస్తు గుణములను, వాని నుపాసించుట వలన కల్గు ఫలములను అట్లే గుర్తింతురుగాక ! ఫలభేదము ముందు రాబోవు మంత్రమున చెప్పబడును.

ధీరులు అనగా బుద్ధిశాలురు, ధ్యానశీలురు అని యర్థము.

'వికారహేతౌ సతి విక్రియంతే యేషాం న చేతాంసి త ఏవ ధీరా ః

'వికారం కలిగించే వస్తువు దగ్గరున్నప్పటికి ఎవరి మనస్సులో వికారం కలుగకుండా ఉంటుందో వారు ధీరులు, అని కాళిదాసు అంటాడు. ఆకలి కలిగితే పదార్థములను తింటాం. కాని ఆకలి లేనపుడు కూడ పదార్థాలను చూస్తే తినాలనిపిస్తుంది. మంచి ఎండాకాలం రోజుల్లో బంగినపల్లి మామిడి పండ్లు వస్తాయి. అవి చూడగానే తినాలని బుద్ధి పడుతుంది. నోరూరుతుంది. అలా నోట్లో నీరూరుట వికార మగును. కాబట్టి పదార్థములను చూస్తూకూడ ఏవిధమైన వికృతి కలుగని వారిని ధీరు లనాలి. ఇపుడు నా వెనుక ఒక సినిమా

తార వచ్చి నిలువబడిం దనుకోండి. అప్పుడు మీరు నన్ను శాస్త్రిగారూ! కాస్సేపు మీ ఉపన్యాస మాపండి అంటారు. ఆమెను చూడాలనే ఉద్దేశ్యంతో (సభలో నవ్వులు విననయ్యెను) అంటే వికృతి చెందుతున్నారని అర్థం. ధ్యానశీలుడైన యోగికి ఈ వికృతి కలుగదు. ఎందువలన ? అతని ఇంద్రియములు, మనోవృత్తులు అతని ఆధీనంలో ఉంటాయి. సామాన్యమైన వ్యక్తులకీ ఇంద్రియ నిగ్రహం కలుగదు.

యమ నియమాదుల ద్వారా ఇంద్రియ నిగ్రహం సంపాదించిన తరువాత ధ్యానం వస్తుంది. సాధకుడు ధ్యానం చేసేటప్పుడు మనసులో ఏవేవో చింతించరాదు. లక్ష్యపదార్థమే అవిచ్ఛిన్నంగా భాసించాలి. ఇది ధ్యాన మనబడుతుంది. ధ్యానస్థితి చాలాకాలం అభ్యాసం చేసిన తరువాత మాత్రమే వస్తుంది.

'అన్యదేవాహుః సంభవాత్ అన్యదాహు రసంభవాత్' - సంభవము అంటే స్థూల పదార్థము. అసంభవము అంటే సూక్ష్మపదార్థం అరెండు విధములైన ప్రకృతులను ఉపాసించితే కలిగే ఫలితం వేరు వేరుగా ఉంటుంది.

సంభూతిం చ వినాశం చ యస్తద్ వేదో భయగ్ం నహ
వినాశేన మృత్యుం తీర్త్వా సంభూత్యాzమృత మశ్నుతే ॥ 11

భావార్థము : ప్రపంచమునందలి పదార్థములలోగల కార్య కారణ భావము వ్యర్థమైనది కాదు. కావున ఆ కార్యకారణముల గుణ కర్మస్వభావముల నెరిగి వానిని ధర్మాది మోక్షసాధనములతో సంయుక్తము చేసికొనవలెను. ఇట్లే మానవ శరీరము అనిత్యము - కార్యరూపము, దానికి కారణ రూపములు గలవు అవి నిత్యములే. కావున మరణ భయమును విడిచి మోక్షసిద్ధికై యత్నింపవలెను. ఇట్లు ఈ కార్యకారణ రూప జగత్తువలన పొందవలసిన ఫలము అన్యము. కార్యకారణ రూపజగత్తునందు రతులుగాక. వానిని త్యజించి పరమాత్మ నుపాసింపవలెనని భావము.

సంభూతి అంటే కార్యజగత్తని, అసంభూతి అంటే యీ కార్యజగత్తుకు మూలకారణమైన ప్రకృతి అని యింతకు పూర్వమే తెలుసుకున్నాం. పరమేశ్వరుని విడిచి యీ రెంటిని ఉపాసించడం యోగ్యం కాదు. ఈ రెంటిని గూర్చి బాగా

తెలుసుకోవాలనడం ఉచితమే. మన మహర్షులు కూడ ప్రాకృతిక పదార్థాలనుగురించి తెలుసుకొనేవాళ్ళు. కాని ఎంతవరకు? వారికి అవసరమైన వరకే. కేవల ప్రకృతి ఉపాసన అజ్ఞానాన్ని కలిగిస్తుంది. ఈ మంత్రంలో 'వినాశం ద్వారా మృత్యువును పోగొట్టుకోవాలి. సంభూతివల్ల ఆనందం పొందుతాం' - అని చెప్పబడింది. ఇచట వినాశము అంటే మూల ప్రకృతి అని అర్థం. అంటే దేనిలో కార్యరూప పదార్థాలు నశించి విలీనమౌతాయో ఆ కారణరూప జగత్తును మూలప్రకృతి అంటారు. అది నశించదు. ఇక సంభూతి అంటే కార్యపదార్థమైన 'శరీర మని ఇచట అర్థం. ఈ శరీరానికి కారణమేమిటి ? ప్రకృతి, శరీరం కార్యం. ఇలా, శరీరానికి ప్రకృతికి గల కార్యకారణ సంబంధాన్ని బాగా తెలుసుకోవాలి. వినాశం ద్వారా మృత్యువును పోగొట్టుకోవడమంటే - యీ శరీరం ఎప్పుడైనా నశించేదే, దీనికి కారణభూతమైన ప్రకృతి మాత్రం నశించదు, అనే నిశ్చితజ్ఞానం కలగడం వల్ల మనకు శరీర వియోగం (మృత్యువు)సంభవించినా దుఃఖించబోమని అర్థం.

తరువాత సంభూతి (శరీరం) వలన ఆనందం పొందడమంటే ఏమిటో తెలుసుకుందాం. జీవుడు యీ మనుష్యశరీరంలోనే మోక్షానందాన్ని సంపాదిస్తాడు. మనుష్య శరీరం లేకపోతే అది సిద్ధించదు. జీవుడు సుఖదుఃఖాలను అనుభవించడానికి శరీరం అవసరం. శరీరం ఉండటం వల్లనే అతడు సుఖ దుఃఖముల ననుభవిస్తున్నాడు. కనుక జీవుడు తన కీ శరీరం రావడానికి కారణ మేమిటో తెలుసుకొని, ఆ కారణములనుండి విడివడితే అతనికి శరీరం రాదు. అప్పుడు శరీరసంబంధమైన సుఖదుఃఖములు తొలగి అతడు మోక్షానందాన్ని పొందుతాడు.

జీవుడు ఈ శరీరంలో ఉండే, సాధన చెయ్యాలి. ఆ సాధన మెలా ! అతడీ శరీరంలో క్రొత్త కర్మలు చేయకుండా ఉండటానికి ప్రయత్నం చెయ్యాలి. కర్మలు మూడువిధములుగా ఉన్నాయి. సంచితములు, ప్రారబ్ధములు, క్రియమాణములునని, సంచిత కర్మలు అంటే, పూర్వజన్మములలో చేసి కూడబెట్టిన కర్మలు, ప్రారబ్ధములు అంటే - సంచిత కర్మలలో నుండి కొన్ని ఈ జన్మలో ఫలముల ననుభవింపజేయుటకు ప్రారంభించిన కర్మలు, క్రియ

మాణములు అంటే - ఈ జన్మలోచేసే క్రొత్త కర్మలు వీటికి ఫలం యీ జన్మలో అనుభవిస్తాము. కాని కొన్ని కర్మలు అనుభవించకుండా మిగిలిపోతాయి. వీటిని వచ్చేజన్మలలో అనుభవించవలసి ఉంటుంది.

జీవులు కర్మయోనులని భోగయోనులని రెండురకములు. యోని అంటే శరీరమని అర్థం. కొన్ని శరీరములలో శుభాశుభకర్మలు చేయడానికి వీలుంటుంది. వీటిని కర్మయోనులు అంటారు. కొన్ని శరీరాలలో కర్మఫల మనుభవించడమే జరుగుతుంది. వాటిలో క్రొత్తకర్మలేవీ చేయబడవు. అందుచేత వానిని భోగయోనులు అంటారు మనుష్య శరీరము కాక, మిగిలిన పశుపక్ష్యాది శరీరములన్నీ భోగయోనులు. మనుష్య శరీరంలో జీవుడు శుభాశుభ కర్మల నాచరించడానికి వీలున్నది. కొన్ని కర్మల ఫలమునుగూడ అనుభవించుటకు వీలున్నది కనుక మానవుడు ఉభయయోని. తప్పుచేసి జైల్లోపడినవాడు తాను స్వతంత్రించి ఏ పని చేయడానికి వీలులేదు. అలాగే జంతు శరీరాల్లో కూడ. పశువులు మాతృగమనం చేస్తాయి. అది తప్పుకాదు. మనుష్యులు చేస్తే తప్పు, పశువు త్రోవను బోతు చేలోమేస్తుంది. అది తప్పుకాదు. దాని కది ఆహారం. కాని కావలివాడు చూస్తూ ఊరుకుంటే ఆసామి కోపపడతాడు గనుక దాన్ని అదలించుతాడు పశువు దొంగతనంచేస్తే తప్పులేదు. మనిషి దొంగతనం చేస్తే మాత్రం తప్పు. కనుక జంతుశరీరాల్లో జీవుల కర్మల ఫలాల ననుభవిస్తాయిఅంతే

జన్మకు కారణమైన క్రొత్తకర్మలు చేయకుండా ఉండాలి. అలా ఉంటే జన్మరాదు. మరియు కర్మలుచేసికూడ బంధనంలో పడకుండ ఉండవచ్చు. అదెలా ! మన మిపుడుచేసే కర్మలు ఫలాపేక్ష లేకుండచేస్తే బంధనంలో పడం. కొందరిలా అంటారు. పూర్వజన్మలలో చేసినకర్మల ప్రభావంవలననే కదా, మళ్ళీ యీ జన్మలో మనం కర్మలు చేస్తున్నాము : మరి ఈ శరీరంలో క్రొత్త కర్మలు చేయమంటే యేమిటి? ప్రారబ్ధకర్మల ఫలితం అనుభవించడమంటే అర్థమేమిటి ? అంటారు. ఈ కర్మ రహస్యము చాలామందికి తెలియదు. దీని అర్థమును మన ఋషిపుంగవులు యిలా చెప్పారు. పూర్వవాసనలు ఈ జన్మలో మనచేత క్రొత్తకర్మలు చేయించవు. మనముచేసే పనులన్నీ యిపుడు చేస్తాం. ఇది మనం బాగా గుర్తించాలి. ప్రారబ్ధ కర్మల ఫలితం ఎలా

అనుభవిస్తామో ఒక ఉదాహరణ చెబుతాను. అజాగ్రత్తగా దారిని నడుస్తాను ఎదురుదెబ్బ తగిలి కాలికి చెక్కుడింది. అజాగ్రత్తగా ఉండి తప్పుచేశాను. నిజమే! ఈ చేసిన స్వల్ప తప్పిదానికి రెండు రోజుల్లో ఆ దెబ్బ మానడం న్యాయం. కాని ఒకప్పుడు చీముఏర్పడి. కాలు తీసివేయవలసి వస్తుందని డాక్టరంటాడు. కొద్దితప్పుకు యింత శిక్ష వేయడం న్యాయంగా తోచదు. మరి ఈ స్థితి ఎందుకు కలిగింది ? అంటే యిపుడు చేసినదానికీ, పూర్వజన్మ కర్మఫలం జోడించి అనుభవింపజేస్తున్నాడన్నమాట. ఒక్కొక్క వ్యాపారి కొద్ది పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుతుంటాడు. నిజాని కతనిపెట్టుబడికి తగినట్టే లాభం రావలసింది. కాని, అనుకున్నదానికంటె ఎక్కువ లాభం పొందుతాడు. కారణం, అతడు పూర్వంచేసిన సత్కర్మల ఫలితమది. ప్రాతకర్మలు మనచేత దొంగతనం చేయించవు. దొంగతనం మనం యిపుడు కావాలనే చేస్తాము. పూర్వకర్మలు మనచేత కేవలం ఫలాన్నిమాత్రమే అనుభవింపజేస్తాయి. మన మీ శరీరంలోనే కర్మలనుండి తప్పుకొనే ఉపాయం ఉంది. అందుకుగాను క్రొత్తకర్మలు చేయకుండా ఉండాలి. ఒకవేళ చేస్తే ఫలాపేక్ష లేకుండ కర్మలు చేయాలి. అప్పుడవి మనలను బంధించవు. ఇలా చేయుటకు తగిన యోగ్యత ఒక్క మానవ శరీరంలోనే ఉంది. తతిమ్మా శరీరాల్లో లేదు. మనకు శరీర విజ్ఞానం - భౌతిక విజ్ఞానం (Science) ముక్తి నియ్యలేవు. కేవలం ఆత్మవిజ్ఞాన మొక్కటే మోక్షము నిస్తుంది. ఆ ఆత్మవిజ్ఞానం సంపాదించడం కూడ యీ మానవశరీరంలోనే సాధ్యమవుతుంది. తతిమ్మా పశు, పక్ష్యాది జంతు శరీరాలిందులకు తగినవి కావు.

'ఇహ చే దవేదీ దథ సత్యమస్తి న చేదవేదీన్ మహతీ వినష్టిః'

కే. 2-5

మనుష్య జన్మలో తెలుసుకున్నవాళ్ళకే మోక్షముంది. లేకపోతే నష్టము. అంటే మానవేతర జన్మ మోక్షమునకు తగినదికాదు అని అర్థం.

గుంటూరు, 3-1-1969

శుక్రవారం సా. 6-00 గం॥

మహాజనులార !

ఇంతవరకు పదునొకండు మంత్రాలను గూర్చి తెలుసుకున్నాం. వచ్చే మూడు మంత్రాలల్లో విద్యా అవిద్యలను గూర్చి చదువుతాము.

అంధం తమః ప్రవిశన్తి యే z విద్యా ముపాసతే ।

తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతా ః ॥ 12

భావార్థము : జ్ఞానాది గుణములతో గూడిన చేతనము జ్ఞాత యనబడును. అవిద్య రూపమగు జడవస్తువు జ్ఞేయము. విద్వాంసుల కాత్మరూపమగు చేతన బ్రహ్మము ఉపాసింపదగినది - ఉపాస్యము - సేవింపదగినది అనిభావము. ఆ బ్రహ్మమునకు భిన్నమైనది ఉపాసింపదగినదికాదు. బ్రహ్మ భిన్న పదార్థముల వలన ఉపకారము పొందవలెను. అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము అను క్లేశములలో చిక్కుకొని పరమేశ్వరుని వీడి తద్భిన్నమగు జడవస్తువుల నుపాసించు మానవులు దుఃఖసాగరమున మునుగుదురు. మరియు శబ్దార్థములు, వాని సంబంధము, అన్వయాదులనెడి సంస్కృతాది భాషల నభ్యసించి, సత్యభాషణము చేయక, పక్షపాత శూన్య న్యాయాచరణరూప ధర్మము నాచరింపక, అభిమానారూఢులై, విద్యను తిరస్కరించి, అవిద్యయందే మగ్నులై యుండి, మిక్కిలి దుఃఖములపాలయి పీడితులగుదురు.

అవిద్యను ఉపాసించేవారు అంధకారంలో ఉంటారు. కేవల విద్య యందు రతులైనవారు ఎక్కువ అజ్ఞానులవుతారు. విద్యకు వ్యతిరేక పదము అవిద్య, అవిద్య అంటే విపరీత జ్ఞానమని అర్థం. వస్తువును ఉన్నదున్నట్లు తెలుసుకోకుండ విపరీతంగా తెలుసుకోవడం. విద్య - విత్=జ్ఞానము. యా=ఇచ్చేది. విద్య అంటే జ్ఞానము నిచ్చునదని యర్థము. అవిద్య అంటే విపరీత జ్ఞానము, లోకంలో ఉండే జడపదార్థాలను ఈశ్వరుడని ఉపాసించడం అవిద్య అవుతుంది.

"అనిత్యాశుచి దుఃఖానాత్మసు నిత్యశుచి సుఖాత్మ ఖ్యాతి రవిద్యా"

యో. ద. 2-5

నాలుగు విధములైన భ్రమాత్మకజ్ఞానం అవిద్య అనబడుతుంది అని పతంజలి. నిత్యముకాని ఈ జగత్తును నిత్యమనుకోవడం, అశుచియైన దానిని శుచిఅనుకోవడం, సుఖము కానిదాన్ని సుఖమనుకోవడం, ఆత్మకాని దానిని

ఆత్మయని యెంచడం 'అవిద్య' అనబడుతుంది.

'అంధం తమః ప్రవిశన్తి యే అవిద్యా ముపాసతే' - ప్రాకృతికములగు జడపదార్థముల నుపాసించడం అవిద్య. కనుక జడపదార్థముల నుపాసించేవారు అంధకారంలో ఉంటారు. అంటే అజ్ఞానంలో ఉంటారు. 'తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ం రతాః' - కేవల శబ్దార్థ సంబంధ రూప విద్య నెరిగినవారు కూడ యింకా అజ్ఞానంలో ఉంటారు. విద్య అంటే జ్ఞానం కలిగించే చదువు. శబ్దార్థములను తెలిసికొనిన కలిగే జ్ఞానం విద్య అవుతుంది. పండితులు చాల చదువుతుంటారు. భాషావిదులను పండితులనరాదని శాస్త్రకారు లంటారు. శబ్దార్థములను తెలిసిన వారిని భాషావిదులు అంటే సరిపోతుంది. పండా అంటే ఆత్మజ్ఞానము. అది కలవాడు పండితు డౌతాడు.

విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవ శ్వపాకే చ పణ్డితా స్సమదర్శిన ః ॥ గీ. 5-18

'సమం పశ్యంతి ఇతి సమ దర్శినః' - అందరి యందు సమముగా వ్యాపించియున్న పరమేశ్వరుని చూచేవాడు సమదర్శి అవుతాడు. బ్రాహ్మణునిలో, ఆవులో, ఏనుగులో, కుక్కలో,కుక్కను వండుకొని తినే చండాలునిలో సైతం పరమేశ్వరుడు సమానంగా ఉంటాడు. రామకృష్ణాదులలో భగవంతుని అంశము ఎక్కువగా ఉంటుంది అంటారు. అది పొరపాటు, జీవులు అందరిలోనూ భగవంతుడు సమంగా ఉంటాడు. కొందరిలో లావుగా ఉండడు.

కేవలం శబ్దార్థ జ్ఞానమును తెలుసుకొని బ్రహ్మోపాసకుల మనుకొనువారిని జ్ఞానులనుటకు వీలులేదు.

'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' - (కఠ. 2-23) పరమేశ్వరుడు యిట్టివాడు, అట్టివాడు అని శాస్త్రదృష్టితో ప్రవచించిన మాత్రమున పరమేశ్వరుడు పొందబడడు. 'య మేవ ఏష వృణుతే - అన్నిటిని మరచిపోయి, అనన్య చిత్తముతో ఆయననే ఎవరు వరించుతారో, ఉపాసించు తారో వారే పరమాత్మను పొందుతారు.

అన్యదేవాహుర్ విద్యాయా అన్యదాహు రవిద్యాయా ః ।
ఇతి శుశ్రుమ ధీరాణాం యేన స్తద్ విచచక్షిరే ॥ 13

భావార్థము : జ్ఞానాది గుణయుక్తమగు చేతనము నుపాసించుట వలన లభించు ఫలము, అజ్ఞానాది యుక్తమగు జడము నుపాసించుటవలన కలుగదు. ఇట్లే జడోపాసనవలన కలుగు ఫలము చేతనోపాసన వలన కలుగదు. కావున మానవులు విద్వాంసుల సాంగత్యము, యోగము, విజ్ఞానము, ధర్మాచరణము అనువాని మూలమున జడచేతనములను వివేకించి వానివలన లాభమును పొందవలెను.

ఇచట జ్ఞాత అంటే జీవుడు (తెలిసికొనేవాడు). తెలిసికోదగిన తత్త్వం జ్ఞేయము అనబడుతుంది. పదార్థముయొక్క కార్యకారణ సంబంధముకూడ తెలుసుకోవాలి. జీవునకు తెలుసుకోదగిన ప్రకృతియే కాక యింకొక చేతనపదార్థం - దేవుడు కూడ ఉన్నాడు జీవించిఉండగానే పరమేశ్వరుని తత్త్వం తెలుసుకోవాలి. అవుడే ముక్తి. ఎప్పుడో మరణించిన తరువాత ముక్తి సిద్ధిస్తుంది. అనుకోవడం పొరపాటు. కనుక పరమేశ్వరుని విడిచి జడవస్తువులను ఉపాసించేవారు 'మహతి దుఃఖసాగరే మజ్జంతి' - దుఃఖసాగరములో మునుగుతారు.

సత్యభాషణ చెయ్యక శబ్దపాండిత్యం మాత్రం సంపాదించి, పరమేశ్వరుని అనుభవపూర్వకముగ గ్రహించనట్లయితే ప్రయోజన మేమిటి ? శాస్త్రాలు తెలుసుకొని, జీవితంలో న్యాయమార్గమున వర్తించుతూ, పక్షపాత రహితంగా ఎందరుంటారు ! కనుక ఆచరణ ముఖ్యం.

విద్యాం చా విద్యాం చ యస్త ద్వేదోభయగ్ం సహ ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా z మృత మశ్నుతే ॥

భావార్థము : విద్య, అవిద్యల స్వరూపము నెరిగి, వానికి చేతనము, జడము సాధకములని నిశ్చయించినవారు జడమగు శరీరమును, చేతనమగు ఆత్మను ధర్మార్థ కామ మోక్షములను సాధించుటకు ఎల్లప్పుడు ఉపయోగింతురు. అట్టివారు లౌకిక దుఃఖములపాలు కాక పారమార్థిక సుఖమును పొందుదురు. జడమగు ప్రకృత్యాది కారణ పదార్థము. శరీరాది కార్యపదార్థములు లేనివాడు పరమేశ్వరుడు జగదుత్పత్తిని, జీవులు కర్మోపాసనా జ్ఞానములను ఎట్లు సాధించగలరు ? కావున కేవల జడముతో గాని, కేవల చేతనముతోగాని, కేవల కర్మలతో గాని, కేవల జ్ఞానముతో గాని, యెవరును మోక్షము సాధింప

సమర్థులు కాజాలరు.

మనుష్యుడు ప్రాకృతిక విజ్ఞానం పొందాలి. విద్యద్వారా ధర్మము లేవో నేర్చుకున్నా మనుకోండి. ఆ నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టాలి. సత్యశాస్త్రములను తెలుసుకొని, పతంజలి మొదలగు మహర్షులు చెప్పిన (యోగ) మార్గం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొందడానికి ప్రయత్నం చెయ్యాలి.

'అవిద్యయా మృత్యుం తీర్త్వా' - శరీరాది జడముల మూలమున చేసిన పురుషార్థమువలన మరణ భయమును దాటి, 'విద్యయా z మృత మశ్నుతే' - ఆత్మ అంతఃకరణముల సంయోగమున కలిగిన యథార్థజ్ఞానరూప విద్యవలన నాశరహితమైన స్వస్వరూపాన్ని లేక పరమాత్మను పొందుతాడు అని. ఇలా ఆత్మసాక్షాత్కారం పొందాలి అంటే ధర్మాచరణం చెయ్యాలి. అందుకు సాధనం శరీరం. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' శరీరము ధర్మసాధనములలో మొదటిది. ఏదైనా తాను జీవించి సాధించాలి. మన ప్రాచీన ఋషులు నిత్యము ధర్మాచరణ చేస్తుండేవారు. వైదిక ధర్మాలు ఆచరించేవారు. ఒక విధమైన జీవన పద్ధతికి ధర్మానుష్ఠానమునకు మతమని పేరు.

యజ్ఞము చేయునప్పుడు అగ్నిలో నెయ్యి ఎందుకు వృథాచేస్తారని సైన్సు చదువుకున్న పిల్లవాడు కూడ అడుగుతాడు. కాని అగ్నిలో వేసే నెయ్యి వ్యర్థంకాదు. నెయ్యేకాదు, ఏవస్తువు వేసినా వ్యర్థంకాదు. ఉదాహరణకు నిప్పులోవేసిన మిరపకాయ మనకు తుమ్ములు తెప్పిస్తుంది. ఎందుకని ? అది కాలి భస్మమై సూక్ష్మరూపం ధరించి వాయువులో కలుస్తుంది. మన మా గాలిని పీల్చితే మనకు తుమ్ములు వస్తాయి. అలాగే అగ్నిలో పాషాణం వేసేట్లయితే ఆ గాలిని పీల్చుకున్నవారంతా చస్తారు. అగ్నిలో మనం అనేక ఓషధులు వేసి యజ్ఞం చేస్తాం. అగ్ని మనంవేసిన ఓషధులను సూక్ష్మద్రవ్యంగా మార్చి వాయువున కందిస్తుంది. ఆ వాయువు నాఘ్రాణించిన ప్రాణులకు వ్యాధులు సోకవు. అలాగే నెయ్యి కూడ. నెయ్యి పుష్టికారక పదార్థం. దానిని అగ్నిలో వేస్తాం. అది వృథాకాదు. అది అగ్నిలో దగ్ధమై వాయువులో కలుస్తుంది. ఆవాయువును పీల్చిన జీవరాసులకు పుష్టినిస్తుంది. అగ్నిహోత్రంవలన యింకొక మేలుంది ఇంట్లో అగ్నిహోత్రం పెట్టామనుకోండి. అక్కడున్న గాలివేడెక్కి బయటికి

పోతుంది. క్రొత్తగాలి యింట్లో ప్రవేశిస్తుంది. ఇలా వాయువు పరివర్తనం చెంది గృహంలోని వాయువు పరిశుద్ధమవుతుంది.

'యజ్ఞాద్ భవతి పర్జన్యః' (గీ. 3-14)

నిత్యము మనం యజ్ఞం చేయుటవలన మేఘములు సకాలమున నేర్పడి వర్షములు కురుస్తాయి. పూర్వం యజ్ఞయాగాదులు అధికంగా చేసే వారు. కనుక సకాలంలో వర్షములుపడి, పాడి పంటలతో దేశం సుభిక్షంగా ఉండేది. అందుచేత యజ్ఞంవలన మనకెంతో మేలు కలుగుతుంది.

ఈ అగ్నిహోత్రం మీద Research (ప్రయోగాలు) చేసినవారు డాక్టర్ సత్యప్రకాశ్ అనేవారు. అలహాబాద్ యూనివర్సిటీలో ఆయన Professor (అధ్యాపకుడు) గా పనిచేశాడు. ఆయన 'అగ్నిహోత్రం' అనే పుస్తకం ఇంగ్లీషులో వ్రాశారు. దానిలో యజ్ఞంవలన కలిగే లాభాలన్నింటిని సశాస్త్రీయంగా నిరూపించారు. నిత్యజీవనంలో అది మనకెంతగా ఉపయోగపడుతుందో అందులో వివరించారు.

యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః
భుంజతే తేత్వఘం పాపా యే పచం త్యాత్మ కారణాత్ ॥ గీ.త. 3-13

తా॥ భూమి మొదలగు దేవతలనుండి తమకు లభించిన పదార్థములలో మేలైన ఘృతము (నెయ్యి) ఓషధులు, ధాన్యములు మున్నగువానిని అగ్నిముఖమున ఆ దేవతల కర్పించి తదుపరి మిగిలిన పదార్థమును (యజ్ఞశేషమును) భుజించువారు పాపములనుండి ముక్తులగుదురు. అట్లు చేయక తమ ఉదరపోషణకే వంటకముల నొనర్చువారు పాపమును భుజించువా రగుదురు. అని గీత చెబుతుంది. అగ్నిహోత్రం ఒకటే యజ్ఞం కాదు. ఇంకా చాలా యజ్ఞాలున్నాయి.

అపానే జుహ్వతి ప్రాణం ప్రాణే z పానం తథాపరే
ప్రాణాపాన గతీరుద్ధ్వా ప్రాణాయామ పరాయణా ః ॥ గీ. 4-92

కొందరు ఉచ్ఛ్వాస నిశ్వాసముల గతిని ఆపి ప్రాణాయామము చేస్తూ, అపానవాయువునందు ప్రాణవాయువును, ప్రాణమున అపానమును ఆహుతి చేస్తారు. ఇది యోగులు చేస్తారు. ప్రాణాయామం ఒక యజ్ఞం.

ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వా ప్రాణస్య' యో.ద. 1-34

కొందరు ప్రాణాయామం చేస్తున్నామని చెప్పి ముక్కు చెవులు పట్టుకుంటారు. ప్రాణాయామము మాత్రం చెయ్యరు. ఎందుకలా ముక్కు చెవులు పట్టుకుంటున్నారని ఎవరైనా అడిగితే, చెవి ఆకాశతత్వం శబ్ద స్వరూపం ముక్కుపట్టుకుంటే వచ్చే మలినం చెవితాకితే పోతుందంటారు (సభలో నవ్వులు) ఇది తప్పు. ప్రాణాయామం చెయ్యాలి.

ప్రాణాయామాదులను చిన్నప్పుడే ప్రాచీనకాలపు గురుకులాల్లో విద్యార్థులకు నేర్పేవారు. ఈనాటి పరిస్థితి వేరు. ప్రతిఒక్కరూ నిత్యం యోగాభ్యాసం చెయ్యాలి. మహర్షులు కొండల్లో ఉండి యోగాభ్యాసం, తపస్సు చేశారు. వారికి గడ్డాలు పెరిగేవి కొండల్లో వాళ్ళకు గడ్డాలుచేసే మంగళ్ళులేక పెంచుకున్నారు. ఇక్కడ గడ్డాలు పెంచుకున్నవాళ్ళు యోగులు కారు. మనకు మంగళ్ళుండగా గడ్డాలు పెంచుకోవడ మెందుకు ? (సభలో నవ్వులు)

ప్రచ్ఛర్దనం - అంటే శ్వాసకోశములలోని గాలిని వేగంగా బయటికి వెళ్ళగ్రక్కడం ఇది రెండు నాసికాపుటములద్వారా జరగాలి. కొందరు నవీనులు ఒక్కొక్క నాసికాపుటముద్వారా మార్చిమార్చి యిలా చేయాలని అంటున్నారు. కాని పాతంజలి యోగదర్శనానికి వ్యాఖ్యానము వ్రాసిన మహర్షి 'నాసికాపుటాభ్యాం' - రెండు నాసికలద్వారా యిది చేయాలన్నాడు. హఠయోగులు ఏవేవో feets (సాధనలు) చేస్తారు. (నేతి, ధౌతి, బస్తి, నౌళి యిత్యాది) అవన్నీ మన కవసరం లేదు. ప్రాణాయామం చేయటంవలన ఏదో అవుతుందని కొందరంటుంటారు. ఏమి ప్రమాదం లేదు. మీకు నేను గ్యారంటి యిస్తున్నాను. ప్రాణాయామంచేస్తే పిచ్చి ఎక్కుతుందనడం పొరపాటు. పిచ్చేమైనా ఉంటే పోతుందికూడ (సభలో నవ్వులు) మీకు గురువులు, బరువులు ఏమీ అవసరం లేదు గురువు ఎంతవరకు ? విషయం తెలిసికొనేవరకే.

యోగ శాస్త్రంలో మూడురకాల ప్రాణాయామం చెప్పబడింది. (ప్రాణాయామమును చేసి చూపుతూ) మొదట సాధకుడు ఆసనబద్ధుడై యిలా

కూర్చోవాలి. (సిద్ధాసనము వేసి చూపించారు) తరువాత శ్వాసకోశములలోని వాయువునువమనము చేసికొన్నట్లు వేగంగా ప్రయత్నపూర్వకముగ, రెండు నాసికాపుటముల ద్వారా వెళ్ళగ్రక్కాలి. (అలాచేసిచూపించారు). తరువాత, బయటి వాయువును లోపలకు పోకుండ బయటనే శక్తికొలది కొంతసపు ఆపాలి (ఇది ఒకరకం ప్రాణాయామం) ఇక ఆగలేమను కొన్నపుడు నెమ్మది నెమ్మదిగా శ్వాసకోశములలోనికి రెండు నాసికలద్వారా వాయువును పూరించాలి. అలా పూరించినగాలిని ఊపిరితిత్తులలోనే శక్తికొలది కొంతసేపు ఆపి ఉంచాలి. (ఇది రెండవ రకం) ఇక అలా ఉంచలే మనుకొన్నప్పుడు మళ్ళీ మొదట చేసినట్లుగా వాయువును వెలుపలికి నడపాలి. ఇక మూడవరకం ప్రాణాయామ ముంది. శ్వాసకోశములలోని వాయువునుబయటికి పంపించడంకాని, బయటి గాలిని లోపలికి పీల్చడంగానీ చేయకుండా ఎక్కడిగాలినక్కడ బంధించాలి. దీన్ని 'కేవల కుంభకం' అంటారు. ఇదొకరకం ప్రాణాయామం. కాలిన యినుప ముక్కపై నీటిబొట్లు వేస్తే సంకుచించి,సంకుచించి చివరకు ఏమీలేకుండా పోతుంది. అలాగే, యీవిధంగా ప్రాణాయామం చెయ్యడం వల్ల మొదట్లో మనకు కొంచెం ఉక్కిరిబిక్కిరి అయినట్లుంటుంది. అంటే మరేం ఫరవాలేదు. ప్రాణంమాత్రం పోదు (సభలో నవ్వులు) 'ప్రాణబంధనం హి మనః' - ప్రాణము బంధనముగా కలిగినది మనస్సు. లేక ఉచ్ఛ్వాస నిశ్వాసములు బంధనముగా కలిగినది మనస్సు అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసములనునిరోధించినపుడు మనసునకు వేగముతగ్గి ప్రసన్నతకలిగి ఉంటుందని అర్థం.

సామాన్యంగా ఆరోగ్యవంతుడైన మనిషి నిముషానికి 6 సార్లు గాలి పీల్చుతాడు కాని అభ్యాసి అయినవాడు 3 లేక 4 సార్లు మాత్రమే గాలి పీలుస్తాడు, అసలు ప్రాణాయామము అంటే ఏమిటి ? ఉచ్ఛ్వాస నిశ్వాసము లను దీర్ఘముచేయుట లేక విస్తరించుట అని అర్థం. మనం చేసే ఉచ్ఛ్వాస నిశ్వాసములు దీర్ఘముగాను, గాలిని బాగా లోపలికి పూరిస్తున్నట్లు గాను (Deepగాను) ఉండాలి. ఈవిధంగా చేయడం వలన, శరీరారోగ్యము చిత్తప్రసన్నత రెండూ కలుగుతాయి. బస్, యివ్వాళకు చాలు.

గుంటూరు, 4-1-1969
శనివారం, సా. 6-00 గం॥

మహాజనులారా !

ఇవ్వాళ చివరి రోజు, ఈ రోజుతో ఉపనిషత్తు పూర్తిఅవుతుంది. ఇంకొక్క మూడు మంత్రాలున్నాయి. సంక్షేపంగా చెప్పుకుందాము. గత రాత్రి విద్య, అవిద్య లంటే ఏమిటో తెలుసుకున్నాము. కేవలం విద్యను గూర్చిగాని, కేవలం అవిద్యను గురించిగాని తెలుసుకుంటే సరిపోదని, రెంటిని తెలసికొని అవిద్య (ప్రాకృతిక పదార్థవిజ్ఞానము) ద్వారా మరణభయమును దాటి, విద్య (ధర్మాచరణము, యమనియామాది సాధనసంపత్తి) ద్వారా ముక్తి పొందాలని నిన్న ముచ్చటించుకున్నాము.

ఏదో ఒకరోజు శరీరము వదలిపెట్టి జీవుడు వెళ్ళుతాడనేది ఖాయం. ఈ స్థితి మన మందరం చూస్తాం. పుట్టిన ప్రతిప్రాణి గిట్టడ అనేది పరమసత్యం, కనుక చనిపోయేముందు శరీరాన్ని ఎలా వదలిపెట్టాలి అనేది యీ మంత్రంలో చూస్తాం. శరీరాన్ని విడిచే సమయంలో, అతని స్థితి ఎలా ఉంటుందో యిందులో తెలుసుకుంటాం. మీరు సాధారణంగా వినే ఉంటారు. మనుష్యునికి మరణావస్థలో ఎట్టిభావ ముంటే అలాంటిగతి కలుగుతుందని. అందుకని మరణావస్థలో నున్నవాని చుట్టూ చేరి, బంధు బాంధవులు భగవన్నామం చెయ్యమంటారు. మరణ సమయంలో భగవన్నామం స్మరిస్తూ ప్రాణము విడిస్తే సద్గతి కలుగుతుందని అలా చెపుతారు తక్కిన సమయాల్లో యిలా చెయ్యమని చెప్పరు. చనిపొయ్యేటప్పుడు మాత్రం అందరూచుట్టూచేరి భజన చేస్తుంటారు. కాని ప్రాణములను వదలుటకు సిద్ధముగా ఉన్న జీవుని కివన్నీ పట్టవు. అతడు స్పృహలో ఉండడు. శరీరం వదలడానికి సిద్ధంగా ప్రాణములు వాటిపనిలో అవి ఉంటాయి. జీవునికి బాహ్యస్మృతిగాని బంధుమిత్రులు చేసే యీ కోలాహలముగురించి ఎఱుకకాని ఉండదు. అతని చుట్టూ ఉన్న బంధువులు అతని చేత నారాయణ అనిపించితే మంచిదనిచెప్పి, 'నారాయణ' 'నారాయణ' అని చెవిలో చెబుతుంటారు. పెద్దగాకూడ అంటుంటారు. కాని ససేమిరా, అతను నారాయణ అనడు. మరణోన్ముఖుడైన అతడు పైగా 'న'

'న' అంటాడు. అంటే 'నే నను' 'నే నను' అని (సభలో నవ్వులు) ఇలా మరణావస్థలో భగవంతుణ్ణి స్మరించుచు చనిపోవాలి అని మనవాళ్ళుచెప్పడం ఎందువల్ల అని నేను చాలా ఆలోచించేవాణ్ణి. తరువాత దీనికి మూలం వేదమంత్రములలో ఉన్నట్లు గ్రహించాను.

వాయు రనిల మమృత మథేదం భస్మాంతగ్ం శరీరమ్
ఓమ్ క్రతో స్మర, క్లిబే స్మర, కృతగ్ం స్మర ॥ 15

భావార్థము : మృత్యుసమయమున ఎట్టి చిత్తవృత్తి ఉండునో తెలిసికొనవలెను. అప్పుడు ఆత్మ శరీరమునుండి వేరగుననియు నెరుంగవలెను. అట్లే జీవన సమయమును గుర్తింపవలెను. జీవుడు వెడలిపోయిన తరువాత శరీరమును దహించి భస్మముచేయవలెను. దాహకర్మమొనర్చిన పిదప శరీరమునకు చేయవలసిన సంస్కారము లుండవు. జీవించినంతకాలము పరమేశ్వరుని ఆజ్ఞను పాలించుచు అతని నుపాసించి, స్వసామర్థ్యమును పెంచుకొనవలెను. చేసిన కర్మము నిష్ఫలముకాదని యెఱిగి, ధర్మమందు ప్రీతి, అధర్మమునందు అప్రీతియు కలిగి వర్తింపవలెను.

'భస్మాంతగ్ం శరీరం' - శరీరానికి అంతిమస్థితి భస్మంకావడం. మృతదేహాలను తగులబెట్టడం వైదిక సంప్రదాయం. వైదికులంతా యిలా చేసేవారు. మనం హిందువులం కాము ; వైదికులం. అలా అనడమే సబబుగా ఉంటుంది. వైదికులమని కాక, యింకేదైన పేరున పిలవాలంటే మనమంతా 'ఆర్యులం' అనడం న్యాయం 'హిందు'పదం మన ప్రాచీన గ్రంథాలలో ఎక్కడా లేదు. భగవద్గీతలో 'హిందు' పదం లేదు. ఉపనిషత్తులలో, వేదములలో, చివరకు మన తత్త్వశాస్త్రములైన షడ్దర్శనములలో కూడ యీ పదం లేదు. దీనికి వ్యతిరేకంగా మనం ఆర్యుల మనడానికి తగిన ఆధారాలు మన ప్రాచీన గ్రంథాలలో ఉన్నాయి. ఉదాహరణకు రాముణ్ణి గూర్చి రామాయణంలో 'ఆర్యః' అని అనేక తావులలో చెప్పినట్లు మనం చూడగలం. అలాగే భగవద్గీతలో కృష్ణుడు యుద్ధంచేయడానికి విముఖుడై అర్జునుని మందలిస్తూ పిరికితనం 'అనార్యజుష్టం' అంటాడు. అంటే అనార్యులైనవారిలో ఉండదగినది అని అంటాడు.

రాముడు, కృష్ణుడు వీరంతా ఆర్యులు. మనమంతా ఆర్యులం. సంస్కృతములోని 'ఆర్య' పదమే తెలుగులో 'అయ్య' అయింది. తిక్కనార్యుడు, అనే పేరు తెలుగులో 'తిక్కయ్య' లేక 'తిక్కన్న' అయింది అలాగే నన్నయార్యుడు అన్నపేరు నన్నయ్య అయింది. ఇంకా యిలాగే ఎన్నో ఉన్నాయి.

పరదేశస్థుల పాలనలో మనం చాలాకాలం బానిసలంగా ఉన్నాము. మనపేరు మనం మరచిపోయాము. మనము హిందువులము కాము. 'ఆర్యులం అని మొదట చెప్పినవాడు దయానందు ఒక్కడే. మనకు హిందు పదం మహమ్మదీయుల కాలంలో వచ్చింది. పూర్వం చైనా రాయబారులైన హ్యూయన్‌సాంగ్. పాహియాన్ మనదేశం వచ్చారు. అప్పటిమన భారతదేశ పరిస్థితులను గూర్చి వారు కొంత వ్రాశారు. భారతదేశంలోని ఆర్యులను హిందువులంటే ఒప్పుకోరని - ఆర్యశబ్దంతో పిలిస్తేనే ఒప్పుకుంటారని వారు వ్రాశారు. 'హిందు'పదం మహమ్మదీయ రాజులు మనపైన బలవంతంగా రుద్దారు. హిందువు అంటే కాఫిర్ (పాపి), గులామ్ (బానిస), చోర్ (దొంగ), డాకూ (బందిపోటుదొంగ) అని వ్రాసి ఉంది. (ఈ పదములువిన్న సభ యావత్తూ ఆశ్చర్యమగ్నమైంది.) చూడండి హిందువు అనే పదాని కున్న అర్థం ఎంతటి నికృష్టంగా ఉందో. ఈ పదం పారసీభాషకుచెందినది. ఆ భాషలో ఈ యర్థములు ఉన్నవి. మనకు కాఫిర్ అనే అర్థంలో ఈ హిందుపదం మహమ్మదీయులు వాడినారు.

కొందరు యిచట సింధునది ఉండటం చేత యీ దేశాన్ని సింధూ దేశమనేవారని పారశీకులు సింధుదేశం అనలేక హిందూదేశ మనేవారని, అప్పటినుండి యీ దేశానికి హిందూదేశం అనే పేరు వచ్చిందని , హిందూ దేశంలో ఉండేవాళ్ళు హిందువు లనబడతారని అంటారు. అట్లయితే - క్రైస్తవులు, మహమ్మదీయులుకూడ హిందూదేశములో ఉన్నారుకనుక వారుకూడ హిందువులని చెప్పబడాలి. కాని మహమ్మదీయులు, క్రైస్తవులు తమ్ముతాము హిందువు లనుటకు ఒప్పుకోరు. కారణమేమిటి ? అసలు ఈ దేశమునకు సింధూదేశమని పేరెక్కడ ఉంది ? ఒకవేళ పారసీకులు 'స' కు 'హ' పలికినప్పటికి భారతీయులు సింధు దేశమును హిందూదేశమని ఏల అందురు.

కాబట్టి మనలను హిందువులనుటకు అది కారణము కాదు.

మహమ్మదీయుల తరువాత మనలను అంగ్లేయులు పరిపాలించారు. అంగ్లేయులు మనపై పెత్తనం సాగించి మనలను Indians(ఇండియన్స్) అన్నారు. దీనికర్థమేమిటి ? కూలీలు అనే అర్థంలో ఈ పదం మన కంటగట్టబడింది.

మనది ఆర్యావర్తం. ఇప్పటికి మనవాళ్ళు ప్రతిదినం సంధ్యావార్చేటప్పుడు మొదట సంకల్పం చెబుతారు. 'అద్య బ్రహ్మణఃద్వితీయప్రహరార్థే శ్వేత వరాహకల్పే వైవస్వత మన్వంతరే, అష్టావింశతి తమే, కలియుగే, ప్రథమచరణే, జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, 'ఆర్యావర్తే' పుణ్యభూమౌ మేరో ర్దక్షిణ దిగ్భాగే.... అని సంకల్పం చెపుతూ, యీ దేశాన్ని ఆర్యావర్తమని కీర్తించుతారు. కాని హిందూదేశమని చెప్పరు. ఇలా సంకల్పంచెప్పడం కోట్లకోలది సంవత్సరాలైనా మారలేదు. మనం సభల్లో మాట్లాడేటప్పుడుకూడ 'ఆర్యులారా ! అంటాము. ఓ హిందువులారా ! అనం. (సభలో నవ్వులు) . కనుక మనం ఆర్యులం. అందులో సందేహం లేదు.

పాపం కొందరికి ఆర్యులమంటే ఆర్యసమాజికుల మౌతామేమో ననే భయం (సభలో నవ్వులు) ఏదోవిధంగా సరిపెట్టుకొని మనం హిందువులమని చెప్పడానికి కొందరు ప్రయత్నం చేస్తారు. హిందు పదానికి నిర్వచనంకూడవారు చేస్తారు. 'హీనం దునోతీతి హిందు'' - అంటే హీనుణ్ణి హింసించేవాడు హిందు. అని అంటే హీనుల్నేగాని, మనం గట్టివాళ్ళను ఎదుర్కొలేమన్నమాట (సభలో నవ్వులు) 'హిందు' అనే పదం - 'హింకృణ్వంతి' అనే పదంమడి 'హిం' తీసికొని, 'దునోతి' అనే పదంనుండి 'దు' తీసికొని, రెండూ కలిపి'హిందు' శబ్దం వచ్చిందని కొందరు అంటున్నారు. నిజాని కలా హిందు పదం ఉత్పత్తి అయినట్లయితే M.A., 'యమ్.ఏ) కున్నట్లు, "హిం.దు." పదముల మధ్యలో కూడ విరామచిహ్నాలుండాలి. కాని అలా లేదు. అందుచేత హిందు అనే పదానికి వీరిచ్చిన నిర్వచనం సరిగాలేదు..

అయినా, ఇంత గందరగోళ పడటం, యిన్ని డొంకతిరుగు సమాధానాలు చెప్పుకోవడం దేనికి ? హిందు పదానికి మారుగా 'ఆర్య' పదమును ఒప్పుకుంటే

సరిపోతుందిగదా (సభలో నవ్వులు). ఆర్యపదం ఒప్పుకుంటే ఆర్యసమాజీయుల మౌతామని భయమా ? మీరు ఆర్యులు కాదన్నమాత్రంచేత కాకుండాపోరు. మీరుచేసే కర్మలనుబట్టి మీరు ఆర్యులో అనార్యులో నిశ్చయంగా తెలుస్తుంది. ఆర్యులు అంటే సత్కర్మలు చేసేవారు లేక మంచివారని అర్థం. అనార్యులంటే దుష్కర్మలు చేసేవారు లేక దుష్టులు అని. మీరు సత్కర్మలు చేయరా ? మరి మీరు ఆర్య (మంచి వారని) లనిపించుకో దలచలేదా ? (సభలో నవ్వులు)

'ఓం క్రతో స్మర క్రతో - అంటే కర్మములు చేసే జీవా ! అని అర్థం. ఓం ఇతి స్మర - అంత్య సమయంలో 'ఓం' అని స్మరించుమని వేదం మనకు చెబుతుంది.

గర్భంలో ఉండినదగ్గరనుండి మనుష్యుడు పుట్టిపెరిగి మరణించే వరకు శరీరానికి పదహారు కర్మలు చేయవలయునని మనవాళ్ళు విధించారు. గర్భాధానమని, పుంసవనమని, సీమంతమని, నామకరణమని, ఉపనయనమని యిలా 16 కర్మలు విధించారు. చివరికర్మ అంత్యేష్టి. అంత్యేష్టిలో చనిపోయిన శరీరాన్ని తగులబెట్టాలి. శరీరాలను పూడ్చడం కంటె తగులబెట్టడం శ్రేయస్కరం. ఎందువల్లనంటే, ఒక మనిషిని పూడ్చడానికి పట్టేచోటులో చాలా శవాలను భస్మం చేయవచ్చు. స్మశానం కొద్దిదైనప్పటికి ఎన్నివందల శవాలనైనా అందులో తగులబెట్టవచ్చు. చనిపోయిన శవాలను పూడ్చడం వాటికి గోరీలు కట్టడం కారణంగా క్రైస్తవమహమ్మదీయుల స్మశానాలు పెరుగుతాయి. పెద్ద పెద్ద పట్టణాలలో సైతము ఈ స్మశానాలు ఎంతో చోటులను ఆక్రమించుతాయి. చాలాభూమి నిరూపయోగంగా ఈ స్మశానాల క్రింద ఉంటుంది. అందుచేత శవాలను పూడ్చడంకంటె తగులబెట్టడమే శ్రేయస్కరం. ఆరోగ్యదాయకంకూడ. శవాలను పూడ్చడంవలన ఇంకొక దోషముంది. అవి అనేకరోజులకుగాని క్రుళ్ళి మట్టిలో కలియవు. అంతవరకు శవాలను పూడ్చిన యీ సమాధులనుండి దుర్గంధపూరితమైన వాయువు బయలుదేరుతుంది. ఆవాయువును పీల్చిన ప్రాణికోటికి అనారోగ్యము, హాని కలుగుతుంది. పార్శీలు శవాలను తగులబెట్టరు. వారు ఎత్తైన ప్రదేశాలలో శవాలను పక్షులకు వదిలివేస్తారు. కాకులు గ్రద్దలు పీక్కుతింటాయి. ఇలా వ్రేలాడగట్టడంలో వారి ఉద్దేశ్యం శరీరం వృధాకాకుండా

కొన్ని ప్రాణులకు ఆహారంగా ఉపయోగపడటమే. కాని యిందులో కూడ దోషముంది. రోగగ్రస్తుడైన మనిషి చస్తే ఆ శరీరాన్ని తిన్న పక్షులుకూడ వ్యాధికి గురికావడమో లేక చావడమో జరుగుతుంది. కొందరు శవాలను ప్రవాహములో పడవేస్తారు. అలా వేయరాదు. నీటిలోని జంతువులు శవాన్ని తినడంచేత అవికూడ రోగగ్రస్తమౌతాయి. కనుక శరీరాన్ని ఎప్పుడైనా భస్మం చెయ్యడమే ఉచితం. ఉత్తమంకూడ. శవాన్ని దహనంచేసే కర్మను అంత్యేష్టి అంటారు. దీన్నే 'నరమేధము' లేక 'నరయాగము' అనికూడ అంటారు మనిషి శవాన్ని కూడ యజ్ఞము చేసినట్లుచేసి దహనం చెయ్యాలి. ఇది వైదిక సంప్రదాయం.

'ఓం స్మర' - 'ఓం' అని స్మరించమంటుంది వేదం, పరమేశ్వరునికి అనేక నామాలున్నాయి. విష్ణువు, శివుడు, బ్రహ్మ, యిలా భగవంతునికి చాలా నామాలున్నాయి. కాని యీ నామాలన్నింటికంటె 'ఓం' పరమేశ్వరునికి ముఖ్యమైన నామం. 'ఓం' అనేది అవ్యయం. అంటే నశించనిది. ఎప్పుడూ ఒకటిగానే ఉంటుంది. దీనిలో మార్పుండదు. కాని మిగిలిన నామములు అలాకాదు, ఆ నామములకు విభక్తులను జోడించడం జరుగుతుంది. వాటికి మార్పులను తేగలం. 'ఓం' అంటే రక్షకుడని అర్థం. 'ఓం' అనువర్ణము 'అ'కార, 'ఉ' కార, 'మ' కార సమన్వితం. ధ్వని శాస్త్రమంతా యీ మూడింటిలో ఉంది. మీరు నోరుతెఱచి శబ్దించా రనుకోండి. అపుడు 'అ' అనే శబ్దం వస్తుంది. నోరు సగంమూసి శబ్దంచేశారనుకోండి. అపుడు 'ఉ' వస్తుంది. అలాగే నోరు పొంతమూ మూసి ధ్వనిచేస్తే 'మ్' అనే శబ్దం వస్తుంది. ఇది 'మ'కారం. ఇలా ఓం అనే పదం అకార, ఉకార, మకారములతో ఏర్పడింది. అందుకనే పరమేశ్వరుని నామము లన్నిటిలో ఇది ఉత్తమమని ఎంచబడింది.

ఇలాంటి పరమోత్కృష్టమైన పరమేశ్వరుని నామమును జపించడానికి అందరికి అధికారం ఉంది. కాని కొంతమంది ఈ నామము (ఓం)ను గుత్తకు తీసుకున్నట్లుగా వ్యవహరించుతున్నారు. 'ఓం' ను సంన్యాసులే స్మరించాలనేవారు కొందరు. కొందరు బ్రాహ్మణులే దీనిని స్మరించాలనేవారున్నారు. కొందరికి ప్రణవాన్ని ఉచ్చరించే అర్హతలేదని, వారు 'ఓం' ను స్మరించితే నాశనమైపోతారని చెప్పే ప్రబుద్ధులు కూడ యీనా డున్నారు. ! ఇదంతా కొందరు స్వార్థపరులు

కల్పించుకున్న కట్టుకథలేకాని వేరుకాదు. పరమేశ్వరుడు అందరికి తండ్రి అలాంటి పరమేశ్వరుని నామాన్ని అందరూ జపించవచ్చు. ఇందులో స్త్రీ, పురుష విభేదంకాని, - సంన్యాసులని, గృహస్థులని, బ్రహ్మచారులనే భేదంకాని, - వీడు శూద్రుడు, వీడు అంత్యజుడు, వీడు బ్రాహ్మణుడనే హెచ్చుతక్కువలు గాని ఏమీలేవు. అందరూ జపించవచ్చు.

రామాయణము రచించిన వాల్మీకికి నారదుడు రామమంత్రం ఉపదేశించాడని, వాల్మీకి 'రామ' పదాన్ని యథాతథంగా ఉచ్చరించలేక 'మరా అన్నాడని అంటారు. మరా అన్నవాడు రామ అని ఎందు కనలేడు (సభలో నవ్వులు) ఇదంతా రామపదానికి మహత్తు కల్పించటానికి చెప్పే మాటలు తప్పితే వేరేమీ లేదు. రామ, కృష్ణ పదాలను మూగవారు మాట్లాడలేరు. కాని 'ఓం' ను **మూగవారుసైతము అనవచ్చు. దానిని ఉపాసింపవచ్చు.** అన్యమతస్థులు కాని, మన భాష రానివారుకాని ఎవరైనా ప్రణవమును (ఓంను) స్మరించుటకు వీలున్నది.

ఓంను స్మరించడంచేత శరీరములోని ప్రాణములకు ఉర్ధ్వగతి కలుగుతుంది. జీవుడు దేహమును విడిచేటప్పుడు ఊర్ధ్వద్వారాలనుండి గాని అధోద్వారాలనుండిగాని వెళ్ళుతాడు. అధోద్వారాలైన గుదము, ఉపస్థలద్వారా చనిపోతే క్షుద్రయోనులలో జన్మిస్తాడని, ఊర్ధ్వద్వారాలైన నోరు కండ్లు, ముక్కు, చెవులు వీటిద్వారా చనిపోతే జీవునికి ఉత్కృష్టజన్మ సిద్ధించుతుందని శాస్త్రం చెపుతుంది. కనుక జీవుడు దేహం విడిచేటప్పుడు శరీరంలో ఊర్ధ్వంగా పోవాలి. 'ఓం'ను స్మరించడంవలన జీవునికి అలాంటి ఊర్ధ్వగతి కలుగుతుంది. అపుడు ప్రాణాలతో జీవుడు ఊర్ధ్వగతుడై శరీరాన్ని వదలిపెడతాడు. ఓంను నిత్యం స్మరణచేస్తేగాని యిలా ఊర్ధ్వగతి కలుగదు. ఎప్పుడో మరణ సమయంలో అనుకుంటే సరిపోతుందిలే అంటే కుదరదు. తరువాత బ్రహ్మరంధ్రముద్వారా జీవుడు శరీరాన్ని వదలిపెడితే ముక్తి సిద్ధించుతుందని మీరు వినే ఉంటారు. ఈ రంధ్రం నడినెత్తిని ఉంటుంది. పసిపిల్లల మాడుచూస్తే మనకది తెలుస్తుంది. అచట మెత్తగా ఉంటుంది. పిల్లలు పెద్దయ్యేకొద్ది అది గట్టిపడుతుంది. సామాన్యజనులలో ఈ బ్రహ్మరంధ్రం మూసుకొని ఉంటుంది. పూర్ణసిద్ధుడు

మాత్రమే యీ ద్వారం భేదించగలుగుతాడు అప్పుడతనికి ముక్తి సిద్ధిస్తుంది.

ఓం కాక ఇతర నామములతో పరమేశ్వరుని స్మరించరాదని. నేననడం లేదు. కాని ఆ నామము లన్నింటికంటె ఓం ఉత్తమ నామమని అంటున్నాను. 'తస్య వాచకః ప్రణవః' - (యో.ద. 1-27) అతని నామధేయము ఓం అని. 'తజ్జపః తదర్థభావనం' - (యో.ద. 1-28) ఓంను స్మరించుట - దాని అర్థమును భావించుటవలన చిత్తైకాగ్రత కలుగుతుంది. అని పతంజలి మహర్షి తమ యోగదర్శనంలో చెప్పాడు. ఓం అంటే రక్షకుడు అని చెప్పాను. ఓంను స్మరించుతున్నంతసేపూ పరమేశ్వరుడు రక్షకుడు అనే భావం గుర్తుంచుకుంటూ ఉండాలి. ఓంను అంతిమస్థితిలో స్మరించాలంటే ప్రతినిత్యం జపం చెయ్యాలి. ఒక్కసారి జపించితే చాలదు. ప్రాణంపోయే సమయంలో ఓంను స్మరించడం తేలికపనికాదు. జీవితాంతం అభ్యాసం చేస్తేగాని అంతిమసమయంలో ప్రణవమును ఉచ్చరించలేము.

గాంధీజిని పిస్టలుతో కాలిస్తే, మొదటి గుండు తగలడంతోనే ఆయన అప్రయత్నంగా 'రాం' అన్నాడు. మళ్ళీ కాలిస్తే 'రాం' అన్నాడు. అలా రామనామ స్మరణతోనే గాంధీజీ దేహత్యాగం చేశాడు. అంటే రామనామమును ఆయన అంత గాఢంగా స్మరించాడన్నమాట. అలాగైతే : ప్రణవనామమును స్మరించుమని మీరు చెబుతూ, గాంధి రామనామం స్మరించాడని చెబుతున్నారు గదా ! మరి రామనామమునే ఏల స్మరించరాదు? అని మీరడుగవచ్చు. ఆయనను మేము ఢిల్లీలో ఒక మారు మీరు స్మరించే రాము డెవరని ప్రశ్నించాము. ఆయన రామాయణం సత్యచరితమని ఒప్పుకోడు. రామునివలె వర్తించాలి, రావణునివలె వర్తించరాదు ; అనే నీతిని బోధించడానికి రామాయణం రచించబడింది. రామాయణం కల్పిత గాథ అని గాంధీజీ అంటాడు. ఆయన నేను స్మరించేది దశథరాముణ్ణి కాదు. అంతరాత్మను 'రామ' పదంతో స్మరించుతాను అన్నాడు. మరి మీరు పరమేశ్వరుణ్ణి రామ పదంతో స్మరించితె లోకులు మీరు దశరథరాముణ్ణే స్మరించుతున్నారనే భ్రమలో పడరా అని అడిగాము. అందుకాయన, నాకు రామ పదం చిన్నపుడు దాది (రంభ అను పేరుగల దాది గాంధీజీ కుటుంబంలో ఉంటుండేది) ఉపదేశించింది. నాకది

అలవాటైంది. యిప్పుడు మానాలంటే మానలేను. నేను దశరథరాముణ్ణి స్మరించేటట్లయితే 'ఈశ్వర, అల్లా తేరేనాం' అని ఎందుకంటాను ? నేను స్మరించేది ఆత్మారాముణ్ణే అనికూడ వారు జవాబిచ్చారు.

ఓంను వదలి రామకృష్ణాది నామాలను స్మరించడంలో ఒక చిక్కుంది. మనం రామకృష్ణుల కథలను చిన్నప్పటినుండి విని ఉండటంచేత రామ అనగానే సీతాపతి, లక్ష్మణాగ్రజుడు దశరథరాముడు గుర్తుకు వస్తాడు. మరి యీ రాముడు పరమేశ్వరుడు కాదు. సృష్టిస్థితి లయకారకుడు కాడు. అలాగే కృష్ణుని కథలు విని ఉండటంచేత ఓంకు మారుగా కృష్ణనామం స్మరించడంచేత జారచోర శిఖామణి, కంస సంహారకుడు, గోపికావల్లభుడు, దుకూల వస్త్రాపహారి మనకు గుర్తుకు వస్తాడు. ఎవరన్నా సృష్టి స్థితి లయకర్తను గుర్తుచేసుకొని రామకృష్ణాది పదములను స్మరించితే మాకేమీ అభ్యంతరం లేదు.

ఇంకొక విశేషమేమంటే - ఓం పదం భగవద్వాచకం. కాని, మరొకరిని తెలుపదు. అందుచేత దీనిని స్మరించడం చేత మనకు వ్యక్తులు గుర్తుకురారు. ఇలాంటి విశిష్టగుణా లనేకం ఓంను స్మరించడంలో ఉన్నాయి. కనుక మరణ సమయంలో ఓంను స్మరించుతూ మరణించాలని వేదం చెపుతుంది.

'క్లిబే స్మర' - స్వసామర్థ్యంకొరకు పరమేశ్వరుని స్మరించు అంటుంది వేదం. పరమేశ్వరుడు మనకు శరీరాన్ని, బలమును యిస్తాడు. కనుక మనం ఈ శరీరంలో సత్కర్మలు చేయాలి. సత్కర్మలు బలవంతుడే చేయగలుగుతాడు. బలహీనుడు దుష్కర్మలు చేస్తాడు. మనం పరమేశ్వరుని బలము నిమ్మని కోరటంలో ఉద్దేశ్యం అదే, 'కృతగ్ంస్మర' - చనిపోయేటప్పుడు పూర్వం నీవు ఏమిచేసినది స్మరించు.

'వాయురనిల మమృత మథేదగ్ం భస్మాంతగ్ం శరీరమ్' వాయువునకు అనిలమునకు సూక్ష్మభేదం ఉంది. వాయువు అంటే శరీరమునందుండే ధనుంజయాది ప్రాణవాయువు. అనిలం అంటే సూక్ష్మవాయువు. స్పర్శతన్మాత్ర సూక్ష్మవాయు వనబడుతుంది. ఇది అమృతం - అంటే నాశనములేని ప్రకృతిలో లీనమౌతుంది. శరీరం భస్మం అంతముగా కలది. అంటే శరీరాన్ని దహించినపుడు దానిలోని పృథివి మొదలైన భూతములు వాటివాటి మూలతత్త్వములోనికి

చేరుతాయి. శరీరాన్ని దహించేటప్పుడు నెయ్యి మొదలగు పుష్టికారక పదార్థములను, మూలికాద్రవ్యములను వేసి దహించాలి. అలా చెయ్యడంవల్ల యీ వాయువును పీల్చుకున్న ప్రాణికోటికి చాల తక్కువ అపకారం జరగటానికి వీలుంది. శవాన్ని యీ విధంగా దహించడం మన వైదిక విధి. ఇలా యీ మంత్రానికి సంక్షేపంగా అర్థం చెప్పుకున్నాం.

అగ్నే ! నయ సుపథా రాయే అస్మాన్
విశ్వాని దేవ వయునాని విద్వాన్
యుయోధ్య స్మజ్జుహురాణ మేనో
భూయిష్ఠాం తే నమ ఉక్తి విధేమ ॥ 16.

భావార్థము : ఎవరు సత్యభావముతో పరమేశ్వరు నుపాసింతురో శక్తికొలది అతని ఆజ్ఞలను పాలింతురో, అతనినే (సర్వోపరి) అందరి కంటె నెక్కుడుగ సత్కరింప తగినవాడని యెంచెదరో వారిని దయాలువగు పరమేశ్వరుడు పాపాచరణమునుండి వేరుచేసి ధర్మమార్గమున నడపును. వారికి విజ్ఞానము కలుగజేయును. ధర్మార్థ కామమోక్షములను సాధింప సమర్థులను జేయును. కావున అద్వితీయుడగు ఆ పరమేశ్వరుని దక్క యితరుల నెన్నడు ఉపాసించరాదు.

ఈ మంత్రంలో మనం పరమేశ్వరుని ప్రార్థిస్తాం. ఏమని ? ప్రకాశ స్వరూప ప్రభూ ! మమ్ములను సుపథా - మంచిమార్గాన, నయ-నడపుము అంటాము. నడుపు అంటే ఆయన నడుపడు. మనమే మంచి మార్గాన నడవాలి. మన మాయనను ప్రార్థిస్తున్నామంటే అర్థము, మంచి మార్గాన నడవడానికి సంకల్పించు కుంటున్నామని. సంకల్పించుకొని ఊరుకోరాదు. ఆసంకల్పము నెరవేరడానికి తగిన ప్రయత్నం కూడ చెయ్యాలి. పరమేశ్వరా ! మానుండి జుహురాణం-కుటిలమైన, ఏనం-పాపాచరణమును వేరుచేయుము. అనికూడ ఇందులో ప్రార్థిస్తాము. పాపము అంటే ఏమిటి ? మనస్సునకు, శరీరమునకు అస్వస్థ కలిగించే పనులు చెయ్యడం సిగరెట్లు, బీడీలు త్రాగడం సాధారణ పాపం. నిన్నటిదినం ఒక డాక్టరు దగ్గరకు పనిఉండి వెళ్ళాము. ఆయన పెద్ద డాక్టర్. Heart Specialist (గుండె జబ్బులకు ప్రత్యేక వైద్యుడు)

కాని నేనక్కడున్న కాసేపటిలోనే రెండు మూడు సిగరెట్లు కాల్చాడు. ఆయన వాలకము చూస్తే చాల బక్కపల్చగా ఉన్నాడు. పైగా (Chain somker) ఎడతెఱపిలేక పొగత్రాగువాడుగా కనుపించాడు. ఆయన ఆరోగ్యము యిక ఎలా ఉంటుందో ఊహించుకోండి. నేనుండలేక ఆయనతో అన్నాను. మీరు 'హార్టు స్పెషలిష్టు' కదా! పొగత్రాగడం శ్వాసకోశములకు, గుండెకు మంచిదికాదని మీరు రోగులకు సలహాకూడ యిస్తారుకదా! అలాంటి మీరే యిలా నిరంతరం సిగరెట్లు కాల్చితే ఇక రోగికేమి నమ్మకం కుదురుతుంది ! వ్యాధి ఏం నయమవుతుంది అని అడిగాను (సభలో చిరునవ్వులు) నా మాటలకు ఆయన కొలదిగా నొచ్చుకున్నాడు. మీరు చెప్పింది వాస్తవమే. కాని నేనుయిదొక్కటి మానలేకుండా ఉన్నానండి అని తన అశక్తతను వ్యక్తం చేశాడు.

అలాగే కల్లు, సారాయి సేవించడం, వ్యభిచరించడం యిలాంటివి పెద్ద పాపాలు. వీటినుండి సాధకుడు వైదొలగాలి. అందుకొరకై నిత్యం పరమేశ్వర ప్రార్థన చెయ్యాలి. ఈ పాపాలకు దూరంగా ఉండాలనే సంకల్పాన్ని తన ప్రార్థన ద్వారా దృఢం చెయ్యాలి. ఊరికే అనుకుంటే లాభం లేదు. 'ధియో యో నః ప్రచోదయాత్' - పరమేశ్వరా, మాకు సద్బుది నివ్వవలసినది అని నిత్యం ప్రార్థించాలి. భగవంతుణ్ణి ఎలా ప్రార్థన చేస్తామో అలా మనం ఆచరించాలి. మనం పాపాలుచేస్తే ఆయన తప్పిస్తాడనుకోరాదు. చేసిన పాపములకు తగిన ఫలితం తప్పకుండ మనం అనుభవింపవలసి ఉంటుంది. చింతాకంత కూడ తీసివెయ్యడు.

హిరణ్మయేన పాత్రేణ సత్య స్యాపి హితం ముఖమ్

యోzసా వాదిత్య పురుషః సో z సా వహం ఓ3మ్ ఖం బ్రహ్మ ॥ 17

భావార్థము : పరమేశ్వరుడు మనుజుల నుద్దేశించి యిట్లుపదేశించు చున్నాడు. ఇక్కడ నెల్లయెడల నున్న నేనే సూర్యాది లోకములందు నున్నాను. సూర్యాది లోకములందంతట నున్న నేనె యిక్కడను ఉన్నాను. ఆకాశమువలె అంతటను వ్యాపకుడనై యున్న నన్ను మించిన వస్తు వొందు లేదు నేనన్నిటికంటె గొప్పవాడను. సులక్షణయుక్త పుత్రునివలె ఎవడు ప్రాణప్రియమగు నా నామము

'ఓమ్' ను భక్తితోను సత్యాచరణతోను శరణుజొచ్చునో, అంతర్యామి రూపమున నేనతని యంవిద్యను నశింపజేయుదును. అతని యాత్మను ప్రకాశింపజేయుదును. శుభగుణ కర్మ స్వభావయుక్తు నొనరింతును ! సత్యస్వరూపమగు నాచరణమును స్థిరమొనర్చి శుద్ధమగు యోగజ ధర్మమును ప్రసాదించి, స్వదుఃఖములనుండి అతనిని వేరుచేయుదును. మోక్షానందమును కలుగ జేయుదును.

హిరణ్మయుడు అంటే పరమేశ్వరుడు. ఆయన 'సత్యస్యాపి హితం ముఖం' - ఈ ప్రపంచాన్ని ఆవరించి కప్పి ఉంటాడు. అంటే ప్రపంచమంతటా లోపల వెలుప లవ్యాపకుడై ఉన్నాడని అర్థం. ఇచట మనమొకటి గుర్తించాలి. పురుషుడు (పరమేశ్వరుడు) ఎలా నిత్యుడో (ప్రపంచం కూడ) కారణరూపంలో నిత్యమే. సూర్యాది గోళములలోను సమస్త జీవులలోను పరమేశ్వరుడే వ్యాపించి ఉన్నాడు. అక్కడ వ్యాపించి ఉన్న పరమేశ్వరుడే యిక్కడకూడ వ్యాపించి ఉన్నాడు.

ఈనాడు ధార్మికక్షేత్రానికి అధినేతలమని చెప్పుకునే చాలమంది గురువులు బోధ గురువులు కారు. కేవలం బాధ గురువులుగా ఉంటున్నారు. ధనాదులను హరించి ప్రజలను పీల్చి పిప్పిచేయడమేపనిగా పెట్టుకుంటున్నారు. జిజ్ఞాసువు అయిన శిష్యుడు గురువు దగ్గరకు వెళ్ళి తత్త్వ బోధ చేయుమంటే మొదట తాను దేవుణ్ణని సిద్ధాంతీకరించు కుంటాడు. అందుకని ఒక శ్లోకం కూడ యిలా చదువుతాడు.

గురుర్బ్రహ్మా గురు ర్విష్ణుః గురు ర్దేవో మహేశ్వరః
గురుః సాక్షాత్ పరం బ్రహ్మా తస్మైశ్రీ గురవే నమః ॥

గురువు త్రిమూర్తుల స్వరూపమేకాకుండా సాక్షాత్ పరబ్రహ్మమే నట ! ఇలా శిష్యునకు మొదటే అజ్ఞానం కలిగిస్తాడు.

'గురుపాదోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే' - గురువుగారి పాదములు కడిగి ఆ నీటిని త్రాగితే ఇక జన్మ ఉండదట ! గురువు గారి పాదములకు, పేడ, మట్టి, యిలాంటి మలినాలు కూడ అంటుకుంటాయి. అవి కూడ కడిగి త్రాగవలసిందే మరి ! (సభలో నవ్వులు)

'గురోరుచ్ఛిష్ట భోజనం అమృతం' - గురువుగారి ఎంగిలి అమృత మట! అది తిన్న శిష్యుడు చావడట ! (సభలో నవ్వులు)

అలాగే గురువులలో లోభాది గుణాలు ఉంటే, అవి శిష్యుణ్ణి పరీక్షించడానికేగాని, నిజానికవి గురువుగారికి లేవని సమాధానం.

సరే, శిష్యునికి గురువు ఏదైనా బోధ చేశాడంటే తెలిసీ తెలియకుండ బోధ చేస్తాడు. పూర్తిగా తెలిసేటట్లు చెపితే మళ్ళీ శిష్యుడు తన వద్దకు రాడని ముడుపులు చెల్లించడని భయం. అసలు చాలమంది గురువులకు తాము చెప్పేదేమిటో తమకే తెలియదనుకోండి ! విప్రనారాయణ సినిమాలో రేలంగి అంటాడు. వేదాంతమంటే, తనకు తెలియకుండ ఇతరులకు తెలియకుండ చెప్పడమే వేదాంతం అని (సభలో నవ్వులు) చదువుకున్నవారు కూడ ఇలా మభ్యపరచి జనులను మోసం చేస్తున్నారు. అందుచేత బాగా పరీక్షించిన తరువాతనే శిష్యుడు ఎవరినైనా గురువుగా అంగీకరింపవలసి ఉంటుంది.

'ఓం-ఖం- బ్రహ్మ' - పరమేశ్వరుడు రక్షకుడు - ఆకాశమువలె సర్వత్ర వ్యాపించినవాడు - గొప్పవాడు అని అర్థం. ఇలా పరమేశ్వర స్వరూపమును గుర్తించి. ఆయన నామమైన 'ఓం' ను స్మరించి అందరు ముక్తులు కావడానికి ప్రయత్నించడం ఉచితం.

గురు శుశ్రూష చేసి నానేర్చిన విదంగా, తోచినవరకు చెప్పాను. పరమేశ్వరుని కృపవల్ల యివ్వాళ్ళతో ఈశావాస్యోపనిషత్తు, చెప్పడం పూర్తయింది. ఋషులు కానివాళ్ళు వ్రాసిన భస్మోపనిషత్తు రుద్రాక్షోపనిషత్తు ఇలాంటి వనేకం నేడు లభ్యమవుతున్నాయి. కాని అవి మనకు ప్రమాణములు కావు. మొత్తం పది పదునొకండు ఉపనిషత్తులనే శంకర, రామానుజాది ఆచార్యులు అంగీకరించి వానికి తమ తమ మతానుకూలముగా భాష్యములను వ్రాసియున్నారు. మిగిలినవి శంకరునికి పూర్వం లేకయైనా ఉండాలి. లేక ఆయన వాటిని ప్రమాణములు కావని నిరాకరించి అయినా ఉండాలి.

భాష్యకారులలో మధ్వాచార్యులు మాత్రం ఋగ్వేదములో 10 సూక్తముల వరకు భాష్యము వ్రాశారు. కాని శంకర రామానుజులు వేదము

నంటలేదు. అసలు వేదమంత్రాలు 17 మాత్రమే ఉండగా ప్రచలిత ఈశావాస్యోపనిషత్తులలో, ఒక మంత్రం ఎక్కువవుంది. శంకరుడు కూడ ఈ ఉపనిషత్తుపై భాష్యము వ్రాసినాడు. కాని అది ఉపనిషత్ భాష్యమే కాని వేదభాష్యము కాదు.

వేదములు మళ్ళీ సంఘములో ప్రచారం కావాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. మూఢవిశ్వాసాలు పోతాయి. స్త్రీ పురుష విభేదం లేకుండా అందరూ వేదములను ప్రచారంచేసిన రోజులున్నాయి. ఇతర దేశస్థులు కూడ మనదేశం వచ్చి విద్యాబుద్ధులు నేర్చుకున్నారు.

నేను చెప్పిన మాటలు మీమీ బుద్ధితో యోచించి హేతుబద్ధంగా అంగీకార యోగ్యంగా ఉన్నవి గ్రహించండి. ఏవైనా దొసగులుంటే విడిచి పెట్టండి.

ఓం ద్యౌః శాంతి రంత రిక్షగ్ం శాంతి ःపృథివీ శాంతి,
రావః శాంతిః ఓషధయః శాంతిః వనస్పతయః శాంతి ః
విశ్వే దేవాః శాంతిః బ్రహ్మశాంతి ః సర్వగ్ం శాంతి ః
శాంతి రేవ శాంతి ః సా మా శాంతి రేధి ॥
ఓ3మ్ శాంతి ః శాంతి ః శాంతి ః

ఉపనిషత్తులు

ఈశావాస్యోపనిషత్తు : యజుర్వేదములోని 40 అధ్యాయము. అందుచేత వేదాంతమనబడినది. ఇది జీవేశ్వర ప్రకృతుల స్వరూప స్వభావాదులు, సగుణనిర్గుణ స్వరూపము, పదార్థముల కార్యకారణ సంబంధము త్రిత్వవాదమును బలపఱచు చున్నది. **రూ. 5/-**

కేనోపనిషత్తు : దీనిని తలవకారోపనిషత్తనియు నందురు. ఈయుపనిషత్తు మొదట "కేనేషితం" అని ప్రారంభింపబడుటచే కేనోపనిషత్తనియు, సామవేదములోని తలవకారశాఖలోని 9వ అధ్యాయమగుటచే తలవకారోపనిషత్తనిరి. ఇందులో గురుశిష్యులు - బ్రహ్మము, దానిమహిమ, దానినిపొందు సాధనములు వివరింపబడినవి. **రూ. 6/-**

కఠోపనిషత్తు : ఇందు దేవుడు, జీవుడు, ప్రకృతియను మూడు తత్వములున్నట్లును, ప్రపంచపదార్థముల ననుభవించుటకు జీవునకు శరీరమందు ఇంద్రియములున్నట్లును, జీవునియిచ్ఛానుసారము మనస్సు ఆ యింద్రియములతో సంబద్ధమైపాంచ భౌతికమైన దానిని గ్రహించి తదనుభూతిని జీవునకందించు చున్నట్లున్నది. మనస్సు పనిచేసినంతకాలము భౌతికమేకాని, దానికంటె సూక్ష్మమైన జీవతత్వముకాని, భగవత్తత్త్వముకాని తెలియబడదని వివరింపబడినది. వానిని దెలిసికొను విధానము చెప్పబడినది. **రూ. 8/-**

ప్రశ్నోపనిషత్తు : బ్రహ్మమును తెలిసికొనవలయునను ఉత్కంఠగలవారు పరబ్రహ్మ నన్వేషించుచు సుకేశుడు, సత్యకాముడు, గార్గ్యుడు, కౌశల్యుడు, వైదర్భి, కబంధియను నార్గురు తపస్వులు గురువైన పిప్పలాదుని చెంతకు జేరిరి. వారిని జూచి పిప్పలాదుడు ఇంక నొక సంవత్సరము బ్రహ్మచర్యము పాలించి తపస్సు చేయుడని చెప్పెను. సంవత్సరము తరువాత తిరిగివచ్చిన వారికి - రయి, ప్రాణము, స్త్రీ పురుషులు, ప్రకృతి పురుషుడు, భోగ్యము, భోక్త, జడ చేనములు, సూర్యచంద్రులు, అను ద్వంద్వములు జనించెననియు,

అద్వంద్వముల వలన మిగిలిన సృష్టియేర్పడునను మొదలగు విషయముల బోధించెను. రూ. 7/-

ముండకోపనిషత్తు : ఇది యథర్వవేదమునకు సంబంధించినదిగా చెప్పబడుచున్నది. బ్రహ్మయను ఋషి అథర్వుడను శిష్యునకు బ్రహ్మవిద్యను బోధించినాడు. అథర్వుడు అంగిరునకు అతడు సత్యవాహునకు, అతడు అంగిరసునకు ఆ విద్యను బోధించినట్లు ఇందుగలదు. అతడు గృహస్థుడైన శౌనకునకుబోధించెను. దానిని గ్రంథస్థము చేసినవాని పేరులేదు. ఇందు బ్రహ్మతత్త్వము నెఱిగిన నంతయు దెలియుననియు, దానిని తెలిసికొనుటకు 'పరాపర' విద్యలు సాధనములనియు, అందు పరవిద్య సాధనమనియు, అపరవిద్య పరంపరా సాధనమనియు చెప్పబడినది. రూ. 11/-

మాండూక్యోపనిషత్తు : ఇది అథర్వవేదమందలి మాండూక్యశాఖకు చెందినది. ఇందు పరమేశ్వరుని నామములలో నుత్తమమగు 'ఓ3మ్' ను గూర్చియు, తద్వాచ్యమగు పరతత్త్వమైన బ్రహ్మమును గూర్చియు వివరింపబడుటచే నిది మహత్త్వపూర్ణముగా శ్రేష్ఠముగా భావింపబడుచున్నది. రూ. 5/-

తైత్తిరీయోపనిషత్తు : ప్రపంచములో పరమేశ్వరుడు, జీవులు, ప్రకృతియను మూడు తత్త్వములున్నవనియు, పరమేశ్వరుడు జీవులనుభవించుటకు ప్రపంచమును సృష్టించుననియు, తాను పరమాణువు కంటె సూక్ష్మమై సర్వాన్తర్యామి యగుచు, అన్నింటికంటె మహత్తగుటచే సర్వవ్యాపకుడై జీవులు చేసిన కర్మలకు తగిన ఫలమిచ్చుననియు, కర్మజీవులు, భోగజీవులు, మూర్ఛాజీవులని 3 రకములు జీవులనియు, వివరింపబడెను. రూ. 8/-

ఐతరేయోపనిషత్తు : ఇందు స్థూల పదార్థవిరణము, శరీరాదులేర్పడు విధానము, శరీరములలో జీవులు ప్రవేశించు పద్ధతి వర్ణింపబడినది. జీవుని గర్భ ప్రవేశము, మోక్షప్రాప్తికి స్థిరమనస్కుడగుట, జీవేశ్వరుల లక్షణము, జీవుడు, మోక్షము పొందు పద్ధతి విశదీకరింపబడినది. రూ. 7/-

శ్వేతాశ్వతరోపనిషత్తు : ఇందు వేదాను సారముగా దేవుడు, జీవుడు, ప్రకృతియను మూడు నిత్యతత్త్వములని ప్రతిపాదింపబడినది. మతగురువులకు త్రిత్వవాదము గిట్టక దీని నుపనిషత్తులలో చేర్పక దశోపనిషత్తులనే ప్రధానముగా ప్రచారము చేసిరి. రూ. 8/-

ఛాందోగ్యోపనిషత్తు : ఇది తాండ్య బ్రాహ్మణమునకు సంబంధించినది. ఇందు 154 ఖండములు గలవు. దీనిలో ఉద్గీథోపాసన, మధువిద్య, గాయత్రీ విచారణ, శాండిల్యవిద్య, సంవర్గ విద్య, జాబాల విద్య, ఉపకోసల విద్య, ప్రాణ సంవాదము, పంచాగ్నివిద్య, జీవగతి, వైశ్వానరవిద్య, తత్త్వమసి వాక్య వివరణము, భూమబ్రహ్మోపాసన, దహర బ్రహ్మోపాసన, అక్షి పురుషోపదేశము మున్నగు గూఢమగు విద్యలు వివరింపబడినవి. **రూ. 20/-**

బృహదారణ్యకోపనిషత్తు : ఇది శుక్లయజుస్సులకు సంబంధించినది. గద్యమయము. వాజసనేయ యాజ్ఞ్యవల్క్యుని ద్వారమున ఉపదేశింపబడినది. మొత్తము గద్యముల సంఖ్య 415 ఇందు సృష్టి, మృత్యువు, ప్రాణము, బ్రహ్మము, మధువిద్య, మొదలగునవి కలవు. యాజ్ఞవల్క్యుడు మైత్రేయి మొదలగు వారితో జరుపు సంభాషణ ద్వారా వివరింపబడినవి. **రూ. 20/-**

గోపదేవ్‌గారు వీనినేగాక న్యాయ, వైశేషిక, సాంఖ్య యోగ, వేదాంత దర్శనములు, ఆస్తికవాదము, అర్థమీమాంస, పంచమహా యజ్ఞవిధి, సంస్కారవిధి, ఋగ్వేదభాష్యభాస్కరము (3 భాగములు), ఏసుక్రీస్తు జీవన రహస్యము మున్నగు గ్రంథములు మొత్తము 63 రచించి తెలుగువారికి అందుబాటులోనికి తెచ్చిన మహోన్నత వ్యక్తి ఆంధ్రదేశమున వీరొక్కరే.

(పుస్తకాల ధరలు తేదీ. 24-7-1999 నాటివి)

16-7-1999

వెంకయ్యార్య

నిరుక్తము

రూ. 140/-

లోకములో సంస్కృత భాషలోనున్న లౌకిక భాషా శబ్దములకర్థము గ్రహించినట్లు వేదశబ్దార్థముల గ్రహించుట సులభము కాదు. వైదిక భాషా శబ్దముల నవగతము చేసికొనుటకు వేదాంగములు, ఉపాంగములు నుపకరించును. అట్టివానిలో యాస్కాచార్య కృతమైనది నిరుక్తము. వేదాంగములైన శిక్షా, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అనునాఱింటిలో నొకటి యై యున్నది. దీని ద్వారా శబ్దార్థముల బాగుగా దెలిసికొని తద్ద్వారా విషయముల గ్రహించిన యత్యద్భుతానందము పొందుటకవకాశమున్నది.

ఋగ్వేదాది భాష్య భూమిక

రూ. 70/-

మహర్షి దయానందస్వామి వేదములకు భాష్యము వ్రాయబూని యీ భూమికా గ్రంథమును రచియించెను వేదములందు ప్రతిపాదిత సత్యములను లోకమునకు వెల్లడించి ప్రాచ్య పాశ్చాత్య దేశీయ విద్వాంసులకు వేదగత సత్యములను దెలుపుటకీ గ్రంథమెంతయో తోడ్పడినది. ఇందు వేదోత్పత్తి, వేదోక్త ధర్మములు, సృష్టివిద్య, పృథివ్యాదిలోక భ్రమణము, గణితవిద్య, ఈశ్వరోపాసన, ముక్తి, నౌవిమానాది విద్య, తారవిద్య, వైద్యశాస్త్రము, పునర్జన్మ,రాజప్రజాధర్మము, వర్ణాశ్రమ విషయము మున్నగు ననేక విషయములిందు వివరింపబడినవి.

శ్రీమద్భగవద్గీత

రూ. 25/-

ఇయ్యది సంస్కృత సాహిత్యమున మిక్కిలి ప్రసిద్ధిగాంచినది. భారతీయ భాషలలోనేగాక పాశ్చాత్య పౌర్వాత్య దేశభాషలలోగూడ ననువదింపబడినది. స్వతః ప్రమాణములైన వేదశాస్త్రములను గూడ నీ భవద్గీత సాంప్రదాయులు విస్మరింపజేసిరి. భగవద్గీతయే పరమ ప్రమాణమని ఉపనిషత్ స్థానమొసగిరి. ద్వైతాద్వైత విశిష్టాద్వైత మతప్రవక్తలైన మధ్వ, శంకర, రామానుజులు దీనికి భాష్యము వ్రాసిరి. భారతఃపంచమవేదః అనుచు భారతాంతర్గతమైన గీతకు వేదత్వమాపాదించిరి. ఇందు యుద్ధవిముఖుడైన అర్జునునకు కృష్ణుడు నిష్కామకర్మయోగమును బోధించి యుద్ధోన్ముఖుని జేయుట ప్రధానాంశము.